

ఈనాడు



విజయవాడ 24-3-2018 శనివారం సిటీ సంపుటి 44 . సంచిక 223

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

ఎవరినీ కలవద్దు

- కేంద్ర మంత్రులతో మాట్లాడాల్సిన పనిలేదు
- విభజన చట్టంలోని అంశాలు, హామీలు నెరవేర్చాల్సిందే
- ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టీకరణ
- ఆంధ్రప్రదేశ్‌పైనా, పోలవరం ప్రాజెక్టుపైనా కుట్ర

ఈనాడు – అమరావతి, డిజిటల్

ప్రస్తుత పరిస్థితుల్లో ఎవర్నీ కలవాల్సిన అవసరం లేదని తెదేపా ఎంపీలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం ఎంపీలు, శాసనసభ వ్యూహ కమిటీ ప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేఅంశాలు, రాష్ట్రానికి రావలసిన కేంద్ర ప్రభుత్వ సంస్థలు వంటి వాటిపై కేంద్ర మంత్రుల్ని కలసి మాట్లాడవచ్చా?... అని కొందరు ఎంపీలు అడిగారు. దీనిపై... "విభజన (మిగతా 2లో)



హీరో మోటార్స్‌కు శంకుస్థాపన సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆ సంస్థ ఛైర్మన్ పవన్ ముంజాల్, రాష్ట్ర పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి

భవిష్యత్తు విద్యుత్తు వాహనాలదే

- హీరో మోటోకార్ప్‌కు చంద్రబాబు శంకుస్థాపన
- దక్షిణాదిన ఇదే తొలి ప్లాంటు
- రూ.600 కోట్ల పెట్టుబడి
- మా పాలన ప్రత్యేకత మీరే చూస్తారు: సీఎం

2లో

"ఆంధ్రప్రదేశ్ ఒక అవకాశాల గని. ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే ప్రతి ఒక్కరూ మాకు ఆత్మీయులే. ఇప్పటికే అనంతపురానికి కియా సంస్థ వచ్చింది. చిత్తూరుకు హీరో మోటోకార్ప్‌తో పాటు రిలయన్స్ జియో, అరవింద్, సెల్‌కాన్, కార్బన్ వంటి పెద్దపెద్ద సంస్థలు వస్తున్నాయి. ఈ ప్రాంతాన్ని ఒక లాజిస్టిక్ హబ్‌గా తయారు చేయడమే మా లక్ష్యం."

\- ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆప్ ఎమ్మెల్యేలకు ఊరట

- 'లాభదాయక కేసు'లో అనర్హత వేటును కొట్టేసిన దిల్లీ హైకోర్టు
- సహజ న్యాయ సూత్రాలు పాటించలేదని వ్యాఖ్య
- 20 మంది ఎమ్మెల్యేలపై మరోసారి విచారించి నిర్ణయం తీసుకోవాలని ఈసీకి ఆదేశం

15లో



కేజ్రీవాల్‌ను అభినందిస్తున్న ఆప్ ఎమ్మెల్యే అల్కాలాంబ

అన్నాహజారే నిరవధిక నిరశన 2లో



రాజ్యసభలో భాజపా బలోపేతం

- ఎన్నికలు జరిగిన 25 స్థానాల్లో 11 కమలనాథుల సొంతం
- యూపీలోని 10 సీట్లలో 9 కైవసం
- పొత్తు కట్టిన అఖిలేశ్–మాయవతిపై ప్రతీకారం తీర్చుకున్న కమలం పార్టీ
- బీఎస్పీ అభ్యర్థికి తప్పని ఓటమి

16లో

కాంగ్రెస్ అవిశ్వాసం

- లోక్‌సభ సెక్రటరీ జనరల్ కార్యాలయంలో నోటీసు అందజేత
- 27న సభ ముందుకు వచ్చే అవకాశం
- ఆరో రోజూ మురిగిపోయిన తెదేపా, వైకాపా అవిశ్వాస నోటీసులు
- కొనసాగిన ఏఐఏడీఎంకే, తెరాస సభ్యుల ఆందోళన
- రాజ్యసభలోనూ అదే పరిస్థితి..
- కార్యకలాపాలను చేపట్టలేకపోవటంపై ఛైర్మన్ వెంకయ్యనాయుడు తీవ్ర ఆవేదన
- ఉభయ సభలూ వాయిదా

ఈనాడు, దిల్లీ: పార్లమెంటులో ప్రతిష్ఠంభన శుక్రవారం కూడా కొనసాగింది. మలి విడత బడ్జెట్ సమావేశాల్లో వరుసగా 15వ రోజు కూడా ఉభయ సభలు కార్యకలాపాలేవీ చేపట్టకుండానే మంగళవారానికి వాయిదాపడ్డాయి. తెదేపా, వైకాపాలు ఇస్తున్న అవిశ్వాస నోటీసులకు గత ఆరు రోజులుగా మద్దతు పలుకుతూ వచ్చిన కాంగ్రెస్‌పార్టీ ఇప్పుడు తానే అవిశ్వాస బాణాన్ని సంధించింది. శుక్రవారం సభ (మిగతా 2లో)



ఎన్డీయే ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంటు హౌస్ వద్ద నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్న రాహుల్‌గాంధీ తదితరులు



విపక్షాలను ప్రజల్లో ఎండగట్టండి

- ప్రజలకు వాస్తవాలను తెలియజేయండి
- భాజపా ఎంపీలకు ప్రధాని దిశానిర్దేశం
- పార్లమెంటులో ప్రతిష్టంభనకు ప్రతిపక్షాలే కారణం: అమిత్ షా
- మిత్రపక్షాల్లో అసంతృప్తిపై చర్చించిన పార్లమెంటరీ పార్టీ

16లో

గ్రూప్-1 టాపర్‌గా నిషాంత్

మార్కులు ప్రకటించిన ఏపీపీఎస్సీ 6లో

దెబ్బకు దెబ్బ!

- 128 అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాల పెంపునకు సిద్ధమైన చైనా
- ట్రంప్ వాణిజ్య ఆంక్షలు విధిస్తే చూస్తూ ఊరుకోబోమని గట్టి హెచ్చరిక

16లో



భవిష్యత్తు విద్యుత్ వాహనాలదే

హీరో మోటోకార్ప్ శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

ఈనాడు, తిరుపతి: భవిష్యత్తు అంతా విద్యుత్ వాహనాలదేనని, దానిపైనా 'హీరో' దృష్టి సారించాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. చిత్తూరు జిల్లా సత్యవేడు శ్రీసిటీ సమీపంలోని మదనపాలెం సమీపంలో 636 ఎకరాల్లో నిర్మించబోయే హీరో మోటోకార్ప్ మొదటిదశ పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఆటోమొబైల్ రంగంలో ప్రపంచంలోనే నంబరు వన్‌గా ఉన్న హీరో దక్షిణభారతంలో మొదటి యూనిట్‌ను మన రాష్ట్రంలోనే స్థాపించడం ఆనందంగా ఉందన్నారు. మూడు దశల్లో నిర్మితమయ్యే ఈ ప్రాజెక్టు వల్ల ఈ ప్రాంతానికి కొత్త కళ వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 12వేల మందికి ఉద్యోగాలు రానున్నాయని చెప్పారు. 'నేను 2002 అక్టోబరు 15న గుర్‌గావ్‌లోని హీరోహోండా ప్లాంటును సందర్శించాను. అందులోని ప్రత్యేకతలను తెలుసుకున్నాను. పదేళ్ల తర్వాత మళ్లీ పవన్ ముంజాల్ ఛైర్మన్ అయిన తర్వాత వారి ప్లాంటును పరిశీలించాను. అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో వారు తయారు చేసే మోటారు సైకిళ్లు ప్రపంచంలోనే ఉత్తమంగా నిలుస్తున్నాయి. ఈ రోజు ఇక్కడ స్థాపించిన ప్లాంట్‌కు 2019 డిసెంబరు నాటికి మొదటి దశ యూనిట్‌ను పూర్తి చేస్తామని పవన్ ముంజాల్ చెబుతున్నారు. మార్చిలోపే పూర్తి చేయాలని నేను ఆకాంక్షిస్తున్నాను...' అని చంద్రబాబు పేర్కొన్నారు. నిర్మాణ సమయంలో ఏ చిన్న సమస్య వచ్చినా.. తాను, తన మంత్రివర్గం, అధికార యంత్రాంగం వెంటనే స్పందిస్తామని, 24/7 అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. హీరోకు ఇప్పటికే 7 ప్లాంట్లు ఉన్నాయని.... 8వ ప్లాంటు ద్వారా.. ఇతర రాష్ట్రాల పాలనకు, ఏపీలో పాలనకు ఉన్న వ్యత్యాసాన్ని చూస్తారని వ్యాఖ్యానించారు.

హీరో మోటోకార్ప్ ఛైర్మన్ పవన్ ముంజాల్ మాట్లాడుతూ 37 దేశాల్లో తమ సంస్థ ఉత్పత్తులు ముందంజలో ఉన్నాయని, మొదటిదశ ప్లాంటును రూ.600 కోట్లతో పూర్తి చేస్తామని చెప్పారు. ప్లాంటు అంటే కేవలం నామమాత్రంగా కట్టడం కాదని, పూర్తి పర్యావరణహితంగా నిర్మించబోతున్నామన్నారు. తాను తోటి పారిశ్రామికవేత్తలకు ఇక్కడ పెట్టుబడులు పెట్టాలని సూచిస్తానని వెల్లడించారు. పరిశ్రమలశాఖ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

"చంద్రబాబునాయుడు మా కుటుంబ శ్రేయోభిలాషి. ఒక రోజు రాత్రి విందుకు మా ఇంటికి వచ్చారు. చాలా సరదాగా మొదలైన మా సంభాషణ గంటసేపు సాగింది. ఆ గంటలోనే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు గురించే మాట్లాడారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని, హీరో కంపెనీ ఉత్పాదన యూనిట్లకు అనువైన పరిస్థితులు ఆంధ్రాలో ఉన్నాయని, వాటిని ఒకసారి పరిశీలించాలని కోరారు. ఆ గంట మొత్తం నా పరిశీలనలో చంద్రబాబుకు రాష్ట్ర భవిష్యత్తుపై ఉన్న విజన్, అభివృద్ధిపై మమకారం కనిపించాయి. దాని తర్వాత కొద్దిరోజులకే మేం దక్షిణ భారతదేశంలో మొదలు పెట్టబోయే ప్లాంటును ఆంధ్రప్రదేశ్‌లో పెట్టాలని నిర్ణయించుకున్నాం."

– పవన్ ముంజాల్, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, హీరో మోటోకార్ప్

ఎవరినీ కలవద్దు

(మొదటి పేజీ తరువాయి)

చట్టంలోని అంశాల్ని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల్ని పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిందే. ఈ విషయంలో మన డిమాండ్‌లు చాలా స్పష్టంగా ఉన్నాయి. వాటిని సాధించుకోవడానికి కేంద్రంపై మనం పోరాడుతున్నాం. వాటిపై కేంద్ర మంత్రుల్ని కలిసి చర్చించాల్సిన అవసరం లేదు. పార్లమెంటులో ఎదురుపడితే పలకరించడంలో తప్పు లేదు. వారితో ప్రత్యేకంగా మంతనాలు సాగించడమో, వారి దగ్గరకు వెళ్లి మాట్లాడటమో చేయొద్దు..." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేంద్రం నుంచి శాఖల వారీగా రావలసిన అంశాల్ని అధికారుల స్థాయిలో చూసుకుంటారన్నారు. కేంద్ర మంత్రులతో తెదేపా ఎంపీలు మంతనాలు సాగిస్తున్నట్టు వైకాపా అనుకూల మీడియా దుష్ప్రచారం చేస్తోందని, దీనిని ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని సూచించారు. ఎంపీలంతా అనుక్షణం అప్రమత్తంగా, రాబోయే ఇబ్బందుల్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. "ఆంధ్రప్రదేశ్‌పైనా, పోలవరం ప్రాజెక్టుపైనా కుట్ర చేస్తున్నారు. దక్షిణాదిలో నాయకత్వాల్ని బలహీనపరిచి, సమర్థ నాయకత్వం లేకుండా చూడాలని కుట్రపన్నుతున్నారు. పోరాటంలో వెనుకంజ వద్దు..." అని ఆయన స్పష్టం చేశారు. కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాల్సిన నిధుల్లో కోత పెడుతూ, ఇతర రాష్ట్రాలకు మాత్రం ధారాళంగా నిధులిస్తోందని ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. "మనం ఎవరి మీదా కుట్ర, కుతంత్రాలు చేయడం లేదు. ప్రధాని నరేంద్ర మోదీ, భాజపా, ఎన్డీయే, యూపీయేలపై కోపం లేదు. రెండు జాతీయ పార్టీలు రాష్ట్రానికి అన్యాయం చేశాయన్నదే బాధ..." అని పేర్కొన్నారు. తెదేపా ఎంపీల పోరాటం ప్రజల్లోకి బలంగా వెళ్లిందని, గురువారం జరిగిన నిరసనలే దానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. తెదేపా బలపడితేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని, బలహీనపరిస్తే రాష్ట్రం నష్టపోతుందని పేర్కొన్నారు. "మనం రాజకీయాల్లోకి వచ్చిందే ప్రజలకు మేలు చేసేందుకు. కుట్రలు, కుతంత్రాలు చేయడానికి కాదు. ఈ విషయాన్ని ఆ మూడు పార్టీల నాయకులు గుర్తుంచుకోవాలి. హోదా ఒక్కటే తీసుకొని ప్రోత్సాహకాలను వదిలేయాలని వైకాపా చూస్తోంది. ప్రత్యేకహోదాలో ప్రోత్సాహకాలు ఉండవని భాజపా అంటోంది. హోదా ఉన్న రాష్ట్రాలకు ఇచ్చిన ప్రోత్సాహకాలన్నీ ఇవ్వాలని మనం అడుగుతున్నాం. దీనిపై అందరిలోను స్పష్టత ఉండాలి. ప్రజల్లో అవగాహన పెంచాలి..." అని పేర్కొన్నారు. "ఇన్ని ఆందోళనలు జరుగుతున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. ఈశాన్య రాష్ట్రాలకు రూ.3 వేల కోట్లు విడుదల చేసింది. ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చే నిధుల్లో కోత పెడుతోంది. ఇది ఏ మాత్రం సరికాదు. రాజకీయాల్లో విశ్వసనీయత ఎంతో ముఖ్యం. దాని వల్లే 2014లో ప్రజలు తెదేపాని గెలిపించారు. విశ్వసనీయత లేదు కాబట్టే వైకాపాను ఓడించారు. ప్రజల్లో మనపై ఉన్న విశ్వసనీయతను కాపాడుకోవాలి..." అని తెలిపారు. సుజనాచౌదరి మాట్లాడుతూ.. రాజ్యసభలో తాను చేసిన ప్రసంగంలో సగభాగం తొలగించడంపై నిరసన వ్యక్తం చేసినట్టు చెప్పారు. కొందరు సభ్యులు వెల్‌లో అడ్డుగా ఉన్నందున, అవిశ్వాసానికి మద్దతిస్తున్న సభ్యుల్ని లెక్కించడం సాధ్యం కావడం లేదని స్పీకర్ అంటున్నారని, వెల్‌లో ఆందోళన చేస్తున్న వారిని సస్పెండ్ చేసి, లెక్కించాలని కోరినా స్పందన లేదని ఆయన వివరించారు.



అన్నాహజారే నిరవధిక నిరశన మొదలు

లోక్‌పాల్ ఏర్పాటు కోసమే..

దిల్లీ: లోక్‌పాల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ....సామాజిక ఉద్యమకారుడు అన్నాహజారే శుక్రవారం నుంచి ఇక్కడ నిరవధిక నిరాహార దీక్షను మొదలు పెట్టారు. ఇక్కడి రామ్‌లీలా మైదాన్‌లో ఆయన దీక్ష మొదలైంది. 2011లో ఇక్కడి నుంచే ఆయన అవినీతి వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించిన విషయం గమనార్హం. కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాల్లో లోకాయుక్తలను ఏర్పాటు చేయాలంటూ హజారే ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్న విషయం గమనార్హం. వ్యవసాయరంగ సమస్యలకు పరిష్కారాలను సూచించిన స్వామినాథన్ కమిషన్ నివేదికను అమలు చేయాలన్నది కూడా అన్నాహజారే డిమాండ్‌గా ఉంది. దీక్షకు ఉపక్రమించడానికి ముందు అన్నాహజారే రాజ్‌ఘాట్ వద్ద మహాత్ముడికి నివాళి అర్పించారు. ఈ దఫా దేశవ్యాప్తంగా ఉన్న రైతులు రామ్‌లీలా మైదాన్‌లో అన్నాహజారేకు మద్దతుగా దీక్షల్లో పాల్గొంటారు.

లక్ష ఎలక్ట్రిక్ వాహనాలు



సీఎం ప్రారంభించిన విద్యుత్తుతో నడిచే (ఎలక్ట్రిక్) బస్సు

- రెండేళ్లలో ప్రవేశపెడతాం
- ప్రభుత్వ కార్యకలాపాలకు పదివేల వాహనాల వినియోగం
- భారీ ప్రోత్సాహకాలు, త్వరలోనే ప్రత్యేక విధానం: సీఎం

ఈనాడు డిజిటల్, అమరావతి: రానున్న రెండేళ్లలో విద్యుత్తుతో నడిచే (ఎలక్ట్రిక్) లక్ష వాహనాలు ప్రవేశపెడతామని, ముందుగా పదివేల వాహనాలను ప్రభుత్వ కార్యకలాపాలకు వినియోగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. ఆర్టీసీలోనూ ఈ తరహా వాహనాలను ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ ఏడాదిని 'ఈ వాహనాల తయారీ సంవత్సరం'గా ప్రకటించారు. కాలుష్యాన్ని తగ్గించడం, యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ రంగాన్ని ప్రోత్సహిస్తామని, ఇందుకోసం తయారీదారులకు భారీ ప్రోత్సాహకాలతో పాటు త్వరలోనే ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్రంలో ఈ వాహన రంగం అభివృద్ధికి గల అవకాశాలు, వీటి తయారీకి అందించాల్సిన ప్రోత్సాహకాలపై అధికారులు, తయారీదారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం సచివాలయంలో సమావేశమయ్యారు. అంతకుముందు 'ఎలక్ట్రిక్ బస్సు'ను ప్రారంభించిన ముఖ్యమంత్రి అందులో కొంతదూరం ప్రయాణించారు. తర్వాత టాటా సంస్థ తయారు చేసిన కారును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. "మొదట విజయవాడ, విశాఖపట్నం, తిరుపతిలలో ఈ వాహనాలు వినియోగించేలా చర్యలు చేపట్టి.. వాటి వాడకం వల్ల వచ్చిన వాతావరణ మార్పులను అంచనా వేస్తాం. ఈఈఎస్ఎల్ (ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్) భాగస్వామ్యంతో పైలట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో 300 ఎలక్ట్రిక్ వాహనాలను ప్రారంభిస్తున్నాం. ఈ వాహనాల వినియోగంలో ఇతర దేశాలు ముందంజలో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా 30 లక్షలు ఉండగా.. 2025 నాటికి వీటి సంఖ్య నాలుగు కోట్లు దాటుతుంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలి..." అని తయారీదారులకు పిలుపునిచ్చారు. ఇటీవల 10 వేల వాహనాలు పంపిణీ చేయాలని ఈఈఎస్ఎల్‌తో ఒప్పందం చేసుకున్నామని, త్వరలో వీటిని సమకూర్చాలని, వాహనాల ఛార్జింగ్ సమయాన్ని తగ్గించాలని ఆ సంస్థ ప్రతినిధులకు సీఎం చంద్రబాబు సూచించారు.

ముసాయిదాలో ప్రోత్సాహకాలెన్నో.. విద్యుత్తుతో నడిచే (ఎలక్ట్రిక్) వాహనాల వినియోగంతో కలిగే ప్రయోజనాలు, ఈ రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి అజయ్ జైన్ వివరించారు. 'ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిక్ వాహన రంగ విధానం' ముసాయిదాను ప్రస్తావించారు. "ఈ వాహనాలకు రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు, ఎస్‌జీఎస్టీలో మినహాయింపులకు అవకాశం ఉంటుంది. కారులో ఒక కిలోమీటరు దూరం ప్రయాణానికి ఖర్చు పెట్రోల్‌లో రూ.3.90, డీజిల్‌లో రూ.3.25 ఖర్చవుతుండగా.. ఎలక్ట్రిక్ వాహనంలో 80 పైసలకే ప్రయాణించవచ్చు. ఔత్సాహికులను ఛార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తాం. ఇది వారికి ఆదాయవనరుగా మారుతుంది. ఈ వాహనాల తయారీ యూనిట్లు, అంకుర సంస్థలకు సంబంధించి ఎంఎస్ఎంఈల ఏర్పాటుకు ప్రత్యేకంగా సెజ్ ఏర్పాటు చేస్తాం. ఈ-రిక్షాలు నడిపేందుకు త్వరలోనే అనుమతులిస్తాం..." అని అజయ్‌జైన్ వివరించారు. పవన విద్యుత్‌లో దేశంలోనే రాష్ట్రం అత్యధిక ఉత్పత్తి సాధించినందుకు నెడ్‌క్యాప్‌కు బెస్ట్ పర్ఫార్మింగ్ నోడల్ ఏజెన్సీ అవార్డును నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విండ్ ఎనర్జీ ఇవ్వడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఈఈఎస్ఎల్‌తో సీఆర్డీఏ, ఈపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్, వీఎంసీ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి.

దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర నిధుల కోత!

- కర్ణాటక ముఖ్యమంత్రి ఆందోళన

ఈనాడు, బెంగళూరు, తిరువనంతపురం: కేంద్రం విడుదల చేయనున్న నిధుల్లో దక్షిణాది రాష్ట్రాలకు భారీగా కోత పడనున్నందున ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులందరూ అప్రమత్తం కావాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య శుక్రవారం ట్వీట్ చేశారు. రాష్ట్రాలకు కేటాయించే నిధులకు 1971 జనాభాకు బదులుగా 2011 జనాభాను ప్రాతిపదికగా తీసుకోవాలని కేంద్రం 15వ ఆర్థిక సంఘానికి సూచించిందన్నారు. దక్షిణాదిలో కంటే ఉత్తరాది రాష్ట్రాల్లో జనసంఖ్య ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అందువల్ల నిధుల కేటాయింపులో ఉత్తరాది కన్నా దక్షిణాది రాష్ట్రాలకు ఇప్పుడు అందుతున్న నిధుల కంటే చాలా తక్కువ నిధులు అందే అవకాశం ఉందన్నారు.

కాంగ్రెస్ అవిశ్వాసం

(మొదటి పేజీ తరువాయి)

వాయిదా పడిన తర్వాత ఈనెల 27వ తేదీ కోసం ఆ పార్టీ లోక్‌సభాపక్షనేత మల్లికార్జున ఖర్గే... లోక్‌సభ సెక్రటరీ జనరల్ కార్యాలయంలో అవిశ్వాస నోటీసును అందజేశారు. మరోవైపు మంగళవారం సభకు తప్పనిసరిగా హాజరుకావాలంటూ తమ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ విప్ కూడా జారీ చేసింది. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ అవిశ్వాస నోటీసు ఇవ్వడం వల్ల ప్రభుత్వంపై ఒత్తిడి పెరగనుంది. అయితే, ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులు తమ ఆందోళనను యథావిధిగా కొనసాగించే అవకాశం ఉన్నందున కాంగ్రెస్ నోటీసుపైనా చర్చ కష్టంగానే కనిపిస్తోంది.

వారిని సీట్లలో కూర్చోబెట్టండి..చర్చిద్దాం.. అవిశ్వాసానికి మద్దతిచ్చే వారు సభామధ్యంలో ఉన్న సభ్యులకు నచ్చజెప్పి సీట్లలో శాంతియుతంగా కూర్చోబెడితే దానిపై చర్చను చేపట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానని సభాపతి సుమిత్రా మహాజన్ ప్రకటించినప్పటికీ శుక్రవారం సభ అదుపులోకి రాలేదు. అధికారపక్షం కూడా చర్చకు సిద్ధంగా ఉన్నందున సభ్యులంతా సహకరించాలని కోరారు. తెదేపా నేత తోట నరసింహం, వైకాపా నాయకుడు వైవీ సుబ్బారెడ్డిలు ఇచ్చిన అవిశ్వాస నోటీసులు వరుసగా ఆరో రోజు సభ ముందుకు వచ్చిన సందర్భంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన రెండు నిమిషాల్లోనే ఏఐఏడీఎంకె, తెరాస సభ్యుల ఆందోళనను ప్రారంభించారు. సభ సజావుగా లేకపోతే అవిశ్వాస నోటీసులకు మద్దతిచ్చే 50 మందిని లెక్కించడం కష్టం కాబట్టి అందరూ తమ సీట్ల దగ్గరకు వెళ్లాలని కోరారు. ఈ మాటలను వినిపించుకోకుండా సభామధ్యంలో ఉన్న సభ్యులు మరింత బిగ్గరగా నినాదాలుచేస్తూ ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా సభాపతి.. కాంగ్రెస్ సభ్యులవైపు చూస్తూ మీరు అవిశ్వాసానికి మద్దతిచ్చేటట్లయితే వీరందర్నీ కలిసి శాంతియుతంగా కూర్చోబెట్టండి అని సూచించారు. ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులు తమ నినాదాలు కొనసాగించడంతో స్పీకర్ లోక్‌సభను మంగళవారానికి వాయిదా వేశారు. శ్రీరామనవమిని పురస్కరించుకొని సోమవారం సభకు సెలవు ప్రకటించారు. 25వతేదీన పార్లమెంటు సభ్యులు తమ తమ నియోజకవర్గాల్లో రామనవమి కార్యక్రమాల్లో పాల్గొనాల్సి ఉన్నందున మరుసటి రోజు సెలవు కావాలని అడిగారని, అందుకోసం సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు సుమిత్రామహాజన్ వెల్లడించారు.



రాజ్యసభ వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేస్తున్న ప్రతిపక్షాల సభ్యులు

'ఏ రాష్ట్రానికీ ప్రత్యేక హోదా ఇవ్వడం కుదరదు': ప్రస్తుతం ప్రత్యేక హోదా మనుగడలో లేదని, అందువల్ల భవిష్యత్తులో ఏ రాష్ట్రానికీ ఆ హోదాను ప్రకటించే ప్రశ్నే ఉత్పన్నం కాదని కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి శివ్‌ప్రసాద్ శుక్లా తెలిపారు. శుక్రవారం లోక్‌సభలో కరీంనగర్ ఎంపీ బి.వినోద్‌కుమార్‌తో పాటు, ఒడిశా, బిహార్‌కు చెందిన మరో ఇద్దరు ఎంపీలు అడిగిన లిఖితపూర్వక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. 14వ ఆర్థికసంఘం ప్రత్యేక కేటగిరీ రాష్ట్రాలు, సాధారణ రాష్ట్రాల మధ్య ఎలాంటి తేడా చూపనందున ప్రస్తుతం ప్రత్యేకహోదా మనుగడలో లేదని స్పష్టంచేశారు.

మైసూరు నుంచి తెలుగు పీఠం తరలింపుపై నిర్ణయం తీసుకోలేదు: మైసూరులోని తెలుగు పీఠాన్ని తెలుగురాష్ట్రాల్లో ఎక్కడోచోటికి తరలించే అంశంపై ఇప్పటివరకూ నిర్ణయం తీసుకోలేదని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ సహాయమంత్రి సత్యపాల్‌సింగ్ తెలిపారు. రాజ్యసభలో తెదేపా సభ్యుడు టీజీ వెంకటేష్ అడిగిన ప్రశ్నకు ఆయన ఈ సమాధానమిచ్చారు.

ఆత్మపరిశీలన చేసుకోవాలి

- వెంకయ్యనాయుడు

ఈనాడు, దిల్లీ: విపక్ష పార్టీల సభ్యులు తమ ఆందోళనలను కొనసాగించటంతో రాజ్యసభ కూడా ఎలాంటి కార్యకలాపాలనూ చేపట్టలేకపోయింది. మూడు వారాలుగా కార్యకలాపాలను చేపట్టలేకపోవటంపై సభాధ్యక్షుడు వెంకయ్యనాయుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే ఆయన దీనిపై ఒక ప్రకటన చేశారు.

"మూడు వారాలుగా పెద్దల సభ తన బాధ్యతలను నిర్వర్తించలేకపోయింది. సభాధ్యక్షుడిగా ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. దేశ ప్రజలకు ఎందుకిలా అన్యాయం చేస్తున్నామని సభ్యులంతా ఆత్మపరిశీలన చేసుకోవాలి. వచ్చే వారమైనా మార్పు ఉంటుందేమో చూడాలి" అని సభ్యులనుద్దేశించి అన్నారు. ప్రతిష్ఠంభన తొలగించడానికి అధికార, ప్రతిపక్షాలు చొరవ చూపాలని వెంకయ్య కోరారు. ఆ తర్వాత మంత్రులు సభావ్యవహారాల కాగితాలు ఉంచిన వెంటనే ఏఐఏడీఎంకె, తెదేపా, కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి వచ్చి ఆందోళన కొనసాగించారు. దాంతో ఆయన సభను తొలుత సోమవారానికి వాయిదా వేశారు. శ్రీరామనవమి కారణంగా లోక్‌సభ ఆ రోజు సెలవు ఇవ్వడంతో రాజ్యసభకూ అదే రోజున సెలవు మంజూరుచేస్తూ తర్వాత నిర్ణయం తీసుకున్నారు.

గ్రహం అనుగ్రహం

24–3–2018 శనివారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
వసంత రుతువు; చైత్ర మాసం; శుక్ల పక్షం
సప్తమి: ఉ. 9-58 తదుపరి అష్టమి
మృగశిర నక్షత్రం: మ. 3-37 తదుపరి ఆర్ద్ర
అమృత ఘడియలు: ఉ. 7-21 నుంచి 8-51 వరకు
తిరిగి తె. 4-40 నుంచి
వర్జ్యం: రా. 11-26 నుంచి 12-56 వరకు
దుర్ముహూర్తం: ఉ. 6-05 నుంచి 7-41 వరకు
రాహుకాలం: ఉ. 9-00 నుంచి 10-30 వరకు
సూర్యోదయం: ఉ.6-05; సూర్యాస్తమయం: సా.6-07

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	41.0	26.0
తిరుపతి	40.2	27.5
కర్నూలు	40.2	26.4
గుంటూరు	40.1	24.2
అనంతపురం	39.8	23.8
రాజమహేంద్రవరం	39.0	25.0
విజయవాడ	38.6	25.0
ఒంగోలు	37.2	27.5
శ్రీకాకుళం	37.0	26.0
ఖమ్మం	37.0	23.0
విశాఖపట్నం	35.4	25.8
నరసాపురం	35.3	25.5
తాడేపల్లిగూడెం	35.0	24.0
నెల్లూరు	32.0	24.0

రాయలసీమలో ఎండలు తీవ్రం

ఈనాడు, విశాఖపట్నం: రాయలసీమ జిల్లాల్లో శుక్రవారం ఎండల తీవ్రత కనిపించింది. కర్నూలు, తిరుపతిలో 40.2 చొప్పున అనంతపురంలో 39.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ వారం అంతా ఇలాగే కొనసాగే అవకాశం ఉందని వాతావరణశాఖ వెల్లడిస్తోంది.

అమెరికా బాటలో ఆస్ట్రేలియా



- 457 వీసా రద్దు.. కొత్తగా 'టీఎస్ఎస్'
- భారతీయులకు తగ్గనున్న ఉద్యోగాలు!

దిల్లీ: భారతీయ విద్యార్థుల ఆశలు, అవకాశాలను దెబ్బతీసేలా.. ఆస్ట్రేలియా కూడా అమెరికా బాటలోనే పయనిస్తోంది. విదేశీ నైపుణ్య ఉద్యోగాలకు కీలకమైన 457(సబ్ క్లాజ్) కేటగిరీ వీసాలను తాజాగా రద్దు చేసింది. దీనిస్థానంలో 'టెంపరరీ స్కిల్ షార్టేజి (టీఎస్ఎస్)' వీసా విధానాన్ని ఈనెల 18న తీసుకొచ్చింది. ఇందులోని నిబంధనలతో విదేశీ నిపుణుల అవకాశాలకు గండికొట్టింది. తుది నిబంధనలను ప్రకటించాల్సి ఉన్నప్పటికీ.. అమెరికాకే 'ప్రథమ ప్రాధాన్యం' అన్న డొనాల్డ్ ట్రంప్ వైఖరినే ఇది తలపిస్తోంది.

457 'వీసా'ంశాలు..

★ నాటి అవసరాల మేరకు విదేశీ నిపుణులను త్వరితగతిన, సులువుగా తీసుకునేలా ఆస్ట్రేలియా 1990ల్లో దీన్ని పరిచయం చేసింది. 95వేల మంది విదేశీ ఉద్యోగులు వీటిని వినియోగిస్తుండగా.. అందులో 25 శాతానికి పైగా భారతీయులే. యూకే, చైనా ఉద్యోగులు 19.5%, 5.8% మాత్రమే.

★ నాలుగేళ్లకు గాను విదేశీయులకు ఆస్ట్రేలియన్ సంస్థలు ఉద్యోగాలిచ్చే వీలుండేది. దీనిద్వారా ఉద్యోగాలు పొందినవారు వెంటనే తమ కుటుంబాలతో ఆస్ట్రేలియాకు వెళ్లి నివసించవచ్చు.

ఏమి 'టీఎస్ఎస్'..!

★ 457 వీసా కింద 650కి పైగా ఉద్యోగాలు దొరికేచోట.. కొత్తవిధానంలో ఆ సంఖ్య 200కు పరిమితమవుతుంది.

★ ఆంగ్లభాషలో ప్రావీణ్యం, కనీసం రెండేళ్ల అనుభవం అవసరం. అలాగే నేరచరిత్రను కూడా పరిశీలిస్తారు. కనీస మార్కెట్ వేతనాలూ ఆస్ట్రేలియన్లకు అనుకూలంగా ఉంటాయి.

★ ఆస్ట్రేలియాలో శాశ్వతనివాసం ఏర్పరచుకోవాలని భావించేవారికి పెద్ద అవరోధంగా మారుతుంది.

★ కొత్త విధానంలో 2 ప్రధాన కేటగిరీలున్నాయి. మొదటిది-స్వల్పకాలికంగా నైపుణ్య వృత్తుల జాబితా (ఎస్‌టీఎస్‌ఓఎల్)లోని ఉద్యోగులను తెచ్చుకోవడం. ఇది గరిష్ఠంగా రెండేళ్లకు మాత్రమే వర్తిస్తుంది. వీరు శాశ్వత నివాసం ఏర్పరచుకోవడానికి అనర్హులు. రెండోది - మాధ్యమిక నైపుణ్య జాబితాలో వారిని నాలుగేళ్లకు తెచ్చుకోవడం. వీరు మాత్రం మూడేళ్ల తర్వాత శాశ్వత నివాసానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

★ విదేశీ నిపుణులను తెచ్చుకోవాలంటే.. సంస్థలపై ఆర్థికభారం పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రతి ఉద్యోగిపైనా ప్రతి సంస్థ కనీసం ఏటా 1200 డాలర్లు (సుమారు రూ. 78 వేలు) చెల్లించేలా 'ఆస్ట్రేలియా నైపుణ్యాభివృద్ధి నిధి (ఎస్ఏఎఫ్)' పేరిట పన్ను వసూలు చేసే అంశంపై ప్రస్తుతం ఆ దేశ పార్లమెంటులో చర్చ జరుగుతోంది.

ఇదీ సంగతి!



ఇదిగో అన్నా. లోక్‌పాల్ తేవట్లేదని ఎవరన్నారు. ఊరేశామంతే!

ప్రకాశం జిల్లా, కనిగిరి
టీచర్స్ అకాడమి-DSC
SGT, SA బ్యాచ్ ప్రా॥ : 29-3-2018
TET లో 138, 133, 132, 131, 130 వంటి అత్యున్నతస్థాయి మార్కులు సాధించిన సంస్థ
98486 61318, 98486 62328

కృష్ణా జిల్లా, అవనిగడ్డ
ప్రగతి DSC
SGT+SA (Mat, Bio, Soc, Tel)
బ్యాచ్ ప్రారంభం : 29-03-2018
81062 68194, 81062 68437

గణపతి సార్‌చే G.K & జనరల్ సైన్స్
SI, కానిస్టేబుల్స్, RRB గ్రూప్-D
రేపే 7 వ బ్యాచ్ ప్రారంభం BOTH EM & TM
గణపతి ...పోటీ పరీక్షల శిక్షణా సంస్థ
నేరుగా లగేజీతో రండి
కాకినాడ, తూ.గో.జిల్లా
95058 66099
95427 15559

స్ఫూర్తి DSC/TTC నెల్లూరు
చాకలి వీధి, VRC, నెల్లూరు
SGT, S.A. Free Demo 25th March 2018
TET-2 సోషల్‌లో స్టేట్ ర్యాంక్
P.కాంచన-118 Marks (HT No.1720715508995)
9440009134, 8985005173

S.I & కానిస్టేబుల్స్ | RPF - 9500 పోస్టులు
మాల్యాద్రి సార్ గైడెన్స్‌లో కాకినాడ బ్రాంచిలో Mar 26th
New Batches ప్రారంభం. హైదరాబాద్ బ్రాంచిలో New Batches ప్రారంభమైనవి
భాగ్యనగర్ ఇన్‌స్టిట్యూట్
కాకినాడ: 9652578639 | చైతన్యపురి - హైదరాబాద్ 040-66338639, 24064477

విజేతకాంపిటీషన్స్® vijetacompetitions.net
పక్షపత్రిక రూ. 20 CURRENT AFFARIS
Ed.CET, I-CET, LAWCET, PG ENTRANCE
RRB ALP TM Rs.349, Rs.139, EM Rs.399, Rs.149 | GROUP-D TM Rs.449, Rs.149, EM Rs.439, Rs.159
POSTMAN/MAIL GUARD Rs. 379 MODEL PAPER 149
040-27406336 9963293399 బుక్స్ విడుదల

DSC Online Classes for
SA FEE: 5,000/- SGT FEE: 4,000/- EM TM
Kautilya CAREER CATALYST
www.kautilyacareers.com
90 1474 1474

2017 గ్రూప్-2లో అత్యధిక ఉద్యోగాలు సాధించిన అగ్రగామి
SHINE IAS STUDY CIRCLE
GROUP-II
కొత్త బ్యాచ్ 26.03.2018 సోమవారం నుండి ప్రారంభం
HYDERABAD 9177778234 | TIRUPATI 8186884499 8186003399

Dr. NTR UNIVERSITY OF HEALTH SCIENCES: A.P: VIJAYAWADA-8.
Notification
Application forms through online are invited from the candidates who studied MBBS/BDS in AP (as per GO.MS. No.29, HM & FW Dept., dt.22-03-2018) and secured the cutoff scores in NEET PG – 2018 / NEET MDS – 2018 and fulfilled other eligibility criteria for admission into the State Quota seats of Post Graduate Medical & Dental Degree/Diploma Courses 2018 under Competent authority quota in the State of Andhra Pradesh, from 11.00 A.M on 26-03-2018 to 08.00 P.M on 31-03-2018. For complete details please visit University website http://appgmed.apntruhs.in & http://apmds.apntruhs.in and http://ntruhs.ap.nic.in
VIJAYAWADA, Date:23-03-2018
REGISTRAR

ఒంటిమిట్ట రామయ్య బ్రహ్మోత్సవాలకు నేడు అంకురార్పణ



సీతాలక్ష్మణ సమేత ఒంటిమిట్ట కోదండరాముడు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: కడప జిల్లా ఒంటిమిట్టలోని కోదండ రామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం రాత్రి అంకురార్పణ చేయనున్నారు. ఇందు కోసం ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఈనెల 25న ధ్వజారోహణం నిర్వహిస్తారు. 25 నుంచి వచ్చే నెల ఒకటో తేదీ వరకు వివిధ వాహన సేవలు జరుగుతాయి. 30న ఉదయం శివధనుర్భాణాలంకారం, సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 31న రథోత్సవం ఉంటుంది. వచ్చే నెల రెండో తేదీన ఉదయం చక్రస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం, మూడో తేదీన పుష్పయాగాన్ని వేడుకగా నిర్వహించనున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు గవర్నరు నరసింహన్, ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు, భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నందున పోలీసులు బందోబస్తుఏర్పాట్లు ముమ్మరం చేశారు.

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయం ప్రారంభం



బాలల హక్కుల పరిరక్షణ లోగోను ఆవిష్కరిస్తున్న మంత్రి పరిటాల సునీత. చిత్రంలో ఎమ్మెల్యే బొండా, ప్రభుత్వ విప్ రవికుమార్ తదితరులు

మధురానగర్(విజయవాడ), న్యూస్‌టుడే: సమాజంలో నిరాదరణకు గురైన బాల బాలికలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో విశేష సేవలు అందిస్తున్నట్లు స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ మధురానగర్‌లో ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కొత్త కార్యాలయాన్ని ఆమె ప్రారంభించారు. బాలల హక్కులపై అవగాహనతో పాటు వారి పరిరక్షణ బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాలకార్మికులకు పని నుంచి విముక్తి కలిగించి విద్యాపథంలోకి తీసుకొస్తూ, వారి సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. సమాజ రుగ్మతలతో పాటు చిన్న వయస్సులో జరిగే వివాహాలను అరికట్టడానికి అంతా కలసిరావాలని కోరారు. గ్రామాల్లోని అంగన్‌వాడీల్లో అన్న అమృతహస్తం, బాలామృతం కింద బాలలకు బలవర్ధక ఆహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కె.రవికుమార్, విజయవాడ మధ్య నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు, స్త్రీ శిశు సంక్షేమశాఖ కార్యదర్శి కె.సునీత, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ జి.హైమావతి తదితరులున్నారు.

4న విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లపై సదస్సు

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్ పద్ధతులను సులభతరం చేసేందుకు ఉన్నత విద్యామండలి, టైమ్స్ ఉన్నత విద్య సంయుక్తంగా నాగార్జున వర్సిటీలో వచ్చే నెల 4న రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉన్నత విద్యామండలి ఛైర్మన్ విజయరాజు తెలిపారు. రాష్ట్రంలోని వర్సిటీలను బలోపేతం చేసేందుకు, ర్యాంకింగ్ మెరుగు పరిచేందుకు తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉద్యోగుల సలహాలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. అన్ని విశ్వవిద్యాలయాలు, కళాశాలలు తప్పనిసరిగా ఈ సదస్సులో భాగస్వాములు కావాలని కోరారు. సదస్సులో పాల్గొనే వారు http://apsche.org/apsche_new/theevent.php లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సుకు ఉపాధ్యక్షురాలు వల్లీకుమారి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. రాష్ట్రం నుంచి మొత్తం మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవగా.. .. తెదేపా రెండు, వైకాపా ఒక స్థానాన్ని దక్కించుకుంది. తెదేపాకి చెందిన కనకమేడల రవీంద్ర కుమార్, వైకాపా నుంచి ఎన్నికైన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇది వరకే ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారు.

భాజపా చెప్పుచేతల్లో అన్నాడీఎంకే :సీఎం రమేశ్

భాజపా చెప్పుచేతల్లోనే అన్నాడీఎంకే నడుస్తోందని రాజ్యసభసభ్యుడు సీఎం రమేశ్ ఆరోపించారు. పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా భాజపా అడ్డుకుంటోందని విమర్శించారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన ఆయన శుక్రవారం రిటర్నింగ్ అధికారి సత్యనారాయణ నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా రమేశ్ విలేకరులతో మాట్లాడారు. కేంద్రం దిగివచ్చి సమస్య పరిష్కరించే వరకూ తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. నాలుగేళ్లు తెదేపాతో కలిసి ఉన్నప్పుడు కనిపించని అవినీతి ఇప్పుడు భాజపా నేతలకు ఎలా కనిపిస్తోందని ఆయన ప్రశ్నించారు. రెండోసారి రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



ఎన్నికల్లో గెలుపొందినట్లు రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువపత్రాన్ని అందుకుంటున్న సీఎం రమేష్

తెరాస అభ్యర్థుల గెలుపు...


ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో శుక్రవారం జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర సమితి మూడింటిని కైవసం చేసుకుంది. ఎన్నికల్లో మొత్తం 107 ఓట్లు పోల్‌కాగా తెరాసకు ఊహించిన విధంగానే 97 ఓట్లు వచ్చాయి. బండా ప్రకాశ్ ముదిరాజ్‌కు 33, బడుగుల లింగయ్య యాదవ్, జోగినపల్లి సంతోష్‌కుమార్‌కు 32 చొప్పున ఓట్లు రాగా వారిని విజేతలుగా ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. కాంగ్రెస్ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరామ్‌నాయక్ 10 ఓట్లు మాత్రమే పొంది ఓటమి పాలయ్యారు. స్వతంత్ర సభ్యుడిగా ఉన్న నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పోలింగు సమయంలో కాంగ్రెస్ ఏజెంటుకు తమ ఓటును చూపించడంతో దీనిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్వో) ఈసీకి ఫిర్యాదు చేశారు. ఆయన ఓటును చెల్లనిదిగా ఈసీ ప్రకటించింది.

ఆదివాసీలను విడుదల చేయాలి

పౌర హక్కుల సంఘం

ఈనాడు, హైదరాబాద్: ఆదివాసీల అక్రమ నిర్బంధం ఆపాలని, వారి పట్ల నియంతృత్వ వైఖరిని విడనాడాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం డిమాండ్ చేసింది. ఈ నెల 17, 18 తేదీల్లో ఛత్తీస్‌గఢ్ నుంచి అనారోగ్యంతో హైదరాబాద్‌కు వచ్చిన ఆదివాసీ ప్రజలను తిరిగి వెళ్తున్న సమయంలో పోలీసులు అరెస్టు చేశారని, వారిని బేషరతుగా విడుదల చేయాలని సంఘం తెలంగాణ అధ్యక్షుడు ప్రొ.లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎన్. నారాయణరావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అరెస్టు అయినవారిలో సుక్మా జిల్లాకు చెందిన కుంజం ఊరయ్య, మహేశ్, సురేశ్, నంది(మహిళ)ఉన్నారని పేర్కొన్నారు. వీరిని మావోయిస్టులుగా ముద్ర వేసి చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు వారి బంధువులు చెబుతున్నారని తెలిపారు. వీరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.





ఈనాడు

సాకల్య క్షాళన తప్పనిసరి

ప్రభుత్వరంగ బ్యాంకుల్లో మేటవేసిన నిష్పూచీతనమే కొండంత అండై భారీ కుంభకోణాల పరంపర దేశంలో అంతులేని వింత కథగా కొనసాగుతోంది. బ్యాంకుల్ని నిలువునా ముంచి తట్టాబుట్టా సర్దుకుని దర్జాగా విదేశాలకు ఉడాయిస్తున్న బడాబాబుల ఉదంతాలు నిశ్చేష్టపరుస్తున్నాయి. ఆ వరసలో సరికొత్తగా హైదరాబాదుకు చెందిన టోటెం ఇన్‌ఫ్రా సంస్థపై కేసు (సీబీఐ) కేసు నమోదైంది! వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ, అతడి సంబంధీకులు పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) అధికారులతో జట్టుకట్టి వివిధ బ్యాంకులకు కుచ్చుటోపీ పెట్టిన మొత్తం ఇప్పటికి పద్నాలుగున్నర వేలకోట్ల రూపాయలకు పైబడింది. ఆ ప్రహసనాన్ని వెన్నంటి రొటొమ్యాక్ సంచాలకుల విక్రం కొఠారీ బాగోతం నెల్లాళ్ల క్రితం వెలుగుచూసింది. ఏడు బ్యాంకులతో కూడిన సహవ్యవస్థ (కన్సార్టియమ్)ను కొఠారీ కుటుంబం రూ.3,695 కోట్లకు ముంచేసింది. ఎస్‌బీఐ నేతృత్వంలోని పద్నాలుగు బ్యాంకుల సహవ్యవస్థకు కనిష్క్ గోల్డ్ యాజమాన్యం అసలు, వడ్డీ కలిపి దాదాపు రూ.1,000 కోట్ల మేర టోకరా వేసి విదేశాలకు ఎగిరిపోయిన వైనం రెండు రోజుల క్రితమే వెల్లడైంది. ఆ కథనాలపై సిరా తడి ఆరకముందే ఏనిమిది బ్యాంకులు, ఆర్థిక సంస్థల సమాఖ్యకు టోటెం ఇన్‌ఫ్రా రమారమి రూ.1,400 కోట్ల దాకా ఎగవేసినట్లు బహిర్గతమైంది. కీలక స్థానాల్లోని అధికారుల్ని ప్రతి మూడేళ్లకోసారి బదిలీ చేయాల్సి ఉన్నా ఆ నిబంధనల్ని పట్టించుకోకపోవడమే బ్యాంకులకు ఈ దుస్థితి తెచ్చిపెట్టిందని సీవీసీ (కేంద్ర నిఘా సంఘం) ఆక్షేపించాక- కేంద్రం ఇక బదిలీల కొరడా ఝళిపిస్తామంటోంది. అంతర్గత నియంత్రణల్ని మెరుగుపరచడంతోపాటు అసలు ప్రభుత్వరంగ బ్యాంకుల గతిరీతులు, యాజమాన్య బాధ్యతలన్నింటినీ సాకల్యంగా పరిశీలించాల్సి ఉందని ప్రధానికి ముఖ్య ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రమణియన్ సృష్టీకరిస్తున్నారు. పైపూత పరిష్కారాలకు ఇది తరుణం కాదు!

ఖాతాల నిర్వహణలో ప్రభుత్వరంగ బ్యాంకులు పారదర్శకత పాటించాలని ఇంపుమీరం మూడు దశాబ్దాలనాడు ఆర్‌బీఐ దిశా నిర్దేశం చేసింది. ఆ ఉద్బోధ అరణ్యరోదనమైన దుష్పరిణామాలు నేడు అడుగడుగునా ప్రస్ఫుటమవుతున్నాయి. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల్లో సిబ్బంది తోడ్పాటుతో జరిగే మోసాల సంఖ్య అధికమని, ఇంటి దొంగల కారణంగా వాటిల్లుతున్న ఆర్థిక నష్టాల పరిమాణం ప్రాతిపదికన రాజస్థాన్ తొలిస్థానమని రిజర్వ్‌బ్యాంకు గణాంకాలే ధ్రువీకరిస్తున్నాయి. కొందరు వ్యాపారవేత్తలు, బ్యాంకర్లు కుమ్మక్కై దేశ భవిష్యత్తును దోచుకుంటున్నారని ఇటీవల ఆక్రోశించిన ఆర్‌బీఐ సారథి ఉర్జిత్ పటేల్- బ్యాంకుల నియంత్రణ చట్టానికి సవరణల ఆవశ్యకతను ప్రత్యేకంగా ప్రస్తావించారు. పీఎన్‌బీలో వేలకోట్ల రూపాయల మహాపంచనను ఆడిట్, నియంత్రణ సంస్థలు ఏడేళ్లుగా పసిగట్టలేక పోవడమేమిటన్న కేంద్ర విత్తమంత్రి జైట్లీ సూటిప్రశ్న- వ్యవస్థాగత లోటుపాట్లను కళ్లకు కట్టింది. మరే బ్యాంకూ అనధికారిక అంగీకార పత్రాలు జారీ చేయకుండా, ఉద్దేశపూర్వక ఎగవేతదారులు విదేశాలకు పారిపోకుండా నట్లు బిగిస్తున్నామంటున్న కేంద్రం- బ్యాంకు దొంగల ఆస్తుల జప్తుపైనా దృష్టి సారించింది. రుణాలు రాబట్టే ఎగ్గొట్టిన వాళ్లు మాత్రమే మోసగాళ్లు కాదు. హర్షద్ మెహతాలకు, కేతన్ పరేఖ్‌లకు, నీరవ్ మోదీలకు, భూపేష్ జైన్లకు లోపాయికారీగా సహకరించి అప్పనంగా కోట్లకు కోట్లు దోచిపెట్టి జేబులు నింపుకొన్న విద్రోహుల అనుపానుల్ని గుర్తించి బోనెక్కించాలి. అటువంటి భారీ రుణ పందేరాలకు సమ్మతి తెలిపిన బోర్డు సభ్యుల్నీ వదిలిపెట్టకూడదు. వందలు, వేలకోట్ల రూపాయల నిధుల్ని నిక్షేపంగా వేరే ఖాతాలకు మళ్లించుకొని కుంభకోణాసురులు భద్రమైన ప్రాంతాలకు తరలిపోయేలా గుట్టుగా కానిచ్చిన వాళ్లందరినీ ఆర్థిక కుట్రలో భాగస్వాములుగా పరిగణించి, కఠినంగా శిక్షించాల్సిందే!

పదహారేళ్ల క్రితం జాన్ రుస్నక్ అనే వ్యక్తి అమెరికాలో 691 మిలియన్ డాలర్ల (ప్రస్తుత రేటు ప్రకారం, నాలుగున్నర వేలకోట్ల రూపాయల) మేర బ్యాంకు మోసానికి పాల్పడి న్యాయాధికారుల్ని ప్రలోభపెట్టినట్లు రుజువై ఏడున్నర సంవత్సరాలు జైలుపాలయ్యాడు. వంచనకు తెగబడ్డారన్న అభియోగాలపై వాంగ్ లైమింగ్, మియావ్ పింగ్ అనే బ్యాంకర్లకు 2004లో చైనా మరణ దండన అమలుపరిచింది. సత్వర న్యాయ విచారణ వ్యవస్థలు నెలకొనని భారత్‌లో మోసాలు, ఉద్దేశపూర్వక ఎగవేతలు ఇంతలంతలై మొన్న డిసెంబరునాటికి బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.8.41 లక్షల కోట్లకు విస్తరించాయి. 2004-15 సంవత్సరాల మధ్య బ్యాంకులు పారుబాకీలుగా మాఫీ చేసిన మొత్తం రూ.2.11 లక్షల కోట్లు! నిరర్థక ఆస్తుల మొదలు గుదిబండై కూలబడిన ప్రభుత్వరంగ బ్యాంకుల పునర్ మూలధనీకరణ పేరిట కేంద్రం వెచ్చిస్తున్నదంతా ప్రజాధనమే. జనం సొమ్మును యథేచ్ఛగా దారిపోస్తున్న ఏ ప్రభుత్వబ్యాంకులోనూ తిరుగులేని జవాబుదారీతనానికి, పనిపోకడల పరంగా పారదర్శకతకు ఇదమిత్థ చర్యలు చేపట్టాల్సిందే. ప్రభుత్వరంగ బ్యాంకుల చైర్మన్, ఎండీ, డైరెక్టర్లను సాగనంపే అవకాశం గాని; బ్యాంకుల లైసెన్సులు రద్దుచేసే అధికారం గాని లేని తాను వాటిని ఎలా నియంత్రించగలనని రిజర్వ్‌బ్యాంకు వాపోతోంది. 1949 నాటి బ్యాంకింగ్ నియంత్రణ చట్టం, 1955నాటి స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1970నాటి బ్యాంకింగ్ కంపెనీల చట్టం, 1980నాటి జాతీయీకరణ శాసనం- కేంద్రం ముందస్తు అనుమతి లేకుండా బ్యాంకు బోర్డులు ఏమీ చేయగల వీల్లేదని నిర్దేశిస్తున్నాయి. అయినా అవకతవకలు పెచ్చరిల్లుతుండటం, రకరకాల లొసుగులతో బ్యాంకింగ్ రంగం కూరుకుపోయిన దయనీయ దుస్థితికి అద్దం పడుతోంది. బ్యాంకింగ్ వ్యవస్థను తిరిగి సవ్యంగా పట్టాలకు ఎక్కించే సమగ్ర సంస్కరణలే దేశార్థికాన్ని తేజరిల్లజేయగలుగుతాయి!

కాడి వదిలి... కదం తొక్కి!


డాక్టర్ పరిటాల పురుషోత్తం

ప్రస్తుత, పూర్వ ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని దీర్ఘకాలంగా నిర్లక్ష్యం చేసినందువల్లే రైతులు నేడు ఉద్యమపథం పట్టారు. ఇటీవల నాసిక్ నుంచి ముంబయి వరకు 35 వేలమంది రైతులు మహా పాదయాత్ర జరపడం, వారిలో ప్రజ్వరిల్లుతున్న తీవ్ర అసంతృప్తికి నిదర్శనం. ఈ నెల ఆరు నుంచి 11వ తేదీ వరకు జరిగిన ఈ యాత్రలో రైతులు తమ రుణాలు, విద్యుత్ బిల్లులను బేషరతుగా మాఫీ చేయాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని, రైతులకు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడగళ్ల వాన, అకాల వర్షాల వల్ల పంటనష్టం జరిగినప్పుడు ఎకరాకు రూ.40 వేల చొప్పున నగదు పరిహారం చెల్లించాలన్నారు. అన్నింటికీమించి తాము దీర్ఘకాలంగా సాగుచేస్తున్న అటవీ భూములపై తమకు యాజమాన్య హక్కులు దఖలుపరచాలని కోరారు. అదే సమయంలో ఆదివాసులకు భూ హక్కులు ఇవ్వాలని, అటవీ హక్కుల చట్టాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే రైతులు గిట్టుబాటు ధరలకోసం పిడికిలి బిగించారు. ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని ఒత్తిడి పెంచారు.


మహారాష్ట్ర రైతుల మహా పాదయాత్ర

పెరుగుతున్న అప్పులు

నీతి ఆయోగ్ 2017 మార్చిలో వెలువరించిన విధానపత్రం ప్రకారం 2015-16 ముందు అయిదేళ్లకాలంలో రైతుల వాస్తవ వ్యవసాయాదాయం ఏటా 0.44 శాతం చొప్పున మాత్రమే పెరిగింది. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుని లెక్కిస్తే వాస్తవ ఆదాయం వస్తుంది. 1993-94 నాటి వాస్తవ ఆదాయంతో పోలిస్తే 2015-16 నాటికి రైతుల ఆదాయం 108.5 శాతం పెరిగినమాట నిజమే కానీ, ఈ ఆదాయవృద్ధి ప్రధానంగా 1993-94 నుంచి 2011-12 వరకు మాత్రమే సంభవించింది. అక్కడి నుంచి వారి ఆదాయాల పెరుగుదల నెమ్మదించింది. వివరంగా చెప్పాలంటే 1993-94లో రూ. 21,110గా ఉన్న వ్యవసాయాదాయం 2011-12నాటికి రూ.43,258కి చేరింది. అప్పటి నుంచి 2015-16 వచ్చేసరికి రూ.44,027కు స్వల్పవృద్ధి నమోదైంది. మరోవైపు వ్యవసాయ ఖర్చులు అధికమై రైతు చేతిలో ఏమీ మిగలని దుస్థితి ఎదురైంది.

1990ల నుంచి కార్పొరేట్ విత్తన సంస్థల ధరలను 500 నుంచి 700 శాతం వరకు పెంచేశాయి. ఆ విత్తనాల్లో నిశరంగా మొలకెత్తేవాటి శాతం 80 నుంచి 60 శాతానికి పడిపోయింది. ఎరువులు, ఇతర ఉత్పత్తి సాధనాల వ్యయాలు పైకెగబాకి రైతుల నిజఆదాయం మాత్రం కోసుకుపోయింది. 27 రకాల పంటల రైతులు విపణిలో ధరల బారినపడటం వల్ల నష్టపోయారని వ్యవసాయ శాఖ ఇటీవలి అధ్యయనమొకటి తేల్చింది. ఒక్క శెనగ రైతులే ఈ ఏడాది పంట వైఫల్యం వల్ల రూ.6,087 కోట్ల నష్టపోయారు. వ్యాపారులు, దళారులు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర కన్నా బాగా తక్కువ మొత్తం చెల్లిస్తున్నందువల్ల ఇప్పటికే రైతుల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. తెలంగాణ రైతులు కంది, శెనగ పప్పును కనీస మద్దతు ధర (ఎమ్‌ఎస్‌పీ)కన్నా రూ.1,000 తక్కువకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. పంటకోసం చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్య చేసుకోవడం ఎక్కువైంది. 2015లో దేశంలో 8,007మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వారి సంఖ్య 2016లో 21 శాతం తగ్గి 6,351కి పరిమితమైంది. గణాంకాలు చాటుతున్నాయి. మొత్తంగా వ్యవసాయ రంగంలో 2015లో 12,602 మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా, 2016లో ఆత్మహత్యల సంఖ్య పది శాతం తగ్గి 11,370కి దిగివచ్చిందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయమంత్రి ఇటీవల లోక్‌సభకు తెలియజేశారు. రైతుల బలవన్మరణాలకు రుణబాధలే కారణమన్నది నిర్వివాదం. 2013లో ప్రతి మూడు గ్రామీణ కుటుంబాల్లో ఒకటి అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఇది 2002 నాటి కన్నా 26.5 శాతం ఎక్కువ. 2013లో ప్రతి రుణగ్రస్త గ్రామీణ కుటుంబంలో తలసరిన రూ.1.03 లక్షల అప్పు మోస్తోంది. 2013లో మొత్తం గ్రామీణ రుణభారంలో 56 శాతం వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ

రైతన్నల్లో రగులుతున్న ఉద్యమస్ఫూర్తి

బ్యాంకులు, బీమా కంపెనీల ఖాతాల్లోనే ఉంది. రైతులు మిగతా 44 శాతం రుణాలను వడ్డీ వ్యాపారులు, బంధుమిత్రుల నుంచి తీసుకున్నారు. ఇందులోనూ అత్యధిక (28.2 శాతం) రుణాలను వడ్డీ వ్యాపారులే ఇచ్చారు. అప్పులు తీర్చిగా లభిస్తాయని రైతులు వారి వద్దకు పరుగులు తీస్తున్నారు. గ్రామీణ రుణభారంలో వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల వాటా 25.1 శాతం. సహకార సంఘాలు, బ్యాంకుల వాటా 24.8 శాతం. వ్యవసాయం, అనుబంధ వృత్తుల్లో 2016 మార్చిలో రూ.51,964 కోట్లుగా ఉన్న మొండి బకాయిలు 2017 మార్చికల్లా రూ.62,307 కోట్లకు చేరినట్లు రిజర్వుబ్యాంకు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఇది 20 శాతం పెరుగుదల.

రెట్టింపు ఆదాయానికి మార్గమేది?



రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తానంటూ ప్రధానమంత్రి ఇచ్చిన హామీని ఏ విధంగా నెరవేరుస్తారో కేంద్ర మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో వివరించలేదు. అయితే ఇప్పటికే కనీస మద్దతు ధర తక్కువగానే ఉందని జైట్లీ తోపాటు ప్రధాని మోదీ కూడా ఒప్పుకొన్నారు. వ్యవసాయ ధరల మార్కెట్ కమిటీ (ఏపీఎమ్‌సీ) యార్డుల ఇష్టానుసారపు ధరల వల్ల రైతులకు దక్కుతున్న మద్దతు ధర తక్కువైతే, ప్రభుత్వమే ఆ ధరపై పంట కొనుగోలు చేస్తుందని, లేదా మరేదైనా సంస్థ చేత చేయిస్తుందని ఆర్థిక మంత్రి భరోసా ఇచ్చారు. రైతులకు కచ్చితంగా గిట్టుబాటు ధర చెల్లించే యంత్రాంగాన్ని నెలకొల్పే విషయమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో నీతి ఆయోగ్ చర్చిస్తోంది. 2018-19 రబీ సీజనులోనే ఇలాంటి యంత్రాంగాన్ని రంగంలో దించాలి.

వాతావరణ మార్పులవల్ల తరచూ పంట వైఫల్యాలు సంభవించి గ్రామీణ ఆదాయాలు పడిపోవడం వల్ల మొండి బకాయిలు పైకెగబాకుతున్నాయి.

మద్దతు ధర కీలకం

భారత వ్యవసాయ విధానం ఇంతకాలం పంట దిగుబడి పెంచడం మీదే శ్రద్ధ పెట్టింది తప్ప రైతుల ఆదాయాలు ఇనుమడింపజేయడానికి ప్రాధాన్యమివ్వలేదు. దేశంలో పప్పు, నూనె గింజల దిగుబడి భారీగా వృద్ధి చెందడంతో వాటి దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం ఇటీవల పెంచింది, అది అలస్యంగా తీసుకున్న చర్యేనని చెప్పాలి. కొంతకాలం క్రితం ఉల్లిపాయల ధరలు ఆకాశంలో పెరిగి ప్రభుత్వాన్ని చిక్కుల్లోకి నెట్టడంతో, ఇటువంటి ఆహార పంటల ధరల నియంత్రణకు ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి ఎంతో ప్రాముఖ్యమిస్తోంది. కనీస మద్దతు ధరను ఒకటిన్నర రెట్లు పెంచడంతోపాటు ప్రభుత్వమే మొత్తం పంటను సేకరి

స్తుందని ఇంతకుముందు కేంద్ర ఆర్థిక మంత్రి ప్రకటించారు. అన్ని ఖరీఫ్ పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం ఎక్కువ కలిపి కనీస మద్దతు ధర నిర్ణయిస్తామని 2018 బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. కానీ, ఇక్కడో మెలిక ఉంది. పంట ఉత్పత్తి వ్యయాన్ని లెక్కించేటప్పుడు అందులో రైతు శ్రమ విలువను చేర్చకపోవడం పెద్ద లోపం. 2017-18 ఖరీఫ్ సీజనులో రైతులు ఎమ్‌ఎస్‌పీకన్నా తక్కువ ధరకు పంటలు అమ్ముకోవలసి రావడంతో వారికి రూ. 32,702 కోట్ల నష్టం వాటిల్లింది. ప్రస్తుత రబీ సీజనులోనూ రైతుల నుంచి పంటల సేకరణ మందకొడిగా సాగుతోంది. ఎమ్‌ఎస్‌పీ అమలులో కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం లోపించింది. అసలు ఎమ్‌ఎస్‌పీని చెల్లించాల్సిన బాధ్యత ఎవరిదనే అంశంపైన రెండింటి మధ్య ఏకాభిప్రాయం లేదు. వ్యవసాయాన్ని రాష్ట్ర జాబితా నుంచి తొలగించి ఉమ్మడి జాబితాలో చేర్చాలనేవారూ ఉన్నారు.

వ్యవసాయానికి సంస్థాగత రుణాలను ఇప్పుడున్న రూ.10 లక్షల కోట్ల నుంచి రూ.11 లక్షల కోట్లకు పెంచుతామని ఆర్థిక మంత్రి ప్రకటించారు. ఇది దాదాపు చిన్న రైతులకు 26 శాతం వ్యవసాయ రుణాలే ముట్టగా, కౌలు రైతులకు ఒక శాతం రుణాలైనా దక్కలేదు. 74 శాతం రుణాలు వ్యవసాయ ప్రాసెసింగ్, వ్యవసాయ రిటైల్ తదితర అనుబంధ రంగాలకు మళ్లాయి. రైతు రుణమాఫీ చాలా లోపభూయిష్ఠంగా తయారైంది. ఇక్కడ బ్యాంకు రుణాలు మాత్రమే మాఫీ అవుతాయన్నది వాస్తవం. రైతులు వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకునే రుణాలే అత్యధికం కాబట్టి వాటికి మాఫీ వర్తించదు. మాఫీ వల్ల రుణాలు సక్రమంగా తీర్చివేయాలన్న స్పృహ రైతులకు లోపించి, బ్యాంకుల పెట్టుబడి హెచ్చుగా పెరుగుతుందని కొందరు పండితులు వాదించినా వాస్తవం వేరుగా ఉంది. ఈ దేశంలో కౌలు చట్టబద్ధం కాదు. కాబట్టి కౌలు రైతులకు బ్యాంకు రుణాలు లభించవు. అలాంటప్పుడు అవి మాఫీ అయ్యే ప్రసక్తి ఎక్కడ? అందుకే రైతుల పట్ల ప్రభుత్వ యంత్రాంగం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మహారాష్ట్ర రైతులు ఇటీవల పాదయాత్ర జరిపారు.

పట్టణాలకే ప్రాధాన్యం

నేడు గ్రామీణ యువత తీవ్ర నిరుద్యోగ సమస్యతో సతమతమవుతోంది. ప్రభుత్వం నగరాల్లో మెట్రో రైళ్లు, పై వంతెనల నిర్మాణంపై చూపుతున్నంత శ్రద్ధ, గ్రామాల్లో విద్యావైద్య ఉపాధి సౌకర్యాలు కల్పించడంపై చూపడం లేదు. వ్యవసాయోత్పత్తుల గ్రేడింగ్, నిల్వ సౌకర్యాలను విస్తరించడానికి ప్రాధాన్యమివ్వడం లేదు. నగరాల్లోని పరిశ్రమలకు రుణాలను ప్రవహింపజేస్తోందే తప్ప గ్రామాలను, వ్యవసాయాన్ని పట్టించుకోవడం లేదు. దీంతో పల్లె జనం పట్టణాలకు పోతేకానీ పొట్టనింపుకోలేని పరిస్థితి ఉంది. దీన్నిబట్టి పట్టణాలకు చౌకగా శ్రమశక్తి పాలు వ్యవసాయోత్పత్తులు లభించేలా చూడటం ప్రభుత్వ విధానమని స్పష్టమవుతోంది. రైతు అన్ని విధాల అన్యాయమైపోయిందుకుల వల్లే నేడు అనేక రాష్ట్రాల్లో వ్యవసాయదారులు ఉద్యమ పథం పడుతున్నారు. వీరిలో అన్ని కులాలవారూ ఉన్నారు. ఈ ఉద్యమాల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొంటోంది. కొన్ని రాష్ట్రాల్లో రుణమాఫీ కోసం, మరికొన్నింటిలో రిజర్వేషన్ల కోసం, పలు రాష్ట్రాల్లో గిట్టుబాటు ధరల కోసం ఉద్యమాలు నడుస్తున్నాయి. వీటన్నింటినీ కలిపి అంతస్సూత్రం- రైతులు ఎదుర్కొంటున్న ఆర్థిక కష్టాలే. అయితే, ఈ ఉద్యమాలను అనుసంధానించే రాజకీయ వ్యూహం, యంత్రాంగం కొరవడటం పెద్దలోపం. కేరళ దీనికి మినహాయింపు. ఆ రాష్ట్ర రైతుల్లో చైతన్యం, అవగాహన ఎక్కువ. వారు గ్రామస్థాయి నుంచి సంఘటితమై ప్రభుత్వ విభాగాలు, బీమా సంస్థలు, విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, వ్యవసాయ మార్కెట్ యార్డుల నుంచి తమకు కావలసిన సేవలను డిమాండ్ చేసి సాధించుకోగలుగుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఈ పరిస్థితి కనిపించదు. ప్రతి రాజకీయ పార్టీకి రైతు విభాగాలు ఉన్నా అవి గ్రామీణులకు సమగ్ర సేవలు అందించడం లేదు. రాష్ట్రాలు ఇకనైనా రైతుల్లో ప్రజాతంత్ర నాయకత్వ సత్తాను పెంపొందించాలి. తద్వారా తమ సమస్యలు తామే పరిష్కరించుకునేలా సమాయత్తం చేయాలి. వారికి సొంత రాజకీయ వేదిక ఏర్పడాలి. రైతు సమస్యలను చిత్తశుద్ధితో పరిష్కరించకపోతే ప్రస్తుత ప్రభుత్వాలకు తీవ్ర సవాలు ఎదురవడం ఖాయం!

(రచయిత- 'సెస్'లో ఆచార్యులు)

రాజకీయ ప్రదక్షిణలు

'దేవుడనేవాడున్నాడా' అని మనిషికి కలిగిన సందేహం పటాపంచలైంది. దేవుడి దేహం కనిపించకపోతేనేం, దేవుడు కనిపించలేదని ఇకముందు ఎవ్వరికీ సందేహం కలగదు గాక కలగదు. వివరాల కరదుగా బిగిన నాస్తికులైనా కళ్లముందు దేవుడి 'ప్రభావం' కనిపిస్తుంటే ఎలా కాదనగలరు? రాజకీయనాయకులకు దేవుడు కనిపిస్తున్నాడు. రాజకీయ వాతావరణం, రణం మారిపోయింది. జనం 'రాజకీయమే రామచంద్రా, అల్లిఅల్లో ఆల్లలాణా' అంటున్నారు.


'రాజకీయ భూమి' తన చుట్టూ తాను తిరుగుతున్నా, దేవుడి చుట్టూ తెగ తిరుగుతోంది. దేవుడి గుండె రాజకీయ గొంతుకలో వినిపిస్తోంది. ఇందుకు ఉదాహరణగా ఎన్టీఆర్‌ది. తిరుమలలోని టీటీడీకి వెంకటేశ్వరస్వామి అధ్యక్షుడని, తాను ఉపాధ్యక్షుణ్ని అని ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎన్టీఆర్ ప్రకటించి సంచలనం సృష్టించారు. వెంకన్న ఏమిటి, ఎవరైనా ప్రకటించిన ఏమిటి అనుకున్నా- దేవతా పాత్రల్లో ఎన్టీఆర్‌లో చూసుకోవడం అలవాటైన తెలుగు ప్రజలు సర్దుకుపోయారు. దాని సంగతేమో, ఇప్పుడు దేవుడు నేరుగా రాజకీయాల్లోకే వచ్చేశాడు.

'ఏడుకొండల స్వామీ!
ఎక్కడున్నావయ్యా
ఎన్ని మెట్లెక్కినా
కానరావేమయ్యా' అని ఇప్పుడు వెతకాల్సిన అవసరమే లేదు.
అంతేకాదు-
'నను బ్రోవమని చెప్పవే
సీతమ్మ తల్లి
నను బ్రోవమని చెప్పవే' అని భక్త రామదాసులాగా సీతమ్మను సైతం సిఫార్సు అడగాల్సిన అవసరమూ లేదు. నాయకులూ దేవుడి నామజపం చేస్తున్నారు. దేవుడూ సహకరిస్తున్నాడు.

నాయకులతో మాట్లాడేస్తున్నాడు. ఇది గాలి మాటలేం కాదు. విధాన నిర్ణయాలు. ఈ విషయంలో దేవుణ్ని శంకించాల్సిన అవసరమూ లేదు. ఇందుకు 'ప్రత్యక్ష' ఉదాహరణలున్నాయి. దేవుడు ఏ అనుభవమూ అర్హతా లేకుండానే జగన్నాటక సూత్రధారి అనిపించుకున్నాడా? అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు అనిపించుకున్నాడా? తెరగా వచ్చే బిరుదులా ఇవి?

రాజకీయనాయకులు అప్పంగా దేవుడికి దూతల్లాపోయారు. ఆన్‌లైన్‌లో కన్నా వేగంగా ఆయనతో సంభాషణ జరుపుతున్నారు. ఆయమధ్య రాజకీయ తీర్థం పుచ్చుకుని

రాజకీయరంగ ప్రవేశం చేసిన 'పవర్ స్టార్' పవన్ కల్యాణ్ ఒక సభలో ఇలా మాట్లాడేశారు... '2019 సంవత్సరంలో రాబోవు ఎన్నికల్లో డబ్బు తీసుకుందామని మీరు అనుకుంటే తీసుకోండి. దేవుడి మీద ఒట్టు వేయమన్నా వేయండి. ఓటు మాత్రం 'జనసేన'కే వేయండి. దేవుడు ఎలాగూ వాళ్లను క్షమించడు. మీకు ఏమీ పర్వాలేదు. అవసరమైతే దేవుడితో నేను మాట్లాడతాను...' అని ఆయన చెప్పేశారు. ఈ దెబ్బకు అన్నీ ఎదురుచూస్తే, బేరసారాలున్నాయిక. దేవుడిమీదే భారం వేయడం తాజా రాజకీయ పరి



ణామం. ఏ రాష్ట్రమేగినా ఎందుకాలిడినా ఇది కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. తమిళనాట కూడా 'దేవుడు' తన తడాఖా చూపించేస్తున్నాడు. ఈమధ్య రాజకీయ రంగస్థలం మీద 'అరంగేట్రం' చేసిన చలనచిత్ర 'సూపర్ స్టార్' రజినీకాంత్ ఆధ్యాత్మిక రాజకీయాల గురించి చెప్పి ఊరూవాడా ఊదరగొట్టేస్తున్నారు. 'ఇదే నీతివంతమైన పాలన' అంటున్నారు. ఆయన మహిమాలయాలైన హిమాలయాలకి వెళ్లివచ్చారు. '23 ఏళ్ల కిందటే ఇక్కడ్రి నన్ను వెతుక్కుంటూ వచ్చినా, వద్దు పొమ్మన్నాను. అప్పుడు నాకు 45 ఏళ్లు. ఇప్పుడేమో 68 ఏళ్లు. అప్పుడు లేని పదవీ వ్యామోహం ఈ వయసులో నాకు వస్తుందా, ఆధ్యాత్మికవేత్త అనిపించుకునే అర్హత నాకు లేదా?

తమిళనాడులో రాజకీయాలు భ్రష్టుపట్టిపోయాయి. అందుకే ఆధ్యాత్మిక రాజకీయాలు అవసరం' అని రజినీకాంత్ అంటుంటే 'ఔను నిజం... ఔను నిజం... నీవన్నది నిజం నిజం' అని ఆయన అభిమాన జనసందోహం సందేహం లేకుండా కోరస్ అందుకుంటోంది.

ఇంతకీ దేవుడి రాజకీయాలు ఎలా ఉంటాయన్నది ఎవరికీ శక్తికొద్దీ... కాదు...కాదు భక్తికొద్దీ వారు ఊహించుకోవాల్సిందే. పుళ్ళూహించుకోవాల్సిందే. దేవుడే రాజకీయ పాత్ర పోషిస్తున్నప్పుడు, ఆయన గురించి దిగులుపడాల్సిందేం తప్ప రాజకీయ నాయకుల గురించి అలోచించాల్సిన అవసరమే లేదు. వారు వాగ్దానాలంగుతలంలోనైనా, సౌరమానంలోనైనా వారి మానాన వారు పోతుంటారు. జగాలు నివేదైనా జరగేది ఎవరి పాపాన వారు పోతారని దేవుడే చెబుతాడు. అదే బీమా, కేసులు, విచారణలు, శిక్షలు అవసరమే లేదు. ఒక తప్పునకు భూమ్మీద జైలు శిక్షలు, నరకంలో శిక్షలు సహజ న్యాయానికి విరుద్ధం కదా! అంతా పైనాడే చూసుకుంటాడు. 'చిత్రగుప్తుల గాలం' తలుచుకుంటే భూమ్మీద 'గుప్తుల కాలం' కలకలం వచ్చేస్తుంది. అంతకన్నా ఏం కావాలి?

చిత్రమేమిటంటే దేవుడికన్నా ముందే ఆధ్యాత్మిక పదజాలం 'అర్థం మారుతున్న' రాజకీయాల్లోకి వచ్చేసింది. పరమ పవిత్ర దేవతా సన్నిధానమైన పట్టణం పేరు 'కుంభకోణం' ఆక్రమాలకు పర్యాయపదమైపోయింది. గుడిలో తప్ప, దానికి సంబంధించిన వార్తల్లో తప్ప, మీడియాలో ఎక్కడ 'గోవింద' అని కనిపించినా, వినిపించినా జనం అపార్థం చేసుకుంటున్నారు. ముడుపులు, భజన, ధ్వజమెత్తడం, ప్రదక్షిణలు, అక్షింతలు, ముఖ్యంబత్తి, శరగోపం, జెండర్లు వంటివి పవిత్ర ఆధ్యాత్మిక శబ్దాలు కాదు. కాలక్రమంలో అవి రాజకీయ విమర్శనాత్మక శబ్దాలుగా రూపుదిద్దుకున్నాయి. ఇంతకాలం దేవుడు రాజకీయాల్లో లేకపోవడం వల్ల, నాటి నుంచి ఇంతకాలం జరగరానివి జరిగాయి. ఇక ముందైనా దేవుడు కళ్లు తెరచి ఇండిస్తాడేమో చూడాలి. జీవుడికే కాదు... దేవుడికీ న్యాయం జరగాలి కదా?

జీవుడి సుత్తికి రెండు వైపులా పదునే. దేవుడు గెలిస్తే నేమో, దేవుడు కాబట్టి గెలిచాడంటే అంటారు. పోతపోటున్న దేవుడు ఓడిపోతేనేమో, ఓటరు దేవుళ్ళే గెలిచారని మాట్లాడొచ్చు. దేవుడి కష్టాలు దేవుడివి. జీవుడికి ఉన్న మార్గం ఆయనకు లేదు. 'నీవే తప్ప ఇతః పరం బెరుగ' అని పాడి జీవుడికి ఉంది. అది దేవుడికి లేదుగా? కనీ అనకు లేదుగా...పాపం దేవుడు!

- శంభు

ఈనాడు లేఖలు

సొంత జిల్లాల్లోనే పరీక్షా కేంద్రాలు

రాష్ట్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష సందర్భంగా అభ్యర్థులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ప్రతి జిల్లాలో అనేక పరీక్షా కేంద్రాలున్నాయి. కేంద్రాలు కేటాయించడానికి ఇంజినీరింగ్ కళాశాలలు కొదవే లేదు. అయినా అభ్యర్థులకు పొరుగు జిల్లాల్లో ఎక్కడో సుదూరంగా పరీక్షా కేంద్రాలను ఇవ్వడం సబబుగా లేదు. దీనివల్ల అభ్యర్థులు అదనపు వ్యయప్రయాసలకు లోనుకావాల్సి వచ్చింది. మహిళలు, గర్భిణులు, బాలింతలు పడిన పాట్లు అన్నీఇన్నీ కావు. ఈ పొరపాటును ప్రభుత్వం సరిదిద్దాలి. భవిష్యత్తులో జరగబోయే ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) నాటికైనా లోపాన్ని సవరించాలి. ప్రతి అభ్యర్థికి సొంత జిల్లాలోనే పరీక్షా కేంద్రాన్ని కేటాయించాలి.

- పల్లపోతు అంజనేయస్వామి, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా

వడగాలుల నుంచి రక్షణ

రాష్ట్రంలో ఎండల ఉద్ధృతి నానాటికీ అధికమవుతోంది. వేడిగాలులు మొదలయ్యాయి. వాతావరణం మరింత వేడెక్కే వడగాలులు వీసే సమయం మరెంతో దూరంలో లేదు. వడగాలుల బారినపడి బాధితులను ఆదుకోవడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేయాలి. గ్రామాలవారీగా శిక్షణ పొందిన కార్యకర్తల ద్వారా శాస్త్రీయ పద్ధతుల్లో రక్షణ ప్రాథమిక సేవలు అందజేయాలి. వీటివల్ల బాధితులు ప్రాణాపాయ పరిస్థితుల నుంచి బయటపడతారు. ఈ విషయంలో స్థానిక సంస్థలను క్రియాశీలం చేయాలి. స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని స్వీకరించడం ద్వారా సామాజిక సేవాదృక్పథంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం విజయవంతంగా ముందుకు తీసుకెళ్ళాలి.

- ఎల్.ప్రహ్లాదచంద్ర, ధర్మవరం, అనంతపురం జిల్లా

అత్యాశ... దురాశ


మనిషి ఆశాజీవి. అది అతడి సహజ లక్షణం, అవసరం. ఆశ లేకుంటే, సంకల్పం కలగదు. అది లేనిదే ప్రయత్నం మొదలు కాదు. ప్రయత్నంపైనే కార్యసాఫల్యం ఆధారపడి ఉంది. కార్యశీలి కాని మనిషి మనిషే కాడు.

సంపద, ఆరోగ్యం, పదవి, అధికారం, నాయకత్వం, కీర్తి- ఏదో ఒకటి పొందాలని ఆశ అంకురిస్తుంది. పొందగలిగినప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మరో అడుగు ముందుకేస్తాడు. ఇంకా ఎంతెంతో సాధించాలనుకుంటాడు. సంతృప్తి కలగదు. మానవుల్లో ఆశ ఆశయంగా మారి, సమాజ శ్రేయస్సుకు కారణమవుతుంది. సామాన్యుల సంగతి వేరు.

ఒక ఆశ పుట్టిందంటే, మానవుడు అంతటితో సంతృప్తి చెందడు. లభించిన వైభవం, సుఖశాంతులు చాలని అనుకోడు. ఇంకా ఏదో కావాలన్న తపన, ఆవేదన, నిరీక్షణతో సతమతమవుతుంటాడు. పొయ్యిలో ఒక్కో కర్ర పెడుతున్నకొద్దీ మంట పెరుగుతుంటుంది. అలాగే అతడి కోరికలు, ఆశలు తీరినా మనసులో కొత్తవి ఉదయిస్తూనే ఉంటాయి. అప్పుడే ఆశ అత్యాశగా మారి, మనిషిని అధఃపాతాళం వైపు తీసుకెళుతుంది. ఆశ తృష్ణగా మారిందంటే, బతుకు పెదదారి పట్టినట్లేమాటే!

అత్యాశ వైపు అడుగు మనిషి చిత్రమైన వికార రూపాలలోని యక్ష ప్రశ్నల్లో కనిపిస్తుంది. ఇంద్రుడు తన పదవి నిలబెట్టుకునేందుకు ఎందరో రుషుల తపస్సును భంగం చేయడానికి వెనకాడలేదు. ధర్మమూ, అధర్మమూ అనే యోచనను ఆత్మాశ వెలివేసింది. స్త్రీ సౌందర్యానికి ప్రలోభం చెంది సుందోపసుందులు ఒకరినొకరు హతమార్చుకుంటారు. అమృతాన్ని సంగ్రహించాలన్న అత్యాశ పోయి రాహుకేతువులు అంతరిస్తారు. అత్యాశ దురాశగా మారిందంటే, ఎదుటివాడికి ఎంతటి హాని చేయడానికైనా మనిషి సిద్ధపడతాడు. ఎంతమంది సర్వనాశనమైనా, తానే విశ్వవిజేత కావాలన్న దురాశ అలెగ్జాండర్ వాసు దయ్యాడు. అతడి బతుకు ఎలా ముగిసిందో అందరికీ తెలిసిందే. దురాశకు లోబడినవాడు ఎంతటి మాయకైనా సందేహించడు. రావణుడు, దుర్యోధనుడు, హిరణ్యకశిపుడు, బలిచక్రవర్తి, విశ్వామిత్రుడి చరిత్రలే అందుకు ఉదాహరణలు.

అత్యాశ అశాంతినిస్తుంది. దురాశ దుఃఖాన్ని, విధ్వంసాన్ని కలిగిస్తుంది. అతి సంపదలే అనర్థానికి దారితీస్తుందని నీతి చంద్రికలోని 'మిత్రలాభం'లో నక్క కథ వివరిస్తుంది. ఆహారం కోసం అన్వేషిస్తున్న దానికి ఒకచోట చనిపోయి పడిఉన్న అడవి పంది, పాము కనిపిస్తాయి. బోయవాడి శవమూ కంటపడుతుంది. వాటన్నింటినీ నిదానంగా కొంచెంగా తింటూ హాయిగా బతకవచ్చని నక్క అనుకుంటుంది. అంతలో దానికి బోయవాడి విల్లు కూడా కనిపి


అంతర్యామి

స్తుంది. ఆ వింటికి కట్టిన నారి- ఒక జంతువుల చెందిన నరం. ముందు దాన్ని తినాలనుకున్న నక్క, ఆ వింటి మొదలును కాలితో తొక్కిపడుతుంది. పైభివడను నోట పట్టుకొని, దాన్ని కొరుకుతుంది. ఆ వింటి తెగుతుంది, వింటిబద్ద నోటిలోకి పొడుచుకుపోయి నక్క చనిపోతుంది. లోభిత్వం, దురాశ ఎంతటి వినాశనాన్ని తెచ్చి పెడతాయో చెప్పడం ఈ కథ!

'తృష్ణాహారిత్యమనే సద్బుద్ధిని మనిషి అలవరుచుకోవాలి. తాను పడే శ్రమకు ధర్మబద్ధంగా ఏ ప్రతిఫలం లభిస్తుందో, దానితోనే సంతృప్తి చెందాలి. అత్యాశను, దురాశను విడిచి పెట్టాలి' అని జగద్గురువు ఆదిశంకరుల ప్రబోధించారు.

పవిత్ర సంకల్పాలు, అత్యాశారహిత ప్రవర్తనను బట్టి ఫలితం లభిస్తుంది. సంకల్పమైనా, ఆశయమైనా ధర్మబద్ధంగా ఉండాలి. అంతవరకు మానవ జీవన ప్రస్థానం విజయవంతంగా సాగుతుంది. ధర్మారహితంగా ఆశించడం ఏ మాత్రం కూడదు. అప్పుడు విజయపరంపర అతణ్ని వీడదు. కోరికలు, ఆశల్ని తగ్గించుకున్నవాడే 'సంతృప్తి' అనే సంపదను పెంచుకుంటాడు. నలుగురి మెప్పూ సంపాదిస్తాడు. వ్యసనాలు దురాశ కలిగిస్తాయి. అవి అనంతమైనప్పుడు, మనిషిని అన్నివిధాలా అధముణ్ని చేస్తాయి.

ఆశలు అంతవరకే ఉండాలి తప్ప, మృత్యుపాశంగా మారుకోకూడదు. ప్రమిదలోని వత్తి లాంటిది ఆశ. తగినంత తైలం పోస్తేనే వెలుగునిస్తుంది. వత్తి మునిగేలా నూనె పోస్తే, దీపం కొండెక్కి. చివరికి చీకటే మిగులుతుంది. సదాశయం లేని ఆశ- వాసన లేని పువ్వు వంటిది. మనిషికి అది అనవసరం!

- చిమ్మపూడి శ్రీరామమూర్తి

క్షయ చికిత్సకు సమర్థ ఔషధం

- ఒక్కో రోగిపై రూ.18 లక్షల వ్యయం
- నేడు ప్రారంభించనున్న సీఎం!

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే, ఈనాడు, అమరావతి: క్షయ వ్యాధికి మెరుగైన చికిత్సలో భాగంగా 'బెడాక్విలైన్' అనే నూతన ఔషధాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఈనెల 24(నేటి) నుంచి అందుబాటులోకి తెస్తున్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని శనివారం లాంఛనంగా ప్రారంభించే అవకాశాలున్నాయి. సాధారణ టీబీ చికిత్సలోనూ కొందరికి కొన్ని మందులు పనిచేయకుండా పోవచ్చు. ఇంజెక్షన్లు, క్వినోలిన్ తరగతి ఔషధాల ద్వారా వ్యాధిని నిరోధించలేకపోతే..దాన్ని మహామొండి క్షయ(ఎక్స్‌టెన్సివ్ డ్రగ్ రెసిస్టెన్స్-ఎక్స్‌డీఆర్) అంటారు. ఇదెంతో ప్రమాదకరమైంది. పీడితులకు ప్రత్యేక చికిత్స అందించకపోతే మళ్లీ పాత పరిస్థితి తలెత్తవచ్చని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. వ్యాధి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఎక్స్‌డీఆర్ టీబీ రోగుల కోసం ఖరీదైన ఔషధాన్ని ప్రవేశపెడుతున్నారు. ఇందుకుగాను ఒక్కో రోగిపై రూ.18 లక్షలు వెచ్చించనున్నారు. ఈ వ్యాధికి అడ్డుకట్ట వేసి, 2025 నాటికి దేశంలో క్షయ నిర్మూలనను సాకారం చేసేందుకు అతి ఖరీదైన ఈ చికిత్సను రోగులకు ఉచితంగా అందించాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించింది.

ఇప్పటికే 5 నగరాల్లో..

ప్రాణాంతక క్షయకు పగ్గం వేసేందుకు ఈ ఔషధాన్ని గతేడాది ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దిల్లీ, చెన్నై, ముంబయి, గువహటి, అహ్మదాబాద్ నగరాల్లో ఇది ప్రస్తుతం అందుబాటులో ఉంది. ఈ క్రమంలో ఎక్స్‌డీఆర్ టీబీ రోగులను గుర్తించి చికిత్స అందించేందుకు గుంటూరు, విశాఖపట్నంతో పాటు మరో రెండు చోట్ల నోడల్ కేంద్రాలు ఏర్పాటుకానున్నాయని గుంటూరు జిల్లా క్షయ నియంత్రణ అధికారి రమేష్ 'న్యూస్‌టుడే'కు శుక్రవారం తెలిపారు. 14 ఏళ్ల పైబడిన రోగులకే ఈ చికిత్స అందిస్తారన్నారు. కార్డియాలజిస్ట్‌తో పాటు నిపుణులైన ఏడుగురు వైద్యుల కమిటీ అర్హులైన రోగులను చికిత్సకు ఎంపిక చేస్తుందన్నారు. రోగులను ప్రత్యేక వార్డుల్లో ఉంచి ఆర్నెల్లపాటు ఈ చికిత్స అందజేస్తామన్నారు.



రియల్ టైం గవర్నెన్స్‌లో వివిధ విభాగాలపై మంత్రులు, అధికారులతో సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి

నీటి సమస్య తలెత్తితే 1100కి ఫోన్ చేయండి

ఈ వేసవి కాలంలో మంచినీటి సమస్య తలెత్తితే 1100 పరిష్కార వేదికకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రజలకు సూచించారు. ఫిర్యాదులపై అధికారులు స్పందించి ఎక్కడా నీటి సమస్య రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. శుక్రవారం రియల్ టైం గవర్నెన్స్‌లో ముఖ్యమంత్రి ఐదు విభాగాలపై సమీక్ష జరిపారు.

★ ఇసుకవిధానం అమలుపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై ప్రజల్లో 85 శాతం సంతృప్తి వ్యక్తమైందని అధికారులు చెప్పారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్న వారిపై 655 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. అక్రమరవాణా చేస్తున్న వారిపై ఉక్కుపాదం మోపాలని సీఎం ఆదేశించారు.

★ ఇటీవల సెప్టిక్ ట్యాంకులో మురుగు శుభ్రం చేస్తూ కొంతమంది కార్మికులు మరణించడం పట్ల సీఎం విచారం వ్యక్తం చేశారు. ఈ పనులను యంత్రాలతోనే చేయించాలని, అవసరాన్ని బట్టి మురుగు శుభ్రత యంత్రాలను అవుట్ సోర్సింగ్ విధానంలో సమకూర్చుకోవాలని సూచించారు.

★ ఈ ఏడాది ఇప్పటివరకూ 3,775 కేసులు నమోదు చేసి 3,933 మందిని అరెస్టు చేశామని అధికారులు సీఎంకు తెలపగా.. అక్రమ మద్య వ్యాపారాన్ని అనుమతించే ప్రసక్తే లేదన్నారు.

★ పదోతరగతి పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ అధికారులు తీసుకున్న చర్యలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. కాపీలు కొడుతూ పట్టుబడిన కేసులు ఈ ఏడాది ఇప్పటివరకూ ఆరు మాత్రమే నమోదయ్యాయని, సక్రమంగా విధులు నిర్వర్తించని 61 మంది ఇన్విజిలేటర్లను తొలగించామని, నలుగురిని సస్పెండ్ చేశామని అధికారులు వివరించారు.

★ కేంద్రం నుంచి నిధులు రాబట్టేందుకు ఆర్థిక శాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తూనే ఉండాలని సూచించారు. మంత్రులు నారాయణ, గంటా శ్రీనివాసరావు, జవహర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



భోజనాలు చేస్తున్న కిస్ విద్యార్థులు

'కిస్'లో కామన్‌వెల్త్ మధ్యాహ్న భోజనం

- 27 వేల మంది విద్యార్థులతో కలిసి విందు ఆరగించిన విదేశీయులు

భువనేశ్వర్ అర్బన్, న్యూస్‌టుడే: భువనేశ్వర్‌లో ఉన్న కళింగ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్స్(కిస్) ఆధ్వర్యంలో శుక్రవారం 'కామన్‌వెల్త్ మధ్యాహ్న భోజనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో కిస్‌లో చదువుతున్న 27 వేల మంది విద్యార్థులు, 53 దేశాల ప్రతినిధులతో పాటు బ్రిటీష్ కౌన్సిలర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిస్ వ్యవస్థాపకులు అచ్యుత సామంత మాట్లాడారు. బ్రిటీష్ కౌన్సిల్ 70 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఘనా, ఇడెన్‌బర్గ్, భారత్‌లలో కామన్‌వెల్త్ మధ్యాహ్న భోజనం కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించిందన్నారు. అందులో భాగంగా భారత్‌లో కిస్ సంస్థలో కార్యక్రమం నిర్వహించారన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12గంటలు నుంచి ఒంటి గంట లోగా 27 వేల మందికి భోజనం పెట్టినట్లు తెలిపారు. భోజనంలో 10 రకాల ఒడియా వంటలను వడ్డించామన్నారు. భోజన కార్యక్రమానికి ముందు ప్రపంచ శాంతి కోరుతూ విదేశీ ప్రతినిధులు పావురాలను ఎగురవేశారు.

క్రిమినల్ కేసులు నమోదుచేయండి

- వాట్సప్‌ల్లో పదోతరగతి ప్రశ్న, జవాబు పత్రాల వ్యవహారంపై సీఎం ఆగ్రహం

ఈనాడు, అమరావతి: వాట్సప్‌ల్లో పదోతరగతి ప్రశ్న, జవాబుపత్రాలు ప్రత్యక్షమవుతున్నట్లు వస్తున్న ఘటనలపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. సచివాలయంలో శుక్రవారం పదోతరగతి పరీక్షలు, ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. మంత్రి గంటా శ్రీనివాసరావు, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి హాజరయ్యారు. ప్రశ్నపత్రాలు బయటకు రావడంపై విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) ఫలితాలు పారదర్శకంగా ఉండాలని, ఎలాంటి అపోహలకు తావిచ్చేలా ఉండకూడదన్నారు. టెట్‌ను మొదటిసారి ఆన్‌లైన్‌లో నిర్వహించామని, అత్యధికంగా 4,14,120 మంది హాజరయ్యారని కమిషనర్ సంధ్యారాణి వెల్లడించగా ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించినందుకు సీఎం అభినందించారు. టెట్ అభ్యర్థులకు వారు రాసిన ప్రశ్నపత్రంతో పాటు జవాబు(అడిట్ ట్రైయల్ రిపోర్టు)లను ఇవ్వాలని నిర్ణయించామని కమిషనర్ వెల్లడించారు. ఇందులో అభ్యర్థి రాసిన సమాధానాలతో పాటు సరైన జవాబు ఉంటుందని వెల్లడించారు. తాడేపల్లిగూడెం మండలంలో పదోతరగతి పరీక్షలు జరుగుతున్న సమయంలోనే జవాబు పత్రాలు వాట్సప్‌లో ప్రత్యక్షం కావడంపై సమగ్రంగా విచారణ జరపాలని అధికారులకు మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పారు.

26న యథావిధిగానే పదోతరగతి పరీక్ష: శ్రీరామనవమి సందర్భంగా సోమవారం పాఠశాలలకు మాత్రమే సెలవని, పదోతరగతి పరీక్ష యథావిధిగానే కొనసాగుతుందని మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడించారు. పరీక్షలో ఎలాంటి మార్పు లేదని ప్రకటించారు.

అమరావతిలో అశోక్ లేల్యాండ్

ప్రముఖ రవాణా వాహనాల తయారీ సంస్థ అశోక్ లేల్యాండ్ అమరావతిలో తమ యూనిట్ నెలకొల్పేందుకు రంగం సిద్ధం చేసింది. రాజధాని పరిధిలో ప్రతిష్ఠాత్మక పారిశ్రామికవాడగా భావిస్తున్న కృష్ణా జిల్లా మల్లవల్లిలో బస్‌బాడీ బిల్డింగ్ యూనిట్ స్థాపనకు కార్యాచరణ ప్రారంభించింది. ఈనెల 31న ముఖ్యమంత్రి చంద్రబాబు దీనికి భూమి పూజ చేయనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఏపీఐఐసీ వర్గాలకు సీఎంవో, అశోక్ లేల్యాండ్ నుంచి సమాచారం అందింది. ఇప్పటికే అశోక్ లేల్యాండ్ సంస్థకు ఏపీఐఐసీ 75 ఎకరాలు కేటాయించింది. ఎకరం రూ.16.50 లక్షల చొప్పున ధర చెల్లించి 15 రోజుల కిందట భూమిని రిజిస్ట్రేషన్ కూడా చేయించుకుంది. కేటాయించిన భూమిలో మౌలిక వసతుల కల్పన, నిర్మాణాలకు వీలుగా భూమి చదును చేయిస్తున్నారు. చెన్నైకి చెందిన సంస్థ ద్వారా మట్టి సామర్థ్య పరీక్షలు చేయిస్తున్నారు. ఇక్కడ నెలకొల్పే యూనిట్‌లో ఏడాదికి 4,800 చొప్పున బస్సు బాడీ బిల్డింగ్ రూపొందించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. తర్వాత విడతలో ఛాసిస్‌లు తయారుచేసే యూనిట్‌నూ నెలకొల్పవచ్చని సమాచారం. దీని వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు రెండు వేల మందికి ఉపాధి లభించనుంది.



మల్లవల్లిలో అశోక్ లేల్యాండ్‌కు కేటాయించిన భూమి



పోలీసుల అదుపులో గోవిందరావు

పరీక్ష కేంద్రంలోకి చీటీలు..

ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడి అరెస్టు

ఆదోని, న్యూస్‌టుడే: కాగితాలపై సమాధానాలు రాసి పరీక్ష కేంద్రంలోని విద్యార్థులకు అందిస్తున్న ఓ ప్రైవేటు ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలోని నేషనల్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. పట్టణంలోని నారాయణ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గోవిందరావు.. పరీక్షా కేంద్రం పక్కనే ఉన్న ఓ భవనంలో ఉండి.. కాపీ చీటీలను పరీక్ష గదిలోని తమ విద్యార్థులకు విసురుతూ బందోబస్తు పోలీసులకు చిక్కాడు. దీనిపై పరీక్షా కేంద్రం పర్యవేక్షణ అధికారి జాకీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ వెల్లడించారు.

డిగ్రీ కళాశాలల ఆన్‌లైన్‌కు కసరత్తు

ఈనాడు, అమరావతి: డిగ్రీ కళాశాలల వివరాలను ఆన్‌లైన్ చేసే ప్రక్రియను ఉన్నత విద్యామండలి వేగవంతం చేసింది. ఇప్పటివరకు ప్రైవేటు కళాశాలల్లో ఎంతమంది విద్యార్థులు చదువుతున్నారు? ఎన్నింటికి అనుమతులున్నాయి? అర్హులైన అధ్యాపకులు ఎంత మంది ఉన్నారనే కచ్చితమైన వివరాలు అధికారులు వద్ద లేవు. ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తయితే కళాశాలల సమగ్ర వివరాలు వెల్లడవుతాయి. దీని ఆధారంగానే ఉపకారవేతనాలను మంజూరు చేస్తారు. వచ్చే ఏడాది ప్రవేశాలను మాత్రం పాత పద్ధతిలోనే నిర్వహించనున్నారు. ఆ తర్వాత నుంచి ప్రవేశాలను ఆన్‌లైన్ చేయాలని భావిస్తున్నారు. వెబ్‌సైట్‌లో వివరాల నమోదుకు ఇప్పటికే విశ్వవిద్యాలయాలకు ఉన్నత విద్యామండలి సమాచారమిచ్చింది. ఆయా వర్సిటీలు తమ సౌలభ్యాన్ని అనుసరించి కళాశాలలకు గడువు విధించనున్నాయి. ఏప్రిల్ లోపు కళాశాలల వివరాల నమోదు పూర్తయితే, వీటి ఆధారంగా కళాశాలల తనిఖీ, అనుమతుల ప్రక్రియను మే చివరిలోపు పూర్తి చేయాలని ఉన్నత విద్యామండలి భావిస్తోంది. జూన్ నుంచి ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుంది. వచ్చే విద్యా సంవత్సరం ప్రవేశాల అనంతరం ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కొన్ని కళాశాలలు ఏడాది పొడవునా విద్యార్థులను చేర్చుకుంటూ పరీక్షలకు అనుమతిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రవేశాలకు గడువు విధించనున్నారు.

भारतीय रिज़र्व बैंक
RESERVE BANK OF INDIA
www.rbi.org.in
ग़ैर बैंकिंग पर्यवेक्षण विभाग
6-1-56, सचिवालय रोड, सैफ़ाबाद, हैदराबाद-500004

सार्वजनिक सूचना - पंजीकरण प्रमाणपत्र का निरस्तीकरण

मेसर्स राजमपेट पर्मनेंट फ़ंड लिमिटेड जिसका पंजीकृत कार्यालय 4-109-ए, ऊपर, मुख्य पथ, राजमपेट, कड़प्पा, जिला वाईएसआर, कड़प्पा, आंध्र प्रदेश-516115 में अवस्थित हैं, ने भारतीय रिज़र्व बैंक द्वारा भारतीय रिज़र्व बैंक अधिनियम,1934(अधिनियम) की धारा 45-आई ए के तहत जारी अपने पंजीकरण प्रमाणपत्र को निरस्तीकरण के लिए सौंप दिया है ।

भारतीय रिज़र्व बैंक अधिनियम, 1934 की धारा 45-आई ए(6) के तहत प्रदत शक्तियों का प्रयोग करते हुए भारतीय रिज़र्व बैंक फ़रवरी 20, 2018 के अपने आदेश दवारा मेसर्स राजमपेट पर्मनेंट फ़ंड लिमिटेड, CIN U67200AP1997PLC027771 को अधिनियम की धारा-45-आई-ए के अधीन वर्णित ग़ैर बैंकिंग वित्तीय संस्थान का व्यवसाय करने के लिए जारी दिसंबर 03,1998 का पंजीकरण प्रमाण-पत्र क्रमांक 09.00222 को निरस्त करता है। अत:,उक्त अधिनियम के अधीन कंपनी ग़ैर बैंकिंग वित्तीय संस्थान का व्यवसाय नहीं कर सकती ।

यह जनहित में जारी किया गया है ।

स्थान : हैदराबाद
दिनांक : मार्च 24, 2018

ह/-
(शंकर सुमन)
महा प्रबंधक

ముగ్గురికి కేఎల్‌యూ గౌరవ డాక్టరేట్లు

తాడేపల్లి, న్యూస్‌టుడే: ఇస్కాన్, అక్షయపాత్ర ఫౌండేషన్ అధ్యక్షుడు పద్మశ్రీ మధు పండిట్‌దాసా, ఐటీ నిపుణులు హేమగోపాల్, సింగపూర్‌లోని నాన్యంగ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయం ఆచార్యుడు బీవీఆర్ చౌదరికి కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్లు ప్రదానం చేసింది. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో శుక్రవారం ఏడో స్నాతకోత్సవం జరిగింది. ఇందులో కులపతి డాక్టర్ రామ్మూర్తి, కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ (కేఎల్ఈఎఫ్) అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, కరస్పాండెంట్ కోనేరు కాంచనలత, ఉపకులపతి డాక్టర్ ఎల్‌ఎస్‌ఎస్‌రెడ్డి సంయుక్తంగా గౌరవ డాక్టరేట్లను ప్రదానం చేశారు. కోనేరు సత్యనారాయణ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఆచార్యుడు బీవీఆర్ చౌదరి మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతోందని రోబోటిక్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిగ్‌డేటా వంటి వాటికి మంచి భవిష్యత్తు ఉందని చెప్పారు. కార్యక్రమంలో 2016-17 సంవత్సరంలో డిగ్రీలు పూర్తిచేసుకున్న 2696 మంది విద్యార్థులకు డిగ్రీలు, మరో 50 మందికి పీహెచ్‌డీలు ప్రదానం చేశారు. 32 మందికి బంగారు పతకాలు, మరో 32 మందికి రజత పతకాలు, నగదు పురస్కారాలను అందజేశారు.



మధు పండిట్‌దాసాకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న కేఎల్‌యూ కులపతి రామ్మూర్తి, కేఎల్‌ఈఎఫ్ అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ

సినీ నటుడు ధనుష్‌కు కోర్టులో ఊరట

చెన్నై, న్యూస్‌టుడే: సినీ నటుడు ధనుష్‌కు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం తోసిపుచ్చింది. ధనుష్ తమ కుమారుడేనని మదురై జిల్లా మేలూర్‌కుచెందిన కదిరేశన్ గతంలో మేలూర్ కోర్టులో పిటిషన్ దాఖలుచేసిన విషయంతెలిసిందే. ఈ కేసు విచారణకు హాజరుకావాలంటూ ధనుష్‌ను మేలూర్ కోర్టు ఆదేశించగా దానిపై స్టే విధించాలని, మేలూర్ కోర్టులోని వ్యాజ్యం కొట్టివేయాలంటూ మదురై ధర్మాసనంలో గత ఏడాది ధనుష్ పిటిషన్ దాఖలు చేశారు. దీని విచారణ సందర్భంగా అప్పట్లో ధనుష్ కోర్టుకు హాజరుకాగా ఆయన శరీరంపై గుర్తులను వైద్యుల బృందం సేకరించింది. ఆ తర్వాత మేలూర్ కోర్టులో కదిరేశన్ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని రద్దు చేస్తూ ధర్మాసనం ఆదేశించింది. ఈ నేపథ్యంలో ధనుష్ బోగస్ జనన, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను సమర్పించి ధర్మాసనాన్ని మోసగించారంటూ మదురై గో. పుదూర్ పోలీసులకు, పోలీసు కమిషనరుకు కదిరేశన్ ఫిర్యాదు చేశారు. ధనుష్‌పై చట్టపరమైనచర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించాలంటూ మదురై ధర్మాసనంలో మరో పిటిషన్ దాఖలు చేశారు. ఈపిటిషన్ న్యాయమూర్తి జస్టిస్ రాజమాణిక్యం సమక్షంలో శుక్రవారం విచారణకు వచ్చింది. అది విచారణకు అర్హమైందికాదంటూ ఆపిటిషన్‌ను న్యాయమూర్తి తోసిపుచ్చారు.

మీ-సేవా కేంద్రాల్లో సేవలు ఇక భారం

- వినియోగ రుసుములపై రూ.10 చొప్పున వడ్డన

ఈనాడు, అమరావతి: మీ-సేవా కేంద్రాల్లో ముఖ్యమైన సేవలపై వినియోగ రుసుములు ఒకేసారి భారీగా పెంచుతూ శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. బిల్లుల చెల్లింపులపై వసూలు చేస్తున్న రుసుముల జోలికి పోకుండా కేటగిరి-ఎ, కేటగిరి-బి కింద అందించే సేవలపై ప్రస్తుతం వసూలు చేస్తున్న రుసుముపై రూ.10 అదనంగా పెంచారు. ఇప్పటివరకు కేటగిరి-ఎ సేవలపై రూ.25, కేటగిరి-బి సేవలపై రూ.35 చొప్పున నిర్వాహకులు వసూలు చేస్తున్నారు. వీటిలో రెవెన్యూ, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, విద్యుత్ పంపిణీ, పురపాలక, నగరపాలక సంస్థల నుంచి అందించే సేవలు ఎక్కువగా ఉన్నాయి. తాజా నిర్ణయం ప్రకారం కేటగిరి-ఎ సేవలపై రూ.35, కేటగిరి-బి సేవలపై రూ.45 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఒకేసారి రూ.పది పెంచడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలపై లక్షలాది రూపాయల అదనపు భారం పడనుంది. నిర్వహణ భారంగా ఉందని గ్రామాల్లో మీ-సేవా కేంద్రాలు నిర్వహిస్తున్న నిరుద్యోగ యువత ప్రభుత్వానికి చేసిన వినతుల మేరకు రుసుం పెంచామని అధికారులు చెబుతున్నారు. ఒకేసారి ఎక్కువగా పెంచడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. పెంచిన ధరలు శనివారం నుంచి అమల్లోకి రానున్నాయి.

విద్యా సంవత్సర కాలమానిని విడుదల

ఈనాడు, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించిన కాలమానిని(అకడమిక్ క్యాలెండర్)ని ఉన్నత విద్యామండలి ఈసారి ముందుగానే విడుదల చేసింది. ఎంసెట్ పరీక్షతో పాటు ధ్రువీకరణ పత్రాల పరిశీలనను ఆన్‌లైన్ చేసిన నేపథ్యంలో కౌన్సెలింగ్ ప్రక్రియ గతంతో పోల్చితే ఈసారి తొందరగా ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ తరగతుల ప్రారంభం, సెమిస్టర్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను ఇప్పటికే అన్ని విశ్వవిద్యాలయాలకు పంపించింది. వర్సిటీల నుంచి అయా కళాశాలలకు చేరనున్నాయి. డిగ్రీ కళాశాలలకు ఇదే షెడ్యూల్‌ను అమలు చేస్తున్నారు.

అకడమిక్ క్యాలెండర్ ఇలా..

కళాశాలల పునఃప్రారంభం: జూన్ 5
సెమిస్టర్-3,5 విద్యార్థులకు తరగతులు: జూన్ 7
సెమిస్టర్-1విద్యార్థులకు తరగతులు: జూన్ 12నుంచి
అంతర్గత పరీక్షలు: ఆగస్టు 6-10(ఐదు పనిదినాల్లో)
సెమిస్టర్ 1,3,5లకు సిలబస్‌పూర్తి: అక్టోబరు 6
సెమిస్టర్ ముగింపు, పరీక్షలు ప్రారంభం: అక్టోబరు 11-నవంబరు3 వరకు

సెమిస్టర్-2, 4, 6..

తరగతుల ప్రారంభం: నవంబరు 5
అంతర్గత పరీక్షలు: జనవరి 7-11వరకు
సిలబస్ ముగింపు: ఫిబ్రవరి 28
సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం: మార్చి4


'ట్రిపుల్‌ఐటీ' స్థల ఎంపికపై వెలువడని నిర్ణయం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకాశం జిల్లాకు కేటాయించిన ట్రిపుల్‌ఐటీ ఏర్పాటుకు సంబంధించి స్థల సేకరణపై మంత్రి గంటా శ్రీనివాసరావు శుక్రవారం సచివాలయంలో సమీక్షించారు. అధికారులతోపాటు మంత్రి శిద్దా రాఘవరావు, ఎమ్మెల్యేలు కదిరిబాబురావు, పోతుల రామారావు హాజరయ్యారు. ట్రిపుల్‌ఐటీని ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై అభిప్రాయాలను మంత్రి శ్రీనివాసరావు తెలుసుకున్నారు. ప్రజాప్రతినిధులు ఎవరికి వారు తమ ప్రాంతంలో పెట్టాలని కోరడంతో స్థలం విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు. స్థలాలను పరిశీలించి, నివేదిక ఇవ్వాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

పెజావర స్వామీజీకి తప్పిన ప్రమాదం

- సాంకేతిక లోపంతో పాఠశాల మైదానంలో దిగిన హెలికాప్టర్

బళ్లారి, న్యూస్‌టుడే: కర్ణాటకలోని ఉడుపికి చెందిన ప్రముఖ పెజావర మఠాధిపతి విశ్వేశతీర్థ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌కు సాంకేతిక లోపం తలెత్తడంతో ఆకస్మికంగా కిందకు దించారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. బళ్లారి జిల్లా హోసపేటెలో శుక్రవారం జరిగిన సర్వధర్మ కార్యక్రమానికి విశ్వేశతీర్థ స్వామీజీ ప్రత్యేక హెలికాప్టర్‌లో వచ్చారు. కార్యక్రమం ముగిశాక తిరిగి బెంగళూరుకు వెళ్తుండగా హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో పైలెట్ ముందుజాగ్రత్తగా హూవినహడగలి తాలూకాలోని హొళలు గ్రామంలో సాధన పాఠశాల క్రీడామైదానంలో హెలికాప్టర్‌ను దింపివేశారు. దీంతో లోపల ఉన్న స్వామీజీ, మరో ఇద్దరికి పెద్ద ప్రమాదం తప్పింది. తరువాత హెలికాప్టర్‌లో తలెత్తిన లోపాలను పైలట్ 30 నిమిషాల్లో సరిచేసి అక్కడి నుంచి బెంగళూరుకు స్వామీజీని సురక్షితంగా చేరవేశారు.



హెలికాప్టర్‌లో విశ్వేశతీర్థ స్వామీజీ



కొలిక్కి వచ్చిన రబీ పంటల బీమా

2016-17 నష్టానికి రూ.70కోట్లు

ఈనాడు, అమరావతి: రబీ 2016-17 పంట నష్టానికి సంబంధించి బీమా పరిహారం విడుదలకు సమస్యలు తొలిగాయి. మళ్లీ రబీ గడచినా బీమా ఇవ్వకపోవడంపై రైతులు ఆందోళన చేస్తున్నారు. వ్యవసాయమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించారు. ఆయన జోక్యంతో బీమా సంస్థలకు ప్రభుత్వ వాటాగా రూ.17.69కోట్లు విడుదలయ్యాయి. దీంతో నెల్లూరు, కడప, కృష్ణా జిల్లాల్లో 16 మండలాల పరిధిలో 20వేల మంది రైతులకు రూ.70కోట్లను ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద అందజేయనున్నారు. ఒక్కో రైతుకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు పరిహారంగా దక్కనుంది.

శ్రీరామనవమి సెలవు సోమవారం

శ్రీరామనవమి పురస్కరించుకొని సోమవారాన్ని సెలవుగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తొలుత ఆదివారం సెలవని ప్రకటించారు.

పంచాయతీరాజ్ అదనపు కమిషనర్‌పై దాడికి యత్నం

పంచాయతీరాజ్ అదనపు కమిషనర్ రంగాపై సూపరింటెండెంట్ ఒకరు దాడికి యత్నించడం శాఖాపరంగా శుక్రవారం చర్చనీయాంశమైంది. కీలక విభాగ పర్యవేక్షకుడిపై వచ్చిన ఫిర్యాదుపై అదనపు కమిషనర్ తన ఛాంబర్‌కు గురువారం పిలిపించి మాట్లాడే సందర్భంలో గొడవ మొదలైంది. చివరకు అదనపు కమిషనర్‌పై దాడికి యత్నించే వరకు వెళ్లింది. ఈ సందర్భంగా అడ్డుకున్న ఒకరిద్దరు ఉద్యోగులను కూడా పర్యవేక్షకుడు పక్కకునెట్టారని ఉద్యోగ వర్గాలు తెలిపాయి.

एम एस टी सी लिमिटेड (भारत सरकार का उपक्रम) MSTC LIMITED (A Govt. of India Enterprise)
6th Floor, "Jeevan Prakash", LIC Building, Jeevitha Bima Road, Visakhapatnam-530 004.
Phones : 0891-2746948, 2701066, 2521566, Fax : 0891-2747053.
SALE OF HUMAN HAIR ON BEHALF OF TTD, TIRUPATHI
The following varieties of Human Hair are for sale vide EA No. 465 on 05.04.18. Material details: First Variety (31" and above) - 9500 KG., Second Variety (16-30") - 41100 KG., Third Variety (10" to 15") - 100 KG., Fifth Variety (Less than 5") - 30000 KG., Grey Hair - 5900 KG. For further details visit www.mstcecommerce.com & www.mstcindia.co.in. Bidders should regularly visit above websites to keep themselves updated.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనాల శాఖ
e-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
NIT No. 11/SRP/ONG/CE (MDR)/EE (TEC)/DEE5/AEE1/ 2018-19 తేది: 23-3-2018
ప్రకాశంజిల్లాలో 2 ప్రత్యేక మరమ్మతు పనులకు సంబంధించి e-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. అంచనా విలువ రూ. 324.45 లక్షలు. టెండరుదారులు టెండరు షెడ్యూళ్లను ది. 28-3-2018 మ.గం. 3.00ల నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. టెండర్ల స్వీకరణకు చివరి తేది: 11-4-2018 మ.గం. 3.30 వరకు. తదుపరి వివరాలు e-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్రదేశం www.apeprocurement.gov.in వద్ద చూడవచ్చును.
సం/- చీఫ్ ఇంజినీర్ (ఆర్ & బి), MDR
DIPR No. 3877/CL/Advt/1/1/2017-18

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
జలవనరుల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీసు
నెం. 34/2017-18 తేది: 20-3-2018
1. పనిపేరు: నీరు-చెట్టు- శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా, బాలయపల్లి, వెంకటగిరి, డక్కిలి మండలములోని వాగులకు కాలువలకు చెక్‌డ్యాం నిర్మించుట మరియు సూళ్ళూరుపేట మండలములోని వివిధ గ్రామాలలో కాలువలకు పూడికతీత మరియు పునరుద్ధరించుట గురించి. (19 పనులు). 2. పనివిలువ: 1) రూ. 598.67 లక్షలు (19 పనులు). 3. టెండరు డాక్యుమెంట్లు లభ్యమగు తేది: 26-3-2018 ఉ. 11.00 గం.ల నుండి 2-4-2018 సా. 3.00 గం.ల వరకు. 4) టెండర్లు స్వీకరించు చివరి తేది: 2-4-2018 సా. 5.00 గం.ల వరకు. 5. ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది: 3-4-2018 ఉ. 11.00 గం.లకు. మిగతా వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌నందు చూడగలరు. ఫోన్ నెం. 0861- 2327658.
DIPR No. 3872/CL/Advt/1/1/2017-18 సం/- పర్యవేక్షక ఇంజినీరు, నీటిపారుదల వలయము, నెల్లూరు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
నెం.28లోని నిట్ నెం. 404 నుండి 409 వరకు/ఆర్‌సి నెం. టిబి/28/2017-18 తేది: 20.3.2018
గుంటూరు పరిధిలోని వివిధ నియోజకవర్గములలో బి.టి. రోడ్స్ రిపేర్లు, మెటలురోడ్డు రిపేర్లు, యస్.టి.కాలనీ అంతర్గత సి.సి. రోడ్లు, తహశీల్దార్ ఆఫీసు భవన నిర్మాణము, 5 పనులు మరియు 1 ప్యాకేజి క్రింద 14 పనులకు అంచనా విలువ రూ. 571.00 లక్షలతో పి.ఆర్.ఇ.యస్‌పర్ సి.ఆర్.ఆర్. (యస్.సి.పి.) 2016-17 గ్రాంటు, రెవెన్యూ డిపార్టుమెంట్ భవన నిర్మాణము గ్రాంటు, పి.ఆర్.రోడ్లు (యస్.సి.పి.) 2017-18 క్రింద ఆన్‌లైన్ ద్వారా కోరబడుచున్నవి. వివరములకు ఇ-మార్కెట్ ప్లేస్ www.apeprocurement.gov.in నందు చూడగలరు.
సం/- పర్యవేక్షక ఇంజినీరు, పంచాయతీరాజ్ సర్కిల్, గుంటూరు
DIPR No. 3873/CL/Advt/1/1/2017-18

APGENCO ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ కొరకు ప్రకటన
ఇ-టెండరు ఆహ్వాన ప్రకటన నెం. 610000353/CGM/(Adm, IS & ERP)/ERP & IT/APGENCO/2018
చీఫ్ జనరల్ మేనేజర్ (Adm, IS & ERP)/ERP & IT/APGENCO./Dr. NTTPS - APGENCO. "స్టేజ్-IV/సర్వీస్ బిల్డింగ్, Dr. NTTPS, ఇబ్రహీంపట్నం, విజయవాడ వద్ద వీడియో వాల్స్ యొక్క సరఫరా మరియు స్థాపన" పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లను కోరుతున్నారు. పని యొక్క అంచనా విలువ: రూ. 25.0 లక్షలు. టెండరు షెడ్యూలు లభించు తేది మరియు సమయం: 16–3–2018, 16.00 గం. నుండి. టెండరు షెడ్యూలు ముగింపు తేది మరియు సమయం: 4–4–2018, 16.00 గం. ముందస్తు అర్హత ఆవశ్యకతలు, టెండరు స్పెసిఫికేషన్లు, షెడ్యూళ్ళు మరియు తదుపరి వివరాలకు APGENCO వెబ్‌సైట్, అనగా www.apgenco.gov.in (లేదా) https://etender.apgenco.gov.in ను చూడగలరు.
మరిన్ని వివరాలకు చూడండి వెబ్‌సైట్: www.apgenco.gov.in

ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లిమిటెడ్
'ఇ'ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
ది ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ ఏ.పి. లిమిటెడ్ దిగువ తెలిపిన పని కొరకు ఆన్‌లైన్ బిడ్స్‌ను ఆహ్వానిస్తున్నది.
స్పెసిఫికేషన్ నెం.: APT-e-23/2017-18. పని పేరు: చిత్తూరు జిల్లాలో సబ్‌స్టేషన్ ఆటోమేషన్ సిస్టంతో 220KV రేణిగుంట SS వద్ద ప్రస్తుతమున్న కన్వెన్షనల్ సబ్‌స్టేషన్ యొక్క మాడిఫికేషన్ నిమిత్తం సరఫరా, స్థాపన మరియు పరీక్షించుట. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మీద టెండర్ల లభ్యత తేది మరియు సమయం: 23–3–2018, 17.00 గం.లు.
గమనిక: (i) టెండరు డాక్యుమెంట్లు పైన తెలిపిన తేదీన మరియు సమయానికి ఆన్‌లైన్‌లో లభించును. (ii) టెండర్లు ఆహ్వానించు అధికారి పేరు మరియు చిరునామా- చీఫ్ ఇంజనీర్/కన్‌స్ట్రక్షన్/విద్యుత్ సౌధ/గుణదల/విజయవాడ-520 008. (iii) కాంట్రాక్టర్లు/సంస్థలు సమాచారాన్ని ప్రధానంగా Zip ఫార్మేట్‌లో అప్‌లోడ్ చేయవలసినదిగా విజ్ఞప్తి. (iv) తదుపరి వివరములను http://www.apeprocurement.gov.in/ నందు చూడవచ్చును. (v) బిడ్డింగ్ డాక్యుమెంట్ http://www.apeprocurement.gov.in/ నందు లభ్యమగును. ఫోన్/ఫ్యాక్స్ నెం.: 0866-2429231: Extns: 2063, 2033
R.O. No. 58/17 సం/– చీఫ్ ఇంజనీర్, కన్‌స్ట్రక్షన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ
(రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ)
29-36-37, 3వ అంతస్థు, అమ్మన ఎస్టేట్స్, ప్రకాశం రోడ్, గవర్నర్ పేట, విజయవాడ - 520002.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం లోని ఈక్రింది ఎత్తిపోతల పథకములు టర్న్ కీ ప్రాతిపదికన నిర్మాణము మరియు రెండు సంవత్సరాల పాటు నిర్వహణ

క్ర.సం.	పని పేరు	టెండరు నోటీసు నెంబరు	కాంట్రాక్టు విలువ (రూ.లక్షల్లో)
1.	కొల్లిమెర్ల డ్రెయిన్ మీద ములుకుదురు – 2 ఎత్తిపోతల పథకము	57/2017 - 18 తేది. 23.03.2018	272.27
2.	తుంగభద్ర డ్రెయిన్ మీద వడ్డిముక్కల ఎత్తిపోతల పథకము	58/2017 - 18 తేది. 23.03.2018	503.09
3.	కొల్లిమెర్ల డ్రెయిన్ మీద సందూరు ఎత్తిపోతల పథకము	59/2017 - 18 తేది. 23.03.2018	698.82
4.	తుంగభద్ర డ్రెయిన్ మీద నిడుబ్రోలు ఎత్తిపోతల పథకము	60/2017 - 18 తేది. 23.03.2018	627.04

'ఇ'ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ నుండి టెండరు షెడ్యూలు తీసుకోవలసిన తేది : 24.03.2018 ఉ. గం. 11.00 నుండి 10.04.2018 సా. గం. 4.00ల వరకు
ఆన్‌లైన్ ద్వారా టెండర్లు స్వీకరించు చివరి తేది : 10.04.2018 సా. గం. 4.30ని.ల వరకు
టెండర్లు ఆహ్వానిస్తున్న అధికారి : జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, సంప్రదించవలసిన ఫోన్ నెంబరు : 0866-2434597, మిగిలిన వివరములకు కొరకు www.apeprocurement.gov.in నందు లేదా జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ, విజయవాడను సంప్రదించగలరు. సం/- జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్

భారతీయ రిజర్వ్ బ్యాంక్
RESERVE BANK OF INDIA
www.rbi.org.in
నాన్ బ్యాంకింగ్ పర్యవేక్షణ విభాగము
6-1-56, సెక్రటేరియట్ రోడ్, సైఫాబాద్, హైదరాబాద్- 500 004
పబ్లిక్ నోటీసు - సర్టిఫికేట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ రద్దు
మెసెర్స్. రాజంపేట పెర్మనెంట్ ఫండ్ లిమిటెడ్, రిజిస్టర్డ్ ఆఫీస్ : 4-109/ఏ, పై అంతస్థు, మెయిన్ రోడ్, రాజంపేట, వై ఎస్ ఆర్ కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్ 516115. వారి అభీష్టం మేరకు సర్టిఫికేట్ ఆఫ్ రిజిస్ట్రేషన్‌ను రిజర్వ్ బ్యాంక్ కు సరెండర్ చేసి, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934, సెక్షన్ 45-IA క్రింద రద్దు చేయమని అర్థించినది.
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం, 1934 లోని సెక్షన్ 45-IA(6) క్రింద తనకు దాఖలు పరచబడిన అధికారాలను వినియోగించుకొని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫిబ్రవరి 20, 2018 తేదీ నాటి ఉత్తర్వు ద్వారా మెసెర్స్ రాజంపేట పెర్మనెంట్ ఫండ్ లిమిటెడ్ CIN U67200AP1997PLC027771, నాన్ బ్యాంకింగ్ ఆర్థిక సంస్థ వ్యాపారము నిర్వహించేందుకు ఆర్ బి ఐ చట్టంలోని సెక్షన్ 45-IA ప్రకారము జారీ చేసిన సర్టిఫికేట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ను CoR No. 09.00222 తేదీ డిసెంబర్ 03, 1998 రద్దు చేసింది.
కావున పైన పేర్కొన్న కంపెనీ నాన్ బ్యాంకింగ్ ఆర్థిక వ్యాపార లావాదేవీలు ఆర్ బి ఐ చట్టం క్రింద నిర్వహించకూడదు.
ప్రజా శ్రేయస్సు దృష్ట్యా ఇది జారీ చేయబడినది.
స్థలము: హైదరాబాద్
తేదీ: మార్చి 24, 2018
సం/-
(శంకర్ సుమన్)
జనరల్ మేనేజర్

గ్రూప్-1 టాపర్‌గా నిషాంత్

● మార్కులు ప్రకటించిన ఏపీపీఎస్సీ

ఈనాడు, అమరావతి, డిజిటల్: గ్రూపు-1 (2016) మౌఖిక పరీక్షలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. మొత్తం 151 మంది వీటికి హాజరయ్యారు. వీరికి ప్రధాన పరీక్షల్లో సబ్జెక్టుల వారీగా... మౌఖిక పరీక్షలో వచ్చిన మార్కులను విడివిడిగా, అలాగే కలిపి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించింది. ప్రాథమిక సమాచారం ప్రకారం... అనంతపురం జిల్లా అభ్యర్థి నిషాంత్‌రెడ్డి 522.5 మార్కులను సాధించి తొలిస్థానాన్ని దక్కించుకున్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జయరాం ప్రసాద్ 5వ స్థానాన్ని పొందాడు. కడపకు చెందిన సింధురెడ్డి 9వ ర్యాంకు సాధించారు. 2011 నోటిఫికేషన్ ద్వారా మంచి ఉద్యోగాలు పొందిన వారు కూడా 2016 మౌఖిక పరీక్షలకు హాజరయ్యారు. ఉద్యోగస్థాయి అనుసరించి పాత మార్కుల ప్రకారం ఉద్యోగాన్ని ఎంచుకోవాలా లేక తాజా మార్కుల్ని అనుసరించి ఎంపిక చేసుకోవాలా అనేది అభ్యర్థులు నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. ధ్రువ పత్రాల పరిశీలన అనంతరం ఎంపిక జాబితా ప్రకటిస్తారు. తాజా నోటిఫికేషన్ ద్వారా డిప్యూటీ కలెక్టర్లు, కమర్షియల్ టాక్స్ ఆఫీసర్లు, జిల్లా రిజిస్ట్రార్లు, డీఎస్పీలు, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు, బీసీ సంక్షేమ అధికారులు, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-2, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ పోస్టులు ప్రకటించారు. డీఎస్పీ పోస్టులు ఎక్కువగా 24 ఉన్నాయి. డిప్యూటీ కలెక్టర్ పోస్టులు ఐదు ఉన్నాయి. అలాగే గ్రూపు-2 (2016) నోటిఫికేషన్ అనుసరించి ఏప్రిల్ 2న కంప్యూటర్ ప్రొఫిషియన్సీ పరీక్షను నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ ప్రకటించింది.

ఐఏఎస్ సాధించాలన్నదే నా కల...



అనంతపురం విద్య, న్యూస్‌టుడే: "ఐఏఎస్ సాధించాలన్నదే నా కల. రెండుసార్లు సివిల్స్ రాసినా ప్రణాళికాబద్ధమైన సన్నద్ధతలేక మెయిన్స్‌లో విఫలం అయ్యాను. గ్రూపు-1లో ప్రథమ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టరు అయితే పదోన్నతిపై కలెక్టరు కావచ్చని అంచలంచెలుగా ఎదిగి రాష్ట్ర స్థాయిలో కూడా సేవలు అందించవచ్చని అనుకున్నా. ఆ ఆశయం నెరవేరే దిశగా ఫలితాలు రావడం ఆనందంగా ఉంది' అన్నారు గ్రూపు-1లో ప్రథమ ర్యాంకు సాధించిన నిషాంత్‌రెడ్డి. అనంతపురం మొదటి రోడ్డు ప్రాంతంలో ఉంటున్న నిషాంత్‌ది మధ్యతరగతి కుటుంబం. స్వగ్రామం బుక్కరాయసముద్రం మండలం బాట్లో కొత్తపల్లి. తండ్రి ఆదిశేఖర్‌రెడ్డి నిషాంత్ ఏడో తరగతిలో ఉన్నప్పుడే మృతి చెందారు. తల్లి పార్వతి పిల్లలను చదువుల కోసం అనంతపురానికి తీసుకొచ్చారు. ఆమె ఓ ప్రయివేట్ పాఠశాలలో టీచరుగా పనిచేసి కొడుకును చదివించారు. నిషాంత్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని యునైటెడ్ ఇండియాలో ఏఓగా విధులు నిర్వహిస్తున్నారు.

అమ్మ కల నెరవేరింది...: రామ్‌ప్రసాద్



కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'మా అమ్మే నాకు స్ఫూర్తి..' అన్నారు గ్రూప్-1లో అయిదో ర్యాంకు సాధించిన బి. జయరామ్ ప్రసాద్. "ప్రభుత్వ శాఖలో ఉన్నతాధికారిగా చూడాలని అమ్మ నన్ను ఎంతో ప్రోత్సహించింది. ఆమె రెవెన్యూ శాఖలో ఉప తహసీల్దారు. కలెక్టర్‌గా నన్ను చూడాలని ఆశపడుతోంది. సివిల్స్ రాశాను. ఇంటర్వ్యూ వరకూ వెళ్లాను. ఐఏఎస్ కావడానికి ఆఖరి ప్రయత్నం చేస్తాను. ఇప్పుడు గ్రూప్-1లో వచ్చిన ర్యాంకుతో మరింత ఉత్సాహం పెరిగింది. ఐఏఎస్ కావాలనే అమ్మ బలమైన ఆకాంక్షను నెరవేరుస్తాను" అన్నారాయన. కాకినాడకు చెందిన జయరామ్ ప్రసాద్ ప్రస్తుతం రాజమహేంద్రవరంలో ఆదాయ పన్ను శాఖాధికారిగా పనిచేస్తున్నారు. ప్రాథమిక విద్యాభ్యాసం రామచంద్రపురంలోని ప్రభుత్వ పాఠశాలలో సాగింది. డిగ్రీ కూడా అక్కడే ఎయిడెడ్ కళాశాలలో పూర్తి చేశారు. ఎంసీఏ తిరుచరాపల్లి నిట్‌లో పూర్తి చేశారు.

అమ్మ నమ్మకమే గెలిచింది: సింధురెడ్డి



ఈనాడు, కడప: "అమ్మ ప్రోత్సాహమే నన్ను నడిపించింది.. ఆమె నాపై పెట్టుకున్న నమ్మకమే చివరకు గెలిచింది.." అన్నారు గ్రూప్-1లో 9వ ర్యాంకు సాధించిన సింధురెడ్డి. మహిళా విభాగంలో రాష్ట్రస్థాయిలో 2వ స్థానంలో నిలవడం చాలా గర్వంగా ఉందన్నారు. కడప నగరానికి చెందిన ఆమె తొలుత 2011లో గ్రూప్-1కు ప్రయత్నించి యాభై లోపు ర్యాంకు సాధించి అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా అవకాశం సాధించారు. తండ్రి నారాయణరెడ్డి డిగ్రీ కళాశాలలో అధ్యాపకునిగా పనిచేసి పదవీ విరమణ చేయగా తల్లి ప్రేమలత గృహిణిగా ఉన్నారు. తండ్రి స్వస్థలం ప్రొద్దుటూరు. ఆయన పదవీ విరమణ అనంతరం కడపకు వచ్చేశారు. తిరుపతి సమీపంలోని శ్రీవిద్యానికేతన్‌లో బీటెక్ పూర్తిచేసిన సింధు.. అక్కడే ప్రాంగణ ఎంపికల్లో ప్రైవేటు ఉద్యోగానికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో కొద్దికాలం పనిచేసిన ఆమె.. అనంతరం అక్కడే గ్రూప్స్‌కు శిక్షణ తీసుకున్నారు.

ఏ స్థానానికి ఎన్ని మార్కులంటే

స్థానం	మార్కులు
1	522.5
2	519.5
3	511.5
4	500
5	499.5
6	494
7	492.5
8	490
9	488
10	488
11	484.5
12	482
13	480.5
14	480
15	479.5

గతంలో వచ్చిన స్థానాలతో పోల్చితే...

అభ్యర్థి	2016లో	2011లో
నిషాంత్‌రెడ్డి, అనంతపురం జిల్లా	1	4
జయరాం ప్రసాద్, తూర్పుగోదావరి	5	9
ఆవుల వెంకట రమణ	22	1

ట్యాంపరింగ్‌పై 'బార్క్' చర్యలు

ఐదుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ఈనాడు, హైదరాబాద్: టీవీ ఛానెళ్ల రేటింగ్‌లను ప్రభావితం చేసేందుకు అవకతవకలకు పాల్పడుతున్న వారిపై 'బ్రాడ్‌కాస్ట్ ఆడియన్స్ రీసెర్చి కౌన్సిల్-ఇండియా (బార్క్) సంస్థ కొరడా ఝుళిపించింది. టీవీ కార్యక్రమాల వీక్షణ సమాచారాన్ని గుర్తించే బార్-ఓ-మీటర్లను ఏర్పాటు చేసిన గృహాలకు సంబంధించిన సమాచారం విషయంలో అవకతవకలకు పాల్పడుతున్నట్లు బార్క్ నిఘా బృందం గుర్తించింది. దీనిపై ఆధారాలతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తెలంగాణ ప్రాంతంలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు గుర్తించిన ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిపై ట్యాంపరింగ్, మోసం, నమ్మకద్రోహం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ట్యాంపరింగ్‌ను అరికట్టేందుకు బార్క్ ఇండియా ఎన్నో ఏళ్లుగా పలురకాల చర్యలు తీసుకుంటోందనీ, అయినా కొంత మంది ఈ తరహా అక్రమాలకు పాల్పడుతూనే ఉన్నారని బార్క్ ఇండియా సీఈవో పార్థో దాస్‌గుప్తా పేర్కొన్నారు. అక్రమ చర్యల్ని అడ్డుకునేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, క్షేత్రస్థాయిలో నిఘా వంటి చర్యలు తీసుకుంటున్నట్లు ఓ ప్రకటనలో వివరించారు.

భవన ఆకృతులపై ఎమ్మెల్యేల సంతృప్తి

ఈనాడు డిజిటల్, అమరావతి: రాజధానిలో నిర్మించ తలపెట్టిన శాశ్వత సచివాలయం, అసెంబ్లీ, ఎమ్మెల్యే క్వార్టర్ల భవన ఆకృతులపై శాసనసభ్యులు అందరూ సంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం సచివాలయంలో భవన ఆకృతులతో ప్రదర్శన ఏర్పాటు చేయగా.. వాటిని తిలకించిన ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి ఎమ్మెల్యేల క్వార్టర్లు సిద్ధమవుతాయని.. క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, జిమ్ వంటి అన్ని సౌకర్యాలతో నిర్మిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. సందర్శకులను కలిసేందుకు ప్రతి క్వార్టర్‌లోనూ ప్రత్యేకహాల్ ఏర్పాటు చేయిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని.. వచ్చే ఎన్నికల్లో ప్రజామోదం పొందితేనే కొత్తగా నిర్మించే శాసనసభ భవనంలోకి అడుగుపెడతామని ముఖ్యమంత్రి ఎమ్మెల్యేలకు చెప్పారు. శుక్రవారం కొంతమంది ఎమ్మెల్యేలు మాత్రమే భవనాల ఆకృతులను తిలకించడంతో మిగిలిన వారికోసం శనివారం అసెంబ్లీ భవనంలో ప్రదర్శన ఏర్పాటు చేయనున్నారు.

ఏపీకి 10 మెప్మా అవార్డులు

ఈనాడు, దిల్లీ: స్వచ్ఛభారత్ కార్యక్రమాలను చురుగ్గా ప్రజల్లోకి తీసుకెళ్లినందుకుగాను కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించిన స్వచ్ఛత ఎక్స్‌లెన్స్ అవార్డులను ఆంధ్రప్రదేశ్ మెప్మా పట్టణ సమాఖ్యలు అందుకున్నాయి. దేశవ్యాప్తంగా 57 అవార్డులు ప్రకటించగా రాష్ట్రానికి పది అవార్డులు దక్కాయి. శుక్రవారమిక్కడ కార్యక్రమంలో కేంద్ర మంత్రి హర్‌దీప్‌సింగ్‌పురి చేతుల మీదుగా ఏపీ మెప్మా సమాఖ్య ప్రతినిధులు అవార్డులు అందుకున్నారు. గుంటూరుకు రెండు, నరసరావుపేట, తెనాలి, సత్తెనపల్లి, చీరాల, చీమకుర్తి, సామర్లకోట, నెల్లిమర్ల, సాలూరు మెప్మా సమాఖ్యలకు ఒక్కో అవార్డు దక్కింది. పది అవార్డులు లభించడంపై సీఎం చంద్రబాబు, మెప్మా ఎండీ చినతాతయ్య హర్షం వ్యక్తం చేశారు.

శ్రీసిటీలో 'లిబరల్ ఆర్ట్స' విశ్వవిద్యాలయం

- ఆర్‌బీఐ పూర్వ గవర్నర్ రఘురాం రాజన్, వ్యాపార దిగ్గజాలు, విద్యారంగ నిపుణుల పథక రచన
- రూ.750 కోట్లతో క్రియా వర్సిటీ ఏర్పాటుకు సన్నాహాలు
- వచ్చే నవంబరులో ప్రవేశాలు

ముంబయి

ఆంధ్రప్రదేశ్ సిగలో మరో విశ్వవిద్యాలయం చేరనుంది. రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ రఘురాం రాజన్, మరికొందరు వ్యాపార దిగ్గజాలు, విద్యారంగ ప్రముఖులు కలిసి... చిత్తూరు జిల్లా శ్రీసిటీలో 'లిబరల్ ఆర్ట్స్' విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంకల్పించారు. స్నాతక (డిగ్రీ) స్థాయి విద్యలో సమూల మార్పులకు నాంది పలుకుతూ- అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తామని శుక్రవారం వారిక్కడ వెల్లడించారు.

"కార్పొరేట్ సంస్థలు తమ సామాజిక బాధ్యతగా ఆంధ్రప్రదేశ్‌లో లిబరల్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయ ఏర్పాటుకు ముందుకొచ్చాయి. తొలిదశలో రూ.750 కోట్లను సమీకరించాలన్నది లక్ష్యం. ఇప్పటికే ఇందులో 70-80% వరకూ నిధులకు స్పష్టత వచ్చింది" అని ఇండస్ బ్యాంకు ఛైర్మన్, వర్సిటీ పర్యవేక్షక మండలి అధ్యక్షులు ఆర్.శేషసాయి తెలిపారు.

ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు...

"2019లో తొలి బ్యాచ్ ప్రారంభమవుతుంది. ప్రవేశ ప్రక్రియ మాత్రం ఈ ఏడాది నవంబరులోనే ఉంటుంది. నాలుగేళ్ల ఆర్ట్స్ (బీఏ ఆనర్స్), సైన్స్ (బీఎస్సీ ఆనర్స్) కోర్సులను అందుబాటులోకి తెస్తున్నాం. ఇప్పటికే వీటి అనుమతుల కోసం యూనివర్సిటీ నిధుల సంఘానికి దరఖాస్తు చేశాం. కేవలం 'ప్లస్ టూ' స్థాయిలో సాధించిన మార్కులే ప్రాతిపదిక కాకుండా... పూర్తిగా విద్యార్థుల ప్రతిభ ఆధారంగానే ప్రవేశాలు కల్పిస్తాం. తొలుత ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ (ఐఎఫ్ఎంఆర్) భవనంలో తరగతులను ప్రారంభిస్తాం. 2020 నాటికి శ్రీసిటీలో 200 ఎకరాల్లో సొంత భవనాలు సిద్ధమవుతాయి. తర్వాత అక్కడికి మార్చుతాం" అని శేషసాయి వివరించారు. వసతిగృహ సదుపాయంతో కలిపి ఒక్కో విద్యార్థి ఫీజు రూ.7-8 లక్షలు ఉంటుందన్నారు. అయితే, పేద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా వారికి ఆర్థిక సహాయం అందించే విషయాన్నీ పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

కొత్త తరాన్ని తయారుచేస్తాం: రఘురాం రాజన్

విశ్వవిద్యాలయ పాలక మండలి సలహాదారు రఘురాం రాజన్ మాట్లాడుతూ... ప్రపంచ అభివృద్ధిలో భాగస్వామ్యమయ్యే భారతీయ విద్యార్థుల తరాన్ని తయారు చేసేందుకు తమవంతు ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రస్తుతం మనదగ్గర లేని విధానాన్ని అందుబాటులోకి తేదలిచామనీ, ఇది తప్పకుండా మంచి భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుందన్నారు. భారతీయ, అంతర్జాతీయ స్థాయి మేధస్సును మేళవించే వేదికగా ఈ విశ్వవిద్యాలయం ఉంటుందని పాలకమండలి మరో సభ్యుడు, ఎస్‌జేడబ్ల్యూ గ్రూపునకు చెందిన సజ్జన్ జిందాల్ అన్నారు. ఒక సరికొత్త వేదిక ఏర్పాటుకు భావసారూప్యత గల ప్రముఖులు ఎంతో ఉత్సాహంగా కలిసి ముందుకు రావడం ముదావహమని ఆనంద్ మహీంద్రా చెప్పారు. విశ్వవిద్యాలయ పాలక మండలి ఛైర్మన్‌గా బ్యాంకు పూర్వాధికారి ఎన్.వాఘుల్, ఉపకులపతిగా ప్రముఖ విద్యావేత్త సుందర్ రామస్వామి వ్యవహరిస్తారని సమాచారం.

అభివృద్ధితో స్థిరాస్తి వృద్ధి

- ఈ ఏడాది లక్ష్యాన్ని మించిన రిజిస్ట్రేషన్ల ఆదాయం
- 'అనంత'ను ప్రథమస్థానంలో నిలిపిన పారిశ్రామికాభివృద్ధి
- రాజధాని పరిధిలోనూ పెరిగిన స్థిరాస్తి విక్రయాలు

ఈనాడు – అమరావతి

రాష్ట్రంలో స్థిరాస్తి వ్యాపారం క్రమంగా పుంజుకుంటోంది. రాజధాని అమరావతి పరిధిలోని కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు కరవు జిల్లా అనంతపురంలోనూ స్థిరాస్తి లావాదేవీలు పెరిగాయి. విజయవాడ-మంగళగిరి మధ్య ఐటీ రంగం అభివృద్ధి చెందడం.. అనంతపురం జిల్లాలో కియా మోటార్స్‌తోపాటు అనుబంధ పరిశ్రమలు వస్తున్నందున అక్కడ స్థిరాస్తి విక్రయాలు జోరందుకున్నాయి. దీంతో 2017-18 ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం భారీగా పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4000 కోట్ల మేర వసూళ్లు జరపాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకోగా.. ఈ నెల 21వ తేదీనాటికి రూ.4048.60 కోట్లు వసూళ్లు జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 1,54,401 దస్తావేజుల రిజిస్ట్రేషన్‌లు ఎక్కువగా జరిగాయి. ఏప్రిల్ నుంచి అక్టోబరు వరకు మందకొడిగా జరిగిన రిజిస్ట్రేషన్లు నవంబరు నుంచి పెరిగాయి. డిసెంబరులో 74%, జనవరిలో 68% వంతున వృద్ధి కనిపించింది. ఫిబ్రవరిలో 44% వృద్ధి నమోదైంది. సగటున 12.42% దస్తావేజుల రిజిస్ట్రేషన్స్‌లో వృద్ధి కనిపించిందని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ వెంకట్రామిరెడ్డి 'ఈనాడు'తో పేర్కొన్నారు.

నిత్యం కరవుతో విలవిలలాడే అనంతపురం జిల్లాలో కియా మోటార్స్‌తోపాటు అనుబంధ పరిశ్రమలు వస్తున్నందున అక్కడి స్థిరాస్తి విక్రయాలు జోరందుకున్నాయి. హిందూపురం వంటిచోట్ల స్థిరాస్తి విక్రయాలు ఎక్కువగా ఉన్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. బెంగళూరు నగరానికి చెందిన వారు ఇక్కడ భూములను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. బెంగళూరుకు చేరువగా ఉండటం.. భూములు, నిర్మాణ ధరలు ఇక్కడ తక్కువగా ఉండటంతో ఇటువైపు దృష్టి పెడుతున్నారు. దీనివల్ల అనంతపురం జిల్లాలో రిజిస్ట్రేషన్ల ద్వారా 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.171.78 కోట్లు రాగా.. 2017-18 ఆర్థిక సంవత్సరంలో మార్చి 21వ నాటికి రూ.227.25 కోట్లు వసూళ్లు జరిగాయి. అమరావతి పరిధిలోని కృష్ణా, గుంటూరు జిల్లాల్లో కంటే అనంతపురం జిల్లాలోనే ఎక్కువగా స్టాంపులు, రెవెన్యూ శాఖకు వసూళ్లు జరగడం గమనార్హం. కృష్ణా జిల్లాలో 23.41%, గుంటూరు జిల్లాలో 24.31% వసూళ్లు పెరిగాయి. విజయవాడ-మంగళగిరి మధ్య ఐటీ రంగం అభివృద్ధి చెందుతుండడంవల్ల భూముల కొనుగోళ్లు పెరిగినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. విజయనగరం జిల్లాలో -6శాతం, విశాఖ జిల్లాలో -0.35శాతం పురోగతి తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. విశాఖలో భూకుంభకోణం కారణంగా లావాదేవీలు కాస్త తగ్గుముఖం పట్టాయి. 2017 ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి 2018 వరకు 13,97,933 దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరిగాయి. కిందటి ఆర్థిక సంవత్సరంలో 12,43,532 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగాయి. ఈ పరిణామాలను పరిశీలిస్తే ... నోట్ల రద్దు ప్రభావం స్థిరాస్తి రంగంపై క్రమేణ తగ్గుముఖం పట్టినట్లు కనిపిస్తోంది. ఈ నెల 31వ తేదీలోగా అదనంగా మరో వంద కోట్ల రూపాయల వరకు వసూళ్లు జరుగుతాయని అంచనా వేస్తున్నారు. రెవెన్యూ వసూళ్ల వివరాలు www.eenadu.net లో

విశ్రాంత ఉద్యోగికి మళ్లీ 'ఉన్నత' కిరీటం!

- పదవి నుంచి దిగిన ఈఎన్‌సీకి మరో అవకాశం కోసం మంత్రి, ఎమ్మెల్యే లేఖలు
- ఆర్థికశాఖ ఆమోదిస్తే మరోసారి గిరిజన సంక్షేమ ఈఎన్‌సీగా సుబ్బారావు

ఈనాడు – అమరావతి

గిరిజన సంక్షేమశాఖలో ఇంజినీరింగ్ ఇన్‌చీఫ్(ఈఎన్‌సీ)గా పూర్తి అదనపు బాధ్యతలు(ఎఫ్ఏసీ) నిర్వహిస్తూ గత నెలాఖరున ఉద్యోగ విరమణ చేసిన ఏవీ సుబ్బారావును మరోసారి కొనసాగించే ప్రయత్నం జరుగుతోంది. ఇందుకోసం విశాఖ జిల్లా అరకు ఎమ్మెల్యే కె.సర్వేశ్వరరావు ఫిబ్రవరి 22న రాసిన సిఫార్సు లేఖపై గిరిజన, సాంఘిక సంక్షేమశాఖల మంత్రి ఎన్.ఆనందబాబు ముఖ్య కార్యదర్శికి అదే రోజున మరో లేఖ రాశారు. ఎమ్మెల్యే సిఫార్సులను ప్రస్తావిస్తూ మరో ఆర్నెల్లపాటు సుబ్బారావును ఈఎన్‌సీ(ఎఫ్ఏసీ)గా కొనసాగించేందుకు ముఖ్యమంత్రి అనుమతికై తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ మేరకు గిరిజన, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కార్యాలయం పంపిన దస్త్రం ఆర్థికశాఖ పరిశీలనలో ఉంది. అక్కడి నుంచి అనుమతి రాగానే ముఖ్యమంత్రి కార్యాలయ ఆమోదంతో సుబ్బారావును తిరిగి ఈఎన్‌సీ స్థానంలో కూర్చోబెట్టాలన్నది ప్రయత్నం.

ఎందుకు కొనసాగించాలట..?: ఉప ప్రధాన ఇంజినీర్(డీసీఈ) హోదా కలిగి ఈఎన్‌సీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించే సుబ్బారావు ఉద్యోగ విరమణ చేస్తే గిరిజన ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలోని అనేక పనులపై ప్రభావం పడొచ్చని ఎమ్మెల్యే సర్వేశ్వరరావు మంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇంజినీర్ల సీనియారిటీ అంశం అపరిష్కృతంగా ఉన్నందున సుబ్బారావునే ఈఎన్‌సీగా ఆర్నెల్లు కొనసాగించాలని సూచించారు. మంత్రి కార్యాలయమూ ఎమ్మెల్యే లేఖపై స్పందిస్తూ తదుపరి చర్యల కోసం గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శికి సూచించడం గమనార్హం. సుబ్బారావు గతనెల 28న ఉద్యోగ విరమణ చేసినా ఇప్పటికి ఎవర్నీ నియమించలేదు. సుబ్బారావును మరోసారి ఈఎన్‌సీ సీట్లో కూర్చోబెట్టేందుకే కాలయాపన చేస్తున్నారా?..అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


KIDARI SARVESWARA RAO
GOVERNMENT WHIP


NAKKA ANANDA BABU
NOTE

మంత్రి ఆనందబాబుకు అరకు ఎమ్మెల్యే రాసిన లేఖ ★ ఎమ్మెల్యే లేఖపై ముఖ్య కార్యదర్శికి మంత్రి రాసిన మరో లేఖ

పైరవీలు చేయించుకోలేదు...

ఉద్యోగ పదవీ కాలాన్ని పెంచేలా ఎవరితోనూ ప్రభుత్వానికి పైరవీలు చేయించుకోలేదు. నరేగా అనుసంధానంతో చేస్తున్న పనులు చాలావరకు పూర్తయి మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. అందువల్ల మరో ఆర్నెల్లు పొడిగిస్తే బాగుంటుందని అరకు ఎమ్మెల్యే రాసి ఉండొచ్చు. దురుద్దేశంతో కొందరు నాపై తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారు.

–ఏవీ సుబ్బారావు, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విశ్రాంత ఈఎన్‌సీ



గాయపడ్డ ధనుంజయ

నిర్దయగా చేతులు నరికేశారు..

వివాహేతర సంబంధం నెపంతో యువకుడిపై దాడి

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా ఏజెన్సీ ప్రాంతమైన గుమ్మలక్ష్మీపురం మండలంలో వివాహేతర సంబంధం నెపంతో ఓ యువకుడి రెండు చేతులను నిర్దాక్షిణ్యంగా నరికేశారు. ఇరిడి పంచాయతీ కొత్తగూడవాసి బిడ్డిక ధనుంజయ(28)పై అదే గ్రామానికి చెందిన పాడి శివన్నారాయణ, నరేష్, ప్రసాద్ గురువారం అర్ధరాత్రి దాడి చేశారు. గ్రామంలోని ఓ ఇంట్లోకి తీసుకెళ్లి చేతులు, కాళ్లను కట్టేసి కర్ర పనిముట్లు తయారుచేసే పరికరం(బాడిత)తో రెండు చేతులు నరికేశారు. అనంతరం ధనుంజయను సర్పంచి పద్మావతి ఇంటి ముందు పడేశారు. సర్పంచి ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ధనుంజయను పార్వతీపురం ఆసుపత్రి, తర్వాత విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. గ్రామానికి చెందిన ఒక మహిళతో ధనుంజయ వివాహేతర సంబంధం కొనసాగించడంపై రెండు వర్గాల మధ్య తగాదాలున్నాయి. ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సాధారణంగా క్రికెట్లో బౌలింగ్ ఎలా చేస్తారు? ఇదేం ప్రశ్న అనుకుంటున్నారా? ఒక చేత్తోనే కదా.. ఇది అందరికీ తెలుసు. మరి ఒకే ఓవర్లో రెండు చేతులతో బౌలింగ్ చేస్తే! ఇదెలా సాధ్యం! అలాంటి బౌలర్లు ఉన్నారా? అవును.. క్రికెట్లో రెండు చేతులతో బంతులేసే బౌలర్లు ఉన్నారు. అలాంటి సవ్యసాచులు చాలా అరుదు. పాత తరంలో ఇలాంటి క్రికెటర్లు ఒకరిద్దరు ఉండేవాళ్లు. తాజాగా ఇద్దరు బౌలర్లు రెండు చేతులతో బంతులు సంధిస్తూ అందర్నీ ఆశ్చర్యపరుస్తున్నారు. ఒకే ఓవర్లో రెండు చేతులతో బంతులు వేస్తూ వికెట్లు తీస్తున్నారు.

కుడి ఎడమల.. పటాఫట్



ఇటీవలే న్యూజిలాండ్‌లో జరిగిన అండర్‌-19 ప్రపంచకప్‌లో శ్రీలంక స్పిన్నర్ కమిందు మెండిస్ రెండు చేతులతో బౌలింగ్ చేసి అందరి దృష్టినీ ఆకర్షించాడు. 17 ఏళ్ల కమిందు కుడి చేతి ఆఫ్ బ్రేక్ బౌలర్ మాత్రమే కాదు.. ఎడమ చేతి స్పిన్నర్ కూడా. అఫ్గానిస్థాన్‌తో మ్యాచ్‌లో అతను ఇలా రెండు చేతులతో బంతులేసి మూడు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఆ టోర్నీలో కమిందు లంక జట్టుకు కెప్టెన్ కూడా.

మనోడూ ఉన్నాడు!

రెండు చేతులతో బంతులేసే సత్తా ఉన్న అరుదైన బౌలర్లలో ఒక భారత క్రికెటరూ ఉన్నాడు. విదర్భకు చెందిన అక్షయ్ కర్నెవార్ సవ్యసాచిగా పేరొందాడు. బ్యాట్స్‌మెన్‌ను బట్టి అతను బౌలింగ్ శైలిని మార్చుకుంటాడు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలింగ్‌తో పాటు కుడి చేత్తో మీడియం పేస్ బౌలింగ్ చేస్తాడతను. ఇటీవలే దేశవాళీ అరంగేట్రం చేసిన అక్షయ్.. విజయ్ హజారే ట్రోఫీలో 7 మ్యాచ్‌ల్లో 16 వికెట్లు తీసి సత్తా చాటాడు. గతేడాది ఆస్ట్రేలియాతో బోర్డ్ ఎలెవన్ ప్రెసిడెంట్స్ ఎలెవన్ మ్యాచ్‌లో





ఆడిన అక్షయ్.. రెండు చేతులతో బంతులేసి కంగారెత్తించాడు. ఎడమ చేతి వాటం బ్యాట్స్‌మన్ అయిన హెడ్, వేడ్‌లకు కుడి చేత్తో మీడియం పేస్ వేసిన అక్షయ్.. కుడి చేతి వాటం బ్యాట్స్‌మెన్ స్టాయినిస్‌కు లెఫ్ట్ ఆర్మ్‌తో బంతులేశాడు.



తిలక్‌రత్నే, గూచ్‌లూ..

శ్రీలంక మాజీ బ్యాట్స్‌మెన్ తిలక్‌రత్నే పార్ట్ టైమ్ బౌలర్. 1996 ప్రపంచకప్‌లో తిలక్‌రత్నే.. కెన్యాతో మ్యాచ్‌లో రెండు చేతులతో బంతులేశాడు. కెన్యాతో మ్యాచ్‌లో లంక విజయానికి చేరువగా ఉన్నప్పుడు ఎడమ చేత్తో బంతులు విసిరిన తిలక్ రత్నే.. అదే ఓవర్లో కుడి చేత్తోనూ బంతులు వేశాడు. ఇంగ్లాండ్ ఆటగాడు గ్రాహం గూచ్ గురించి అందరికీ తెలుసు. అతను మంచి బ్యాట్స్‌మెన్ మాత్రమే కాదు ఉపయుక్తమైన కుడి చేతి వాటం పేసర్ కూడా. అయితే అప్పుడప్పుడూ అతను ఎడమ చేత్తోనూ బంతులు వేసేవాడు. పాకిస్థాన్ మాజీ స్టార్ హనీఫ్ మహ్మద్ కూడా ఇదే కోవకు చెందినవాడు. కుడి చేత్తో ఆఫ్ స్పిన్ వేసే హనీఫ్... లెఫ్ట్ ఆర్మ్ స్పిన్‌తోనూ అలరించేవాడు.

అప్పుడు...
సుశీల్‌కుమార్, యోగేశ్వర్ దత్ లాంటి స్టార్ల సాహచర్యంలో ఎదిగిన వాడు.. ప్రపంచ, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో పతకాలతో సత్తా చాటిన వాడు.. ఒలింపిక్స్ శిబిరంలోనూ పాల్గొన్నవాడు..

ఇప్పుడు..
విగ్రహాలకు రంగులు వేసుకుంటూ..ఏ మట్టిలో ఎదిగాడో ఆ మట్టి విగ్రహాలనే నమ్ముకుంటూ.. కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవితాన్ని గడుపుతున్నాడు.. ఆ ఛాంపియనే దేవిసింగ్. ధూల్‌పేట లాంటి ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి అంతే వేగంగా కింద పడ్డ రెజ్లర్! అందుకే అతను పేరుకే పహిల్వాన్!

కష్టంలో మీ.. పహిల్వాన్



క్రీడా ప్రతిభకు నిలయమైన తెలుగు రాష్ట్రాల్లో కుస్తీ ప్రాచుర్యంలో ఉన్నా.. క్రీడాకారులు మాత్రం ఆర్థిక ఇబ్బందుల కారణంగా అంతర్జాతీయ స్థాయిలో కొనసాగలేకపోతున్నారనడానికి దేవిసింగ్ తాజా ఉదాహరణ. ఎలాంటి సౌకర్యాలు లేని ధూల్‌పేటలో మట్టిలో మాణిక్యంలా ఎదిగాడు దేవి. స్థానిక మినీ స్టేడియంలోని అకాడమీలోనే అతడి సాధన సాగేది. సోదరుడు కిషన్‌సింగ్‌తో పాటు అతను ప్రాక్టీస్ చేసేవాడు. జాతీయ స్థాయిలో 50కి పైగా పతకాలు ఖాతాలో వేసుకున్న దేవి.. స్థానికంగా జరిగే కేసరి పోటీల్లో ఎన్నోసార్లు టైటిళ్లు అందుకుని పహిల్వాన్‌గా మారాడు. అతని బంధువు సాయంతో దిల్లీలో సత్పాల్‌సింగ్ అకాడమీలో తన తమ్ముడు కిషన్‌తో కలిసి చోటు సంపాదించాడు. ఇక్కడే సుశీల్‌కుమార్, యోగేశ్వర్ దత్ లాంటి దిగ్గజ రెజ్లర్ల సాహచర్యంతో ఆటలో ఆరితేరాడతను. ముందు మట్టిలో కుస్తీ పట్టిన వాడికి మ్యాట్‌ల మీద ఎలా ఆడాలో తెలిసింది అప్పుడే. అంతేకాదు కష్టాల్లో ఉన్న కుటుంబాన్ని ఆదుకోవడానికి దిల్లీలో స్థానికంగా జరిగే ఓపెన్ దంగల్‌కు వెళ్లి డబ్బులు సంపాదించి ఇంటికి పంపేవాడు. చాలాసార్లు డబ్బులు లేని స్థితిలో యోగేశ్వర్ అన్నదమ్ములను ఆదుకునేవాడు. అంతేకాదు రెజ్లర్లకు చాలా అవసరమైన బాదం, నెయ్యి వారితో పంచుకునేవాడు.

ఆసియా ఘనత

ఆసియా ఛాంపియన్‌షిప్‌లో తనకన్నా మెరుగైన రెజ్లర్లను మట్టికరిపించి స్వర్ణం గెలవడం దేవి కెరీర్‌లోనే అతి పెద్ద విజయం. దీంతో ఈ కుర్రాడికి మంచి భవిష్యత్ ఉందని అనుకున్నారు. ఎందుకంటే భారత్‌లో కుస్తీ ఆట మంచి ఊపు మీద ఉంది. అందులోనూ అంతర్జాతీయ రెజ్లర్‌గా మంచి పేరున్న భజరంగ్ పునియాను ఒకటికి రెండుసార్లు ఓడించి దేవి అందరి దృష్టిలో పడ్డాడు. 2012 లండన్ ఒలింపిక్స్ కోసం జరిగిన రెజ్లింగ్ శిబిరంలోనూ... అమెరికాలోని కొలరాడోలో జరిగిన శిక్షణ శిబిరంలోనూ అతను పాల్గొన్నాడు. కానీ ఆర్థిక పరిస్థితి.. వసతుల లేమి.. రెజ్లింగ్ సంఘంలో రాజకీయాలు, స్థానికంగా ప్రోత్సాహం లేకపోవడం లాంటి కారణాలు అతణ్ని ఎదగనివ్వలేదు. పోటీలకు వెళ్లేందుకు డబ్బులు కూడా లేక.. చేసిన అప్పులు తీర్చుకోలేక కుస్తీ పక్కనపెట్టేశాడు. కుటుంబ పోషణ కోసం విగ్రహాలకు రంగులు వేయడం ప్రారంభించాడు. జాతీయ స్థాయి రెజ్లర్ అయిన అతని తమ్ముడు కిషన్ కూడా అన్న బాటే పట్టాడు. వినాయక చవితి లాంటి పెద్ద పండగలు వస్తేనే వాళ్లకు డబ్బులు వస్తాయి.

ఒలింపిక్స్ కల నెరవేరేనా!

ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాలనేది దేవి కల. ఆ అవకాశం 2012లో చేతికి అందినట్లే అంది చేజారిపోయింది. ఆర్థిక ఇబ్బందులు భరించలేక తర్వాత



హైదరాబాద్‌కు వచ్చేసి పెయింటర్‌గా స్థిరపడిపోయినా ఇప్పటికీ ఆశ పోలేదు. ఎవరైనా తనను ఆదుకోకపోతారా.. మళ్లీ అంతర్జాతీయ స్థాయి పోటీలకు వెళ్లకపోతానా అని! 2020 టోక్యో ఒలింపిక్స్ ట్రయల్స్‌కు ఇంకా సమయం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వం ఆదుకుంటే కచ్చితంగా మళ్లీ గాడిలో పడతానని.. ఒలింపిక్స్‌లో పతకం కోసం పోరాడతానని దేవీ అంటున్నాడు. అతను అంతర్జాతీయ పతకాలు సాధించినపుడు ఆదుకుంటాం అని చెప్పిన అధికారులు, నాయకులెవరూ ఇప్పుడు పట్టించుకోవట్లేదు. తనకు ఆర్థికంగా మద్దతు ఇస్తే కచ్చితంగా రాణిస్తానని అతను చెబుతున్నాడు.

ప్రపంచ క్యాడెట్ ఛాంపియన్‌షిప్‌లో పతకం సాధించినప్పుడు కంటే ఆసియా ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం గెలిచినప్పుడే చాలా ఆనందంగా అనిపించింది. ఎందుకంటే పతకం స్వీకరించేటప్పుడు జనగణమన ఆలపించారు. ఆర్థిక ఇబ్బందులతో మళ్లీ ఎప్పుడూ ఆ అవకాశాన్ని పొందలేకపోయాను. ఒలింపిక్స్‌లో పాల్గొనడం పెద్ద కల. ఇప్పుడు నాకు 24 ఏళ్లే. ఫిట్‌గా ఉన్నాను. జాతీయ స్థాయికి వెళ్లే స్థోమత లేక పెయింటర్‌గా బతుకుతున్నా. మా కోసం నాన్న బియ్యం మూటలు ఎత్తడం.. రోడ్డు మీద అమ్మ కూరగాయలు అమ్మడం ఇంకా మరిచిపోలేదు. అందుకే ఎంత కష్టమైనా రెజ్లింగ్‌లో కొనసాగాను. కానీ నా వల్ల కాక వదిలేశాను. కామన్వెల్త్, ఆసియా క్రీడలకు ట్రయల్స్‌లో పాల్గొనే అవకాశం లేదు. ఐతే 2020 ఒలింపిక్స్‌కు వెళ్లాలనే కోరిక ఉంది. దానికి ముందు ట్రయల్స్‌లో సత్తా చాటాలి. అంతర్జాతీయ పతకాలు సాధించినా ప్రభుత్వం తరపున ఎలాంటి సాయం లేదు. ఆదుకుంటే పతకాలు తెచ్చే సత్తా నాలో ఇంకా ఉంది. నాలాంటి రెజ్లర్లు ధూల్‌పేటలో చాలామంది ఉన్నారు. వారికి ఉపకార వేతనాలు ఇచ్చి ప్రోత్సహించాలి. అకాడాల నిర్మాణానికి, వసతుల కల్పనకు సాయం చేయాలి”

- దేవీసింగ్

దేవి ఘనతలు

- ఆసియా క్యాడెట్ ఛాంపియన్‌షిప్, (బ్యాంకాక్) స్వర్ణం
- ప్రపంచ క్యాడెట్ ఛాంపియన్‌షిప్ (హంగేరి) కాంస్యం
- జూనియర్ ఆసియా ఛాంపియన్‌షిప్ (కజకిస్థాన్) కాంస్యం
- అంతర్జాతీయ రెజ్లింగ్ పోటీల్లో తెలుగు రాష్ట్రాల నుంచి పతకం గెలిచిన తొలి ఆటగాడు
- జాతీయ జూనియర్, సీనియర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లలో 50కి పైగా పతకాలు



బైక్‌లు అమ్మేసి..

పాతబస్తీలో రెజ్లింగ్ పోటీలు జరిగితే అక్కడో పెద్ద పండగ వాతావరణం. ఎక్కడెక్కడి నుంచో పహిల్వాన్‌లు పోటీలకు వస్తుంటారు. కేసరి టైటిళ్లు సాధించిన వాళ్లకు ద్విచక్ర వాహనాలు బహుమతిగా ఇస్తుంటారు. ఇలాంటి పోటీల్లో గెలవడంలో దేవి దిట్ట. ఏకంగా ఎనిమిది బైక్‌లు సంపాదించాడతను. అయితే ఆ బైక్‌లు గెలిచింది సరదాగా ధూల్‌పేటలో షికారు కొట్టేందుకు కాదు. అక్కాచెల్లెళ్ల పెళ్లిళ్లు చేయడానికి. అందుకోసం గాయాలతోనూ పోటీల్లో పాల్గొన్న రోజులున్నాయి. వచ్చిన బైకులన్నింటినీ అమ్మేసి సోదరిల పెళ్లిళ్లు చేశాడు. తన కోసం తల్లిదండ్రులు చేసిన అప్పులు తీర్చాడు. జాతీయ, అంతర్జాతీయ పోటీలకు వెళ్లే స్థోమత లేక ధూల్‌పేటకే పరిమితం అయిపోయిన దేవి.. రెజ్లింగ్ మీద మమకారం చంపుకోలేక తన విద్యను యువ రెజ్లర్లకు పంచుతున్నాడు. ఇప్పటికే అతను దాదాపు 200 మంది రెజ్లర్లను తయారు చేశాడు. వారిలో గబ్బర్, చందన్‌సింగ్ జాతీయ స్థాయిలో పతకాలు సాధించారు.

– దాస్యం వెంకట వంశీకృష్ణ


పెద్ద కుటుంబం...
ఉన్నత చదువు...
ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ...
వైద్య రంగంలో సేవలు...
ఇవన్నీ ఇచ్చిన సంతృప్తి ఒకెత్తైతే...
తను రేసర్‌గా పొందే కిక్ ఒకెత్తు!
అందుకే దేశంలో అత్యంత వేగవంతమైన డ్రైవర్‌గా మారాడు..
మోటార్ స్పోర్ట్స్‌లో తిరుగులేని క్రీడాకారుడయ్యాడు...
2017 సంవత్సరానికి గాను ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఎస్‌సీఐ) ‘జాతీయ మోటార్ స్పోర్ట్స్ పర్సన్ ఆఫ్ ది ఇయర్’ అవార్డు అందుకున్నాడు. మోటార్ స్పోర్ట్స్‌లో సంచలనాలు సృష్టిస్తున్న ఆ యువ రేసర్..
కొండా అనింధిత్‌రెడ్డి

స్పీడున్నోడు

మాజీ ఉప ముఖ్యమంత్రి కొండా వెంకట రంగారెడ్డి ముని మనవడు... అపోలో గ్రూపు సంస్థల ఛైర్మన్ ప్రతాప్ సి. రెడ్డి మనవడు... ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అపోలో డైరెక్టర్ సునీతారెడ్డిల కుమారుడు... ఇంత పెద్ద కుటుంబ నేపథ్యం ఉందన్న విషయం ఎక్కడా చెప్పుకోలేదు అనింధిత్. అతను మోటార్ స్పోర్ట్స్ రేసర్ అన్న సంగతి కూడా చాలా మందికి తెలియదు. అలా చెప్పుకోవడం అతనికి ఇష్టముండదు. తనకంటూ వ్యక్తిగతంగా గుర్తింపు రావాలన్నదే అతని తపన. నిరుడు ఎంఆర్ఎఫ్ ఎఫ్ఎఫ్ 1600, యూరో జేకే 17 జాతీయ రేసింగ్ ఛాంపియన్‌షిప్‌లలో అనింధిత్ విజేతగా నిలిచాడు. దేశంలో ఒకే సీజన్‌లో 2 టైటిళ్లు గెలిచిన తొలి ఆటగాడిగా రికార్డు సృష్టించాడీ హైదరాబాదీ. అందుకే ఉత్తమ క్రీడాకారుడి అవార్డు అతడిని వరించింది. 2014లో రేసింగ్ మొదలుపెట్టిన అనింధిత్ మొత్తం 5 ఛాంపియన్‌షిప్‌లు గెల్చుకున్నాడు. గత ఏడాది 33 రేసుల్లో 20 మార్లు పోడియం ఫినిష్ చేయడం విశేషం. ప్రతిష్ఠాత్మక వెంటో కప్‌లో గెస్ట్ రేసర్‌గానూ పాల్గొని ప్రతిభ కనబరిచాడు. ఇప్పుడు అతని దృష్టి అంతర్జాతీయ స్థాయికి మళ్లింది. వచ్చే సీజన్‌లో ఆసియా స్థాయిలో బరిలో దిగాలని భావిస్తున్నాడు. ప్రస్తుతం ఫార్ములా-3, ఫార్ములా- 4 కార్లు నడిపిస్తున్న అనింధిత్.. రానున్న సీజన్‌లో జీటీ3, జీటీ4 కార్లు డ్రైవ్ చేయాలని ఉవ్విళ్లూరుతున్నాడు. ఐరోపాలో బాగా ప్రాచుర్యంలో ఉన్న జీటీ3, జీటీ4తో కెరీర్ సుదీర్ఘంగా కొనసాగించొచ్చన్నది 28 ఏళ్ళ అనింధిత్ అభిప్రాయం.



రేసింగ్‌పై ఉన్న ఇష్టంతోనే ఆటోమొబైల్ ఇంజినీరింగ్ కోర్సు చదివా. 2014 నుంచి ప్రొఫెషనల్ రేసింగ్ చేస్తున్నా. ఎలాంటి శిక్షణ తీసుకోలేదు. హాబీగా మొదలుపెట్టి ఇలా గుర్తింపు సాధించా. నేను చేసే రేసింగ్‌ను ఎఫ్3, ఎఫ్4 అంటారు. దేశంలో కోయంబత్తూరు, చెన్నై, దిల్లీలో మాత్రమే రేసింగ్ ట్రాక్‌లు ఉన్నాయి. మిగతా క్రీడల్లా రేసింగ్‌లో ప్రాక్టీస్ ఎక్కువగా ఉండదు. ట్రాక్‌లు లేవు కాబట్టి. ఈవెంట్‌కు రెండ్రోజుల ముందువెళ్లి సాధన చేసుకోవాలి. మిగతా సమయమంతా ఫిట్‌నెస్. చేస్తా. రేసింగ్ ప్రమాదాల నుంచి బయటపడేందుకు హెల్మెట్, గార్డ్స్ అన్నీ పక్కాగా ఉంటున్నాయి. దీంతో రేసింగ్ సురక్షితంగా మారాయి. రేస్‌లో మన రక్షణ, ఎదుటి వాళ్ళ రక్షణ చాలా ముఖ్యం. రేసింగ్‌లోనే వేగం థ్రిల్‌గా అనిపిస్తుంది. కానీ, మన రోడ్ల మీదకి వచ్చేసరికి బాధ్యతగా నడుపుతా. విదేశాల్లో రేసులకు వెళితే 6 వారాంతాల్లో 14 రేసులు ఉంటాయి. నిరుడు 11 వారాల్లో 33 రేసుల్లో పాల్గొన్నా. మిగతా సమయమంతా వ్యాపారంలో మునిగిపోతా. ఆఫీసు కార్యకలాపాలకే ప్రాధాన్యం. ఈ మధ్య మన దగ్గర రేసింగ్ సంస్కృతి పెరుగుతోంది. భవిష్యత్తులో రేసింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నా. తెలంగాణతో మొదలుపెట్టి దేశవ్యాప్తంగా ట్రాక్‌లు నిర్మించాలన్నది లక్ష్యం.



‘ఎఫ్’ ఫర్...

రేసింగ్ ప్రపంచంలో ఎఫ్1 అత్యున్నతమైనది. ఎఫ్4, ఎఫ్3, ఎఫ్2 నుంచి ఎఫ్1కు వెళ్ళాలి. ఇంజిన్ కెపాసిటీ ఒక్కటే. స్పీడ్ భిన్నం. ఎఫ్1లో గంటలకు 325 కిమీ వేగంతో వెళ్తారు. ఎఫ్3, ఎఫ్4లో 200 కిమీ వేగంతో రేసింగ్ చేస్తారు. ఈ కార్లు ఎక్కువ స్పీడ్‌ను తీసుకోలేవు.

తక్కువ వయసుకే ప్రాధాన్యం...

5 నుంచి ఏడేళ్ళ వయసులో రేసింగ్ ఆరంభించాలి. ఎంత చిన్న వయసులో మొదలుపెడితే అంత మంచి భవిష్యత్తు ఉంటుంది. 19 ఏళ్ళ లోపు ఎఫ్3లో ఛాంపియన్ అవ్వాలి. అప్పుడే ఎఫ్1కు వెళ్ళే అవకాశముంటుంది. కొత్త డ్రైవర్‌పై పెట్టుబడి పెట్టాలనుకునే ఎఫ్1 జట్టు తక్కువ వయసున్న డ్రైవర్లను ఎంచుకుంటుంది.

ఈనాడు సినిమా


మహేష్‌బాబు

బెజవాడలో... భరత్ స్వరాలు?

మహేష్‌బాబు కథానాయకుడిగా నటించిన చిత్రం 'భరత్ అనే నేను'. కొరటాల శివ దర్శకుడు. డివివి దానయ్య నిర్మాత. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. గురువారంతో టాకీ మొత్తం పూర్తయింది. ఓ పాట మాత్రమే మిగిలి ఉంది. ఈనెల 26 నుంచి స్పెయిన్‌లో ఆ గీతాన్ని చిత్రీకరిస్తారు. ఏప్రిల్ 7న విజయవాడలో పాటల్ని విడుదల చేస్తారని సమాచారం. ఈ చిత్రంలో మహేష్ ముఖ్యమంత్రిగా కనిపించబోతున్నారు. కథకు, కథానాయకుడి పాత్రకూ తగినట్టు... ఆడియో వేడుక దగ్గర అసెంబ్లీని పోలిన ఓ సెట్ వేయాలని చిత్రబృందం భావిస్తోంది. ఇటీవల 'భరత్..' టీజర్‌ని విడుదల చేశారు. 'ఒక్కసారి ప్రామిస్ చేసి ఆ మాట తప్పితే యూ ఆర్ నాట్ కాల్డ్ ఏ మేన్' అనే డైలాగ్‌తో విడుదలైన టీజర్ అభిమానులకు చేరువైంది. ఏప్రిల్ 20న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

రాజుగాడి అల్లరి


రాజ్‌తరుణ్, రాజేంద్రప్రసాద్, అమైరా దస్తూర్

రాజ్‌తరుణ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'రాజుగాడు'. సంజనారెడ్డి దర్శకురాలిగా పరిచయమవుతోంది. అమైరా దస్తూర్ కథానాయిక. రామబ్రహ్మం సుంకర నిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు తుది దశకు చేరుకున్నాయి. మే 11న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. నిర్మాత మాట్లాడుతూ "ఓ విచిత్రమైన జబ్బుతో బాధపడే యువకుడి కథ ఇది. అవసరం లేకపోయినా, తనకు తెలియకుండానే దొంగతనాలు చేసేస్తుంటాడు. దాని ద్వారా పుట్టే వినోదం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణ. రాజ్‌తరుణ్‌తో మా సంస్థలో తెరకెక్కించిన నాలుగో చిత్రమిది. రాజేంద్ర ప్రసాద్ నటన మరోసారి అలరిస్తుంది. టీజర్‌కి మంచి స్పందన వస్తోంద"న్నారు. నాగినీడు, రావురమేష్, సిజ్జు, పృథ్వీ, కృష్ణభగవాన్ తదితరులు నటించారు. సంగీతం: గోపీ సుందర్

పంచ్ డైలాగ్

మీడియా పబ్లిక్ కోసం పనిచేయాలి కానీ పబ్లిసిటీ కోసం కాదు.
చిత్రం: నాయక్
– పంపినవారు: కె.రాఘవేంద్ర, గుంటూరు


రిషి కపూర్, అమితాబ్ బచ్చన్

తండ్రి కూల్ కొడుకు ఓల్డ్ స్కూల్

సెంచరీ దాటేసిన తండ్రేమో కుర్రాడిలా చెలరేగిపోతుంటాడు. అతని కొడుకేమో నీరసంగా.. నిరుత్సాహంగా ఉంటాడు. తండ్రే కొడుక్కి సేవలు చేయాల్సిన పరిస్థితి. ఆ వందేళ్ల యువకుడి కథేంటో తెలియాంటే '102 నాట్ అవుట్' చూడాల్సిందే. 102 ఏళ్ల వయసున్న తండ్రి పాత్రలో అమితాబ్ బచ్చన్, 75 ఏళ్ల అతని కొడుకుగా రిషి కపూర్ నటిస్తున్న చిత్రమిది. 27 సంవత్సరాల తర్వాత ఈ ఇద్దరూ కలిసి నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పంచుకొన్నారు అమితాబ్. "బాప్ కూల్...బేటా ఓల్డ్ స్కూల్' అని రాశారు అమితాబ్. మే 4న ఈ చిత్రం విడుదలకానుంది.

కథానాయికల మధ్య 'నువ్వా నేనా' అన్నట్టుంది పోటీ. ఒకరికి దీటుగా మరొకరు కనిపిస్తున్నారు. ఇదివరకు దర్శక నిర్మాతలు తమ సినిమాలకి తగ్గ జోడీని వెదుక్కోవడాన్ని ఓ పెద్ద ప్రహసనంగా భావించేవాళ్లు. స్టార్ భామల కాల్షీట్ల కోసం ఎప్పట్నుంచో వెంటపడితే కానీ దొరికేవి కాదు. సినిమాలన్నీ నలుగురైదుగురు కథానాయికల చుట్టూనే తిరుగుతున్నట్టు అనిపించేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. కథానాయికలు చాలామందే కనిపిస్తున్నారు. ప్రాంతీయ సినిమాకీ, జాతీయ సినిమాకీ మధ్య హద్దులు చెరిగిపోవడంతో బాలీవుడ్ భామలు కూడా ఏ మాత్రం బెట్టు చేయకుండా తెలుగులో నటించేందుకు ముందుకొస్తున్నారు. ఈ దశలో వరుసగా అవకాశాల్ని ఒడిసిపట్టి కాల్షీట్ల డైరీని భర్తీ చేసుకోవడమంటే ఆషామాషీ విషయం కాదు. కానీ కొద్దిమంది కథానాయికలు ఇంత పోటీలోనూ రెండు మూడు చిత్రాల్లో నటిస్తూ బిజీగా గడుపుతున్నారు.



ఆటా మాదే వేటా మాదే!

కథానాయికల విషయంలో ఇదివరకు ప్రత్యామ్నాయం అస్సలు కనిపించేది కాదు. స్టార్ కథానాయకుల సరసన నటించడానికైతే చాలా తక్కువమంది కనిపించేవాళ్లు. కానీ ఇప్పుడు అలా కాదు. ఒకరు కాదంటే, మరొకరు. అందుకు కారణాలు చాలానే ఉన్నాయి. కొత్త తరం దూసుకొస్తోంది. వచ్చీ రాగానే భాషపై పట్టు పెంచుకొని కథలు, పాత్రలకి తాము న్యాయం చేయగలమని దర్శకులకి భరోసా ఇస్తున్నారు. మరోపక్క సీనియర్ భామలు తమ పట్టుని కోల్పోకుండా, తమ అనుభవానికి తగ్గట్టుగా కథల్ని ఎంచుకొంటూ విజయాలు అందుకొంటున్నారు. అభినయం ప్రదర్శించడంతో పాటు, అందాన్నీ కాపాడుకొని కొత్తభామలకి దీటుగా కనిపిస్తున్నారు. దాంతో మన చిత్రసీమలో కథానాయికల సంఖ్య కాస్త ఎక్కువగానే కనిపిస్తోంది. అది దర్శకనిర్మాతలకి ఓ వరంగా మారింది. అయితే కథానాయికల్లో మాత్రం పోటీ బలంగా పెరిగినట్టైంది. ఇదివరకు కొత్త అవకాశాలతో అలవోకగా డైరీ నిండిపోయేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రతి అవకాశాన్నీ ఒడిసి పట్టాల్సిందే. అన్ని ప్రయత్నాలు చేసినా కాల్షీట్లు ఇంకా ఖాళీగానే కనిపిస్తున్నాయి. చాలామంది పొరుగు భాషలపై కూడా కన్నేస్తూ తమ మార్కెట్‌ని విస్తరించుకొనే ప్రయత్నంలో ఉన్నారు. అయితే ఇంత పోటీలోనూ కొద్దిమంది భామలు తమ సత్తా చాటే ప్రయత్నం చేస్తున్నారు. సమంత, పూజా హెగ్డే, అను ఇమ్మాన్యుయేల్, అనుపమ పరమేశ్వరన్ డైరీ కొత్త సినిమాలతో కళకళలాడుతోంది.



పూజా హవా

'ముకుంద'తో తెలుగు తెరకు పరిచయమైన కథానాయిక పూజా హెగ్డే. ఆ తర్వాత నాగచైతన్యతో కలిసి 'ఒక లైలా కోసం' చిత్రంలో నటించింది. ఆ వెంటనే హృతిక్ రోషన్ చిత్రం 'మొహంజొదారో'లో నటించే అవకాశం రావడంతో అటువైపు వెళ్లింది. ఆ తర్వాత కూడా ఆమెకి హిందీలో అవకాశాలు తలుపు తడుతున్నప్పటికీ, 'డీజే' కోసం తెలుగుకి తిరిగొచ్చింది. అందులో అల్లు అర్జున్ సరసన ఆమె సందడి చేసిన విధానం ప్రేక్షకులకే కాదు, పరిశ్రమని కూడా ఆకట్టుకుంది. దాంతో పూజ కోసం దర్శకనిర్మాతలు క్యూ కట్టేశారు. ప్రస్తుతం బెల్లంకొండ శ్రీనివాస్‌తో 'సాక్ష్యం'లో నటిస్తున్న ఆమె తదుపరి ఎన్టీఆర్ - త్రివిక్రమ్ సినిమాలోనూ, మహేష్ - వంశీ పైడిపల్లి చిత్రాల కోసం సంతకం చేసింది. త్వరలోనే 'రంగస్థలం'లో ఓ ప్రత్యేక గీతంతో సందడి చేయబోతోంది. వరుసగా స్టార్ కథానాయకుల చిత్రాల్లో అవకాశాలు సొంతం చేసుకొంటున్న ఆమె తెలుగులో జెండా బలంగా పాతేసినట్టే.

సమంత 'సై'

ఎంత పోటీ నెలకొన్నా వెనక్కి తగ్గేదే లేదంటోంది సమంత. మామూలుగా అయితే పెళ్లయ్యాక కథానాయికల కెరీర్ అంత ఆశాజనకంగా ముందుకు సాగదు. కానీ సమంత విషయంలో మాత్రం భిన్నం. పెళ్లయ్యాక కూడా ఆమె వరుసగా అవకాశాల్ని అందుకొంటోంది. త్వరలోనే 'రంగస్థలం'లో రామలక్ష్మిగా సందడి చేయబోతున్న ఆమె, 'మహానటి'తో పాటు, 'యు టర్న్' చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ రెండూ కూడా తెలుగు, తమిళ భాషల్లో విడుదల కాబోతున్నాయి. కొంతకాలంగా విభిన్నమైన కథలు, ప్రాధాన్యమున్న పాత్రలే లక్ష్యంగా సినిమాలు చేస్తున్న ఆమె ఎక్కడ సంతృప్తికరమైన పాత్రలొస్తే అక్కడ నటిస్తున్నారు.


అనుపమ పరమేశ్వరన్


అను ఇమ్మాన్యుయేల్

అను + అను

కేరళ భామలు అను ఇమ్మాన్యుయేల్, అనుపమ పరమేశ్వరన్‌లు కూడా అవకాశాల విషయంలో ముందంజలో ఉన్నారు. అల్లు అర్జున్‌తో కలిసి 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'లో, నాగచైతన్యతో కలిసి 'శైలజారెడ్డి అల్లుడు'లో నటిస్తున్న అను ఇమ్మాన్యుయేల్, ఈ మధ్యే ప్రారంభమైన రవితేజ 'అమర్ అక్బర్ ఆంటోనీ'లోనూ నటించేందుకు పచ్చజెండా ఊపేసింది. అనుపమ పరమేశ్వరన్ ఇప్పుడిప్పుడే గేరు మార్చింది. నానితో కలిసి 'కృష్ణార్జునయుద్ధం'తో పాటు, సాయిధరమ్ తేజ్ కథానాయకుడిగా కరుణాకరన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మరో చిత్రంలో నటిస్తున్న ఆమె, ఇటీవలే ప్రారంభమైన రామ్ 'హలో ప్రేమ గురూ'లోనూ నటిస్తున్నారు. శ్రద్ధాకపూర్, కైరా అడ్వానీ, నిధి అగర్వాల్, మాళవిక శర్మ... ఇలా పలువురు బాలీవుడ్ భామలు ప్రస్తుతం తెలుగులో నటిస్తున్నారు. వీళ్లకి తోడు బోలెడు మంది దక్షిణాది కథానాయికలు అవకాశాల కోసం పోటీ పడుతున్న సమయంలోనూ పూజ హెగ్డే, సమంత, అనుపమ పరమేశ్వరన్, అను ఇమ్మాన్యుయేల్‌ల కాల్షీట్లు కళకళలాడుతుండడం విశేషం. కథానాయికల మధ్య పోటీ పెరగడం దర్శకనిర్మాతలకి కలిసొస్తోంది. పారితోషికం విషయంలోనూ, కాల్షీట్ల విషయంలోనూ కాస్త వెసులుబాటు లభిస్తోంది.

గీతోపదేశం

మనసులో నీవైన భావాలే
బయట కనిపిస్తాయి దృశ్యాలై
నీడలు నిజాల సాక్ష్యాలే
శత్రువులు నీలోని లోపాలే
స్నేహితులు నీకున్న ఇష్టాలే
రుతువులు నీ భావ చిత్రాలే
గీతం: **ఎంత వరకు ఎందుకొరకు...**
చిత్రం: గమ్యం
రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి
– పంపినవారు: టి.ప్రవేశ్, తెనాలి


అక్షిత, మనీష్‌బాబు

ప్రశ్నించే కుర్రాడు

మనీష్‌బాబు కథానాయకుడిగా పరిచయం అవుతున్న చిత్రం 'ప్రశ్నిస్తా'. అక్షిత కథానాయిక. రాజా వన్నెంరెడ్డి దర్శకుడు. సత్యరెడ్డి నిర్మాత. హైదరాబాద్‌లో లాంఛనంగా ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు బాబి క్లాప్‌నిచ్చారు. అనంతరం నిర్మాత మాట్లాడుతూ "ఈ చిత్రంతో మా అబ్బాయిని కథానాయకగా పరిచయం చేస్తున్నా. రెండేళ్లుగా మనీష్ నటన, నృత్యంలో శిక్షణ తీసుకుంటున్నాడు. కథానాయిక అక్షిత మన తెలుగమ్మాయే. దివ్యభారతిలా తాను మంచి పేరు తెచ్చుకుంటుంద"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రశ్నించే గుణం ఉన్న కుర్రాడి కథ ఇది. ఇన్నేళ్ల తరవాత కూడా ఇది నా తొలి సినిమాలానే అనిపిస్తోంది. మనీష్‌కి మంచి పేరు తీసుకొచ్చే చిత్రం అవుతుంద"న్నారు. ఎల్.ఎం.ప్రేమ్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: యోగిరెడ్డి.

వసుంధర

అది 1980ల నాటి గోదావరి తీరంలోని పల్లె. ఏ వీధి చూసినా పెంకుటిళ్లూ, పచ్చని కొబ్బరిచెట్లూ, ముంగిట్లో అందమైన ముగ్గులతో ఆ పల్లె ఆకట్టుకుంటుంది. పేరుకే అది ఊరు కానీ అక్కడెవరూ ఉండరు. అదేంటీ అంటారా.. అవును మరి ఆ గ్రామం పేరు రంగస్థలం. ఆ సినిమా కోసం మౌనికా రామకృష్ణ సబ్బాని జూబ్లీహిల్స్‌లో వేసిన సెట్టింగు అది. అదొక్కటే కాదు... 'అందాల రాక్షసి', 'సాహసం', 'సుబ్రమణ్యం ఫర్ సేల్'... ఎలా ఎన్నో సూపర్‌హిట్ చిత్రాలకు పనిచేసి అవార్డులూ.. అంతకు మించి ప్రశంసలెన్నో అందుకుంది. అంతేనా ఎన్టీఆర్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రానికి 1920ల నాటి వాతావరణాన్ని సృష్టిస్తున్న ఆమె తమ గురించి ఏం చెబుతోందంటే...



"నందమూరి తారక రామారావు పేరుచెబితే గర్వించని తెలుగువారుండరు. అంత గొప్ప వ్యక్తి జీవిత గాథ కోసం పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాం. దర్శకుడు మాకు ఆ విషయం చెప్పగానే ఆ మహానుభావుడి గురించి ఇంకా తెలియని విషయాలు తెలుసుకోవడం మొదలుపెట్టాం. ఈ చిత్రంలో ఆయన పుట్టక ముందు నుంచీ చూపిస్తారు. 1920ల్లో వాతావరణం ఎలా ఉంటుందో తెలుసుకోవడం మొదలుపెట్టాం. పుస్తకాలూ, పత్రికలూ, ఆయన చిత్రాలు సేకరిస్తున్నాం. ఇప్పటికే సెట్ నిర్మాణం ప్రారంభమైంది. త్వరలోనే చిత్రీకరణ కూడా మొదలు కాబోతోంది. దీంతోపాటు 'సవ్యసాచి', వరుణ్ తేజ్ సినిమాలు చేస్తున్నాం."

• • • • •

"మేం ఒక సినిమాకి పనిచేస్తే పలు చిత్రాలకు అవకాశాలు వస్తుంటాయి. అలాగని మేం వచ్చిన ప్రతి సినిమాకీ పని చేయాలనుకోం. నాణ్యతతో కూడిన తుది ఫలితాన్ని అందించాలనే ఉద్దేశంతో సమయం వెసులుబాటు చూసుకుంటాం. అందుకే 'నాన్నకు ప్రేమతో' వంటి భారీ బడ్జెట్ సినిమా వచ్చినా వదులుకున్నాం. అయినా ఆ దర్శకుడు 'రంగస్థలం' సినిమా బాధ్యతలను మా మీదే పెట్టారు"

"జీవిత భాగస్వామిగా భార్యాభర్తలు ఒకింట్లో నెగ్గడం ఈ రోజుల్లో కాస్త కష్టమే. అలాంటిది పని వాతావరణంలోనూ మేం భాగస్వాములుగా నెగ్గుతున్నాం. నిజంగా మాకు ఇది సవాలే. ఒక ప్రాజెక్టు రాగానే ఇద్దరం వింటాం. కాసేపటికి వేరువేరుగా ఓ ప్రణాళిక వేసుకుని కొన్ని డ్రాయింగులు గీసుకుంటాం. ఆ తరవాత ఎవరి ఆలోచనలు ఏంటి అనేది చర్చించుకుంటాం. ఇద్దరి ఆలోచనల్లో ఏది బాగుంటే దానికి అనుగుణంగా సెట్టింగుల నిర్మాణం మొదలుపెడతాం. కలిసి పనిచేస్తూ.. సహాయకులతో చేయించుకుంటాం. ముఖ్యంగా మధు, కిరణ్ అనే సహాయకులు ఎప్పుడూ నాకు అండగా ఉంటారు "



రంగస్థలం C/o జూబ్లీహిల్స్





తెలుగు చిత్ర పరిశ్రమలో స్వతంత్ర కళాదర్శకురాలిగా గుర్తింపు కార్డు అందుకున్న తొలి మహిళ మౌనిక. ఆమె ఈ రంగంలోకి రావడానికి చిన్నతనం నుంచీ చూసిన సినిమాలే కారణం అంటుంది. 'అవును.. నాకు చిన్నతనం నుంచీ సినిమాలంటే ఇష్టం. అందుకే పుట్టి పెరిగిన దిల్లీ నుంచి పుణె వెళ్లా. అక్కడ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో ప్రొడక్షన్ డిజైనింగ్ అండ్ ఆర్ట్ డైరక్షన్‌లో శిక్షణ తీసుకున్నా. అక్కడే నాకు మావారు రామకృష్ణ పరిచయం అయ్యారు. కొన్నాళ్లకి మా స్నేహం ప్రేమగా మారి వ్యక్తిగత, వృత్తిగత జీవితంలో భాగస్వాములమయ్యాం.

తొలి చిత్రానికి నంది: మా గురించి వ్యక్తిగతంగా చెప్పుకోవడానికి ఇంతకు మించి లేకపోవచ్చు కానీ వృత్తిగతంగా చాలా ఉంది. ఇద్దరం కలిసి ఇప్పటి వరకూ ఇరవైకిపైగా సినిమాలకు పని చేశాం. దీనికంటే ముందు మేం పుణెలో శిక్షణ పూర్తి చేసుకుని ముంబయి వెళ్లాం. అక్కడ కళాదర్శకులు సాబుసిరిల్, సమీర్ చంద్ర వద్ద సహాయకులుగా చేరి రెండు చిత్రాలకి పనిచేశాం. అదే సమయంలో కొన్ని వాణిజ్య ప్రకటనలూ చేస్తుండే వాళ్లం. ఇంతలో దర్శకుడు హను 'అందాల రాక్షసి'కి పని చేయమన్నారు. ఇందులో నవీన్ చంద్ర మొరటు స్వభావమున్న పాత్ర. కానీ అతను చిత్రాలు గీస్తూ.. స్క్రాప్‌తో కళాకృతులు వేస్తుంటాడు. అవన్నీ చేసింది మేమే. అందులోనే షెడ్డూ, సీసాలతో లావణ్య త్రిపాఠి బొమ్మ మేం చేసిందే. అదే మేం స్వతంత్రంగా చేసిన మొదటి సినిమా. దానికి నంది అవార్డునూ అందుకున్నాం.

ఆ వీడియోలు చూశాం: తరువాత 'సాహసం' సినిమా చేసే అవకాశం వచ్చింది. పాకిస్థాన్ నేపథ్యంలో తీసిన చిత్రమది. పాక్ గ్రామాన్ని లద్ధాక్‌లో సెట్ వేశాం. ఈ సినిమాలో మెట్ల బావీ, గదులూ.. ప్రధానంగా ప్రేక్షకుల్ని ఆకర్షిస్తాయి. వాటిని రామోజీఫిలింసిటీలో కట్టాం. ఆ సమయంలో రామోజీరావు సర్ మా సెట్ చూడ్డానికి వచ్చి... అభినందించారు. ఈ చిత్రం కోసం బెలూచిస్థాన్, లాహోర్‌లోని పల్లెటూళ్లూ, వాళ్లు వాడే వస్తువులు... ఇలా అన్నింటి గురించి తెలుసుకున్నాం. మానవబాంబుని ఎలా తయారు చేస్తారో తెలుసుకోడానికి చాలా వీడియోలు చూడాల్సి వచ్చింది. అందులో బాంబు పేలుళ్లు చూసి మనసు కల్లోలమైపోతుండేది. కొన్ని సార్లు నిద్ర కూడా పట్టేది కాదు.

నాని అలా అన్నారు: 'జ్యో అచ్యుతానంద' చిత్రం చూసినవారు ఇందులో సెట్టింగ్స్ ఏం ఉన్నాయని ఆశ్చర్యపోతున్నారు. నిజానికి కళాదర్శకులకి అదే పెద్ద ప్రశంస. 'అరే ఆ సెట్ నిజంగానే ఇల్లు అనుకున్నాం' అని చెప్పినప్పుడు సంతోషంగా అనిపిస్తుంది. ఈ చిత్రంలో హీరోల ఇంటిని ఓ కొండ మీద సెట్‌గా వేశాం. మధ్య తరగతి వాళ్ల ఇల్లు.. వారు వాడే వస్తువులు ఇలా అన్నీ పక్కాగా ఆలోచించాం. నిజానికి నాకూ, మావారికి పల్లెటూరి నేపథ్యం లేదు. కానీ హైదరాబాద్‌లోని కొన్ని ప్రాంతాల్లో 70, 80ల నాటి ఇళ్లు గమనించి ఆ అంచనాలతో సెట్ వేశాం. అదీ నలభై ఐదు రోజుల్లో పూర్తి చేశాం. తీరా పూర్తయ్యాక హైదరాబాద్‌లో పెద్ద గాలీ, వానా. తెల్లవారాక మా సహాయకుడు వెళ్లి ఆ సెట్‌ని చూసి ఏడుస్తూ ఫోన్ చేశాడు. ఆ రోజు నగరంలో ఎన్నో చెట్లూ, హోర్డింగులూ కూలిపోయాయి. అదృష్టం ఏంటంటే... మేం సెట్‌ని కాస్త దృఢంగానే వేయడంతో అద్దాలూ, తలుపులు మాత్రమే పగిలిపోయాయి. దాంతో నీళ్లు లోపలికి వెళ్లిపోయాయి. ఓ నలభై శాతం మళ్లీ కొన్ని మార్పులు చేయాల్సి వచ్చింది. అంత కష్టపడ్డాం కాబట్టే ఆ సినిమా పూర్తి అయ్యాక చాలామంది 'ఆ ఇల్లు ఎక్కడ ఉంది.. మేం చిత్రీకరణ చేసుకుంటాం' అని అడిగారు. నటుడు నాని 'మా అమ్మమ్మగారి ఇల్లు అచ్చం అలానే ఉంటుంది' అన్నారు. ఇక, 'సుబ్రమణ్యం ఫర్ సేల్'లో హీరో పనిచేసే రెస్టారంట్ బయట ప్రదేశాన్ని విదేశాల్లో, గదుల లోపలి సెట్‌నేమో హైదరాబాద్‌లో వేశాం. ఇవన్నీ ఒకెత్తయితే.. రాబోయే 'రంగస్థలం' గురించి ఎంత చెప్పినా తక్కువే.

మళ్లీ నిర్మించాం: గోదావరి పల్లెటూరి వాతావరణంలో సాగే చిత్రమిది. రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణకు అనువుగా ఉంటుందని వెళ్లాం. నిజానికి అక్కడ పల్లెలు చాలా అభివృద్ధి అయ్యాయి. అన్నీ సీసీ రోడ్లూ, విద్యుత్ దీపాలూ, డాబాలూ, ఏసీ సౌకర్యాలు.. అబ్బో ఇలా చాలానే కనిపించాయి. నిజానికి 80ల నాటి వాతావరణం ఉన్నట్టు ఏ పల్లెటూళ్లోనూ కనిపించలేదు. దాంతో పోలవరం పరిసరాల్లో కొన్ని సన్నివేశాలు చిత్రీకరించాం. పల్లెటూరి సెట్‌ని జూబ్లీహిల్స్‌లోనే ఓ పాతిక ఎకరాల ఖాళీ స్థలంలో వేశాం. అలానే ఆ కాలంలో వాడే వస్తువులూ, మంచాలూ, దుస్తులూ, వంట పాత్రలూ, రోలూ, తిరగలి... ఇలా అన్ని రకాల వాటి గురించి తెలుసుకుని ప్రత్యేకంగా తయారు చేయించాం. గుడిసెలు వేసి.. చుట్టూ తడికెలూ, మట్టిరోడ్లూ, ప్లాస్టిక్‌తో పచ్చని మొక్కలు తయారు చేసి.. అచ్చంగా అది పల్లెటూరేనా అనేలా సెట్ వేశాం. దాదాపు రెండు నెలలు కష్టపడి పనిచేయించాం. ప్రతిరోజూ ఐదొందల మంది కార్మికులు రాత్రీపగలు కష్టపడ్డారు. తీరా అంతా అయ్యాక వర్షం వచ్చింది. దాంతో మా పల్లె నీట మునిగింది. ఈ నీళ్లని ఆ స్థలం పక్కన ఉన్న గుంతలోకి మళ్లించాం. దాంతో నిజంగా గోదావరి ఒడ్డున గ్రామం ఉన్నట్టే కనిపించింది. మళ్లీ మార్పులు చేశాం. వీటితో పాటు స్కూళ్లూ, ఆసుపత్రులూ, నగరం.. ఇలా ఇంకొన్ని కట్టాం. మా సెట్‌ని చూడ్డానికి ప్రత్యేకంగా చిరంజీవి సర్, రాజమౌళి సర్ దంపతులు వచ్చారు. పైగా రామ్‌చరణ్ తరచూ సెట్ విశేషాలను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంటూ మమ్మల్ని అభినందిస్తుండేవారు' అంటూ ఆనందంగా చెబుతున్నారు మౌనిక.

– పద్మ వడ్డె

మొదటిసారైతే... పుషప్స్ మంచివే

వ్యాయామం చేయాలని మనసులో ఉన్నా... ఎలా మొదలుపెట్టాలో, ఏవి చేయాలో తెలియక చాలామంది వాయిదా వేస్తుంటారు. అది ఓ కొలిక్కి రాక అక్కడే ఆగిపోతారు. మరేం చేయాలంటే...



నిర్ణయించుకోండి... : వ్యాయామం చేయాలన్న ఆలోచన రావడంతోనే మొదలుపెట్టేసినట్లు కాదు. ముందు మీకు ఏ సమయం అనువుగా ఉంటుందో ఓ స్పష్టత తెచ్చుకోండి. దానికి తగ్గట్లుగా ప్రణాళిక వేసుకోండి. అప్పుడే ఎంత సమయం కేటాయించుకోగలుగుతారో ఓ అవగాహన వస్తుంది. గంటయినా, అరగంటయినా సరే... క్రమం తప్పకుండా చేసేలా చూసుకోండి. వ్యాయామం ఉదయం అయితేనే మేలు. లేదంటే సాయంత్రం నాలుగైదుగంటలప్పుడు చేస్తే విటమిన్ డి కూడా శరీరానికి అందుతుంది.

ఎక్కడ చేయాలీ... : అవును.. ఇంతకీ వ్యాయామం ఎక్కడ చేయాలనుకుంటున్నారు... ఇంట్లోనా, జిమ్‌లోనా అంటే... మొదటిసారి ప్రారంభించే వాళ్లు జిమ్‌కి వెళ్లడమే మేలు. ఎందుకంటే రకరకాల సాధనాలు మీలో ఉత్సాహాన్నివ్వడమే కాదు. నిపుణుల ఆధ్వర్యంలో చేయడం వల్ల ఏకాగ్రతా ఉంటుంది.

ఎలాంటి వ్యాయామాలు... : పుషప్స్, స్క్వాట్స్, ప్లాంక్స్, జంప్స్ వంటివన్నీ చేయొచ్చు. అయితే ఎప్పుడూ ఒకే తరహావి కాకుండా రోజూ కనీసం ఓ ఐదు రకాల్ని ఎంచుకుంటే మంచిది. అవి మీ కండరాల్ని దృఢంగా మారుస్తాయి. శరీరంలోని ప్రతి కండరం చురుగ్గా పనిచేయడం మొదలుపెడుతుంది. ఎన్నిసార్లు చేయాలనేదీ నిపుణుల సలహా తీసుకోవడం మంచిది.

ఆహారం: బరువుతగ్గించుకోవడంతోపాటూ దానికి అవసరమయ్యే శక్తిని సమన్వయం చేసుకోవడం తప్పనిసరి. అందుకు క్రమపద్ధతి ఉండాలి. అప్పుడే బరువు మీరనుకున్నట్లు తగ్గుతారు. అందుకే ఆహారంలో మార్పులూ మొదలుపెట్టాలి. పండ్లూ, కూరగాయలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలి.

ఉసిరి నూనెతో పట్టులా..

జుట్టుకి తగిన సంరక్షణ లేకపోతే రాలిపోవడం, చిట్లిపోవడం వంటి ఇబ్బందులెన్నో ఎదురవుతుంటాయి. అందుకే ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి.



- **కొబ్బరి నూనె:** జుట్టు ఏ మాత్రం పొడిబారి పీచులా అయినా సరే! కొబ్బరినూనెను కొద్దిగా వేడిచేసి తలకు మర్దన చేయాలి. ఆపై కాసేపు తలకు ఆవిరిపెడితే చాలు జుట్టు మృదువుగా మారుతుంది. కుదుళ్లూ బలంగా ఉంటాయి. కొబ్బరినూనెలో కరివేపాకు వేసి మరిగించి రాసుకుంటే తల నెరవదు.
- **బాదంనూనె:** దీన్ని తరచూ తలకు రాయడం వల్ల పలు పోషకాలు జుట్టుకు అందుతాయి. కుదుళ్లు గట్టిపడతాయి. దీన్ని ఇతర నూనెలతో కలిపి కూడా తలకు పెట్టుకోవచ్చు. మాడునీ, జుట్టునీ ఆరోగ్యంగా ఉంచుతుంది.
- **ఉసిరి నూనె:** ఈ నూనెను కనీసం వారం రోజులకోసారి పెట్టుకుని మర్దన చేయడం చేయడం వల్ల నిర్జీవంగా ఉన్న జుట్టు పట్టులా మారుతుంది. రాలే సమస్యా తగ్గుతుంది. ఇది అందుబాటులో లేకపోతే గనుక ఉసిరిపొడిని కొబ్బరినూనెలో కలిపి మరిగించి తలకు రాసుకోవచ్చు. ఇలా వారానికోసారి చేస్తే మంచిది.



బంగారం వెండి

23న ముగింపు-క్రితం



	హైదరాబాద్		విజయవాడ	
బంగారం (24క్యా)	31,540	31,600	31,570	31,300
ఆర్నమెంట్	29,700	29,530	29,300	29,000
వెండి (కిలో)	39,500	39,500	39,800	39,500

	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం (24క్యా)	31,400	31,350	30,860	30,690
ఆర్నమెంట్	29,120	29,070	29,390	29,230
వెండి (కిలో)	39,600	39,600	41,600	41,600

	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం (24క్యా)	31,490	31,370	-------	-------
ఆర్నమెంట్	29,290	29,180	2,939	2,923 గ్రా
వెండి (కిలో)	39,900	39,900	41.60	41.60 గ్రా

నల్లేరును పెంచడం సులువే!

పసిపిల్లల నుంచి వయోవృద్ధుల వరకూ ఎముకల పటుత్వానికైనా, వాటికి సంబంధించిన సమస్యలను తగ్గించడంలోనైనా అగ్రతాంబూలం నల్లేరుకే ఇవ్వాలి. నల్లేరును 'అస్థి సంహార', 'వజ్రవల్లి' అని అంటారు. ఈ రెండు పేర్లూ ఎముకల దృఢత్వాన్ని పెంచడంలో నల్లేరు పాత్రను వ్యక్తపరిచేవే. ఇది మనదేశానికి చెందిన మొక్కే. దీని శాస్త్రీయ నామం సిస్సస్ క్వాడ్రాంగ్యులారిస్.



నల్లేరు ద్రాక్ష కుటుంబానికి చెందిన బహువార్షికం. దీన్ని అడమెంట్ ప్లాంట్ అని కూడా అంటారు. నాలుగు పలకలుగా ఉండే కాండంతో, కణుపులుగా ఉండి, వేగంగా పెరిగే తీగజాతి మొక్క. ఇది దాదాపు రెండు మీటర్ల ఎత్తు వరకూ పెరుగుతుంది. కణుపుల మధ్య దూరం దాదాపు 3-5 అంగుళాలు ఉంటుంది.

గుత్తులుగా పూలూ...

ప్రతి కణుపు దగ్గర ఒకవైపు మూడుగా చీలిన వెడల్పాటి ఆకూ, రెండోవైపు సన్నని నులితీగ ఉంటాయి. ఈ నులితీగల సాయంతోనే నల్లేరు ఆధారాన్ని పట్టుకుని ఎగబాకుతుంది. దీని పూలు తెలుపూ/ లేత పసుపు/ లేతాకుపచ్చ రంగులో చిన్నచిన్న గుత్తుల్లో పూస్తాయి. గుత్తుల్లో కాసే గుండ్రని చిన్న చిన్న కాయలు పండినప్పుడు ఎర్రగా అందంగా ఉంటాయి.

నల్లేరు ఎలాంటి నేలలోనైనా పెరుగుతుంది. మరీ వెలుతురు అస్సలు రాని చోట తప్ప ఎక్కడైనా పెంచుకోవచ్చు. నీళ్లు రోజూ పోయాల్సిన పనిలేదు. చీడపీడల భయంలేదు. అలాగే పెద్దగా ఎరువుల అవసరం కూడా లేదు. మట్టి మిశ్రమంలో కొంచెం కంపోస్టు లేదా పశువుల ఎరువు కలిపితే సరిపోతుంది.

కూరగాయగానూ...

నల్లేరు తరతరాలుగా ఔషధ మొక్కగా ప్రాచుర్యంలో ఉంది. ఎముకలను ఆరోగ్యవంతంగా ఉంచడంలో, విరిగిన ఎముకలు అతికేలా చేయడంలో నల్లేరుకు సాటి వేరే లేదు. ఎముకలు అతకడానికే కాకుండా కండరాలు దెబ్బతిన్నా, లిగమెంట్లు విరిగిపోయినా కూడా నల్లేరు అద్భుతంగా పనిచేస్తుంది. బరువును తగ్గించడంలో కూడా నల్లేరు పాత్ర చెప్పుకోదగ్గదే. ఎముకలూ, కండరాల సమస్యలను త్వరితంగా పరిష్కరించడమే కాకుండా ఆ సమయంలో ఉండే నొప్పుల్నీ, వాపుల్నీ ఈ మొక్క తగ్గిస్తుందట. అలాగే స్త్రీలకు సంబంధించిన వ్యాధుల నివారణలో కూడా నల్లేరు చాలా మంచి ఔషధమట.

ఈ మొక్క వాడకం చాలా సులువు. చక్కగా కూరగాయలా దీన్ని వాడుకోవచ్చు. దీంతో రోటి పచ్చడి చేసుకోవచ్చు. కూర వండుకోవచ్చు. బజ్జీలు వేసుకోవచ్చు. ఇలా మరెన్నో సొంతంగా మీరూ ప్రయత్నించవచ్చు. నల్లేరు తరచూ వాడుతుంటే ఎముకల క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయట. ఇది పైల్స్‌ను తగ్గిస్తుందట. అల్సర్, ఉబ్బసాన్ని అదుపులో ఉంచుతుందట. రక్తహీనతను కూడా అరికడుతుందట. నల్లేరు కొమ్మను కోసి దాంతో తుడిస్తే తుప్పు మరకలు పోతాయట. ఈ మొక్కను కణుపులను నాటుకుని సులువుగా ప్రవర్ధనం చేయవచ్చు. చూడటానికి చక్కగా ఉండి, అద్భుతమైన ఔషధ లక్షణాలున్నాయి. కూరగాయగానూ వాడుకోవచ్చు. ఇంటి శుభ్రతకు పనికొస్తుంది. నల్లేరును తెచ్చుకోవడానికి ఆలోచిస్తారా!





ఈ జాగ్రత్తలు అమ్మలకే!

అమ్మగా మారిన తరువాత ఆనందానికి అంతుండదు. చిన్నారి రాక జీవితంలో ఎన్నో సంతోషాలను తెస్తుంది. వీటితోపాటు కొత్త బాధ్యతలూ పెరుగుతాయి. అయితే చిన్నారి సంరక్షణలో భాగంగా కొన్ని జాగ్రత్తలు మీకంటూ తీసుకోవాలి.

- చాలామంది తల్లులు చిన్నారులను ఎప్పుడూ ఎత్తుకునే ఉంటారు. ఇలా చేయడం వల్ల తరచూ నడుం నొప్పి సమస్య బాధిస్తుంది. ఇప్పుడు పిల్లల్ని ఎత్తుకునేందుకు వీలుగా బేబీ కారియర్స్ దొరుకుతున్నాయి. వాటిని ఎంచుకుంటే నడుమునొప్పి సమస్య చాలామటుకూ అదుపులో ఉంటుంది.
- శిశువులకు పాలిచ్చే సమయంలో తల్లులు ముందుకు వంగుతారు. ఈ స్థితిలో చాలాసేపు ఉండటం వల్ల మెడా, భుజం కండరాలు పట్టేస్తాయి. కాబట్టి కూర్చునే ముందు తలగడకు ఆనుకుంటే మంచిది.
- ఓ వైపు ఇంటిపనులూ, మరోవైపు పాపాయి అవసరాలు తీర్చే క్రమంలో ఒత్తిడీ, అలసటా తప్పదు. ఈ సమస్యకు పరిష్కారం అవకాశం కుదిరినప్పుడల్లా విశ్రాంతి తీసుకోవడమే. కాసేపు ధ్యానం చేసినా, ఒత్తిడి తగ్గుతుంది.
- అన్నిపనులూ మీరే చేయాలని చూడకుండా కొన్నింటిని ఇతర కుటుంబసభ్యులకూ అప్పగించండి.

ఏ పద్ధతి సరైందో తెలియట్లేదు!

నాకు రొమ్ములో గడ్డ ఉన్నట్టు ఈ మధ్యనే గుర్తించా. వెంటనే వైద్యుల్ని సంప్రదిస్తే అన్ని పరీక్షలు చేసి క్యాన్సర్ అని తేల్చారు. అంతేకాదు చికిత్సలో భాగంగా రొమ్మును పూర్తిగా తొలగించొచ్చు, లేదంటే పరిస్థితిని బట్టి కేవలం గడ్డను మాత్రమే తీసేయొచ్చు అని చెప్పారు. అయితే నాకు దేనివల్ల మంచి ఫలితం ఉంటుందో తెలియడం లేదు. దేన్ని ఎంచుకోవచ్చు.

– ఓ సోదరి

డియర్ వసుంధర



డా॥ గీతానాగశ్రీ
క్యాన్సర్ శస్త్రచికిత్సా నిపుణురాలు

మీరిక్కడ కంగారుపడాల్సిన అవసరం లేదు. రొమ్ము తొలగించకుండానే చికిత్స చేయించుకోవడానికే మహిళలు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. క్యాన్సర్ నిపుణులూ, అధ్యయనాల ప్రకారం చూస్తే రెండు విధానాల వల్ల కూడా ఒకేలాంటి ఫలితాలు ఉంటాయి. క్యాన్సర్ వచ్చింది అనగానే రొమ్మును పూర్తిగా తొలగించడం పాత పద్ధతి. ఇప్పుడు అలా కాదు. వీలైనంతవరకూ రొమ్మును తీసేయకుండానే చికిత్స చేయడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాం. అంతకన్నా ముందు గడ్డ, రొమ్ము పరిమాణం బట్టి రొమ్ము ఆకృతి ఏ మాత్రం పోకుండానే చికిత్స చేస్తారు. కొన్నిసార్లు గడ్డ పరిమాణాన్ని బట్టి కీమోథెరపీ ద్వారా కూడా దాన్ని కరిగించే ప్రయత్నం చేస్తాం. ఒకవేళ ఆ క్యాన్సర్ లింఫ్ గ్రంథులకూ చేరిందని పరీక్షలో తేలితే... ఫై పద్ధతిలో అవసరం మేరకు ఆ గ్రంథుల్ని కూడా కొంతవరకూ తీసేయాల్సి ఉంటుంది. కాబట్టి మీరు భయపడకుండా మరోసారి వైద్యుల్ని సంప్రదించండి. లోపల ఏర్పడిన గడ్డ, దాని దశ... ఇలా రకరకాల పరీక్షల అనంతరం చికిత్స ఏం విధంగా చేయాలీ అనేది వైద్యులు నిర్ణయిస్తారు. ఆ తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తల్నీ వివరిస్తారు.

– మీ సందేహాలను, సమస్యల్ని vasuhealth@eenadu.net కు పంపించగలరు.

గాల్లోంచి నీరు తీశారు వీరు



నీళ్లు లేక.. నోళ్లు ఎండిన గ్రామాలెన్నో?
కన్నీళ్లు తాగి.. దాహం తీర్చుకుంటున్న ఊర్లు ఎన్నో?
శుద్ధ జలాల కోసం.. కి.మీ. వెళుతున్న జనాలెందరో?

వీరందరినీ చూసి చలించారు ఈ యువకులు. ఈ బాధలు తీర్చడానికి ఏమైనా చేయాలనుకున్నారు. గాలి నుంచి నీరు గ్రహించే పరికరం తయారు చేశారు. 'ఉరవు' పేరుతో అంకుర సంస్థను నెలకొల్పి వీరు ఆవిష్కరించిన ఈ పరికరానికి లాస్‌యాంజెల్స్ నుంచి నడిచే ఎక్స్‌ప్రైజ్ అనే సంస్థ బహుమతి ప్రకటించింది. టాటా గ్రూప్, ఆస్ట్రేలియన్ ఎయిడ్ సంయుక్తంగా ఈ బహుమతి కింద రూ.32 లక్షలు అందివ్వనున్నాయి. శ్రీవాస్తవ్, అమిత్, భరత్, సందీప్, వెంకటేశ్ అనే 5మంది ఔత్సాహిక కుర్రాళ్లు సాధించిన ఘనత ఇది.

నదులు, సముద్రాలు, చెరువులు, కాల్వలు, బోర్లు... ఇలా నీటి వనరులెన్నో చూశాం. ఇప్పుడు మన చుట్టూ ఉన్న గాలి నుంచి నీరు తోడుకొనే రోజులు రానున్నాయంటున్నారు ఈ యువత. 25 దేశాలు, 98 బృందాలు... ఇంతమంది పోటీపడినా మన హైదరాబాద్‌కు చెందిన 'ఉరవు' అంకుర సంస్థ తుది 5 బృందాల జాబితాలో స్థానం సంపాదించింది. ఈ అయిదు బృందాలకు ఒక్కొక్కరికీ రూ.32 లక్షలు అందిస్తారు. రెండో విడత పోటీలోనూ విజేతలైన వారికి 1.5 మిలియన్ డాలర్లు ఇచ్చి ప్రోత్సహిస్తారు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనే కాదు... ప్రపంచ వ్యాప్తంగా తాగునీటి సమస్య తీవ్రమైంది. 2025 నాటికి ఇది ఉగ్రరూపం దాల్చి 350 కోట్ల మంది ప్రజలు జలం కోసం అలమటించే పరిస్థితి వస్తుంది. దీన్ని గుర్తించే మేం ఈ ఆవిష్కరణకు నడుంబిగించామని చెబుతారు ఈ కుర్రాళ్లు. వేర్వేరు రాష్ట్రాలకు చెందిన, భిన్నమైన సబ్జెక్టులు చదివిన ఈ అయిదుగురు కలిసి గాలిలోంచి నీరు తీసే పరికరాన్ని ఆవిష్కరించారు. మానవ జీవితంలో తలెత్తే అనేక సమస్యలకు పరిష్కారాలు కనుగొనే నూతన ఆవిష్కరణలకు ఎక్స్‌ప్రైజ్ అనే సంస్థ పోటీలు నిర్వహించి... బహుమతులు అందిస్తుంటుంది. మన 'ఉరవు' సంస్థ ఇప్పుడు దీనికి ఎంపికైంది.

మెటీరియల్ సైన్స్, సౌరశక్తి ఆధారంగా ఈ పరికరం తయారు చేశారు. ఇందులో ఒక లీటర్ నీటి ఉత్పత్తికి రూ.1.50 ఖర్చు అవుతుంది. ఈ పరికరం పూర్తిగా సౌరశక్తితో నడుస్తుంది. దీని తయారీకి రూ.30వేలు ఖర్చైందని, ఒక్కో పరికరం రోజుకు 10 లీటర్ల నీటిని గాలి నుంచి ఉత్పత్తి చేయగలదని ఈ బృందంలో ఒకరైన భరత్ తెలిపారు.

మండే ఎండలో నడుస్తున్నా... దాని తాలుకు వేడి శరీరాన్ని ఇబ్బంది పెట్టకూడదంటే...? ముంచేసే ఉక్కపోతలోనూ... శరీరం తేలికగా ఉండాలంటే...? నూలు(కాటన్) దుస్తులు ధరించాలని... టక్కున సమాధానం వచ్చేస్తుంది. మరి కాటన్ అంటే తెలుపేనా? కాటన్ అంటే ప్లెయిన్ షర్ట్సేనా? అయితే మాకొద్దు! కాటన్‌లో ఏదైనా వెరైటీ ఉంటే చెప్పండి అంటోంది యువత... ఆ నూతనత్వాన్ని చదివేయండి మరి.

ట్రెండీ.. ట్రెండీ..
కూల్ కూల్





కాటన్ దుస్తులు అనగానే యువత వద్దంటుంది. దూరం పెడుతుంది. డిజైనర్లు వీరిని సైతం ఆకట్టుకోవడానికి కొత్త ఫ్యాషన్లతో సిద్ధమయ్యారు. ఈ వేసవిని చల్లగా మార్చేయానికి కొత్త మార్గాలు వెతికారు. అలాంటి వాటిల్లో చేనేతది ప్రత్యేక స్థానం. వీటిల్లో ఇకత్, కలంకారీలు ఇప్పుడు హాటెస్ట్ ట్రెండ్. ఇక లినిన్ లేతరంగుల షర్ట్‌లు ఈ కాలానికి చక్కని ప్రత్యామ్నాయం. పూలడిజైన్లు అమ్మాయిలకే అన్నది పాతమాట. ఈ వేసవిలో పూల సోయగాలు అబ్బాయిల్నీ మెప్పించేలా డిజైనర్ లుక్‌తో సిద్ధం అయిపోయాయి. ఇక నూలు దుస్తుల్లో ప్లెయిన్ అనేది ఒక రకమే. అలాని ఎప్పుడూ ఒకేతరహావి ఎందుకు? విభిన్నవర్ణాల మేళవింపుతో చెక్స్, లైన్స్ వంటివెన్నో ఎంచుకోవచ్చు. ఇక సీగ్రీన్, స్లేబ్లూ, ఐస్‌బ్లూ, క్రీమ్ వైట్, మిల్క్‌వైట్ వంటి రంగులు (లేలేతఛాయల్లో(పేస్టల్‌కలర్స్-షేడ్స్) ఈ షర్ట్‌లను ఎంచుకోవచ్చు అని సూచిస్తున్నారు డిజైనర్ రవి అవ్వారు.

ఇక డిజైన్‌ల సంగతికొస్తే ఈ కాలంలో కాస్త వదులుగా ఉండే దుస్తుల్ని ఎంచుకోవడమే మంచిది. ఎప్పుడూ షర్టులేనా అనుకొనే వారు... కొంచెం కొత్తగా కుర్తాలు ప్రయత్నించవచ్చు. వీటిల్లో షార్ట్, లాంగ్, క్రాస్‌ఫిట్, సంప్రదాయ, డిజైనర్ రకాల్ని సందర్భాన్ని బట్టి వేసుకోవచ్చు. వీటిల్లోనూ కాలర్ ఉన్నవీ, లేనివాటితో పాటు చైనీస్ కాలర్ వంటి డిజైన్ల ఇలా మన శరీర ఆకృతిని బట్టి ఎంపిక చేసుకోవచ్చు.

5 నుంచి 10 ఏళ్ల లోపు పిల్లలకైతే ముదురు రంగులు ఎంపిక చేసుకోవాలి. 11 -15 ఏళ్ల మధ్య వయస్సు టీనేజర్లకు చిన్న లైన్సు(గీతలు), చెక్స్(గళ్లు) తీసుకోవచ్చు. 15-20 ఏళ్ల యువతకు కుర్తాలు కొత్త అందాన్ని తెచ్చిపెడతాయి. 20-30ల వయసు వారికి షార్ట్ కుర్తాలు, యాపిల్‌కట్‌తరహా ఫినిషింగ్ షర్ట్స్ బాగుంటాయి. కార్యాలయాలు, కళాశాలలకు వెళ్లే వారికీ ఇవి చక్కగా నప్పుతాయి. నలభైల్లో ఉన్నవారికి ఖాదీ హుందాతనాన్ని తెచ్చిపెడుతుంది.





మరి ప్యాంట్లు ఎలా? అంటారా మీ కోసమే కొత్తగా క్యాజువల్ లూజ్ ఫిట్ కాటన్ ప్యాంట్లు వచ్చాయి. వీటిని చిన్నబెల్టుతో మీకు నప్పేట్లు ఎంచుకోవచ్చు. వీటిపైనా ఇకత్, కలంకారీ వంటి చేనేత అందాలు చమక్కుమంటున్నాయి. వీటిని బయటికి వేసుకెళ్లడం ఇబ్బంది అనుకొనే వారు కాటన్ జీన్స్, స్లిమ్‌ఫిట్ కాటన్ ప్యాంట్లు ధరించవచ్చు. డ్రైవింగ్ చేసే వారు స్లిమ్‌ఫిట్ కాటన్, ఖాదీ ప్యాంట్లు సౌకర్యంగా ఉంటాయి.



అమ్మాయిలకూ కాటన్ సల్వార్‌లూ, ట్యూనిక్‌లూ, కుర్తీలు, టాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి జతగా లినిన్ కాటన్ లెగ్గింగ్స్ ఈ వేసవిలో సౌకర్యంగా ఉంటాయి. కుర్తీలకు కళంకారీ డిజైన్లు మరింత వన్నెతెస్తున్నాయి. దుపట్టాలూ, స్కార్ఫ్‌లు కూడా ఈ వన్నెలద్దుకుంటున్నాయి. క్రాప్‌టాప్ తరహాలో పోచంపల్లి, కలంకారీ బ్లవుజులు చీరలమీదకూ, లెహెంగాల మీదకూ కూడా నప్పేస్తున్నాయి. ఇంకాస్త ట్రెండీగా కనిపించాలి అనుకునేవారు పలాజోలాపైనా వేసుకుంటున్నారు. మంగళగిరి కాటన్, కొటాలవేవ్, కాంజీవరం, బెనారస్ రకాలు ప్రస్తుతం ఆదరణ పొందుతున్నాయని డిజైనర్ లావణ్య చెబుతున్నారు. పార్టీలు, ఫంక్షన్లకు కంచి చేనేత రకాలు కొత్తదనాన్ని తెచ్చిపెడుతున్నాయి. ఎండాకాలం తక్కువ బరువుతో లినిన్, ఖాదీ చీరలు మగువలను ఆకట్టుకుంటాయని చెబుతున్నారు. సంబల్‌పూరి కాటన్ పోచంపల్లిలానే ఉంటుందని, వీటిలో వాడే రంగులు పూర్తిగా సహజసిద్ధమైనవని ఇవి చల్లదనాన్ని ఇస్తాయంటున్నారు డిజైనర్ లావణ్య.



నప్పేవే మెప్పిస్తాయి

మార్కెట్లో ఎన్నో కాటన్ ఫ్యాషన్లు అందుబాటులో ఉన్నాయి. శరీరానికి నప్పేవి తీసుకుంటేనే ట్రెండీగా ఉంటుంది. ఇందుకు డిజైనర్ సలహాలు చాలా ముఖ్యం. మీకు అందుబాటులో ఉండే డిజైనర్‌ను సంప్రదించి మీ శరీరా ఆకృతి, రంగును బట్టి దుస్తులు రెడీ చేయించుకుంటే మంచిది. ఎండాకాలం వదులుగా ఉండే దుస్తులు సౌకర్యంగా ఉంటాయి. మరి ఫ్యాషన్‌కు ఇబ్బంది కదా అనుకొనే వారు... మంచి డిజైనర్ల వద్దకు వెళ్లి వారికి తగ్గట్లు డిజైన్ చేయించుకోవచ్చు.

- రవి అవ్వారు(గాంధీ), అవ్వారు డిజైన్స్

నా ప్రేమ కుశలమేనా..?

మా ఊరు చిన్నపట్నం. డిగ్రీ రెండో ఏడాది చదువుతున్నాను. నా స్నేహితులంతా కలిసి చిన్న వారపత్రిక నడిపేవాళ్లం. సాహిత్యంతో పరిచయం ఉండటంతో ప్రతీవారం కవితలు నేనే రాసేవాడ్ని. అలాగే ఓ ప్రముఖ వార్తాపత్రికకూ స్థానిక వార్తలను పంపేవాడిని. పాకెట్‌మనీ కోసం చేసే చిన్న ఉద్యోగమది. ఓరోజు సన్నని జల్లులు పడుతున్నాయి. పత్రికకు కవిత రాయాలి. టీ తాగాలనిపించింది. దగ్గరున్న టీకొట్టుకు ఆ చినుకుల్లో తడుస్తూ వెళ్లాను. అప్పుడే మొదటిసారి చూశాను తనని. చుడీదార్‌లో దుపట్టా నెత్తిపైన కప్పుకొని వేగంగా నడుస్తూ.. నన్ను చూసి ఆగింది. మీరు స్వామి కదా..అంది. భలే ఉంది ఈమె గొంతు అనుకున్నా. మీరు మా సీనియర్, నాకు తెలుసు. నేను వేరే గ్రూపు లెండి...! అంటూ మాట్లాడటానికి అవకాశం లేకుండా వేగంగా మాట్లాడుతోంది. స్వతహాగ మితభాషిని నేను. అలా నడుస్తూ మాట్లాడుకుందాం అంటూ ముందుకు నడిచాను. నా గురించి చెబుతోంది. ఆ వేగాన్ని నేను అందుకోలేకపోయా. మాటల్లోనే ఎక్కడికి అని అడిగింది. టీకి అని చెప్పా. ఇక్కడుంది రండి అంటూ.. తనే ముందు వెళ్లింది. అలా మొదలైంది ఆమెతో నా మొదటి పరిచయం.

తను సైన్సు గ్రూపు, నేను ఆర్ట్స్. అయితే నా గురించి పూర్తిగా తెలుసు తనకు. నా కవితలన్నింటినీ గడగడా చెప్పేసేది. అలా మా పరిచయం పెరిగింది. మూడో వ్యక్తి గురించి మా మధ్య సంభాషణ ఉండదు. ఎక్కువగా పుస్తకాల గురించే. తిలక్, లత, శ్రీశ్రీ, చలం రచనలు మా మధ్య తిరిగేవి. తనకు రష్యన్ రచనలంటే పిచ్చి. ఆమె మాట తీరు, వేగం, వ్యక్తిత్వం చూస్తే చాలా ఇష్టంగా ఉండేది. ముఖం తెలియని వారెవరినైనా నవ్వుతూ పలకరిస్తుంది. ఆమె ముఖంపై ఎప్పుడూ చిరునవ్వే. ప్రతీవ్యక్తిని గౌరవించేది. ఆమెది తీయని గొంతు. లతామంగేష్కర్, సుశీల, జానకి పాటలన్నింటినీ పాడేది. చినుకులు పడితే చాలు, ఇద్దరం ఇరానీ చాయ్ తాగుతూ.. కవిత్వం చెప్పుకునేవాళ్లం. తనొక అద్భుతం నాకు.

డిగ్రీతోపాటూ మా స్నేహమూ పెరిగింది. మా మధ్య సాన్నిహిత్యం పెరిగింది. నేను ప్రేమించాను ఆమెను. కానీ ఎప్పుడూ ప్రేమ గురించి చర్చ రాలేదు. చెప్పాలనుకునేవాడిని. వాళ్లది మధ్యతరగతి కుటుంబం. అందరూ నన్ను చాలా మర్యాదగా చూసేవారు. ఇద్దరం పుస్తకప్రియులం కావడంతో పుస్తక సమావేశాలను వదిలేవాళ్లం కాదు. వేదికపై విశ్లేషిస్తూ నేను మాట్లాడుతుంటే శ్రద్ధగా వినేది. అప్పుడప్పుడూ వేదికపై తను పాటలు పాడేది. తను ఎక్కడ ఉంటే ఆ చోటును, అక్కడ ఉండే అందరి మనసులనూ ఆక్రమించేసేది. అంతటి ఉత్సాహం ఆమెలో. దాదాపు మూడేళ్లపాటు మేమిద్దరం స్నేహితులం. చివరికి నా ప్రేమను చెప్పేశాను. నాకు తెలుసంటూ ముగ్ధంగా నవ్వింది. ఇద్దరం జీవితాల్లో స్థిరపడి పెళ్లి చేసుకుందామనుకున్నాం. మేం ప్రేమికులం, అంతకు మించి మంచి స్నేహితులం. మా అభిరుచులూ, ఆలోచనలు ఒకటే.



అందరి ప్రేమ కథల్లోలాగే మా కథలోనూ మలుపు. మా పెళ్లికి అభ్యంతరం వచ్చింది. కులం, ధనం ముఖ్యపాత్రలయ్యాయి. సమయం లేదు. పెళ్లి చేసుకుందాం అని చెప్పా. కుటుంబానికి ప్రాధాన్యతనిచ్చిందో ఏమో నవ్వి, అక్కడ నుంచి వెళ్లిపోయింది. ఇద్దరి కళ్లల్లో నీళ్లు. అప్పుడు కూడా వర్షం. ఆ చినుకుల్లో మా కన్నీళ్లు కూడా కలిసిపోయాయి. తనకు పెళ్లై, వెళ్లిపోయింది. జీవితమంతా శూన్యంగా అనిపించింది. పిచ్చాడిలా తిరిగాను. స్నేహితుల చేయూతతో తిరిగి మామూలు మనిషయ్యా. ఇప్పుడు మంచి ఉద్యోగంలో స్థిరపడ్డాను. డబ్బుకు లోటు లేదు. కానీ తను లేని లోటు మాత్రం తీరదు.

ఓ రోజు సాయంత్రం రోడ్డుపై నడుస్తుంటే.. తన పలకరింపు, ఎన్నో ఏళ్ల తరువాత. ఎదురుగా తను. నమ్మలేకపోయా. ఏం చేస్తున్నావంటూ అడిగింది. తన కళ్లల్లో ఏదో వెలితి. కళ లేదు. నా కళ్లల్లో అవకాశం ఇస్తే జారిపోయేలా కన్నీళ్లు. మాటలు రాక తలూపా. తనని అడిగా సిటీలైఫ్ కదా. వేగంగా ఉంది అంది. చదువు, సంగీతం, సాహిత్యంలో ముందుండే తను, జీవితంలో వెనకుందెందుకు అనిపించింది. నా వెలితి తనే. కానీ తన జీవితంలో వెలితెందుకు. ఆలోచించా. ఆర్థికంగా చేయూతగా తన చదువుకు అవకాశాన్ని ఇప్పించా. మేం మంచి స్నేహితులం. సరైన నిర్ణయం తీసుకోలేక తనను కోల్పోయా. ధైర్యంగా అప్పుడు తనను సాధించుకోగలిగితే నా జీవితం సంపూర్ణంగా ఉండేదేమో. ధైర్యం ఉంటేనే ప్రేమించాలి. ఇప్పుడు కనీసం తను బాగుంటే చాలనుకుని, ఎప్పటికప్పుడు తన కుశలాన్ని తెలుసుకుంటూ ఉండే నా ప్రేమ నిజంగా కుశలమేనా... నా కిష్టమైన తను కుశలమేనా.. తనను సాధించుకోలేని నా ప్రేమ అప్పటి నుంచి ఇప్పటివరకు కుశలమేనా..

■ అమెరికాలో చదువు ఉపాధిని ఇవ్వనప్పుడు.. అక్కడ బతకాలంటే పెళ్లి ఒక ఆసరా. 30ఏళ్లు నిండని ఒక భారతీయ విద్యార్థి ఈ బాట పడతాడు. అప్పటికే పెళ్లై, భర్తతో విడిపోయిన, ఒక బిడ్డకు తల్లి అయిన అమెరికా గ్రీన్‌కార్డు నల్లజాతి అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు. బతుకు భద్రం అని భావిస్తాడు. ఉత్తుత్తి పెళ్లి చేసుకుని ఎంబసీలో దొరికిపోతాడు. అప్పుడు ఆ జంట మానసిక స్థితి ఎలా ఉంటుంది?

దీనిపై ఓ రచన చేస్తే...!

■ స్థానిక నల్లజాతి అమ్మాయితో కుదుర్చుకున్న ఒక ఒప్పంద వివాహం 'అన్ అరేంజ్డ్ మ్యారేజ్'. కాగితాల మీదనే భర్తగా ఆమెకు నెలకు ఇంత చెల్లించే ముందస్తు ఒప్పందం ఇదన్నమాట. ఇందులోని మానసిక సంఘర్షణ ఒక వైపు, పెళ్లి అంటే ఒక బంధం అని నమ్మిన కుటుంబాల కథ మరోవైపు....

దీన్ని అక్షరబద్ధం చేస్తే...!

కాల్పనిక 'కథా'నాయకుడు



ఇలా వర్తమాన సమాజంలోని మనుషుల మనసుల్లోని సంక్లిష్టతను అక్షరీకరించి, అమెరికా విశ్వవిద్యాలయాలను మెప్పించాడు మన ఖమ్మం కుర్రాడు నిశాంత్. సైడ్ ఎఫెక్ట్స్, లైఫ్ ఆఫ్ ఇన్నోసెన్స్, టౌన్‌ఆఫ్‌ది డెడ్, హైవే, పైలెట్, సుమ్మెర్స్ ఆఫ్ పెయింటింగ్స్, అన్ అరేంజ్డ్ మ్యారేజ్, లుక్‌ఇన్‌సైడ్ లాంటి 8 కథలు రాశాడు. వీటిని ప్రచురించడానికి అక్కడి మూడు ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు ముందుకొచ్చాయి. అంతేకాదు... మిషిగన్ విశ్వవిద్యాలయం నిర్వహించే 'హెలెన్‌జిల్' అనే శిక్షణకు ఎంపికై చరిత్ర సృష్టించాడు.

తెలంగాణ రాష్ట్రం ఖమ్మం నగరంలో జన్మించిన నిశాంత్ తండ్రి ఐవీ రమణారావు ఆంగ్ల అధ్యాపకులు. తల్లి లక్ష్మి వైద్యురాలు. అమెరికాలోని యూ-పెన్ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ పూర్తి చేశాడు. ఆ తర్వాత చికాగోలోని ప్రముఖ ఆంగ్ల దినపత్రిక ట్రిబ్యూన్‌లో డిజిటల్ పైపర్‌లో సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేశాడు. అలా అమెరికాలో స్థిరపడిన నిశాంత్ భిన్నమైన బాటను ఎంచుకున్నాడు. తన చుట్టూ ఉన్న మానసిక ఉక్కపోత నుంచి ఉపశమనం పొందటం కోసం రచనను ఒక వ్యాపకంగా మార్చుకున్నాడు. ఆ వ్యాపకమే కోటి రూపాయల ఉపకారం వేతనం పొందేలా చేసింది.

నిరంతర తపన

8వ తరగతిలోనే కథలు రాయటం మొదలు పెట్టాడు. అమెరికాలో రాత్రి విధులు ముగించుకొని స్టూడియో చికాగో పేరిట సాగే రచయితల సమావేశాలకు, సాహిత్య సభలకు వీలైనన్ని ఎక్కువ సార్లు హాజరయ్యేవాడు. ఈ క్రమంలోనే ప్రముఖ సాహిత్య పత్రిక టిన్ హౌస్ వారి వేసవి శిక్షణ తరగతులకు, లైట్‌హౌస్ రచయితల కార్యశాలకు వెళ్లాడు. స్టాన్‌ఫర్డ్‌లో ఆన్‌లైన్ రైటర్స్ ప్రోగ్రాంలో శిక్షణ తీసుకున్నాడు. ఈ నిరంతర కృషి అతన్ని విజయం వైపు నడిపింది.



సాహిత్యంలో..

వృత్తి రీత్యా తన నైపుణ్యం ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీలో ఉన్నా ప్రవృత్తి రీత్యా తాను అభిమానించే కాల్పనిక సాహిత్యం(క్రియేటివ్ ఫిక్షన్) వైపు అడుగులు వేశాడు.

విలక్షణత... భావోద్వేగాలు

నా చుట్టూ ఉన్న విలక్షణమైన జీవితాలు, భావోద్వేగాలు సృజనాత్మక వ్యాసంగంవైపు నన్ను మళ్లించాయి. అరుంధతీరాయ్, ఝంపాలహరి, గ్రేస్ పాలేని వంటి వారి రచనలు నాకిష్టం. డానియల్ ఇవాన్, జుడిత్ మిచెల్ లాంటి అధ్యాపకుల సహచర్యం నా రాతకు పదును పెట్టాయి. మానవ జీవితంలోని ఉద్వేగాలపై ఒక గ్రహాంతర వాసికి ఉన్నంత కుతూహలం నాకుంది. ప్రకృతిపై హిమాలయాలంత ప్రేమ ఉంది. ఈ రెండు ఆసక్తులే నన్ను కాల్పనిక సాహిత్యంవైపు నడిపిస్తున్నాయి. **- ఇంజం నిశాంత్**

12 మందిలో ఒకరు

అమెరికాలో సృజనాత్మక రచనలను చేసే వారి నైపుణ్యాలను సానబెట్టేందుకు మూడేళ్ల మాస్టర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(ఎం.ఎఫ్.ఏ) కోర్సు ఉంది. అన్ని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో శిక్షణ ఇస్తారు. ఇందులో చాలా ముఖ్యమైనది 'హెలెన్ జిల్' రైటర్స్ ప్రోగ్రాం. ఇది ఆన్ ఆర్బర్‌లో ఉన్న మిషిగన్ విశ్వవిద్యాలయంలో ఉంది. ఇందులో 12సీట్ల కోసం వందల మంది పోటీ పడతారు. 2018లో ప్రవేశాలకు గానూ 1800 పైగా దరఖాస్తులు వచ్చాయి. మూడేళ్ల కోర్సు కాలంలో మొదటి రెండేళ్లకు గానూ విశ్వవిద్యాలయం వారు ఫెలోషిప్ కింద లక్షా 66వేల డాలర్లు ఇస్తారు. ఈ ఫెలోషిప్ ఈ ప్రోగ్రాంకు ప్రత్యేక ఆకర్షణ. అంతే కాక జ్ఞానపీఠ్‌తో పోల్చదగిన పులిట్జర్ అవార్డు గ్రహీతలు ఇక్కడ ఆచార్యులుగా పనిచేయటం విశేషం. ఈ విశ్వవిద్యాలయం ప్రస్తుత సంవత్సరం ఎంపిక చేసిన 12మంది రచయితల్లో నిశాంత్ ఒకడయ్యాడు.

- షేక్ లాలా, న్యూస్‌టుడే, ఖమ్మం విద్యావిభాగం

2 కంపెనీలను తీసుకురండి..

- శాసనసభలో ప్రతిపక్షాలకు లోకేశ్ సవాల్
- ఐటీ కంపెనీలకు నిబంధనల ప్రకారమే భూములిస్తున్నామని వెల్లడి



విమాన టికెట్లు బుక్ చేస్తా.. హోటల్ ఖర్చులు భరిస్తా.. రెండు కంపెనీలనైనా తీసుకురండి. 21 రోజుల్లో అన్ని అనుమతులు ఇస్తా.. అంటూ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్ ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. విశాఖపట్నంలో ఐటీ కంపెనీలకు ముఖ్యంగా 'ఫ్రాంక్లిన్ టెంపుల్టన్‌కు భూ కేటాయింపు'పై శాసనసభలో శుక్రవారం చేపట్టిన అత్యవసర చర్చపై మంత్రి మాట్లాడారు..

ఈనాడు, అమరావతి: 'ఐటీ కంపెనీలకు నిబంధనల ప్రకారమే పారదర్శకంగా భూములిస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా ఐటీ రంగం తీవ్ర ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో లక్ష ఐటీ, రెండు లక్షల ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం' అని లోకేశ్ చెప్పారు. 'ఇప్పటివరకు 15,550 మందికి ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంలో ఉద్యోగాలు కల్పించాం. ఒక్క ఫాక్స్‌కాన్ కంపెనీలో 14వేల మంది మహిళలు పనిచేస్తున్నారు. త్వరలోనే తిరుపతిలో రిలయన్స్ ఎలక్ట్రానిక్స్ పార్కు ఏర్పాటు చేయబోతుంది. ఐటీ రంగంలో 16,583 ఉద్యోగాలు కల్పించాం. ఒప్పందం కుదుర్చుకుని భూములు కేటాయింపు పూర్తయి, పనులు ప్రారంభమైతే మరో 27,500 మందికి ఉద్యోగాలు వస్తాయి. మరో 40వేల ఉద్యోగాల కల్పన కోసం వివిధ కంపెనీలతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నాం. విశాఖపట్నానికి ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, ఏఎన్ఎస్ఆర్, కన్సూయెంట్, గూగుల్ ఎక్స్‌లాంటి కంపెనీలు వచ్చాయి. విశాఖలో ఎప్పటి నుంచో ఖాళీగా ఉన్న హిల్ 1, 2కు ఇప్పుడు ఐటీ కంపెనీలు వచ్చాయి. అమరావతిలోని హెచ్‌సీఎల్ కంపెనీ, డేటా సెంటర్లు వచ్చాయి. సుదీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న మేధాటవర్స్ ఇప్పుడు నిండిపోయింది. ఫేస్-2 కూడా వేగంగా నిర్మాణం జరుగుతోంది. మంగళగిరిలో ఐటీ కంపెనీల కోసం 70 ఎకరాలు కేటాయిస్తే అంత ఎందుకు అని విమర్శించారు. ఇప్పుడు మరిన్ని కంపెనీలు రాబోతున్నాయి. తాను, సీఎం కలిసి అమెరికాలోని ఫ్రాంక్లిన్ కంపెనీకి వెళ్లి చర్చలు జరిపి, ఒప్పించి రాష్ట్రానికి తీసుకొచ్చాం. వాక్‌టూ వర్క్ పద్ధతిలో ఫ్రాంక్లిన్ కంపెనీ ఏర్పాటు కాబోతుంది. 455 కోట్ల రూపాయల పెట్టుబడితో 2500 మందికి ఉద్యోగాలు రాబోతున్నాయి. కంపెనీలకు నేరుగా భూములను ఇవ్వడంలేదు. ముందు అద్దె భవనాల్లో కార్యకలాపాలు ప్రారంభించిన తరవాత వారికి భూములు కేటాయిస్తున్నాం' అని లోకేష్ వివరించారు. దొంగ ఆధార్ దొంగ పేపరులో ఉద్దేశపూర్వకంగా వార్తలు రాస్తున్నారు. కంపెనీలు రాకుండా అడ్డుపడేదే చరిత్రహీనులుగా మిగిలిపోతారని విమర్శించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ విష్ణుకుమార్‌రాజు పేరును కూడా ప్రస్తావించారు. వేతనాలు తీసుకుంటూ భాజపా సభ్యులు మాత్రం సభకు రావడంలేదని వ్యాఖ్యానించారు.

పేదలకు అప్పులు తప్పడం లేదు

- వారి ఆదాయ వ్యయాల్లో భారీ వ్యత్యాసం
- సమ్మిళిత వృద్ధిపై చర్చలో ఆర్థికమంత్రి యనమల వ్యాఖ్యలు



రాష్ట్రంలో తలసరి ఆదాయం ఏడాదికి రూ.1.42లక్షలుగా నిర్ధరించినా.. సాధారణ ప్రజలకు నిజంగా ఇంత వస్తుందా? అని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ప్రశ్నించారు. సమ్మిళిత వృద్ధిపై శాసనసభలో శుక్రవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు..

ఈనాడు, అమరావతి: 'ప్రణాళికా సంఘం 2011-12లో తయారు చేసిన గణాంకాల ప్రకారం గ్రామీణ ప్రజల తలసరి ఆదాయం నెలకు రూ. 860 ఉంటే.. వ్యయం రూ.1,563గా ఉంది. సంపాదన, ఖర్చుల మధ్య ఇంత భారీ వ్యత్యాసం ఉన్నపుడు పేదలకు పొదుపు సామర్థ్యమెలా వస్తుంది? అప్పు చేయడమో, ప్రభుత్వ పథకాలపై ఆధారపడటమో చేయాల్సిందే. వెనుకబడిన ఇలాంటి వర్గాలను ప్రధాన స్రవంతిలోకి తెచ్చినపుడే సమ్మిళిత వృద్ధి సాధ్యమవుతుంది' అని యనమల స్పష్టం చేశారు. దళితుల ఆదాయంలో 13శాతం వృద్ధిరేటు నమోదవుతుంటే.. సాధారణ ప్రజల విషయంలో ఇది 2శాతం మాత్రమే ఉందన్నారు. పేదరికం రేటు తగ్గుతున్నా.. పేదల జనాభా పెరుగుతోందని యనమల వివరించారు. ఆదాయం మాత్రం తక్కువగా ఉంటోందని ఆందోళన వెలిబుచ్చారు. క్షేత్రస్థాయిలో పేదరికం ఎంత అనే లెక్కల్లో స్పష్టత లేదన్నారు. టెండూల్కర్ కమిటీ గణాంకాల ఆధారంగా పేదరికం 9.2శాతంగా కేంద్రం నిర్ధరించగా.. ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించిన సర్వేలో మాత్రం 21శాతంగా తేలిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కారణంగా పేదల ఆదాయం కొంత పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. సేవల రంగంలో ఉద్యోగాలు పెరిగితే అసమానతలు తగ్గుతాయని వివరించారు. పట్టణీకరణ వల్లే ఇది సాధ్యమవుతుందన్నారు. ఏపీలో పట్టణీకరణ 29 శాతం మాత్రమే ఉందన్నారు. దీన్ని పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. రాష్ట్రంలో వెనకబడిన జిల్లా జాబితాలో ప్రకాశం చేర్చాలని కోరుతూ కేంద్రానికి లేఖ రాశామని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఇవ్వాల్సిన నిధుల్లో కోత విధిస్తూ, ఈశాన్య రాష్ట్రాలకు రూ. 3 వేల కోట్ల ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించడం దారుణమని యనమల అన్నారు. సాంకేతికంగా ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వడం కుదరదని అవాస్తవాలు చెప్పి ఈశాన్య రాష్ట్రాలకు హోదా వల్ల లభించే ప్రోత్సాహకాలు ఇవ్వడం తెలుగు ప్రజలను తీవ్రంగా అవమానించడమేనని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాజాగా పోలవరానికి కేటాయించిన రూ.1400 కోట్లలో రూ. 300 కోట్లు కోత విధించడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోందన్నారు.

రూ.1018 కోట్లు అడిగితే రూ.181 కోట్లే ఇచ్చారు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గృహనిర్మాణానికి కేంద్రం నుంచి తగిన సాయం అందడం లేదని గ్రామీణ గృహనిర్మాణశాఖ మంత్రి కాలవ శ్రీనివాసులు చెప్పారు. పట్టణ ప్రాంతాల్లోని పేదలకు 1,58,340 ఇళ్లు (లబ్ధిదారులే నిర్మించుకునే పద్ధతిలో) మంజూరు చేసిన కేంద్రం.. నిధుల విడుదలలో తాత్సారం చేస్తోందన్నారు. వీటికి కేంద్రం వాటాగా తొలి విడత రూ. 1018 కోట్లు విడుదల చేయాలని కోరితే రూ. 181 కోట్లే ఇచ్చారన్నారు. ఈ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ. 500 కోట్లు ఖర్చు చేసిందన్నారు. శాసనమండలిలో శుక్రవారం గృహనిర్మాణంపై జరిగిన లఘు చర్చలో మంత్రి మాట్లాడారు.


'ఈనాడు' కథనం ప్రస్తావన: ధాన్యం సేకరణలో రైతులకు ప్రభుత్వమిచ్చే రవాణా ఛార్జీలను మిల్లర్లు, దళారులు దోచుకుంటున్నారని, ఒక్కో జిల్లాలో రూ. 50 కోట్ల మేర అవినీతి జరుగుతోందని భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆరోపించారు. ఫిబ్రవరి 10న 'ఈనాడు' ప్రధాన సంచికలో 'ధాన్యం సేకరణలో రవాణా ఛార్జీల దోపిడీ' పేరిట ప్రచురితమైన కథనాన్ని ప్రస్తావించారు.

16% పెంపు ఓ కనికట్టు: అయ్యన్న

రాష్ట్ర రోడ్లు భవనాల శాఖకు బడ్జెట్‌లో 16% నిధుల కేటాయింపు పెరిగినట్లు పేర్కొనడం కనికట్టు.. గారడీ అని రాష్ట్ర మంత్రి అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు. నిధుల సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎ,బి,సి,డి క్రమంలో ప్రాధాన్యాలను గుర్తించి రోడ్ల నిర్మాణం చేపడతామన్నారు.

ఇలాగైతే వందేళ్లకూ పూర్తికావు

- జాతీయ విద్యాసంస్థల స్థితిపై చర్చలో తెదేపా ఎమ్మెల్యేలు



కర్నూలు ట్రిపుల్ ఐటీ తరగతులు కాంచీపురంలో నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమా? అని ప్రభుత్వ విప్ కె.రవికుమార్ ప్రశ్నించారు. కేంద్ర కేటాయింపుల ప్రకారం జాతీయ విద్యాసంస్థల నిర్మాణం పూర్తి కావాలంటే 50 నుంచి వందేళ్లపైనే పడుతుందని ఎమ్మెల్యే రామానాయుడు ఎద్దేవా చేశారు. జాతీయ విద్యాసంస్థల ఏర్పాటుకు కేంద్ర నిధుల కేటాయింపుపై శాసనసభలో శుక్రవారం జరిగిన చర్చ వాడివేడిగా సాగింది..

ఈనాడు, అమరావతి: కేంద్ర బడ్జెట్లో మొక్కుబడి కేటాయింపులపై కేంద్ర ప్రభుత్వంతో పాటు భాజపా, ప్రధాని మోదీని లక్ష్యంగా చేసుకుని అధికార తెదేపా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించింది. ఈ సందర్భంగా కేంద్ర సాయాన్ని వివరిస్తూ భూకేటాయింపుల్లో జాప్యం ప్రస్తావించడంతో పాటు మోదీపై విమర్శలను భాజపా సభ్యులు తిప్పికొట్టారు. దీంతో ఇరుపార్టీల సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. "ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న జాతీయ విద్యాసంస్థల స్థితి' అనే అంశంపై శాసనసభలో శుక్రవారం స్వల్పకాలిక చర్చ జరిగింది. ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి చర్చ ప్రారంభిస్తూ జాతీయ విద్యాసంస్థలకు ఈ ఏడాది బడ్జెట్లో రూ. 119.34కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. నేను గుజరాతీని అని చెబుతూ మోదీ ఓట్లు అడుగుతున్నారని తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఆక్షేపించారు. పదేళ్లలో రూ. 10వేల కోట్లు అంటున్న భాజపా నాయకులు దామాషా ప్రకారం నాలుగేళ్లలో రూ. 4వేల కోట్లు కూడా రాలేదనే విషయాన్ని గుర్తించాలని ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు.

ప్రవేశాలకు ఆప్షన్లు తీసుకునే సమయంలో విశాఖపట్నం ఐఐఎంను చివరి అవకాశంగా ఎంచుకుంటున్నారని మానవవనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు చెప్పారు. శాశ్వత సిబ్బంది, మౌలిక సౌకర్యాలు లేకపోవడం, తాత్కాలిక వసతి వల్ల సంస్థ ప్రాధాన్యం కోల్పోతోందని ఆవేదన వెలిబుచ్చారు. 15 విద్యాసంస్థలకు రాష్ట్రం 3,508 ఎకరాల భూమిని కేటాయించి రూ. 607 కోట్లు ఖర్చు చేసిందన్నారు. వాసవి విద్యాసంస్థల్లో తాడేపల్లిగూడెం నిట్ తరగతులు నిర్వహిస్తున్న విషయాన్ని ప్రస్తావిస్తూ తమ భవనాలు తమకివ్వాలని యాజమాన్యం కోరుతోందన్నారు. దీనికి సంబంధించిన భవనాల నిర్మాణపనులు శంకుస్థాపన సమయంలో ఎలా ఉన్నాయో ఇప్పుడూ అలాగే ఉన్నాయని వివరించారు. సామాజిక మాధ్యమాల్లో ప్రజల పోస్టింగులను గుర్తు చేస్తూ. . 'కోడిని కోసుకు తింటే చికెన్ పార్టీ, మేకను కోసుకుతింటే మటన్‌పార్టీ, మధ్యతరగతి మనిషిని మధ్యలో కోసుకుతింటే భారతీయ జనతాపార్టీ అంటున్నారని' చెప్పడంతో సభలో నవ్వులు విన్పించాయి. జాతీయ విద్యాసంస్థలకు ఇచ్చిన భూములకు లెక్క గట్టడం ఎక్కడా చూడలేదని భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణ విమర్శించారు. అదేదో చంద్రబాబు సొంత ఆస్తులు ఇచ్చినట్లు చెబుతున్నారని ధ్వజమెత్తారు. 'భవనాలు కట్టడం కాదు.. తరగతులు జరుగుతున్నాయా? లేదా?' అనేది ముఖ్యమని గుర్తు చేశారు.

సంస్కరణలతో రెవెన్యూపై అసంతృప్తి తగ్గించాం: కేఈ

సంస్కరణల కారణంగా రెవెన్యూ శాఖపై ప్రజల్లో అసంతృప్తిని చాలా వరకు తగ్గించామని ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. 2018-19 బడ్జెట్ ఆదాయ వ్యయ పట్టికలో డిమాండ్లపై చర్చ సందర్భంగా ఆయన రెవెన్యూ సంస్కరణలపై మాట్లాడారు. మీ ఇంటికి మీ భూమి ద్వారా ఇంటి నుంచే భూముల వివరాలు తెలుసుకునే అవకాశం కల్పించామన్నారు. త్వరలోనే భూసేవ, భూదార్ విధానాలు అమల్లోకి తెస్తున్నామన్నారు.

మహిళలపై నేరాల నియంత్రణకు చర్యలు: చినరాజప్ప

మహిళలపై నేరాల నియంత్రణకు నిర్భయ పథకం కింద కడప, అనంతపురం జిల్లాల్లో మహిళా పోలీసు వాలంటీర్లను నియమించినట్లు ఉప ముఖ్యమంత్రి చిన్నరాజప్ప చెప్పారు. మన్యంలో గంజాయి సాగుపై అక్కడి ప్రజల్లో కళాజాతల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు ఎక్సైజ్‌శాఖ మంత్రి జవహర్ వివరించారు.

ఆపరేషన్- 7 స్టేట్స్ ఏపీలో కుదరదు

మంత్రి సోమిరెడ్డి వ్యాఖ్య

ఈనాడు డిజిటల్, అమరావతి: "రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను నిర్వీర్యం చేసేందుకు భాజపా తలపెట్టిన ఆపరేషన్-7 స్టేట్స్ ఏపీలో కుదరదు. ఇప్పటికే తమిళనాడులో చేతులు పెట్టి ఆ రాష్ట్ర ఉప ఎన్నికల్లో నోటా కంటే తక్కువ స్థాయికి దిగజారిపోయారు. మా చేతికి అధికారమిచ్చారు కదా అనీ రాష్ట్రాలను చిన్నాభిన్నం చేస్తామంటే వీలు కాదు" అని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మీడియా పాయింట్‌లో విలేకర్లతో మాట్లాడారు. 'వెంకయ్యనాయుడిని కీలక స్థానం నుంచి పక్కన పెట్టించారు. ప్రజాధనాన్ని ప్రత్యక్షంగా దోపిడి చేసిన వారిని పక్కన పెట్టుకుంటున్నారు. అవిశ్వాసం పెట్టిన విజయసాయిరెడ్డి ప్రధాని కిచెన్, డైనింగ్ హాల్‌లో కనిపిస్తున్నారు. లోపల కౌగిలింతలు, బయట ప్లకార్డులు. అసలు ప్రధాని ప్రజలకు ఏం సంకేతాలు ఇస్తున్నారు. ఇదెక్కడి న్యాయం" అని విమర్శించారు. "నాలుగేళ్లు నమ్మకమైన మిత్రపక్షంగా ఉన్నాం. జీఎస్టీ నుంచి పెద్దనోట్ల వరకు అన్నింటినీ సమర్థించాం. దానికి ప్రతిఫలంగా ఇప్పుడు వైకాపాతో లాలూచీ రాజకీయాలు నడుపుతారా? నల్లధనాన్ని పంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన భాజపా ఆర్థిక నేరస్తుడు విజయసాయి రెడ్డి సలహాలు తీసుకునే పరిస్థితికి వచ్చింది. మీకు అవినీతిపై మాట్లాడే హక్కు ఉందా?" అని భాజపా నేతలను మంత్రి ప్రశ్నించారు.

నేను జైట్లీతో మాట్లాడలేదు

- అదంతా వైకాపా మైండ్‌గేమ్
- కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి

ఈనాడు, దిల్లీ: కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైటీతో తానేమీ మాట్లాడలేదని తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత, కేంద్ర మాజీ మంత్రి సుజనాచౌదరి స్పష్టం చేశారు. ప్రత్యేకహోదా అంశం తేలేంతవరకూ కేంద్రంతో ఎలాంటి చర్చలకూ తావు ఇవ్వట్లేదని తెలిపారు. ''ప్రభుత్వం ఏదైనా మంచి అనుకుంటే చేయవచ్చు, చేయకపోవచ్చు అది వారిష్టం.. మేమేమీ మాట్లాడం. ఏపీకి ప్యాకేజీ విషయంపై నేను కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీతో మాట్లాడినట్లు, ఆ వివరాలను ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించినట్లు వస్తున్న వార్తలు పూర్తిగా తప్పు. ఇదంతా వైకాపా మైండ్‌గేమ్. వారి గేమ్‌లో పడేంత సున్నితమైనవాళ్లమేం కాదు. మేమేం చేయాలో మాకు తెలుసు" అని వ్యాఖ్యానించారు. ''కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీతో సుజనా చౌదరి భేటీ అయ్యారు, పోలవరానికి రూ. 1400 కోట్లు ఇచ్చినట్లే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీల ప్రకారం ఇతర ప్రాజెక్టులకు ఆర్థిక సహకారమందిస్తామని జైట్లీ ఆయనతో అన్నారు" అని శుక్రవారం ప్రచారం సాగింది. దీనిపై సుజనా పైవిధంగా స్పందించారు. కలహమెందుకు కలిసిసాగుదాం రండి అని కేంద్ర మంత్రుల నుంచి మీకు ఆహ్వానం అందినట్లు వార్తలు వచ్చాయి కదా అని విలేకరులు అడగ్గా.. "అలాంటి ఆహ్వానాలేమీ రాలేదు. వస్తే మొదట విలేకరులకే తెలియజేస్తా. ఆహ్వానం మాకు వచ్చినట్లు వార్తలు ఎక్కడ నుంచి వచ్చాయో తెలియద"ని సమాధానమిచ్చారు.

కేంద్రం విభజన రాజకీయాలు చేస్తోంది: నారాయణ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలతో పయనిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేటలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా సాకులు చెబుతోందని విమర్శించారు. దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాలను విభజించి పాలిస్తోందని ఆయన ఆరోపించారు. తెదేపా మంత్రి పదవులకు రాజీనామా చేసి, మళ్లీ ఎన్‌డీఏలో కొనసాగుతామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. భాజపా పెద్దలు అవసరమయితే చంద్రబాబును సైతం జైల్లో పెడతారని ఆయన అన్నారు. ఆంధ్ర, తమిళనాడులో భాజపాకు పునాదులే లేవని, అలాంటి చోట్ల వారి పార్టీ రావాలంటే ఎలా సాధ్యమవుతుందని ఆయన ప్రశ్నించారు. తెరాస దిల్లీలో, తెలంగాణలో విభిన్నంగా వ్యవహరిస్తోందని ఆయన చెప్పారు. పార్లమెంటులో అవిశ్వాసం చర్చకు రాకుండా తెరాస, ఏఐడీఎంకే ఎంపీలు అడ్డుకుంటున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ. 2లక్షల కోట్ల కుంభకోణం జరిగితే, భాజపా పాలనలో 2015 నుంచి 2017 వరకు రూ. 5 లక్షల కోట్ల స్కాంలు జరిగాయని ఆరోపించారు.

ప్రత్యేకహోదాకు కలిసి పోరాడాలి

- మావోయిస్టు పార్టీ ఏవోబీ ఎస్‌జడ్‌సీ కార్యదర్శి చంద్రమౌళి

సీలేరు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించేందుకు ప్రజలంతా కలిసి పోరాడాలని సూచిస్తూ మావోయిస్టు పార్టీ ఆంధ్రా, ఒడిశా ప్రత్యేక జోనల్ కమిటీ కార్యదర్శి చంద్రమౌళి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర విభజన సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చేందుకు భాజపా నాయకులు అనేక హామీలను గుప్పించారని, అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలకు తీరని ద్రోహం చేశారని మండి పడ్డారు. తెదేపా, భాజపా ప్రభుత్వాల చర్యలతో ఆంధ్రప్రదేశ్ అప్పులప్రదేశ్‌గా, నిర్వాసిత ప్రదేశ్‌గా మారిందన్నారు. ఫలితంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలబెడతామని ప్రతి వేదికపైనా ఉపన్యాసం ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికలకు ఏడాది ముందు వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు కేంద్రంపై తిరుగుబాటు బావుటా ఎగురవేశారన్నారు.

27న రాజ్యాంగ పరిరక్షణ దినంగా పాటిస్తాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ. చిత్రంలో చలసాని శ్రీనివాస్, మధు

విజయవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోరుతూ నిర్వహించిన జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు చెప్పారు. శుక్రవారం విజయవాడ ప్రెస్ క్లబ్‌లో వీరు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంటులో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాజ్యాంగానికి విఘాతం కలిగిస్తున్న నేపథ్యంలో ఈ నెల 27న అంబేడ్కర్ విగ్రహాల ఎదుట రాజ్యాంగ పరిరక్షణ దినం పాటిస్తామని రామకృష్ణ చెప్పారు. ఆ రోజు రాత్రి గంటపాటు విద్యుద్దీపాలు నిలిపివేసి 'చీకటి దినం'గా నిరసన వ్యక్తం చేస్తామన్నారు. విభజన హామీల గురించి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రధానికి ఎందుకు చెప్పరని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో సూక్తులు చెబుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక హోదాకి సైంధవుడిలా మారారని, ప్రధానికి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. సినీ నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతమని పేర్కొన్నారు. చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ 28న విద్యార్థి ఐకాసతో సమావేశాన్ని ఏర్పాటుచేసి ఉమ్మడి పోరాటానికి సిద్ధమవుతామన్నారు.



పార్లమెంటులో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ప్రత్యేక హోదా కోసం ఆందోళన చేస్తున్న తెదేపా ఎంపీలు

కేంద్రం మెడలు వంచుతాం

- భాజపా.. బ్రేక్ జనతా పార్టీ
- తెదేపా విమర్శలు
- గాంధీ విగ్రహం వద్ద కొనసాగిన ఆందోళన

ఈనాడు, దిల్లీ: ప్రజా ఉద్యమంతోనే కేంద్రం మెడలు వంచుతామని తెదేపా స్పష్టం చేసింది. ప్రత్యేకహోదా, విభజన హామీల అమలు కోసం తెదేపా నేతల నిరసన శుక్రవారమూ కొనసాగింది. పార్లమెంటు ఉభయ సభల ప్రారంభానికి ముందు గాంధీ విగ్రహం వద్ద తెదేపా ఎంపీలు ఆందోళన చేశారు. విభజన హామీలు నెరవేర్చాలని నినదించారు.

- ప్రభుత్వ వైఖరి తమకేమీ ఆశ్చర్యం కలిగించడం లేదని ఎంపీ గల్లా జయదేవ్ అన్నారు. కేంద్రాన్ని ప్రశ్నిస్తున్నందున రాష్ట్రాన్ని, తెదేపాను ఎంత ఇబ్బంది పెట్టాలో అంత పెడతారని పేర్కొన్నారు.
- భాజపా అంటే బ్రేక్ జనతా పార్టీ అని ఎంపీ రవీంద్రబాబు విమర్శించారు. ఇతర రాష్ట్రాలకు చేసినట్లే రాష్ట్రానికి సాయం చేస్తున్నారన్నారు.
- కేంద్రం మాట తప్పిందని, ప్రజల చేత సిగ్గుసిగ్గు అనిపించుకోవాల్సి వస్తుందనే అవిశ్వాస తీర్మానం రానీయకుండా అడ్డుకుంటున్నదని ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి ఆరోపించారు.
- పోలవరం రైతుగా వచ్చిన ఎంపీ శివప్రసాద్ మాట్లాడుతూ.. 'ప్రజా ఉద్యమం అనే చర్నాకోలతో నీ మెడలు వంచి నిధులు సక్రమంగా వచ్చేట్లు చేసి నిన్ను ఏ కాలంలో ఎలా దెబ్బతీయాలో అలా చేస్తాం. . రైతులతో పెట్టుకున్న వారు బాగుపడలేదు. సకాలంలో నిధులిచ్చి పోలవరాన్ని వరంగా చేయండి' అని పేర్కొన్నారు.
- జాతీయ జెండా చూసైనా ప్రధాని వైఖరిలో మార్పు వస్తుందని ఆశిస్తున్నానని ఎంపీ మాగంటి బాబు అన్నారు. జాతీయజెండా ఊపుతూ దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడాలంటూ నినదించారు.
- పక్క రాష్ట్రం, దిల్లీ కన్నా మిన్నగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని నాడు నరేంద్రమోదీ, వెంకయ్యనాయుడు హామీనిచ్చారని ఎంపీ తోట సీతారామలక్ష్మి గుర్తుచేశారు.
- సీఎం చంద్రబాబుపై లేనిపోని కేసులు బనాయించి.. బలహీనపర్చి రాష్ట్రాన్ని హస్తగతం చేసుకోవాలని భాజపా చూస్తున్నదని ఎంపీ మురళీమోహన్ ఆరోపించారు.
- రాయలసీమకు రూ. 350 కోట్లు ఇచ్చినట్లే ఇచ్చి వెనక్కి తీసుకోవడం సిగ్గుచేటని ఎంపీ నిమ్మల కిష్టప్ప అన్నారు.
- దేశవ్యాప్తంగా ఒకే రిజర్వేషన్ విధానం సరికాదని ఎంపీ అవంతి శ్రీనివాస్ అన్నారు. కాపుల రిజర్వేషన్లపై ప్రైవేటుమెంబర్స్ బిల్లు ప్రవేశపెట్టనున్నామన్నారు.

ఎస్సీ ఎస్టీ వేధింపుల కేసులకు సంబంధించి సుప్రీంలో కౌంటరు దాఖలు చేయాలంటూ గాంధీ విగ్రహం వద్ద నిరసనకు దిగిన కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని ఎంపీ శివప్రసాద్ పలకరించారు. తాను పోలవరం రైతునని చెప్పగా రాహుల్ చిరునవ్వుతో రైట్‌రైట్ అంటూ స్పందించారు.

ప్రధాని ప్రతిష్ఠను దిగజార్చేలా మాట్లాడారు

- చంద్రబాబుపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తాం: విజయసాయి

ఈనాడు, దిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబుపై పార్లమెంటులో సభాహక్కుల ఉల్లంఘన నోటీసు ఇవ్వనున్నట్లు వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ప్రకటించారు. దేశ ప్రధాని, ఆయన కార్యాలయం, పార్లమెంటు ప్రతిష్ఠను దిగజార్చేలా ముఖ్యమంత్రి శాసనసభ వేదికగా మాట్లాడారని ఆరోపించారు. శుక్రవారం ఆయన ఇక్కడి విజయ్‌చౌక్ వద్ద విలేకరులతో మాట్లాడారు. 'అత్యున్నత పదవిలో ఉన్న ఒక గొప్ప వ్యక్తిపై ఉద్దేశాలు ఆపాదిస్తూ ముఖ్యమంత్రి శాసనసభలో ప్రకటన చేశారు. సభాహక్కులను ఉల్లంఘించారు. దేశ ప్రతిష్ఠనే దిగజార్చారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా అలాంటి దుష్ట సంప్రదాయానికి విరామం ఇవ్వాలని, భవిష్యత్తుల్లో చంద్రబాబు లాంటి వారు ఇలాంటి చర్యలకు పాల్పడకుండా ఉండాలనే ఉద్దేశంతో సభాహక్కుల ఉల్లంఘన నోటీసునిచ్చి ఆయన వివరణ కోరాలనుకుంటున్నా. ప్రధాని కార్యాలయంపై ముఖ్యమంత్రి ఆరోపణలు చేస్తూ, నేరగాళ్లకు అడ్డాగా మారిందంటూ అసెంబ్లీ సాక్షిగా చెప్పారు' అని పేర్కొన్నారు. సభలో లేనివారి గురించి ముఖ్యమంత్రి ఎలా మాట్లాడతారు? అని ప్రశ్నించారు. 'చంద్రబాబుపై మేం చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నాం. తాను తప్పు చేయలేదనుకుంటే ఆంధ్రప్రదేశ్‌లో కాకుండా మరెక్కడైనా చర్చకు రావాలి. అక్కడే మా ఆరోపణలన్నింటి ఆధారాలను చూపిస్తాం' అని పేర్కొన్నారు. 'కేంద్రంలోని ఇద్దరు మంత్రులతో రాజీనామా చేయించారు. ఎన్డీయే నుంచి బయటకొచ్చారు. మళ్లీ ఈ కొద్ది రోజుల్లోనే తన అవినీతి ఎక్కడ బయటపడుతుందో, సీబీఐ విచారణ ఎక్కడ నిర్వహిస్తారోనన్న భయంతో తిరిగి ఎన్డీయేలో చేరేందుకు భాజపాతో మంతనాలు సాగిస్తున్నారు. ఇది ఆయన ద్వంద్వ ప్రవృత్తి' అని విమర్శించారు.

నేరం చేసిన వారిలా భాజపా పారిపోతోంది: రఘువీరారెడ్డి

హైదరాబాద్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వంపై ఈ నెల 27న అవిశ్వాస తీర్మానం పెడుతూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జునఖర్గే నోటీసులు ఇవ్వడాన్ని హర్షిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘువీరారెడ్డి తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలపై కాంగ్రెస్ మొదటినుంచి కట్టుబడి ఉందని అన్నారు. మాజీ మంత్రి శైలజానాథ్, తదితరులతో కలిసి రఘువీరారెడ్డి శుక్రవారం హైదరాబాద్ ఇందిరాభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. వైకాపా, తెదేపాలు ఐదు రోజులుగా అవిశ్వాస తీర్మానాలు ఇస్తున్నా.. తీర్మానానికి కాంగ్రెస్ అనుకూలంగా ఉందని సోనియాగాంధీ నిలబడి చెబుతున్నా పదేపదే లోక్‌సభను వాయిదా వేస్తున్నారని విమర్శించారు. క్రిమినల్ కేసులున్న నిందితుడు ఎలా పారిపోతాడో, సభ నుంచి భాజపా అలానే పారిపోతోందని ధ్వజమెత్తారు. బయట ఉపన్యాసాలు ఇస్తున్న ప్రధాని మోదీ సభలో ఎందుకు వారిచ్చిన హామీలు, ప్రజల ఆకాంక్షల గురించి మాట్లాడడం లేదని కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం దిల్లీలో ప్రశ్నించారు. సభా సంప్రదాయాలను తుంగలో తొక్కడం మోదీకి అలవాటుగా మారిందని ఆరోపించారు.


తప్పు చేశారు కాబట్టే చంద్రబాబు భయపడుతున్నారు

- మేకపాటి రాజమోహన్‌రెడ్డి వ్యాఖ్య

ఈనాడు, దిల్లీ: ముఖ్యమంత్రి చంద్రబాబు పవిత్రుడిలా రోజూ నీతివాక్యాలు చెబుతున్నారని వైకాపా లోక్‌సభాపక్ష నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం లోక్‌సభ వాయిదాపడ్డాక పార్టీ ఎంపీలతో కలిసి రాజమోహన్‌రెడ్డి విజయ్‌చౌక్‌లో విలేకరులతో మాట్లాడారు. 'మా పార్టీ నుంచి 23 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలను కొన్నారు. పట్టిసీమలో రూ. 370 కోట్లు అవినీతి చేశారని, దానిపై సీబీఐ విచారణ జరపాలని భాజపా ఎమ్మెల్యే అసెంబ్లీలోనే డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి మాత్రం నేనేమీ తప్పు చేయలేదంటారు. తప్పు చేశారు కాబట్టే భయపడుతున్నారు. రాబోయే రోజుల్లో భాజపా పరిస్థితి బాగుండదనే ఆ పార్టీ నుంచి దూరం జరుగుతున్నారు. మరోవైపు భాజపా ఎలాంటి ప్రమాదం తీసుకువస్తుందోనని భయపడుతున్నారు. నిజాయితీగా ఉంటే విచారణ చేసుకోండని సవాల్ చేసి ఉండొచ్చు కదా? తప్పులన్నీ చేసి ఎంత ధైర్య ఉంటే అవినీతి, నైతిక విలువల గురించి ముఖ్యమంత్రి మాట్లాడగలుగున్నార'ని ధ్వజమెత్తారు.

నర్సరీలకు ఉచిత విద్యుత్తు

- వ్యవసాయంతో సమానంగా ఉద్యానరంగ అభివృద్ధి: చంద్రబాబు



ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రంలోని నర్సరీలకు ఉచిత విద్యుత్తు అందించాలని నిర్ణయించినట్లు సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. కడియం నర్సరీ రైతులు ప్రభుత్వానికి బకాయిపడిన రూ. 3.76 కోట్లను రద్దు చేస్తున్నామని, ఇందుకోసం జీవో నెం. 39ని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల 50 వేల మంది రైతులకు లబ్ధి చేకూరనుందన్నారు. వ్యవసాయరంగంతో సమానంగా ఉద్యానరంగాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. రూ. 10 కోట్ల వ్యయంతో ప్రపంచస్థాయి పూల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో కడియం ప్రాంత నర్సరీ రైతులతో నిర్వహించిన సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్ర ఉద్యానరంగంలో ప్రపంచంలోని అత్యుత్తమ పద్ధతులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చొరవ తీసుకుంటామని వివరించారు. గతంలో సింగపూర్‌లో పర్యటించిన సమయంలో అక్కడి పూల వనాల్లో కన్పించిన వాటిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారని ప్రశ్నించగా తూర్పుగోదావరి జిల్లా కడియం నుంచి తెచ్చినట్లు వారు చెప్పినపుడు ఎంతో గర్వంగా అనిపించిందన్నారు. విభజనానంతరం రాష్ట్రంలో ఉన్న సమస్యలను పరిష్కరించమని ఎలాంటి భేషజాలు లేకుండా ఓపిగ్గా ప్రయత్నించినా కేంద్రం పట్టించుకోలేదన్నారు. రాజకీయ దురుద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేకహోదాను ఇవ్వడం లేదని విమర్శించారు. జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్, ఉద్యానశాఖ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు.

సెన్సెక్స్ ▼ 410 **32597**

నిఫ్టీ ▼ 117 **9998**

డోజోన్స్ 24027 ▲ 69 | నాస్‌డాక్ 7140 ▼ 27

అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

రూపాయి 65.01 ▲ 10 పైసలు (ఒక అమెరికా డాలరుకు)

ముడి చమురు 70.03 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ఘనం (+)

నిఫ్టీ	23న	మార్పు %
HCL TECH	957.40	2.89
BHARTI INFRATEL	342.50	2.18
ZEE ENTERTAINMENT	569.40	1.82
ADANI PORT	362.40	1.16
POWER GRID CORP	194.25	0.80
TECH MAHINDRA	623.35	0.69
INFOSYS	1167.60	0.54
ASIAN PAINTS	1112.65	0.50

గ్రహణం (-)


నిఫ్టీ	23న	మార్పు %
VEDANTA	276.00	-5.41
HINDALCO	206.10	-4.94
YES BANK	286.65	-3.89
AXIS BANK	499.50	-3.61
LUPIN	734.50	-3.16
SBI	234.80	-2.79
ICICI BANK	275.55	-2.72
TATA STEEL	566.50	-2.48

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం	కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	59.32	68.79	బహ్రెయిన్ దీనార్	160.65	184.10
పౌండ్ స్టెర్లింగ్	83.74	97.12	కువైట్ దీనార్	179.92	223.98
యూరో	73.17	84.87	ఒమన్ రియాల్	157.32	179.98
జపనీస్ యెన్/100	56.58	65.63	సౌదీ రియాల్	15.78	18.69
ఆస్ట్రేలియా డాలరు	45.75	52.93	యూఏఈ దిర్హమ్	16.15	18.88
సింగపూర్ డాలరు	45.12	53.44	మలేషియా రింగిట్	14.84	18.25
థాయ్ బాత్/100	189.77	226.97	చైనీస్ యువాన్	7.29	11.82



తగ్గిన విదేశీ మారకపు నిల్వలు

ముంబయి: విదేశీ మారకపు నిల్వలు మార్చి 16తో ముగిసిన వారానికి 15.24 కోట్ల డాలర్లు తగ్గి 42,133.4 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. రెండు వారాలపాటు పెరుగుతూ వచ్చిన విదేశీ మారకపు నిల్వలు.. విదేశీ కరెన్సీ ఆస్తుల్లో తగ్గుదల కారణంగా తాజాగా తగ్గినట్లు రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. గత వారం 72.89 కోట్ల డాలర్లు పెరిగి విదేశీ మారకపు నిల్వలు 42,148.7 కోట్ల డాలర్లకు చేరిన సంగతి విదితమే. 40,000 కోట్ల డాలర్ల మార్కును తొలిసారిగా సెప్టెంబరు 8, 2017తో ముగిసిన వారానికి దాటాయి. మొత్తం నిల్వల్లో ప్రధానమైన విదేశీ కరెన్సీ ఆస్తులు మార్చి 16తో ముగిసిన వారంలో 17.52 కోట్ల డాలర్లు తగ్గి 39,615.6 కోట్ల డాలర్లకు చేరాయి. బంగారం నిల్వలు 1.32 కోట్ల డాలర్లు పెరిగి 2,156.2 కోట్ల డాలర్లకు చేరాయి. అంతర్జాతీయ ద్రవ్య నిధి వద్ద మన ఎస్‌డీఆర్ (స్పెషల్ డ్రాయింగ్ రైట్స్)లు 41 లక్షల డాలర్లు పెరిగి 153.8 కోట్ల డాలర్లకు చేరాయి. ఇదే సమయంలో నిల్వలు కూడా 55 లక్షల డాలర్లు పెరిగి 207.7 కోట్ల డాలర్లకు చేరినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

భూషణ్ స్టీల్ ఇక టాటా స్టీల్‌దే!

● బిడ్ గెలుచుకున్న దిగ్గజం

దిల్లీ: దివాలాలో ఉన్న భూషణ్‌స్టీల్‌ను కొనుగోలు చేయడానికి టాటా స్టీల్ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. అయితే ఎంత మొత్తానికన్నది తెలియరాలేదు. పరిశ్రమ వర్గాల అంచనా ప్రకారం.. కొనుగోలు విలువ రూ.35,000 కోట్లుగా ఉండొచ్చు. మొత్తం నగదు రూపంలో జరిగే ఈ ఒప్పందం పూర్తయితే టాటా స్టీల్ భారత్‌లోనే అతిపెద్ద ఉక్కు తయారీ కంపెనీగా అవతరిస్తుంది. ప్రస్తుతం టాటా స్టీల్‌కు 13 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యం ఉండగా.. భూషణ్ స్టీల్‌కు చెందిన 5.6 మిలియన్ టన్నుల సామర్థ్యం అదనంగా జతచేరనుంది.

'భూషణ్‌స్టీల్‌కు రుణాలిచ్చిన రుణదాతల కమిటీ(సీఓసీ) మమ్మల్ని ఆ కంపెనీని కొనుగోలు చేయడానికి అనుమతులిచ్చింది. అయితే నియంత్రణపరమైన(సీసీఐ, ఎన్‌సీఎల్‌టీ) అనుమతులు దక్కాల్సి ఉంద'ని టాటా స్టీల్ ఒక ప్రకటనలో పేర్కొంది. బ్యాంకులకు భూషణ్ స్టీల్ రూ.48,100 కోట్ల బకాయిలు ఎగవేసిన నేపథ్యంలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ తదితర కంపెనీలు బిడ్‌లు వేశాయి. చివరకు టాటా స్టీల్ బిడ్‌కు ఆమోదం లభించింది. 'కార్పొరేట్ దివాలా పరిష్కార ప్రక్రియ(సీఐఆర్‌పీ) కింద టాటా స్టీల్ దాఖలు చేసిన ఆసక్తి వ్యక్తీకరణ(ఎల్‌ఓఐ)కు భూషణ్ స్టీల్ సీఓసీ ఆమోదించింద'ని భూషణ్ స్టీల్ సైతం ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో తెలిపింది. అయితే నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) అనుమతి కోసం పరిష్కార ప్రణాళికను నివేదించాల్సి ఉందని అందులో వివరించింది.



టాటా ప్రణాళిక ఇదీ..

అయిదేళ్లలో రెట్టింపు సామర్థ్యాన్ని(26 మిలియన్ టన్నులు) పొందాలని టాటా స్టీల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవల ఒడిశాలో ఒక కొత్త ఉక్కు ప్లాంటును సైతం ప్రారంభించింది. ఇపుడు తాజాగా భూషణ్ స్టీల్‌ను కొనుగోలు చేయడం ద్వారా జేఎస్‌డబ్ల్యూను అధిగమించి దేశంలోనే అతిపెద్ద ఉక్కు తయారీ కంపెనీగా మారుతుంది.

ఆ 12 ఖాతాల్లో ఇదే మొదటిది

నిరర్థక ఆస్తులుగా మారిన పెద్ద ఖాతాల వివరాలను, ఎన్‌సీఎల్‌టీకి సిఫారసు చేయమంటూ బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ పంపిన తొలి 12 కంపెనీల జాబితాలో భూషణ్ స్టీల్ మొదటిది. ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్ బిడ్డింగ్ ప్రక్రియలోనూ టాటా స్టీల్ పాల్గొంది. భూషణ్ పవర్ అండ్ స్టీల్‌కు సైతం దరఖాస్తు చేసుకుంది. ఒక వేళ ఇవి కూడా టాటా స్టీల్ సొంతమైతే దేశంలో ఫ్లాట్ స్టీల్ ఉత్పత్తుల్లో సగం మార్కెట్ వాటా టాటా స్టీల్‌దే అవుతుంది.

ఎస్సార్ స్టీల్ కోసం యార్సెలర్ మిత్తల్ మళ్లీ బిడ్

వేదాంతా దూరం

దిల్లీ: ఎస్సార్ స్టీల్ కొనుగోలు కోసం వేసిన బిడ్‌ను ఆ కంపెనీకి రుణాలిచ్చిన బ్యాంకులు తిరస్కరించడంతో యార్సెలర్ మిత్తల్ మరోసారి ప్రయత్నిస్తోంది. దివాలా ప్రక్రియలో ఉన్న ఎస్సార్ స్టీల్ కోసం మరో సారి బిడ్ వేయాలన్న యోచనలో ఉన్నట్లు యార్సెలర్ తెలిపింది. ఎస్‌బీఐ ఆధ్వర్యంలోని బ్యాంకుల కన్సార్షియం ఈ వారంలోనే యార్సెలర్ మిత్తల్-న్యూమెటల్ వేసిన బిడ్‌ను తిరస్కరించింది. దివాలా స్మృతి కింద ఆ బిడ్‌కు అర్హత లేదని చెప్పింది. కాగా, 'దివాలా పరిష్కార అధికారి నుంచి ఎటువంటి నోటిఫికేషన్ అందలేదు. అయితే తిరిగి ఆ బిడ్డింగ్‌లో పాల్గొనాలని నిర్ణయించుకున్నామ'ని యార్సెలర్ మిత్తల్ ఒక ప్రకటనలో పేర్కొంది. 30కి పైగా బ్యాంకుల నుంచి రూ.45,000 కోట్ల మేర ఎస్సార్ స్టీల్ రుణాలు తీసుకున్న సంగతి తెలిసిందే.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఎస్సార్ స్టీల్ రీబిడ్డింగ్ ప్రక్రియలో వేదాంతా పాల్గొనే అవకాశం కనిపించడం లేదు. 'వేదాంతా దృష్టి ఎలక్ట్రోస్టీల్ స్టీల్స్‌పై ఉంది. ఎస్సార్ స్టీల్‌కు తొలుత ఆసక్తి వ్యక్తీకరణ తెలిపినా బిడ్ వేయలేదు. కాబట్టి దాని కోసం రెండో సారి బిడ్డింగ్‌లో పాల్గొనకపోవచ్చ'ని ఈ పరిణామాలతో సంబంధమున్న ఒక వ్యక్తి పేర్కొన్నారు. రూ.11,000 కోట్లకు పైగా బకాయిలు పడ్డ ఎలక్ట్రోస్టీల్ కూడా దివాలా ప్రక్రియలో ఉన్న సంగతి తెలిసిందే.

జియోకు మరో 83 లక్షల కనెక్షన్లు

● జనవరిలో కొత్తగా చేరిక

● మొత్తం చందాదార్లు 16.84 కోట్లు

దిల్లీ: రిలయన్స్ జియో జనవరిలో కొత్తగా 83 లక్షల మంది చందాదార్లను తన నెట్‌వర్క్‌లో చేర్చుకోగలిగింది. ఇదే సమయంలో దిగ్గజ సంస్థలైన భారతీ ఎయిర్‌టెల్ (15 లక్షలు), వొడాఫోన్ (13 లక్షలు), ఐడియా (11 లక్షలు) నెట్‌వర్క్‌లలో చేరిన కొత్త చందాదార్లు 39 లక్షల మంది మాత్రమే. అంటే ఈ 3 సంస్థల కొత్త చందాదార్లను కలిపినా, జియోకు రెట్టింపు కంటే అధికంగా జత చేరారు. జనవరి ఆఖరుకు జియో చందాదార్ల సంఖ్య 16.84 కోట్లకు చేరింది. అయితే 29.16 కోట్ల మంది వినియోగదారులతో భారతీ ఎయిర్‌టెల్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. వొడాఫోన్ 21.38 కోట్లు, ఐడియా సెల్యులార్ 19.76 కోట్ల మంది వినియోగదారుల్ని కలిగి ఉన్నాయి. బీఎస్‌ఎన్‌ఎల్ జనవరిలో చేర్చుకున్న 3,96,111 మందితో కలిపి 10.83 కోట్ల వినియోగదారుల్ని కలిగి ఉంది. మిగతా టెలికాం సంస్థలు తమ వినియోగదారుల్ని కోల్పోయాయి. అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ జనవరిలో 2.11 కోట్ల మంది వినియోగదారుల్ని కోల్పోయింది. టాటా టెలి సర్వీసెస్, టాటా టెలి సర్వీసెస్ మహారాష్ట్ర 19 లక్షల మందిని, ఎయిర్‌సెల్ 35 లక్షల మందిని, టెలినార్ 16 లక్షల మందిని, ఎంటీఎన్‌ఎల్ 10,634 మంది వినియోగదారుల్ని కోల్పోయాయి. జనవరి 31 నాటికి మొత్తం 115.19 కోట్ల మంది మొబైల్ ఫోన్ వినియోగదారులున్నారని ట్రాయ్ పేర్కొంది. డిసెంబరులో ఈ సంఖ్య 116.74 కోట్లు కావడం గమనార్హం.



టెలిఫోన్ వినియోగదారులు తగ్గారు

టెలిఫోన్ వినియోగదారులు డిసెంబరు నెలతో పోలిస్తే జనవరిలో 1.32 శాతం మంది తగ్గారు. టెలికాం చందాదార్ల సంఖ్య 119.06 కోట్ల నుంచి 117.50 కోట్లకు పరిమితమైందని ట్రాయ్ తెలిపింది. బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు డిసెంబరుతో పోలిస్తే 4.2 శాతం మంది పెరిగారు. 36.28 కోట్ల నుంచి 37.81 కోట్లకు చేరారు.

డిజిటల్ సంగీత సేవల్లోకి

డిజిటల్ సంగీత సేవల్లో తన స్థానం పటిష్టపరచుకునేందుకు సావన్‌తో రిలయన్స్ జియో ఒప్పందం కుదుర్చుకుంది. వంద కోట్ల డాలర్లకు (రూ.6,500 కోట్లకు) పైగా పెట్టుబడితో డిజిటల్ మీడియా ప్లాట్‌ఫాం ఏర్పాటుకు ఈ ఒప్పందం దోహద పడనుంది. 'ఈ రంగంలో ఎంతో అనుభవం కలిగిన సావన్ జట్టుతో కలిసి పని చేయడంతో ప్రపంచానికి విస్తరించగలమని' జియో డైరెక్టర్ ఆకాశ్ అంబానీ తెలిపారు.

డెక్కన్ క్రానికల్‌పై ఎఫ్ఐఆర్ నమోదు

● యూఐఐసీ మోసం కేసులో

దిల్లీ: యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ(యూఐఐసీ)ని రూ.30.54 కోట్ల వరకు మోసం చేసిన ఆరోపణలపై డెక్కన్ క్రానికల్ హోల్డింగ్స్, ఆ కంపెనీ ఛైర్మన్ టి. వెంకట్రామ్ రెడ్డి, ఇతరులపై కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) తొలి సమాచార నివేదిక(ఎఫ్ఐఆర్)ను నమోదు చేసిందని అధికారులు తెలిపారు. యూఐఐసీ(పెట్టుబడుల విభాగం, చెన్నై) మాజీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ. బాలసుబ్రమణియన్, మాజీ చీఫ్ మేనేజరు కె.ఎల్. కుంజిల్వార్‌లతో పాటు కేర్, ఐడీఎఫ్‌సీలపైనా ఎఫ్ఐఆర్ నమోదైంది. బాలసుబ్రమణియన్, కుంజిల్వార్‌లు 2011లో డీసీహెచ్‌ఎల్ జారీ చేసిన స్వల్పకాలిక అన్‌సెక్యూర్డ్ రిడీమబుల్ నాన్-కన్వర్టబుల్ డిబెంచర్లలో యూఐసీసీ తరపున పెట్టుబడులు పెట్టారు. అయితే వాటిని కంపెనీ తిరిగి చెల్లించని కారణంగా యూఐఐసీకి రూ.30.54 కోట్ల నష్టం వచ్చిందన్నది ఆరోపణ. పెట్టుబడుల ప్రతిపాదనలను పూర్తిగా పరిశీలించకుండానే ఎ. బాలసుబ్రమణ్యం ఆమోదం తెలిపారని.. అదే సమయంలో కేర్ రేటింగ్స్ ఇచ్చిన రేటింగ్స్ ఆధారంగా యూఐఐసీ పెట్టుబడులు పెట్టిందని ఎఫ్ఐఆర్‌లో సీబీఐ పేర్కొంది. కేర్ రేటింగ్‌ను పరిగణనలోకి తీసుకోవడం మినహా, సొంతంగా ఎటువంటి నష్టభయ విశ్లేషణను యూఐఐసీ చూపట్టలేకపోయిందని అందులో ఆరోపించింది. కేవలం ఒకే ఒక అరేంజర్(ఐడీఎఫ్‌సీ) ద్వారా ఈ కొనుగోలు జరిగిందని వివరించింది.

డీసీహెచ్‌ఎల్ రుణదాతల కమిటీ అభ్యర్థనకు ఎన్‌సీఎల్‌టీ అనుమతి

ఈనాడు, హైదరాబాద్: డెక్కన్ క్రానికల్ హోల్డింగ్ లిమిటెడ్(డీసీహెచ్‌ఎల్)పై దివాళా పరిష్కార ప్రక్రియ కొనసాగించడానికి గడువు కావాలన్న రుణదాతల కమిటీ అభ్యర్థనను హైదరాబాద్‌లోని జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్(ఎన్సీఎల్‌టీ) శుక్రవారం అనుమతించింది. దివాళా పరిష్కార నిపుణుడు(ఐఆర్‌పీ)ను మార్చడానికి జరిగిన ప్రక్రియలో జాప్యం చేసుకుందని, ఈ నేపథ్యంలో మరికొంత గడువు కావాలని రుణదాతల కమిటీ కోరింది. అందుకు ఎన్సీఎల్‌టీ గడువిచ్చింది. డీసీహెచ్‌ఎల్ నుంచి సుమారు రూ.600 కోట్లకు పైగా రుణ బకాయిల వసూలు కోసం కెనరా బ్యాంక్ ఎన్సీఎల్‌టీలో దివాళా పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

జిగ్నేశ్ షాపై సీబీఐ కేసు నమోదు

● కార్యాలయాల్లో సోదాలు

దిల్లీ: ఎమ్‌సీఎక్స్ మాజీ ఎండీ జిగ్నేశ్ షాతో పాటు ఫార్వర్డ్ మార్కెట్ కమిషన్ (ఎఫ్‌ఎమ్‌సీ)కు చెందిన నలుగురు మాజీ ఛైర్‌పర్సన్లు, ఇతరులపై సీబీఐ కేసు నమోదు చేసింది. 2003లో మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజ్ (ఎమ్‌సీఎక్స్)కు అర్హతలు లేకపోయినప్పటికీ దేశీయ ఎక్స్ఛేంజీ హోదా ఇవ్వడం ఇందుకు నేపథ్యం. ముంబయి, గ్వాలియర్, సిమ్లాలలోని తొమ్మిది ప్రాంతాలతో పాటు షా కార్యాలయంలో సోదాలు జరిగాయి. బిష్ణు ఖట్వా, కేవల్ రామ్, ఆనంద్ కుమార్ భట్, రాజీవ్ కుమార్ అగర్వాల్‌లు కేసు నమోదైన నలుగురు మాజీ ఛైర్మన్ల జాబితాలో ఉన్నారని సీబీఐ అధికారులు పేర్కొన్నారు. ఎమ్‌సీఎక్స్ మాజీ ఎండీ జోసెఫ్ మాసే, మార్కెట్ కమిషన్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ విశాల్ నాయర్‌ల పేర్లు కూడా ఎఫ్ఐఆర్‌లో ఉన్నట్లు వారు తెలిపారు. 'జిగ్నేశ్ షా, ఎఫ్‌టీఐఎల్‌లు పరిమితికి మించి షేర్లను అట్టే పెట్టిఉంచుకున్నారని.. అదనపు షేర్లను విక్రయించడం ద్వారా రూ.137 కోట్ల మోసపూరిత లాభాలను పొందార'ని ఒక అధికారి పేర్కొన్నారు.

మార్కెట్ కబుర్లు

✦ అర్హులైన సంస్థాగత మదుపర్ల (క్యూఐపీ)కు ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.1,200 కోట్లు సమీకరించినట్లు **జిందాల్ స్టీల్** ప్రకటించింది.

✦ అంతరిక్షంలో పనికొచ్చే లిథియం- అయాన్ బ్యాటరీల తయారీ కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)తో ప్రభుత్వ రంగ సంస్థ **భెల్** సాంకేతిక పరిజ్ఞాన బదిలీ ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

✦ మహారాష్ట్రలో రూ.2,921.83 కోట్ల 3 రహదారుల ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి సంయుక్త సంస్థ భాగస్వామి లాంగ్‌జియాన్ రోడ్ అండ్ బ్రిడ్జ్ కంపెనీతో కలిసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నుంచి ఆర్డర్లు దక్కించుకున్నట్లు **ఎంఈపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్** వెల్లడించింది.

✦ ఇటీవల పబ్లిక్ ఇష్యూ ముగించుకున్న **బంధన్ బ్యాంక్..** 27న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కానుంది. ఈ ఐపీఓకు 14.6 రెట్ల అధిక స్పందన లభించింది.

✦ **ఐసీఐసీఐ సెక్యూరిటీస్** పబ్లిక్ ఇష్యూ రెండో రోజున 36 శాతం స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 4,42,25,343 షేర్లను జారీ చేయగా.. 1,59,57,060 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

✦ **మిశ్రధాతు నిగమ్ (మిధానీ)** పబ్లిక్ ఇష్యూకు 1.21 రెట్ల అధిక స్పందన వచ్చింది. ఇష్యూలో భాగంగా 4,87,08,400 షేర్లను జారీ చేయగా.. 5,90,65,050 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

దేశీయ విపణిపై జేడీఏ దృష్టి


ఈనాడు, హైదరాబాద్: రిటైల్ రంగానికి సాఫ్ట్‌వేర్ సొల్యూషన్లు అందిస్తున్న జేడీఏ సాఫ్ట్‌వేర్ భారత్ ఆదాయాన్ని పెంచుకోవాలని భావిస్తోంది. దేశంలో జీఎస్‌టీ అమలులోకి రావడం, ఇ-కామర్స్ రంగ అభివృద్ధి ఆకర్షణీయంగా ఉండడం ఆదాయం పెరగడానికి దోహదం చేయనున్నాయని, 2025 నాటికి కంపెనీకి భారత్ అత్యంత కీలక మార్కెట్ కాగలదని జేడీఏ సాఫ్ట్‌వేర్ సీఈఓ గిరీశ్ రిషి తెలిపారు. హైదరాబాద్‌లోని కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కంపెనీకి ప్రపంచ వ్యాప్తంగా 4,400 మంది ఉద్యోగులు ఉన్నారని, ఇందులో సగం మంది హైదరాబాద్, బెంగళూరు కేంద్రాల్లోనే పని చేస్తున్నారని వివరించారు. 70 శాతం ఉత్పత్తుల అభివృద్ధి భారత్‌లోనే జరుగుతోందని చెప్పారు.

హెచ్‌సీఎల్ టెక్నాలజీస్



రూ.905 వద్ద ప్రారంభమై రూ.903.55 - 960.55 మధ్య కదలాడి, క్రితం ముగింపు 930.55తో పోలిస్తే రూ.26.85 (2.89%) లాభంతో రూ.957.40 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈలో చేతులు మారిన షేర్లు 27,39,036

వేదాంతా




రూ.284.25 వద్ద మొదలై రూ.274.30 - 285.50 మధ్య చలించి, క్రితం ముగింపు 291.80తో పోలిస్తే రూ.15.80 (5.41%) నష్టంతో రూ.276 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలో 1,32,90,580 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)		52 వారాల కనిష్ఠం (రూ.లలో)	
న్యూలైట్ అప్పరెల్స్	30.70	అదానీ పవర్	23.70
తిరణి ప్రాజెక్ట్స్	37.00	అనంత్‌రాజ్	44.00
మెహాయ్ టెక్నాలజీ	90.00	యూడ్ ల్యాబ్స్	45.05
దలాల్ స్ట్రీట్ ఇన్వెస్ట్‌మెంట్స్	143.90	ఆదిత్య బిర్లా క్యాపిటల్	143.80
బీపీఎల్ ఫార్మా	175.90	అంబుజా సిమెంట్స్	223.50
వాదిలాల్ ఎంటర్‌ప్రైజెస్	1100.00	అమృతాంజన్	535.00

ఎఫ్ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
23/03	7,246	5,617	1,628	4,203	5,138	–935
22/03	5,225	5,064	161	3,692	3,282	410
21/03	5,515	5,416	98	3,692	3,494	198
20/03	4,976	4,632	344	3,574	2,843	731

కోడిగుడ్లు: 23న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



(100కు రూపాయలలో)

హైదరాబాద్	315	వరంగల్	317
చిల్లరగా(ఒక గుడ్డు)	3.75	విశాఖపట్నం	325
బెంగళూరు	350	చెన్నై	370
24వ తేదీకి...		చిత్తూరు	363
విజయవాడ/గోదావరి	310	నమక్కల్	360

ఎన్‌ఎస్‌ఈ

శుక్రవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 362.40 (358.25) 4518979
AMBUJA CEMEN 227.20 (228.25) 1842220
ASIAN PAINTS 1112.65 (1107.10) 828523
AUROBIND PHA 551.65 (557.40) 2207278
AXIS BANK LT 499.50 (518.20) 29385110
BAJAJ AUTO L 2789.95 (2834.95) 451122
BAJAJ FINANC 1685.30 (1695.60) 1088426
BHARTI AIRTE 412.70 (415.60) 5133743
BHARTI INFRA 342.50 (335.20) 2991192
BOSCH LTD 17361.80 (17350.20) 21555
BPCL 413.45 (414.70) 3663740
CIPLA 538.40 (540.75) 1203262
COAL INDIA L 269.95 (269.40) 3980861
DR. REDDYS 2072.30 (2108.30) 474396
EICHER MOTOR 27896.10 (28030.50) 44127
GAIL 439.60 (438.40) 8750824
HCL TECH 957.40 (930.55) 2739036
HDFC 1789.60 (1809.55) 2788553
HDFC BANK 1841.55 (1867.75) 1797538
HERO MOTOCOR 3413.75 (3452.30) 423299
HINDALCO IND 206.10 (216.80) 12819120
HINDUSTAN UN 1301.65 (1311.85) 1301609
HPCL 339.00 (342.85) 2813472
ICICI BANK 275.55 (283.25) 31922568
INDIABULLS H 1200.40 (1220.35) 908851
INDIAN OIL 168.85 (170.10) 8890932
INDUSINDBANK 1749.50 (1753.10) 1854651
INFOSYS LTD 1167.60 (1161.30) 6004042
ITC 256.00 (258.30) 11185677
KOTAK MAHIND 1038.80 (1053.05) 1961492
LARSEN & TOU 1267.90 (1296.25) 2280525
LUPIN 734.50 (758.50) 1701513
M&M 732.90 (730.85) 2276332
MARUTI SUZIK 8607.25 (8696.55) 644482
NTPC LTD 170.05 (170.95) 9023161
ONGC 177.40 (178.90) 6884971
POWER GRID C 194.25 (192.70) 5097792
RELIANCE IND 893.90 (908.15) 10729694
SBI 234.80 (241.55) 27150262
SUN PHARMA 502.40 (508.40) 5098042
TATA CONSULT 2818.15 (2831.35) 1827061
TATA MOTORS 330.85 (338.20) 8578297
TATA STEEL L 566.50 (580.90) 14133550
TECH MAHINDR 623.35 (619.05) 3153066
ULTRATECH 3873.75 (3925.15) 249194
UPL LIMITED 704.75 (716.90) 1360837
VEDANTA LIMI 276.00 (291.80) 13290580
WIPRO 284.65 (288.45) 3289391
YES BANK LTD 286.65 (298.25) 21617995

ZEE ENTERTAI 569.40 (559.20) 2132211

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1277.90 (1289.80) 35739
ACC 1528.55 (1549.40) 208904
ASHOK LEYLAN 142.05 (142.00) 18267529
AVENUE SUPER 1281.10 (1320.45) 521909
BAJAJ FINSER 5126.70 (5119.85) 173772
BANK OFBAROD 133.20 (134.95) 14793481
BEL 139.95 (143.40) 8205730
BHEL 81.40 (81.40) 6338328
BRITANNIA 4839.65 (4838.20) 136672
CADILA HEALT 370.35 (377.30) 917584
COLGATE PALM 1037.20 (1045.20) 182599
CONTAINER 1210.30 (1180.95) 613345
CUMMINS INDI 733.70 (732.95) 323008
DABUR INDIA 318.20 (316.95) 2284582
DLF LIMITED 203.00 (213.20) 8236891
EMAMI LIMITE 1060.15 (1056.85) 136997
GLAXOSMI CON 6426.00 (6426.10) 3810
GLAXOSMI PHA 2174.30 (2215.05) 11330
GLENMARK PHA 535.40 (544.85) 572092
GODREJ CONSU 1094.90 (1084.05) 410947
HAVELLS INDI 492.65 (495.90) 814892
HINDUSTAN ZI 301.45 (312.75) 2797668
ICICI PRU LI 381.60 (378.05) 1205048
IDEA CELLULR 77.65 (77.60) 13329299
INTERGLOBE A 1247.10 (1258.70) 670202
JSW STEEL LT 286.00 (286.00) 6571245
LIC HOUS.FIN 519.85 (525.25) 2001610
MARICO LIMIT 325.55 (322.95) 1256743
MCDOWELL 3078.95 (3054.60) 468408
MOTHERSON 306.15 (310.95) 3625027
MRF 69236.90 (69489.30) 4854
NHPC LTD 26.55 (26.20) 6076918
NMDC LTD 120.15 (121.00) 4778409
OIL INDIA 349.95 (341.35) 5043261
ORACLE FIN S 3797.20 (3816.05) 21887
P&G HYG&HEAL 9252.85 (9320.10) 3333
PETRONET LNG 232.00 (234.15) 4522706
PIDILITE IND 902.20 (908.10) 491815
PIRAMAL ENTE 2395.40 (2477.70) 241320
PNB 93.15 (96.55) 23075193
POWER FIN CO 85.15 (86.80) 6746446
RURAL ELEC C 123.45 (126.40) 5103332
SAIL 68.70 (73.70) 29849099
SHREE CEMENT 16039.30 (16354.45) 28295
SHRIRAM TRAN 1394.10 (1401.10) 417724
SIEMENS 1090.90 (1095.55) 134822
SUN TV LTD 831.25 (848.25) 1422906
TATA POWER 80.00 (80.00) 6418882
TITAN IND 895.05 (887.55) 4132765
TORRENT PHAR 1250.80 (1247.80) 406035

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 158.10 (164.55) 743205
ADANI ENTERP 152.45 (159.45) 9936873
ADANI POWER 24.10 (25.15) 12030957
ALL BANK 46.60 (48.50) 3829621
AMARA RAJA 770.00 (778.20) 354870
ANANT RAJIND 46.85 (48.30) 1186824
ANDHRA BANK 39.90 (42.05) 6538001
APOLLO HOSPI 1008.35 (1022.30) 209179
APOLLO TYRES 256.05 (260.20) 2051561
APTECH 279.95 (288.80) 349250
BAJAJ ELECT. 532.15 (535.20) 619409
BAJAJ HIND 9.25 (9.65) 4150650
BAJAJ HOLDIN 2530.20 (2527.45) 13683
BALAJI TELE 128.70 (129.55) 102044
BALLARPUR IN 12.75 (12.95) 1184196
BALRAMPUR CH 84.95 (87.10) 4200343
BANK OF MAHA 13.65 (14.10) 1001009
BANK OFINDIA 97.45 (102.35) 8452627
BATA INDIA 709.05 (705.20) 392981
BGR ENERGY S 100.70 (102.45) 80494
BHARAT FORGE 690.30 (698.65) 1665813
BHUSHAN STEE 41.60 (39.50) 11042417
BIOCON LTD 571.20 (579.90) 1240877
BOMBAY DYE 239.45 (250.05) 3993756
CANARA BANK 244.75 (254.65) 6282424
CEAT LIMITED 1430.85 (1473.00) 452802
CENTRAL BANK 72.65 (75.50) 4252701
CHAMBAL FERT 164.10 (170.05) 959386
CHENNAI PETR 322.00 (338.35) 458749
CITY UNIBANK 170.00 (173.90) 556504
CORPO BANK 29.60 (30.75) 474429
COX & KINGS 234.15 (240.80) 1323381
D B REALTY L 44.15 (46.30) 698108
DELTA CORP L 286.25 (293.15) 2710030
DENA BANK 18.55 (19.05) 1338064
DHANALAKBANK 21.25 (22.40) 2989933
DIVIS LAB 1037.70 (1068.80) 710829
EDELWEISS CA 232.00 (236.50) 2743356
EID PARRY 284.60 (276.85) 236640
EIH 160.30 (164.35) 144465
ESSAR SHIPPI 22.60 (23.35) 42312
ESTER INDUST 66.05 (69.50) 170681
EXIDE INDUST 216.20 (217.40) 3012938
FEDERAL BANK 90.65 (90.85) 8461138
FINOLEX CABL 632.05 (637.10) 65861
G E SHIP LTD 332.10 (341.00) 41135
GAMMON INFRA 2.20 (2.30) 9430637
GATI LIMITED 97.05 (100.00) 538318
GAYATRI PROJ 184.00 (188.95) 147989
GITANJALIGEM 9.60 (10.10) 21506
GMR INFRASTR 16.70 (17.50) 43483709
GODREJ IND 532.80 (528.35) 330328
GRASIM IND 1082.60 (1092.90) 943252
GUJ ALK&CHEM 708.85 (705.15) 119847
HCL INFOSYS 49.85 (51.70) 1873824
HDFC BANK 1886.00 (1917.00) 60767
HEXA TECH 377.15 (385.05) 1379002
HIMACHAL FUT 25.35 (26.25) 5898121
HOUSING DEV 39.60 (41.05) 7652734
IDBI 71.85 (76.65) 34065584
IDFC 49.30 (51.00) 8568135
IFCI 19.60 (20.15) 9324007
IL&FS TRANS 62.35 (64.10) 646679
IND SWIFTLAB 55.95 (58.20) 24495
INDBULLS REL 192.45 (200.65) 6700866
INDIA CEM 137.95 (140.75) 3064781
INDIAN BANK 280.90 (289.20) 1386158
INDO RAMA SY 29.20 (29.85) 248048
INDRAPRASTHA 282.00 (291.25) 2728794
IND-SWIFTLTD 7.20 (7.45) 8333
INGERSOLL-R 669.60 (687.55) 28232
IOB 17.65 (18.15) 758303
IPCA LAB 662.65 (665.70) 69711
IRB INFRA DE 216.35 (218.60) 720894
J&K BANK 58.30 (58.35) 449008
JAI CORP 128.35 (137.05) 1499552
JAIN IRRIGAT 106.70 (105.10) 7464411
JAYPEE INFRA 8.85 (9.25) 5965396
JAYSHREE TEA 90.40 (93.95) 59874
JET AIRWAYS 620.05 (641.90) 3356605
JINDAL SAW 115.40 (120.20) 1149574
JINDAL STEEL 213.75 (224.90) 19683008
JK LAKSHMI C 452.15 (444.70) 128732
JK PAPER LIM 133.40 (136.10) 475771
JM FINANCIAL 120.35 (119.00) 930961
JP ASSOCIATS 17.00 (18.10) 90558280
JSW ENERGY L 72.05 (73.90) 2600330
JUBILANT FOO 2277.05 (2275.00) 1939420
JUBILANT ORG 815.40 (795.25) 906057
JYOTHY LABS 362.60 (366.45) 129609
JYOTI STRUC 8.50 (8.90) 418358
KARNATA BANK 116.70 (117.75) 2188689
KEC INTL LTD 385.95 (389.90) 387130
KOLTE PATIL 294.90 (310.25) 127478
KPIT CUMMINS 219.70 (227.55) 1735894
L&TFIN.HOLD 153.75 (155.25) 3473189
LAK VIL BANK 95.80 (97.55) 890119
M & M FINANC 426.40 (432.60) 1467660
MANAPPURAM G 105.80 (102.95) 6378368
MMTC LIMITED 54.55 (57.65) 2487128
MPHASIS LTD 835.30 (844.95) 692640
MRPL 110.25 (111.85) 690791
MTNL 19.15 (19.95) 1499184
NAGARJUNA OI 3.85 (3.90) 657431
NCC LIMITED 115.10 (119.00) 4871615
NETWORK18 FI 54.20 (56.15) 820386
NEULAND LAB 707.35 (712.75) 20945
NIIT LTD 85.80 (88.90) 607195
NIIT TECHNOL 893.80 (932.60) 1934431
OMAXE LTD 222.60 (225.25) 227325
ONMOBILE GLO 43.20 (40.95) 1037050
ORIENT PAPER 37.25 (38.05) 326164
ORIENTALBANK 89.50 (94.50) 4366514
PARSVNATH DE 14.35 (15.00) 168102
PATEL ENGG 62.30 (64.70) 409437
PFIZER 2083.00 (2113.15) 18606
POLARIS SOFT 472.65 (473.35) 37178
POWERTRADING 85.55 (88.60) 1581929
PRAJ IND 79.05 (82.20) 389946
PRISM CEMENT 108.20 (114.05) 1002008
PROVOGUE (IN 4.25 (4.40) 127501
PUNJ LLOYD 16.25 (16.95) 1229508
PUNJAB & SIN 35.05 (36.25) 88980
PURAVANKARA 137.70 (142.20) 216928
PVP VENTURES 5.50 (5.70) 208126
PVR LIMITED 1228.15 (1233.40) 171560
RADICO KHAIT 345.65 (341.90) 1648752
RAJESH EXPOR 718.40 (728.70) 73275
RALLIS INDIA 219.45 (220.55) 321025
RAMCO IND 230.25 (234.75) 128172
RAMCO SYS 363.55 (380.75) 25017
RAMKY INFRA 179.35 (185.40) 144910
RAYMOND 891.65 (928.00) 469717
RELIANCE CAP 410.10 (411.15) 8523747
RELIANCE COM 22.70 (23.80) 87934691
RELIANCE INF 418.70 (430.40) 2948049
RELIANCE POW 36.90 (38.20) 6259951
ROLTA INDIA 57.40 (59.90) 691007
SAGAR CEMENT 886.80 (880.05) 5486
SAREGAMA 660.10 (671.75) 63585
SHANTHI GEAR 129.90 (129.45) 23268
SHIPPNG CORP 65.15 (67.80) 569537
SHREE RENUKA 15.30 (15.35) 5816338
SINTEX IND 18.20 (18.95) 4990842
SOBHA DEVELO 466.50 (482.25) 152098
SOUTHINDBANK 22.60 (23.25) 22250039
SRS LIMITED 0.95 (1.00) 922693
STERLITE TEC 314.60 (319.90) 1515801
SUJANA METAL 1.05 (1.05) 38205
SUN PHARMA 383.75 (390.30) 173898
SUND FASTNER 557.50 (576.35) 236776
SUZLON ENERG 10.85 (11.20) 19732395
SYND. BANK 53.70 (58.15) 8645742
TATA CHEM 667.50 (666.05) 333100
TATA COFFEE 114.95 (116.90) 417339
TATA COMMUN 617.15 (627.80) 488732
TATA GLOBAL 257.90 (258.85) 2297852
TATA METALIK 709.45 (728.10) 85679
TATA MOT DVR 186.90 (190.55) 1944356
TATA STEEL L 127.85 (133.65) 334945
TATA TELESER 5.70 (5.90) 1308701
THE INDIAN H 127.50 (129.25) 1235271
TORRENT POWE 224.00 (231.50) 680048
TRIVENI ENGG 42.50 (44.80) 649641
TTK PRESTIGE 6259.85 (6245.95) 1658
TV TODAY NET 498.20 (524.20) 646758
TV18 BROADCA 63.30 (64.60) 10855062
TVS MOTOR 606.35 (606.00) 1189441
UCO BANK 21.80 (22.60) 866394
UNION BANK 86.85 (94.70) 27151046
UNITECH 5.70 (5.95) 17330313
UNITED BANK 12.95 (13.05) 1466493
UNITED BREWE 941.85 (963.85) 300126
USHA MARTIN 18.25 (18.65) 985316
VADILAL INDU 856.45 (844.95) 56061
VENKYS 3840.75 (3963.55) 125955
V-GUARD IND 221.65 (221.50) 587664
VIJAYA BANK 52.00 (53.20) 681705
VIP 312.95 (308.95) 321112
VOLTAS 604.25 (614.55) 1327631
ZEE LEARN LI 36.35 (36.95) 225380
ZUARI GLOBAL 173.55 (182.90) 92377
ZYDUS WELLNE 1143.40 (1170.80) 11797

ALPHAGEO 730 (744.10) 4830
AMAR RAJA BA 769.50 (779.40) 26533
ANDHRA BANK 39.95 (42) 477446
ANDHRA CEMEN 9.40 (9.67) 122068
ANDHRA PAPER 288.75 (291.10) 8127
ANDHRA PETRO 51.35 (54) 160029
ANDHRA SUGAR 405.70 (428.90) 1957
ASTRA MICROW 78.60 (80.45) 135727
AUROBINDO PH 550.55 (556.95) 110905
AVANTEL SOFT 519.25 (525.90) 5016
AVANTI FEEDS 2164.70 (2246.30) 12807
AVON ORG 10.30 (10.83) 6570
BALAJI AMIN 570.95 (572.40) 5506
BARTRONICS 10.09 (10.56) 35565
BHAGYA NAG 42.75 (44.85) 22135
BRILLIANT SE 9.12 (9.59) 595367
CAMBRIDGE TE 65 (66.20) 2352
CIL SECURI 26.10 (26.55) 3825
CONT COFFEE 284.90 (275.90) 3385
COROMAN FERT 517.95 (519.85) 10568
CYIENT LIMIT 659.85 (658.95) 7055
DECCAN CEMEN 522 (517.25) 696
DIVI'S LAB 1035.45 (1069.05) 22420
DR REDDY 2073.80 (2107.70) 21490
FOUR SOFT 69.30 (68.25) 20935
GATI CORPN 97.25 (99.80) 66390
GAYATRI PROJ 182.60 (187.45) 19648
GMR INFRASTR 16.70 (17.50) 3940057
GOLDST INFRA 182.10 (186.20) 44246
GRANULES (I) 103.35 (104.60) 106641

బీఎస్‌ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 13.35 (14) 1543324
HBL NIFE POW 44.20 (46.65) 231581
HERITAGE FOO 717.40 (727.75) 505
IDL INDUSTRS 498.40 (509.05) 2824
ILFS ENGINEE 31.55 (32.50) 34056
INNAREDY COM 2.83 (2.81) 150756
IVRCL INFRAS 3.38 (3.55) 181344
KAKATIYA CEM 233.30 (243.35) 8643
KAVERI SEED 478.80 (484.25) 19774
KCP LTD 114.55 (113.25) 12396
KERNEX MICRO 38.55 (39.45) 6124
KNR CONSTRUC 288.75 (291.20) 11536
LANCO INDUS 309.95 (315.65) 30006
LANCO INFRAT 1.07 (1.12) 218589
LAURUS LABS 507.60 (506.60) 12536
LOKESH MACH 50.20 (52.60) 37635
MADHUCON PRO 20.65 (21.35) 85071
MIC ELECTRON 4.75 (4.99) 34256
MOLD-TEK.TEC 48.60 (50.55) 58756
MOLDTK PLA 307.15 (314.40) 1107
NAGARJAGRICH 40.25 (41.55) 12295
NATCO PHARMA 782.95 (781.85) 21944
NAVA BH VENT 132.40 (136) 30871
NCC 115.40 (118.90) 381194
NCL IND 217.30 (222.75) 78592
NEULAND LAB 696.55 (709.90) 2996
NIHAR INFO 13.90 (14.50) 275
OIL COUNTRY 31.70 (33.80) 59661
PENNER IND 51.85 (53.45) 76398
PIONEER DIST 189.25 (176.40) 568
PITTI LAMIN 80.15 (82.65) 16648
POKARNA 191 (198.45) 10732
PREMIER EXPL 328.50 (336.65) 36624
PRISM CEMENT 108.45 (114.30) 183160
PRUDENTL PHA 3.78 (3.87) 227243
RAIN INDUSTR 373.45 (380.65) 243703
SAGAR CEM 883.05 (883.90) 1351
SAMKRG PIST 271.30 (279.05) 9213
SATVAH. ISPA 18.80 (19.50) 8091
SMS PHARMA 74 (75.95) 53883
SPHERE GLOBA 32.05 (32.25) 8469
SREE RAYAL A 50.90 (52.05) 241885
STEEL EXCHAN 24.70 (26) 16825
SUJANA TOWER 3.26 (3.42) 1827
SUJANA UNIVE 0.71 (0.74) 48803
SURYALAKSH.C 66.35 (67.20) 29162
SUVEN PHARMA 168.50 (169.95) 29997
TAJ GVK HOTE 155.15 (158.85) 3177
TANLA 30.75 (33) 181282
TERA SOFTWAR 39.30 (42.70) 17414
VICEROY HOTE 14 (14.70) 67900
VIJAY TEXTIL 39.50 (41.50) 2271
VIMTA LABS 180.90 (190.40) 6594
VISAKA IND 638.35 (666.25) 17472
VISTA PHARMA 37.05 (39) 192705
YBRANT DIGIT 4.41 (4.62) 681120
ZENTECH 112.75 (116.40) 28647

వాణిజ్యం.. ఆజ్యం..





అమెరికా, చైనా అనిశ్చితులతో ప్రపంచ మార్కెట్లు విలవిల

● మన సూచీలకు తాకిన సెగ ● అయిదు నెలల కనిష్ఠానికి సెన్సెక్స్

చల్లబడ్డాయనుకున్న 'వాణిజ్య' ఉద్రిక్తతలు ఒక్కసారిగా రాజుకున్నాయి. చైనా వస్తువులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించడంతో మళ్లీ వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. ఇంకేముంది.. అప్పటి వరకు లోలోన ఉన్న మదుపరి భయం ఒక్కసారిగా పెల్లుబికింది. ఇది అమ్మకాల రూపంలో ప్రతిబింబించింది. అంతర్జాతీయ మార్కెట్ల తరహాలోనే మన మార్కెట్లు కూడా భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. ఫలితం.. రూ.1.57 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరి.

అమెరికా- చైనాల మధ్య ఏర్పడిన వాణిజ్య యుద్ధం మరింత విస్తృతమవుతుందనే ఆందోళనలతో దేశీయ మార్కెట్లు కకావికలమయ్యాయి. సెన్సెక్స్ అయిదు నెలల కనిష్ఠ స్థాయికి చేరగా, నిఫ్టీ కీలకమైన 10,000 పాయింట్ల స్థాయిని కోల్పోయింది. అమ్మకాలు వెల్లువెత్తడంతో దాదాపు అన్ని రంగాల సూచీలు కుదేలయ్యాయి. ముఖ్యంగా బ్యాంకింగ్ షేర్లు విలవిలలాడాయి. ఫలితంగా ఒక్కో రోజులో రూ.1.57 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరైంది. ఇక వరుసగా నాలుగో వారం సూచీల పతనం కొనసాగింది. వారం ప్రాతిపదికన చూస్తే.. ఈ వారం సెన్సెక్స్ 579.46 పాయింట్లు, నిఫ్టీ 197.10 పాయింట్లు చొప్పున పతనమయ్యాయి. 419 షేర్లు 52 వారాల కనిష్ఠానికి పడిపోయాయి.

చివరి వరకు నష్టాల్లోనే: సెన్సెక్స్ ఉదయం 32,650.89 పాయింట్ల వద్ద బలహీనంగా ప్రారంభమైంది. చివరి వరకూ నష్టాల్లోనే కదలాడిన సూచీ.. ఒకానొకదశలో 32,483.84 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 409.73 పాయింట్లు కోల్పోయి 32,596.54 దగ్గర స్థిరపడింది. అక్టోబరు 23 తర్వాత సూచీకిదే కనిష్ఠ స్థాయి. నిఫ్టీ సైతం 116.70 పాయింట్ల నష్టంతో 9,998.05 వద్ద ముగిసింది. అక్టోబరు 11 తర్వాత సూచీకిదే అత్యల్ప కనిష్ఠ స్థాయి.

రూ.1394 కోట్ల రుణ మోసం కేసు వెలుగుచూడటంతో యూనియన్ బ్యాంక్ షేర్లు కుదేలయ్యాయి. ఇంట్రాడేలో 9.13 శాతం కుప్పకూలి 52 వారాల కనిష్ఠానికి చేరిన షేరు.. చివరకు 8.29 శాతం నష్టంతో రూ.86.85 వద్ద ముగిసింది. బ్యాంక్ మార్కెట్ విలువ రూ.670.78 కోట్లు తగ్గి రూ.7,432.22 కోట్లకు పరిమితమైంది.

సెన్సెక్స్ 30 షేర్లలో 24 నష్టాలు చవిచూశాయి. యెస్ బ్యాంక్ 3.87%, యాక్సిస్ బ్యాంక్ 3.34%, ఎస్‌బీఐ 2.90%, ఐసీఐసీఐ బ్యాంక్ 2.73%, టాటా స్టీల్ 2.40%, టాటా మోటార్స్ 2.10%, ఎల్ అండ్ టీ 2.07%, బజాజ్ ఆటో 1.84%, డాక్టర్ రెడ్డీస్ 1.61%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.59%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.54%, విప్రో 1.40% చొప్పున డీలాపడ్డాయి. అదానీ పోర్ట్స్ 0.99%, ఇన్ఫోసిస్ 0.75%, పవర్‌గ్రిడ్ 0.54%లు మాత్రం రాణించాయి. రంగాల వారీ సూచీల్లో స్థిరాస్తి 3.31% కోల్పోయింది. లోహ 2.89%, బ్యాంకింగ్ 2.08%, ఫైనాన్స్ 1.73%, యంత్ర పరికరాలు 1.56%, ఆరోగ్య సంరక్షణ 1.48%, పీఎస్‌యూ 1.30% మేర నష్టాలు నమోదు చేశాయి. బీఎస్ఈలో మొత్తం 2,149 షేర్లు నష్టపోగా, 558 స్క్రిప్‌లు లాభపడ్డాయి. 154 షేర్లు లాభనష్టాలు లేకుండా ట్రేడయ్యాయి.

భారత్ డైనమిక్స్ ఢమాల్

భారత్ డైనమిక్స్ షేర్లు స్టాక్ మార్కెట్లలో తమ ప్రయాణాన్ని నిరుత్సాహకరంగా మొదలుపెట్టాయి. ఇష్యూ ధరైన రూ.428తో పోలిస్తే 15.88% తక్కువగా రూ.360 వద్ద కంపెనీ షేర్ల నమోదయ్యాయి. బీఎస్ఈలో చివరకు 8.71% తగ్గి రూ.390.70 వద్ద ముగిశాయి. ఎన్ఎస్ఈలోనూ 8.92% క్షీణతతో రూ.389.80 వద్ద స్థిరపడ్డాయి. బీఎస్ఈలో 6.03 లక్షల షేర్లు, ఎన్ఎస్ఈలో 39 లక్షలకు పైగా షేర్లు చేతులు మారాయి.

లోక్‌సభ సమాచారం

ఫోర్టిస్, రెలిగేర్‌పై ఎస్ఎఫ్ఐఓ దర్యాప్తు

నీరవ్, మెహుల్ కంపెనీలపై కూడా: మంత్రి పి.పి.చౌదరి

దిల్లీ: అవకతవకలు చోటుచేసుకున్నాయనే ఆరోపణల నేపథ్యంలో రెలిగేర్ ఎంటర్‌ప్రైజెస్, దాని గ్రూపు కంపెనీ ఫోర్టిస్ హెల్త్‌కేర్‌పై తీవ్ర నేరాల దర్యాప్తు సంస్థ (ఎస్ఎఫ్ఐఓ) దర్యాప్తు చేస్తోందని కేంద్ర మంత్రి పి.పి. చౌదరి తెలిపారు. అలాగే నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల కంపెనీలపైనా దర్యాప్తు ప్రారంభించిందని లోక్‌సభకు ఇచ్చిన లిఖిత పూర్వక సమాధానంలో మంత్రి వెల్లడించారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)తో పాటు మరికొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో రూ. వేల కోట్ల మేర మోసపూరిత లావాదేవీలు వెలుగుచూసిన సంగతి తెలిసిందే. గత నాలుగు ఆర్థిక సంవత్సరాల్లో 575 కంపెనీలపై ఎస్ఎఫ్ఐఓ ద్వారా దర్యాప్తునకు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారి చేసిందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే (2018 మార్చి 15 వరకు) 258 కంపెనీలపై దర్యాప్తు ప్రారంభమైందని తెలిపారు. ఈ కంపెనీలన్నీ కూడా సెబీ నిఘాలో ఉన్నాయని అన్నారు. ఫైర్‌స్టార్ డైమండ్ ఇంటర్నేషనల్, ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్, ఫైర్‌స్టార్ డైమండ్, నీరవ్ మోదీ ప్రైవేట్ లిమిటెడ్, గీతాంజలి జెమ్స్, నక్షత్రా బ్రాండ్స్ కంపెనీల వ్యవహారాలపై దర్యాప్తునకు కూడా ఎస్ఎఫ్ఐఓను ఆదేశించినట్లు చౌదరి తెలిపారు.

780 కంపెనీలపై విచారణకు చర్యలు

వార్షిక రిటర్న్‌లు, ఆర్థిక వివరాలు సమర్పించని 780 నమోదిత కంపెనీలపై మంత్రిత్వ శాఖ విచారణకు చర్యలు చేపట్టిందని వివరించారు. నిబంధనలు పాటించని 2.97 లక్షల కంపెనీల పేర్లను రిజిస్టర్ ఆఫ్ కంపెనీస్ (ఆర్ఓసీ) నుంచి తొలగించినట్లు తెలిపారు. వరుసగా రెండు లేదా అంతకుమించిన ఆర్థిక సంవత్సరాలకు రిటర్న్‌ల దాఖలు, ఆర్థిక వివరాలు సమర్పించని, ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించని కంపెనీలు ఈ ఆర్థిక సంవత్సరంలో 2.97 లక్షలున్నాయని ఆర్ఓసీ గుర్తించిందని పేర్కొన్నారు. ఇందులో మహారాష్ట్రకు (59,849) చెందినవే ఎక్కువని తెలిపారు. ఆ తర్వాతి స్థానాల్లో దిల్లీ (43,925), తమిళనాడు (24,723), కర్ణాటక (18,165), తెలంగాణ (16,817), గుజరాత్ (11,389) ఉన్నాయి. ఈ ఏడాది జనవరి వరకు కంపెనీల చట్టం నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలో వివిధ కోర్టుల్లో కేసులు ఎదుర్కొంటోన్న కంపెనీల సంఖ్య 48,886 అని మరో ప్రశ్నకు సమాధానంగా ఆయన బదులిచ్చారు.

ఈడీ పరిశీలనలో 120 డొల్ల కంపెనీలు: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో వెలుగుచూసిన కుంభకోణంతో సంబంధమున్న 120 డొల్ల కంపెనీల వ్యవహారాలను డైరెక్టరేట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఈడీ) విశ్లేషిస్తోంది. ఈడీ ఇచ్చిన వివరాల ఆధారంగా పై విషయాన్ని లోక్‌సభకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి శివ్ ప్రతాప్ శుక్లా తెలియజేశారు. ప్రస్తుతం దర్యాప్తు జరుగుతున్నందున పేర్లు, ఇతరత్రా వివరాలు వెల్లడించలేమని పేర్కొన్నారు. మనీ లాండరింగ్ నియంత్రణ నిబంధనల కింద నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీలపై ఈడీ రెండు కేసులు నమోదు చేసిందని చెప్పారు.

కంపెనీల రిజిస్ట్రేషన్లు పెరిగాయ్

వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) విధానం అమల్లోకి వచ్చాక, గత 8 నెలల్లో 68,299 కంపెనీలు నమోదయ్యాయని లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో మంత్రి పి.పి.చౌదరి తెలిపారు. జులై 2016 నుంచి 2017 ఫిబ్రవరి మధ్య నమోదైన కంపెనీల సంఖ్య 63,106 మాత్రమేనని పేర్కొన్నారు. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక కంపెనీల రిజిస్ట్రేషన్లు పెరుగుతున్న విషయాన్ని గమనించాలని వెల్లడించారు. గతేడాది వరకు మొత్తం 17.21 లక్షల కంపెనీలు రిజిస్టర్ అయ్యాయని పేర్కొన్నారు. ఇందులో 7,270 మాత్రమే క్రియాశీలకంగా ఉన్నాయని తెలిపారు.

ప్రస్తుత హవా పెద్ద కార్లదే

చిన్న కార్ల వాటా తగ్గలేదు

ఈనాడు - ఇంటర్వ్యూ

హ్యుందాయ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాకేశ్ శ్రీవాస్తవ

'ఇల్లు, కార్యాలయం తర్వాత ఒక వ్యక్తి అధికంగా గడిపే మూడో ప్రదేశం కారు. అందుకే, అది సురక్షితంగా ఉండటంతో పాటు, సౌకర్యవంతంగా, అత్యాధునిక సాంకేతికతతో అనుసంధానం అవడంతో పాటు, యజమానిగా గర్వపడేలా ఉండాలి. అలాంటి కార్లను తీసుకురావడంపైనే మేము దృష్టి సారిస్తున్నాం' అంటున్నారు హ్యుందాయ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, సేల్స్) రాకేశ్ శ్రీవాస్తవ. ప్రస్తుతం ఎస్‌యూవీలు కొనడాన్ని ఇష్టపడుతున్నారన్నారాయన. ప్రయాణికుల కార్ల విభాగంలో మారుతున్న ధోరణులు, హ్యుందాయ్ తీసుకొస్తున్న కొత్త వాహనాల గురించి.. భారత్‌తో 20 ఏళ్ల అనుబంధం గురించి 'ఈనాడు'తో ఆయన మాట్లాడారు.



ఈనాడు - హైదరాబాద్

హ్యుందాయ్ భారత్‌లో అడుగుపెట్టి ఇప్పటికి 20 ఏళ్లు. ఈ కాలంలో దేశంలో ప్రముఖ బ్రాండుగా హ్యుందాయ్ పేరు సంపాదించుకుంది. 2017 సంవత్సరంలో హ్యుందాయ్ గ్లోబల్ బ్రాండ్ విలువ 13.2బిలియన్ డాలర్లకు చేరింది. ప్రపంచ వ్యాప్తంగా విలువైన బ్రాండ్‌లలో 35వ స్థానంలో ఉన్నాం. భారత్‌లో కూడా హ్యుందాయ్ గురించి అవగాహన పెరిగింది. 2016లో 77.1శాతం ఉండగా.. 2017లో ఇది 80 శాతానికి చేరింది. హ్యుందాయ్‌ను ఎంచుకోవాలని చూసేవారూ అధికమవుతున్నారు. 2016లో 69.7 శాతం ఉండగా 2017లో ఇది 70.7 శాతానికి పెరిగింది.

కేవలం కార్లను అమ్మడమే కాదు.. విక్రయానంతర సేవలను అందించడంలోనూ జాగ్రత్తలు తీసుకుంటున్నాం. 2017లో 62.7 లక్షల కార్లను సర్వీసింగ్ చేశాం. 2016తో పోలిస్తే ఇది 16 శాతం అధికం. దేశం మొత్తం మీద నెలకు సగటున 5లక్షల కార్లకు సర్వీస్ చేస్తున్నాం. ఇన్‌హౌస్ ఎక్స్‌టెండెడ్ వారంటీ కూడా అందిస్తున్నాం. జేడీ పవర్ కస్టమర్ సర్వీస్ ఇండెక్స్‌లో 2017లో హ్యుందాయ్‌కు 923 పాయింట్లు వచ్చాయి. మా వినియోగదారుల సంతృప్తికి ఇది నిదర్శనం.

సామాజిక బాధ్యతగా..

భారత్‌లో ఏటా రోడ్డు ప్రమాదాల్లో దాదాపు 5లక్షల మందికి పైగా మరణిస్తున్నారు. ఇది ఆందోళన కలిగించే అంశమే. ప్రమాదాల నివారణ గురించి అవగాహన పెరిగేందుకు హ్యుందాయ్ తరఫున పలు అవగాహన కార్యక్రమాలు రూపొందించాం. కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా దీని మీద దృష్టి సారిస్తున్నాం. షారుఖ్‌తో కలిసి 'బీ ద బెటర్ గయ్' పేరుతో అవగాహన కల్పిస్తున్నాం. స్కూళ్లలోని విద్యార్థులకు, షాపింగ్ మాల్స్‌కు వచ్చే వారికీ ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నాం.

అంతర్జాతీయ విపణికీ...

భారత ప్లాంట్లలో తయారైన కార్లను అంతర్జాతీయ మార్కెట్లకూ ఎగుమతి చేస్తున్నాం. ప్రతి దేశంలోనూ కార్లకు సంబంధించి కొన్ని నిబంధనలు ఉంటాయి. వాటిని పాటిస్తూ.. కార్లను తయారు చేసి, విక్రయిస్తున్నాం. నిబంధనలను బట్టి, ధరలు ఉంటాయి. భారత్‌లో విక్రయించే కార్ల విషయంలోనూ అంతర్జాతీయ ప్రమాణాలను పాటిస్తున్నాం.

7-8శాతం వృద్ధి..

భారత ఆర్థిక వ్యవస్థ పనితీరు బాగున్న నేపథ్యంలో ప్రయాణికుల కార్ల విభాగంలోనూ మంచి వృద్ధి కనిపిస్తోంది. 2017లో 30లక్షల కార్లు అమ్ముడయ్యాయి. ఇది ఒక శుభ పరిణామమే. ఈ ఏడాది కూడా విక్రయాల్లో 7-8శాతం వృద్ధి ఉంటుందని అంచనా. పలు అంతర్జాతీయ సంస్థలు కూడా భారత విపణిలోకి తమ ఉత్పత్తులను తీసుకొస్తున్నాయి. భారత్‌లో ఉన్న సంస్థలు కొత్త ఉత్పత్తులను తీసుకువస్తున్నాయి. ఇవన్నీ కూడా మార్కెట్ పెరగడానికి సానుకూలతలే.

కొత్త కుటుంబ కారు...

హ్యుందాయ్ నుంచి ఈ ఏడాది ద్వితీయార్ధంలో కొత్త ఫ్యామిలీ డిజైన్ కారు తీసుకువస్తున్నాం. ఇప్పటికే ఉన్న ఒకటి రెండు కార్లను రిఫ్రెష్ చేస్తున్నాం. కార్లలో అత్యాధునిక సాంకేతికతను జోడించడంతోపాటు, చూడముచ్చటైన ఇంటీరియర్స్‌ను అందించే ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికే ఐ20ని కొత్త రూపంలో విడుదల చేశాం. ఈ ఏడాది రూ.7.13లక్షల కారును, రూ.5.55లక్షల కారును విడుదల చేయబోతున్నాం. బ్యాటరీ కార్ల విషయంపై కూడా ఆలోచిస్తున్నాం. సెడాన్, ఎస్‌యూవీలో ఒక ఎలక్ట్రిక్ కారు రావచ్చు. అది ఎప్పుడన్నది మాత్రం ఇప్పుడే చెప్పలేం.

ఎస్‌యూవీలు పెరుగుతున్నాయి..

చూడ్డానికి పెద్దగా కనిపించడం, ఎత్తు మీద కూర్చొని డ్రైవింగ్ చేస్తున్న అనుభూతి, పటిష్ఠంగా ఉండటం, భారతీయ రోడ్డులకు తగ్గట్టుగా పెద్ద టైర్లు.. భద్రత అధికంగా ఉండటం.. ఇలా పలు రకాల కారణాలతో వాహనదారులు ఎస్‌యూవీల వైపు మొగ్గు చూపిస్తున్నారు. అంతర్జాతీయంగా కూడా చైనా, రష్యా, యూరోపియన్ దేశాల్లో ప్రస్తుతం ఎస్‌యూవీల హవా నడుస్తోంది. ఇప్పుడిది ఒక ట్రెండ్. ఎస్‌యూవీలు.. ఎస్‌యూవీల్లా కనిపించే కార్లను ఇప్పుడు ఎక్కువగా ఆదరిస్తున్నారు. అయితే, ఇప్పటికీ కార్ల విక్రయాల్లో చిన్న వాటి వాటా 70శాతం వరకూ ఉంది. పెద్ద నగరాల్లోనే ఎస్‌యూవీలు, ట్రెండీ కార్లను కొనేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. గతంతో పోలిస్తే.. సెడాన్‌లకు ఇప్పుడు కాస్త గిరాకీ తగ్గిందనే చెప్పాలి. రూ.10లక్షల లోపు కార్లకు గిరాకీ ఎప్పుడూ పెరుగుతూనే ఉంది.

చర్చలతోనే పరిష్కారం

అమెరికా, చైనా అనిశ్చితిపై శక్తికాంతదాస్



దిల్లీ: అమెరికా, చైనా వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య యుద్ధమేఘాలు ఆవరించడంపై జీ20లో భారత ప్రతినిధి శక్తికాంత దాస్ ఆందోళన వెలిబుచ్చారు. ఇటువంటి అంశాలు పరస్పరం కలిసి చర్చించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 'ఆయా దేశాలు తీసుకున్న నిర్ణయాలు, తమ ఆర్థిక వ్యవస్థకు నిజంగా ప్రయోజనాలు అందజేస్తాయా అని ఆలోచించుకోవాలి. పరస్పర అంగీకారంతో వీటిని పరిష్కరించుకోవాలి' అని దాస్ ట్వీట్ చేశారు. చైనా దిగుమతులపై 60 బిలియన్ డాలర్ల విలువైన వార్షిక సుంకాలను విధిస్తూ ట్రంప్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. మరో పక్క చైనా సైతం అమెరికా వస్తువులపై 3 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతి సుంకాన్ని విధించడానికి రంగం సిద్ధం చేస్తోంది.

విధుల్లోకి 4 విమానాలు.. ఇంకా 7 కిందే

దిల్లీ: ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్(ఇండిగో యాజమాన్య సంస్థ)కు చెందిన ఎయిర్‌బస్ ఎ320 నియో విమానాల్లో నాలుగు తిరిగి కార్యకలాపాల్లోకి చేరాయి. ఇంజిన్ మరమ్మతుల కారణంగా ఇండిగోకు చెందిన ఈ రకం విమానాలు 11 నిలిచిపోయిన సంగతి విదితమే. 'నియో ఐవీసీలో ఇంజిన్ మార్పు పూర్తయింది. కార్యకలాపాల్లోకి 4 విమానాలు తిరిగి అడుగుపెట్టాయి. ఇంకా ఏడింటిపై పనిచేయాల్సి ఉంద'ని ఇండిగోకు చెందిన అధికారి ఒకరు తెలిపారు. గో ఎయిర్ విమానాలు కూడా 3 నిలిచిపోగా, ఒకటి కార్యకలాపాలు ప్రారంభించింది. ఇంకా రెండింటి మరమ్మతు పూర్తి కావాల్సి ఉంది.

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ మైసూర్ ఖాతాదారులూ

చెక్‌లు మార్చుకోవాలి


స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)లో విలీనమైన అనుబంధ బ్యాంకుల ఖాతాదారులు తమ చెక్‌బుక్‌లు ఈనెల 31లోగా మార్చుకోవాలని బ్యాంక్ సూచించింది. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ట్రావన్‌కోర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ మైసూర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ బికనీర్ అండ్ జైపుర్, స్టేట్‌బ్యాంక్ ఆఫ్ పటియాలా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్) తో పాటు భారతీయ మహిళా బ్యాంక్ ఖాతాదారులు తమ చెక్‌బుక్‌లను మార్చుకుని, కొత్తవి తీసుకోవాలి. ఈ విషయమై శుక్రవారం ప్రచురితమైన 'ఎస్‌బీఐ అనుబంధ బ్యాంకుల చెక్కులు 1 నుంచి చెల్లవు' వార్తలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ మైసూర్ పేరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ రాయపూర్‌గా వచ్చింది. దీనిని పాఠకులు గమనించగలరు.

కృత్రిమ మేధ

భారత్ అబ్బురపరుస్తోంది

● సాంకేతికతతోనే సమాజంలో మార్పు
● రైతుల సాధికారికతకు దోహదం

మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల



కోచి: భారత్ సాధిస్తున్న ప్రగతిపై మైక్రోసాఫ్ట్ ముఖ్య, కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) సత్య నాదెళ్ల ప్రశంసల వర్షం కురిపించారు. తాను పర్యటించిన ప్రతిసారి భారత్‌లో జరుగుతున్న అభివృద్ధి చూసి సంభ్రమాశ్చర్యానికి లోనవుతున్నానని ఆయన అన్నారు. ఇక్కడ జరిగిన కేరళ గ్లోబల్ డిజిటల్ సదస్సు 'ఫ్యూచర్'ను ఉద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నాదెళ్ల ప్రసంగించారు. సమాజంలో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలకు సాంకేతికత ఏవిధంగా తోడ్పడుతుందనే విషయం కీలక సవాళ్లలో ఒకటని అన్నారు. గుండె సంబంధిత వ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు కృత్రిమ మేధస్సును (ఏఐ) ఆరోగ్య సంరక్షణ సేవల సంస్థలు ఉపయోగించుకుంటున్న తీరు ఇందుకు ఓ ఉదాహరణ అని అన్నారు. పంట దిగుబడి పెంచేందుకు వాతావరణం, భూస్వరూపం తదితరాల విషయాలను సులువుగా అర్థం చేసుకునేలా రైతులకు సాంకేతికత పరంగా మరిన్ని వివరాలను అందుబాటులోకి తేవాలని తెలిపారు. పిల్లలు బడి మానేసేందుకు దారితీస్తున్న పరిణామాలను తెలుసుకునేందుకు క్లౌడ్, ఏఐను పాఠశాలలు ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఉద్యోగుల సాధికారికతను పెంచేందుకు, పౌర సేవలను మెరుగుపర్చేందుకు మొబైల్ కమ్యూనికేషన్స్ యాప్ కైజాలాను ప్రభుత్వాలు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. సాంకేతికత వల్ల ఇతరులకు ప్రయోజనం కలిగినప్పుడే నిజమైన వేడుక అవుతుందని అన్నారు. మరింత పురోగతిని సాధించేందుకు ఈ ప్రపంచంలో ప్రతి వ్యక్తి, సంస్థను సాధికారత దిశగా నడిపించాలన్నదే మైక్రోసాఫ్ట్ ఉద్దేశమని అన్నారు.

ఉద్యోగాలు పోవచ్చు

● వినూత్న సాంకేతికత ఇందుకు కారణం
● భయపడకుండా ముందుకు సాగాలి

రఘురాం రాజన్



కోచి: కృత్రిమ మేధ (ఏఐ) వల్ల నిపుణులతో పాటు సాధారణ ఉద్యోగాలకు చేటు తప్పదనే ఆందోళనను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ రఘురాం రాజన్ ఆందోళన వ్యక్తం చేశారు. 'మెషీన్ లెర్నింగ్, కృత్రిమ మేధ, రోబోటిక్స్‌లో వినూత్న ఆవిష్కరణలతో మున్ముందు మరిన్ని మార్పులు చోటుచేసుకుంటాయి. వైద్యులు లాంటి అధిక నైపుణ్యమున్న వృత్తి నిపుణుల దగ్గర నుంచి నైపుణ్యం లేని వాళ్ల ఉద్యోగాలన్నింటినీ ఇవి తీసేసుకునే అవకాశం ఉంది' అని రాజన్ పేర్కొన్నారు. ఇక్కడ జరిగిన ఫ్యూచర్ గ్లోబల్ డిజిటల్ సదస్సులో ఆయన కీలకోపన్యాసం చేశారు. ఉద్యోగాలు, ఆదాయాలు కోల్పోవాల్సి ఉంటుందని లేదా మనుషుల స్థానంలో యంత్రాలు పనిచేస్తాయనే భయంతో ముందడుగు వేయకుండా ఆగిపోకూడదని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న డిజిటల్ మార్పుల్లో అగ్రగామిగా నిలిచేందుకు భారత్ సాంకేతికతను అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందనే ఆందోళనే సాంకేతికతను అందిపుచ్చుకునే విషయంలో ప్రధాన అవరోధంగా నిలుస్తోందని అన్నారు. 'పారిశ్రామిక విప్లవం సమయంలోనూ ఉద్యోగాలు కోల్పోతాయనే భయాలు ఉండేవి. అది వచ్చి రెండు వందల ఏళ్లు అవుతోంది. ఇప్పటికీ ఉద్యోగాలు కొత్తవి వస్తూనే ఉన్నాయి కదా. యంత్రాలు చేయలేని పనుల వైపు ప్రజలు, సమాజం అడుగులు వేయాల'ని తెలిపారు. 'సాంకేతికత కారణంగా ప్రతి ఉద్యోగంలో మార్పులొస్తాయి. సాంప్రదాయ ధోరణులు తొలిగి, ఆ ఉద్యోగంలో సృజనాత్మకత, ప్రయోజనాత్మకత ప్రాధాన్య అంశాలుగా మిగులుతాయ'ని పేర్కొన్నారు.

ఛాంపియన్స్



గతేడాది విజయాలు నాలో హుషారు నింపాయి. ఈ సారి కామన్వెల్త్‌లో పతకం సాధించడమే ప్రస్తుతం నా లక్ష్యం. నా దృష్టిలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలవడం కన్నా కామన్వెల్త్ క్రీడల్లో దేశానికి పతకం అందించడమే ప్రధాన విషయం - శ్రీకాంత్

మేమొచ్చేశాం

2019 వన్డే ప్రపంచకప్‌కు అఫ్గానిస్థాన్ అర్హత



హరారె: గత కొన్నేళ్లుగా నిలకడగా రాణిస్తూ, అప్పుడప్పుడూ సంచలన ప్రదర్శన చేస్తూ అంతర్జాతీయ క్రికెట్‌పై తనదైన ముద్ర వేస్తున్న అఫ్గానిస్థాన్.. మరోసారి సత్తా చాటింది. గట్టి పోటీని తట్టుకుని ప్రతిష్టాత్మక వన్డే ప్రపంచకప్‌లో రెండోసారి పాల్గొనే అవకాశం దక్కించుకుంది. ప్రపంచకప్ క్వాలిఫయర్స్ టోర్నీ ద్వారా ఇప్పటికే వెస్టిండీస్ 2019 టోర్నీ బెర్తు సంపాదించగా.. రెండో బెర్తును అఫ్గాన్ కైవసం చేసుకుంది. శుక్రవారం క్వాలిఫయర్స్ సూపర్ సిక్స్ చివరి మ్యాచ్‌లో అఫ్గాన్ ఐదు వికెట్ల తేడాతో ఐర్లాండ్‌పై విజయం సాధించి టోర్నీలో ఫైనల్‌కు అర్హత సాధించింది. మొదట ఐర్లాండ్‌ను అఫ్గాన్ 209/7కే కట్టడి చేసింది. స్టిర్లింగ్ (55), కెవిన్ ఓబ్రైన్ (41), నీల్ ఓబ్రైన్ (36) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. క్వాలిఫయర్స్ ఆరంభం నుంచి అద్భుత ప్రదర్శన చేస్తున్న స్పిన్నర్ రషీద్ ఖాన్.. అఫ్గాన్ ప్రపంచకప్‌కు వెళ్లాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లోనూ అదరగొట్టాడు. అతను 40 పరుగులే ఇచ్చిన మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం అఫ్గాన్ 49.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి విజయాన్నందుకుంది. మహ్మద్ షెహజాద్ (54), గుల్బాదిన్ నైబ్ (45), స్తానిక్‌జాయ్ (39 నాటౌట్) విజయంలో కీలక పాత్ర పోషించారు. షెహజాద్ 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. క్వాలిఫయర్స్‌లో ఫైనల్ చేరిన రెండు జట్లూ ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తాయన్న సంగతి తెలిసిందే. సూపర్‌సిక్స్ దశలో విండీస్ (8), అఫ్గాన్ (6) తొలి రెండు స్థానాల్లో నిలిచి ముందంజ వేశాయి. చివరి మ్యాచ్‌లో అఫ్గాన్‌ను ఓడించి ఉంటే ఐర్లాండ్ ఆరు పాయింట్లతో ఫైనల్ చేరేది. క్వాలిఫయర్స్ లీగ్ దశలో పేలవ ప్రదర్శన చేసిన అఫ్గాన్.. ప్రపంచకప్‌కు అర్హత సాధిస్తుందని ఎవరూ అనుకోలేదు. ఐతే సూపర్‌సిక్స్‌లో ఆ జట్టు పుంజుకుంది. విండీస్, అఫ్గాన్ మధ్య తుది పోరు ఆదివారం జరుగుతుంది. అఫ్గాన్ 2015లో తొలిసారి వన్డే ప్రపంచకప్ ఆడింది.

'గోల్డ్'కోస్ట్

కామన్వెల్త్‌లో పసిడిపై గురి

శ్రీకాంత్ సాధించేనా..!

దిల్లీ

అది 2014 గ్లాస్గో కామన్వెల్త్ క్రీడలకు కొద్దిరోజుల ముందు... తొలిసారి ఆ మెగాక్రీడలకు ఎంపికైన ఓ బ్యాడ్మింటన్ ఆటగాడు. . ఎలాగైనా దాంట్లో సత్తాచాటాలని గోపీచంద్ అకాడమీలో సాధన చేస్తున్నాడు. అయితే దురదృష్టవశాత్తూ ఓ రోజు మెదడు సంబంధిత వ్యాధితో ఆకస్మాత్తుగా బాత్రూమ్‌లో కుప్పకూలాడు. వారం రోజుల పాటు ఐసీయూలో ఉన్నాడు. దాని నుంచి కోలుకొని కామన్వెల్త్ క్రీడల్లో పోటీపడ్డ ఆ ఆటగాడు క్వార్టర్స్‌లో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు. అయితే అదంతా గతం.. ప్రస్తుతం భారత బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో అతనో స్టార్. గతేడాది నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లు నెగ్గి రికార్డు సృష్టించాడు. ప్రస్తుతం ప్రపంచ ర్యాంకింగ్స్‌లో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. తొలిసారి అనారోగ్య సమస్య వల్ల కామన్వెల్త్ క్రీడల్లో పతకం సాధించలేకపోయిన అతను.. ఈ సారి ఎలాగైనా పసిడిని ముద్దాడాలని దృఢనిశ్చయంతో ఉన్నాడు. ఆ ఆటగాడే ప్రస్తుత ప్రపంచ బ్యాడ్మింటన్ రంగంలో పెద్దగా పరిచయం అక్కర్లేని కిదాంబి శ్రీకాంత్. వచ్చే నెల 4 నుంచి ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్‌లో ఆరంభం కానున్న కామన్వెల్త్ క్రీడల్లో కచ్చితంగా పతకం నెగ్గే భారత ఆటగాళ్లలో అతనొక్కడు. "అప్పుడేదో అనారోగ్య సమస్య వచ్చింది. దానిపేరు ఏంటో కూడా నాకు తెలీదు. ఆ రోజు అసలేం జరిగిందో నాకు ఎవ్వరూ చెప్పలేదు. నాక్కూడా గుర్తులేదు" అని శ్రీకాంత్ గతాన్ని గుర్తుచేసుకున్నాడు. "ఆ సమస్య నుంచి కోలుకొని తిరిగి బ్యాడ్మింటన్ సాధన చేశా. కామన్వెల్త్ క్రీడల బరిలో దిగా. కానీ క్వార్టర్స్‌లో సింగపూర్ ఆటగాడి చేతిలో ఓడా. నాలుగేళ్ల తర్వాత ప్రస్తుతం పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉన్నా. గతేడాది విజయాలు నాలో హుషారు నింపాయి. ఈ సారి కామన్వెల్త్‌లో పతకం సాధించడమే ప్రస్తుతం నా లక్ష్యం" అని శ్రీకాంత్ అంటున్నాడు. గత కామన్వెల్త్ క్రీడల్లో బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో పసిడి నెగ్గిన పారుపల్లి కశ్యప్.. 32 ఏళ్ల తర్వాత ఆ విభాగంలో భారత్‌కు పతకం అందించిన ఆటగాడిగా నిలిచాడు. అంతకుముందు ప్రకాశ్ పదుకొనె (1978), సయ్యద్ మోదీ (1982)లు మాత్రమే బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో స్వర్ణాలు గెలిచారు. "క్రితం సారి కామన్వెల్త్ క్రీడల్లో మంచి ప్రదర్శన చేశాం. నాలుగేళ్లలో మరింత పరిణతి సాధించిన మాకు ఈ సారి మరిన్ని ఎక్కువ పతకాలు గెలిచే అవకాశం ఉంది. నా దృష్టిలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలవడం కన్నా కామన్వెల్త్ క్రీడల్లో దేశానికి పతకం అందించడమే ప్రధాన విషయం" అని అతను తెలిపాడు. ఆంధ్రప్రదేశ్‌లోని బుర్రిపాలెం అనే చిన్న గ్రామం నుంచి వచ్చిన శ్రీకాంత్.. బ్యాడ్మింటన్ డబుల్స్ ఆటగాడైన తన అన్న నందగోపాల్ చూపిన బాటలోనే నడిచాడు. గోపీచంద్ అకాడమీలో చేరిన శ్రీకాంత్ బ్యాడ్మింటన్ కెరీర్.. 2014లో చైనా సూపర్ సిరీస్ ప్రీమియర్ టైటిల్ నెగ్గడంతో మలుపు తిరిగింది. ఫైనల్లో ఐదు సార్లు ప్రపంచ ఛాంపియన్ లిన్‌డాన్‌పై గెలిచిన అతను ఆ టోర్నీ నెగ్గిన తొలి భారత ఆటగాడిగా నిలిచాడు. ఆ తర్వాతి ఏడాది ఇండియన్ సూపర్ సిరీస్, స్విస్ ఓపెన్ గ్రాండ్ ప్రి టోర్నీలో విజేతగా నిలిచిన శ్రీకాంత్.. పదుకొనె, గోపీచంద్ తర్వాత భారత్ నుంచి ర్యాంకింగ్స్‌లో మూడో స్థానాన్ని సాధించిన ఆటగాడిగా నిలిచాడు. అదే జోరులో రియో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన అతను.. ఆ మెగాటోర్నీలో క్వార్టర్‌ఫైనల్లో ఓడాడు. ఆ తర్వాత చీలమండ గాయంతో బాధపడ్డ శ్రీకాంత్.. దాని నుంచి కోలుకోవడానికి తీవ్రంగా శ్రమించాడు. గాయం నుంచి కోలుకున్నాక గతేడాది నాలుగు సూపర్ సిరీస్ టైటిళ్లు నెగ్గి ప్రపంచ అగ్రశ్రేణి ఆటగాళ్ల సరసన స్థానం సంపాదించాడు.

సింధు, సైనా కుటుంబ సభ్యుల పేర్లు తొలగింపు

- 21 మందికి క్రీడల శాఖ అనుమతి నిరాకరణ
- రోనక్ పండిట్ లేకపోవడంపై రగడ

దిల్లీ: కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారుల సహాయ సిబ్బంది, కుటుంబ సభ్యుల జాబితాపై కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ కోత విధించింది. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) సిఫార్సు చేసిన జాబితా నుంచి 21 మందికి అనుమతి నిరాకరించింది. అందులో పి.వి.సింధు తల్లి విజయ, సైనా నెహ్వాల్ తండ్రి హర్‌వీర్‌సింగ్ ఉన్నారు. ఐతే మాజీ షూటర్ రోనక్ పండిట్ పేరును కూడా తొలగించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొంటున్న షూటర్ హీనా సిద్ధుకు రోనక్ భర్త. కొన్నేళ్లుగా ఆమెకు కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. పైగా భారత పిస్టల్, రైఫిల్ జట్టు హై పర్ఫార్మెన్స్ డైరెక్టర్ కూడా. హీనా సిద్ధు భర్త అనే కారణంతో రోనక్‌ను తప్పించడంపై షూటింగ్ వర్గాలు గుర్రుగా ఉన్నాయి. కామన్వెల్త్ క్రీడల నిర్వాహకులు రోనక్ పేరిటే గన్ పర్మిట్‌లు ఇవ్వడం.. క్రీడా శాఖ అతని పేరును తొలగించడం భారత షూటింగ్ జట్టును మరింత కలవరపెడుతోంది. కామన్వెల్త్ క్రీడల్లో పాల్గొనే జాతీయ షూటింగ్ జట్లకు విమానాశ్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గన్‌లు తెచ్చి.. తిరిగి తీసుకెళ్లడానికి నిర్వాహక దేశం గన్ పర్మిట్‌లు ఇస్తుంది. భారత జట్టు కోసం రోనక్ పేరిట గన్ పర్మిట్‌లను మంజూరు చేశారు. తీరా పోటీలు దగ్గరపడే సమయంలో కామన్వెల్త్ బృందం నుంచి రోనక్ పేరును తొలగించడం షూటర్లను అయోమయానికి గురిచేస్తోంది. నిజానికి రోనక్ విషయంలో క్రీడా శాఖ కొర్రీలు పెట్టడం ఇది కొత్త కాదు. హీనా కోచ్‌గా 2016 రియో ఒలింపిక్స్‌కు వెళ్ళేందుకు సైతం రోనక్‌ను అనుమతించలేదు. 2012 లండన్ ఒలింపిక్స్ సమయంలో హీనా, రోనక్‌లకు ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సహాయంలోనూ ఇబ్బందులు తలెత్తాయి. ఈ వ్యవహారంపై హీనా అసంతృప్తి వ్యక్తంజేసింది. "నేనెప్పుడూ అబద్ధం ఆడలేదు. మోసం చేయలేదు. 11 ఏళ్ళుగా షూటింగ్ క్రీడలో ఉన్నా. ఆరేళ్ళుగా రోనక్‌తో కలిసి సాధన చేస్తున్నా. ఆరేళ్ళుగా ఇదే గొడవ. కోచ్‌కు నిధులు విడుదల, ప్రయాణాలు, గుర్తింపు విషయాల్లో పోరాడి అలసిపోయా. రోనక్ నా కోచ్. నాకు ఒకడే కోచ్.. అది రోనక్. షూటింగ్ రేంజ్‌లో 5 నిమిషాలు ఉంటే ఎవరికైనా ఈ విషయం అర్థమవుతుంది. షూటింగ్ జట్టుకు అతను మేనేజర్ కూడా" అని హీనా తెలిపింది. క్రీడా శాఖ తీరుపై భారత జాతీయ రైఫిల్ సంఘం (ఎన్‌ఆర్‌ఏఐ) అధ్యక్షుడు రణిందర్‌సింగ్ తప్పుపట్టాడు. గన్‌లు లేకుంటే షూటర్లు పోటీల్లో ఎలా పాల్గొంటారని ప్రశ్నించాడు.



హీనా

రోనక్

సౌమ్యజిత్‌పై వేటు

కామన్వెల్త్‌కు దూరం

దిల్లీ: అనుకున్నదే అయింది. అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న టేబుల్ టెన్నిస్ ఆటగాడు సౌమ్యజిత్ ఘోష్‌ను కామన్వెల్త్ భారత బృందం నుంచి తొలగించారు. అంతే కాక అతడిపై తాత్కాలిక నిషేధం కూడా పడింది. ఈ మేరకు భారత టీటీ సమాఖ్య (టీటీఎఫ్ఐ) శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. ''సౌమ్యజిత్‌పై టీటీఎఫ్ఐ కార్యనిర్వాహక బోర్డు తాత్కాలిక సస్పెన్షన్ విధించింది. పోలీస్ విచారణ అనంతరం కోర్టు తీర్పును అనుసరించి బోర్డు తుది నిర్ణయం తీసుకుంటుంది. ఈ నిషేధం ఉన్నంత కాలం అతను జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో ఆడడానికి వీల్లేదు. మీడియా నివేదికలు, ఎఫ్ఐఆర్ ప్రకారం బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. వచ్చే కామన్వెల్త్ పోటీలకు అతను అనర్హుడు'' అని టీటీఎఫ్ఐ ప్రకటనలో తెలిపింది.

కోహ్లి.. రూ.34 కోట్ల ఇల్లు కొనట్లేదు!



ముంబయి: భారత క్రికెట్ జట్టు సారథి విరాట్ కోహ్లి ముంబయిలో రూ.34 కోట్లతో ఇల్లు కొనేందుకు చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకున్నాడు. ఒక భవన నిర్మాణ సంస్థ తలపెట్టిన విలాసవంతమైన అపార్ట్‌మెంట్లో 35వ ఫ్లోర్‌లోని 7,171 చదరపు అడుగుల విస్తీర్ణం ఉన్న ఫ్లాట్‌ను కొనుగోలు చేయాలని కోహ్లి 2016లో నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు ఆ సంస్థతో ఒప్పందం కూడా చేసుకున్నాడు. కానీ ఇప్పుడా ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు తెలిసింది. ఈ అపార్ట్‌మెంట్లోనే యువరాజ్ సింగ్ భారీ ధరతో ఒక ఫ్లాట్ తీసుకున్నాడు. కొన్ని నెలల కిందటే బాలీవుడ్ నటి అనుష్క శర్మను పెళ్లాడిన కోహ్లి.. ఇటీవలే ముంబయిలోనే ఒక విలాసవంతమైన ఫ్లాట్‌ను రెండేళ్ల కాలానికి లీజుకు తీసుకున్నాడు. దానికి నెలకు రూ.15 లక్షల అద్దె చెల్లిస్తున్నాడు.

ఫైనల్లో పంకజ్

ఆసియా బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్



యాంగాన్: ఆసియా బిలియర్డ్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ క్యూయిస్ట్ పంకజ్ అడ్వాణీకి ఎదురులేకపోయింది. ప్రపంచ ఛాంపియన్ పంకజ్ ఆసియా ఛాంపియన్‌షిప్ టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచాడు. శుక్రవారం సెమీస్‌లో పంకజ్ 5-1 తేడాతో మన దేశానికే చెందిన ధ్వజ్ హరియాపై విజయం సాధించాడు. అంతకుముందు క్వార్టర్స్‌లో పంకజ్ 5-1తో అంగ్ హటే (మయన్మార్)పై గెలిచాడు. ఫైనల్ మ్యాచ్ మనోళ్ల మధ్యే జరగనుంది. భారత్‌కు చెందిన భాస్కర్, రూపేశ్‌ల మధ్య సెమీస్ విజేతతో పంకజ్ ఫైనల్లో తలపడనున్నాడు. మహిళల విభాగంలో కీరత్ భండాల్ కాంస్యం గెలిచింది. సెమీస్‌లో కీరత్ 0-3తో సిరిపాపార్న్ (థాయిలాండ్) చేతిలో ఓడింది. సెమీస్ చేరిన మరో భారత మహిళా క్యూయిస్ట్ అమీ కమని ఫైనల్లో చోటు కోసం కక వాన్ (హాంగ్‌కాంగ్)తో పోటీపడనుంది.

సన్‌రైజర్స్ టికెట్ అమ్మకాలు షురూ

ఈనాడు, హైదరాబాద్: నగరంలోని క్రికెట్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఐపీఎల్ టికెట్ అమ్మకాలు మొదలయ్యాయి. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆడే 7 మ్యాచ్‌లకు సంబంధించిన టికెట్ల అమ్మకాలు షురూ అయ్యాయి. ఏప్రిల్ 7న చైన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌తో హైదరాబాద్‌లో మ్యాచ్‌లు ప్రారంభమవుతాయి. ఈవెంట్స్‌నౌ డాట్ కామ్ ద్వారా ఆన్‌లైన్లో టిక్కెట్లు అందుబాటులో ఉండనున్నాయి. కనిష్ఠ ధర రూ.500గా, గరిష్ఠ ధర రూ.2734గా నిర్ణయించారు.



వార్నర్ బౌల్డ్

ఆసక్తికరంగా మూడో టెస్టు

కంగారూ-సఫారీ.. నువ్వా నేనా

కేప్‌టౌన్: సిరీస్ 2-2తో సమంగా ఉంది. మూడో టెస్టులో గెలిచే జట్టుకే సిరీస్ సాధించే అవకాశాలు మెండుగా ఉంటాయి. ఈ స్థితిలో కేప్‌టౌన్ టెస్టు రసవత్తరంగా సాగుతోంది. మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా హోరాహోరీగా తలపడుతున్నాయి. రెండో రోజు ఒక దశలో దక్షిణాఫ్రికా ఆధిపత్యం చలాయిస్తున్నట్లే కనిపించింది. ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 100కు అటు ఇటుగా ఆధిక్యం సాధించేలా కనిపించింది. కానీ లోయరార్డర్ పోరాటంతో ఆసీస్ ఆధిక్యాన్ని తగ్గించేందుకు బాగానే ప్రయత్నించింది. ఆట ఆఖరుకు ఆస్ట్రేలియా స్కోరు 245/9. ఒక వికెట్ చేతిలో ఉన్న ఆ జట్టు ఇంకా 66 పరుగులు వెనుకబడి ఉంది. 50-60 పరుగుల ఆధిక్యమైనా కీలకమే కాబట్టి సాధ్యమైనంత త్వరగా చివరి వికెట్ పడగొట్టాలన్న పట్టుదల దక్షిణాఫ్రికాది. ఉన్న ఒక్క వికెట్‌తో మరింతగా లోటును తగ్గించుకోవాలన్న ప్రయత్నం ఆస్ట్రేలియాది. మరి మూడో రోజు ఆసీస్ ఇన్నింగ్స్ ఎక్కడ ముగుస్తుందో చూడాలి. తొలి ఇన్నింగ్స్‌లో 311 పరుగులకు ఆలౌటైన దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో ఎలా ఆడుతుందన్నదీ ఆసక్తికరమే. శుక్రవారం ఉదయం 266/8తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన సఫారీ జట్టు ఇంకో 45 పరుగులు జోడించి మిగతా రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ ఎల్గర్ 141 పరుగులతో అజేయంగా నిలవడం విశేషం. రబాడ (22)తో తొమ్మిదో వికెట్‌కు అతను 50 పరుగులు జోడించాడు. అనంతరం బాన్‌క్రాఫ్ట్ (77), వార్నర్ (30) ఆసీస్‌కు మంచి ఆరంభాన్నిచ్చినా.. తొలి వికెట్ పడ్డాక కథ మారింది. ఖవాజా (5), స్మిత్ (5) చేతులెత్తేయడంతో ఆసీస్ 72/3కు చేరుకుంది. ఐతే బాన్‌క్రాఫ్ట్, షాన్ మార్ష్ (26) జోడీ ఆదుకోవడంతో స్కోరు 150/3కి చేరుకుంది. ఈ దశలో మళ్లీ ఆసీస్ పతనం మొదలైంది. రబాడ (3/81), మోర్నీ మోర్కెల్ (4/84) ఆసీస్ ఇన్నింగ్స్‌ను కుదేలు చేశారు. పైన్ (33 బ్యాటింగ్), లైయన్ (47) పతనాన్ని అడ్డుకుని తొమ్మిదో వికెట్‌కు 66 పరుగులు జోడించారు. ఆట చివర్లో లైయన్ ఔటయ్యాడు. పైన్‌తో పాటు హేజిల్‌వుడ్ (1) క్రీజులో ఉన్నాడు.

రబాడ × వార్నర్.. భలే మజా

4, 4, 4, 6, 4.. రబాడ బౌలింగ్ వార్నర్ ప్రతాపం సాగిన తీరిది. ఈ సిరీస్‌లో దక్షిణాఫ్రికా ఆటగాళ్లకు, వార్నర్‌కు అసలేమాత్రం పడని సంగతి తెలిసిందే. గత మ్యాచ్‌లో తాను ఔటైనపుడు రబాడ ఎగతాళిగా హేళన చేయడాన్ని దృష్టిలో ఉంచుకునేమో శుక్రవారం అతడి బౌలింగ్‌లో వార్నర్ చెలరేగిపోయాడు. టీ20ల్ని తలపిస్తూ వరుస బౌండరీలు బాదాడు. కానీ ఐదు వరుస బౌండరీల అనంతరం వార్నర్‌ను బౌల్డ్ చేసి రబాడ ప్రతీకారం తీర్చుకున్నాడు. అతడి ధాటికి ఎగిరిన ఆఫ్ స్టంప్ నాలుగైదుసార్లు పల్టీలు కొడుతూ కనువిందు చేసింది.



అభిమానితో రగడ: తొలి టెస్టులో దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ క్వింటన్ డికాక్‌తో తీవ్ర స్థాయిలో వాగ్వాదానికి దిగి, అతడిపై దూసుకెళ్లే ప్రయత్నం కూడా చేసిన ఆస్ట్రేలియా ఓపెనర్ వార్నర్‌కు శుక్రవారం ఓ దక్షిణాఫ్రికా అభిమానితో వివాదం నడిచింది. రబాడ బౌలింగ్‌లో బౌల్డయ్యాక వార్నర్ పెవిలియన్‌కు నడుస్తుండగా.. పక్కనే ఉన్న వీక్షకుల గ్యాలరీ నుంచి ఒక నడి వయసు అభిమాని వార్నర్‌ను సమీపించాడు. ఓవైపు చప్పట్లు చరుస్తూనే అతడిని రెచ్చగొట్టేలా మాట్లాడాడు. కొంచెం ముందుకు వెళ్లాక వార్నర్ ఆగి ఆ అభిమానితో వాగ్వాదానికి దిగాడు. భద్రత సిబ్బంది వారించే ప్రయత్నం చేసినా ఇద్దరూ తగ్గలేదు. మధ్యలో బారికేడ్ ఉండగా.. ఇద్దరూ ముందుకు నడుస్తూనే మాటల యుద్ధాన్ని కొనసాగించారు. ఆట ముగిశాక వార్నర్ ఆ అభిమానిపై రిఫరీకి ఫిర్యాదు చేశాడు.

విలియమ్సన్ రికార్డు శతకం

- భారీ ఆధిక్యం దిశగా కివీస్
- ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు



విలియమ్సన్ (102)

ఆక్లాండ్: ఈ తరం మేటి బ్యాట్స్‌మెన్‌లో ఒకడైన న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్.. 27 ఏళ్ల వయసుకే తమ దేశం తరపున అత్యధిక టెస్టు శతకాలు సాధించిన బ్యాట్స్‌మన్‌గా రికార్డు నెలకొల్పాడు. శుక్రవారం అతను 18వ టెస్టు శతకం సాధించాడు. ప్రస్తుతం న్యూజిలాండ్ జట్టులోనే ఉన్న రాస్ టేలర్, దివంగత కెప్టెన్ మార్టిన్ క్రోల పేరిట ఉమ్మడిగా ఉన్న 17 శతకాల రికార్డును అతను బద్దలు కొట్టాడు. విలియమ్సన్ (102) శతకం సాయంతో ఇంగ్లాండ్‌తో తొలి టెస్టులో న్యూజిలాండ్ భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్‌ను కేవలం 58 పరుగులకే కుప్పకూల్చిన కివీస్.. రెండో రోజు వర్షం వల్ల ఆట నిలిచిపోయే సమయానికి 4 వికెట్ల నష్టానికి 229 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 175/3తో ఆట కొనసాగించిన కివీస్.. 23.1 ఓవర్లు మాత్రమే బ్యాటింగ్ చేసింది. 91 పరుగులతో క్రీజులోకి వచ్చిన విలియమ్సన్ కాసేపటికే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ వెంటనే ఔటయ్యాడు. నికోల్స్ (49 బ్యాటింగ్), వాట్లింగ్ (17 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా జాగ్రత్త పడ్డారు.

ఇంగ్లాండ్ శుభారంభం

ముక్కోణపు టీ20 టోర్నీ



ముంబయి: ముక్కోణపు టీ20 టోర్నీని ఇంగ్లాండ్ మహిళల జట్టు విజయంతో మొదలు పెట్టింది. శుక్రవారం ఇంగ్లాండ్ 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై విజయం సాధించింది. తొలుత ఆస్ట్రేలియా 8 వికెట్లకు 149 పరుగులు చేయగలిగింది. రాచెల్ హైనెస్ (65) అర్ధశతకంతో ఆకట్టుకుంది. ఇంగ్లాండ్ బౌలర్లలో సీవర్ (2/29), జెన్నిగన్ (3/26) రాణించారు. అనంతరం సీవర్ (68 నాటౌట్), టామీ బేమాంట్ (58 నాటౌట్) చెలరేగడంతో ఇంగ్లాండ్ 17 ఓవర్లలో 2 వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది.

సౌత్‌జోన్ ఛాంప్ ఆంధ్ర

బీసీసీఐ అంతర్ రాష్ట్ర మహిళల క్రికెట్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: బీసీసీఐ సౌత్‌జోన్ అంతర్ రాష్ట్ర మహిళల అండర్-23 టీ20 లీగ్ క్రికెట్లో ఆంధ్ర సత్తాచాటింది. ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ గెలిచిన ఆంధ్ర సౌత్‌జోన్ ఛాంపియన్‌గా నిలిచింది. ఐదు మ్యాచ్‌ల్లోనూ విజయాలతో 20 పాయింట్లు సాధించిన ఆంధ్ర పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. కేరళ (16) రన్నరప్ ట్రోఫీ అందుకుంది. హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది.

ట్రోఫీతో ఆంధ్ర జట్టు



మమతా బెనర్జీని కలిసిన షమి భార్య



కోల్‌కతా: టీమ్ఇండియా పేసర్ మహమ్మద్ షమి భార్య హసీన్ జహాన్ శుక్రవారం పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కలిసింది. షమిపై గృహ హింస, అక్రమ సంబంధాల ఆరోపణలు చేస్తూ అతనిపై పోలీస్ కేసు పెట్టిన ఆమె తనకు అండగా నిలవాలని మమతను కోరింది. షమి ఫిక్సింగ్‌కు పాల్పడలేదని బీసీసీఐ తేల్చిన తర్వాతి రోజే జహాన్ ముఖ్యమంత్రిని కలవడం విశేషం. ఆమెకు న్యాయం జరిగేలా చూస్తానని మమతా బెనర్జీ చెప్పారు.

మే 20న మహిళా వర్సిటీ పీజీసెట్

మహిళా విశ్వవిద్యాలయం(తిరుపతి), న్యూస్‌టుడే: తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2018-19 విద్యా సంవత్సరానికి ఎస్పీఎంవీవీ పీజీసెట్-18 నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య కళారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాల్లోని మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని వివరించారు. వర్సిటీ వెబ్‌సైట్‌ను పరిశీలించి దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. పూర్తి చేసిన దరఖాస్తులను మే 5లోపు అందజేయాలని, అదే నెల 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ఎమ్మెస్సీలో 18, ఎంఏలో పది కోర్సులు, బ్యాచిలర్స్ డిగ్రీలో ఒకటి, ఇంటిగ్రేటెడ్ మూడు, బి.ఒకేషనల్ రెండు, పీజీ డిప్లొమా ఏడు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు జూన్ 6నుంచి కౌన్సెలింగ్ ఉంటుందని వివరించారు.

శాసనసభ్యుల క్రీడా పోటీలను విజయవంతం చేయండి :కొల్లు రవీంద్ర

ఈనాడు డిజిటల్, అమరావతి: శాసనసభ్యుల స్పోర్ట్స్ మీట్-2018ని విజయవంతం చేయాలని క్రీడల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. ఈ నెల 24, 26 తేదీల్లో విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం, దండమూడి రాజగోపాల్ ఇండోర్ స్టేడియంలో క్రీడలు జరుగుతాయని తెలిపారు. ఈ పోటీల్లో ముఖ్యమంత్రి జట్టు, స్పీకర్ జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. క్రీడల్లో పాల్గొనేందుకు మొత్తం 54 మంది ఎమ్మెల్యేలు తమ పేర్లు నమోదు చేయించుకున్నారని శుక్రవారం ఆయన ఓ ప్రకటనలో తెలిపారు.

లింగాయతులు ఇక అల్పసంఖ్యాకులు

ఉత్తర్వులు జారీచేసిన కర్ణాటక ప్రభుత్వం

ఈనాడు- బెంగళూరు: లింగాయతులు, బసవతత్వాన్ని నమ్మిన వీరశైవుల్ని మత అల్పసంఖ్యాకులుగా కర్ణాటక ప్రభుత్వం అధికారికంగా గుర్తించింది. కర్ణాటక మత అల్పసంఖ్యాకుల, హజ్, వక్ఫ్‌శాఖ శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతమున్న అల్పసంఖ్యాకులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌలభ్యాలకు ఇబ్బంది కల్గించరాదనే ఆంక్షలకు లోబడి లింగాయతులు, బసవతత్వాన్ని నమ్మిన వీరశైవుల్ని మత అల్పసంఖ్యాకులుగా గుర్తించినట్లు అందులో పేర్కొంది. లింగాయతులను అల్పసంఖ్యాకులుగా గుర్తించాలంటూ కేంద్రానికి ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ప్రతిపాదించింది.

ఆప్షన్ల నమోదు గడువు పొడిగింపు

ఈనాడు, అమరావతి: పీజీ వైద్య విద్యలో ప్రవేశాల కౌన్సెలింగ్‌లో భాగంగా ఆప్షన్ల నమోదు గడువును కేంద్రం పొడిగించింది. తొలుత నిర్ణయించిన ప్రకారం శనివారం సాయంత్రంతో ఇది ముగియాల్సి వచ్చింది. సర్వరులో సాంకేతిక లోపంపై ఫిర్యాదులు అందడంతో కేంద్రం ఈ సమస్యను పరిష్కరించింది. సాఫ్ట్‌వేర్‌లో అవసరమైన మార్పులు చేయడంతో ప్రస్తుతం ఆప్షన్ల నమోదు సులువుగా ఉన్నట్లు విద్యార్థులు పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ వరకు ఆప్షన్ల నమోదుకు గడువును పొడిగించనున్నట్లు మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ తెలిపింది.

కాలువలో పడి 110 గొర్రెలు మృతి

తాడికొండ,న్యూస్‌టుడే: కాలువలో పడి 110 గొర్రెలు చనిపోయిన సంఘటన గుంటూరు జిల్లా తాడికొండ వద్ద జరిగింది. బేతపూడి, నిడమర్రు గ్రామాలకు చెందిన తోట వెంకటేశ్వర్లు, గయిరబోయిన శివయ్య, బొంతా నాగేశ్వరరావు, బొంతా గోపయ్యలకు 800 గొర్రెలు ఉన్నాయి. శుక్రవారం సాయంత్రం కంతేరు నుంచి తాడికొండ పొలాల్లోకి వెళుతున్న సమయంలో ఒక లారీ అడ్డువచ్చింది. దీంతో గొర్రెలు బెదిరి కాలువలోకి దూకటంతో ఒకదానిపై ఒకటిపడిపోయి ఊపిరి ఆడక 110 గొర్రెలు చనిపోయాయి. వాటి విలువ సూమారు రూ.10 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు.

విశాఖ మెట్రోకు 5 కంపెనీలకు అర్హత

ఈనాడు, విశాఖపట్నం: విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టేందుకు బిడ్ వేసిన 5 ప్రధాన కంపెనీలు ప్రాథమికంగా అర్హత సాధించాయని అమరావతి మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు. అదానీ, టాటా రియాలిటీ, షాపూర్‌జీ పల్లోన్‌జీ, ఎస్సెల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్, ఐఎల్ అండ్ ఎఫ్ఎస్ రైల్ కంపెనీలు ఇందులో ఉన్నాయి. వీటి నుంచి ప్రతిపాదనల్ని ఆహ్వానించే ప్రక్రియకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది. ఆయా కంపెనీల ప్రతిపాదనల ప్రక్రియ అయ్యాక.. ప్రాజెక్టు నిర్మాణ బాధ్యతలకు ఎవరు అర్హులో నిర్ణయిస్తారు.

ఆప్ ఎమ్మెల్యేలకు ఊరట

- ‘లాభదాయక కేసు’లో అనర్హత వేటును కొట్టేసిన దిల్లీ హైకోర్టు

దిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి పెద్ద ఊరట! లాభదాయక పదవుల కేసులో ఆ పార్టీకి చెందిన 20 మంది ఎమ్మెల్యేలపై పడిన అనర్హత వేటును దిల్లీ హైకోర్టు శుక్రవారం కొట్టేసింది. ఈ అంశంపై మరోసారి విచారించి, నిర్ణయం తీసుకోవాలని కేసును తిరిగి ఎన్నికల సంఘానికి అప్పగించింది.

ఈ ఎమ్మెల్యేలు 2015 మార్చిలో దిల్లీ ప్రభుత్వంలోని మంత్రులకు పార్లమెంటరీ కార్యదర్శులుగా నియమితులయ్యారు. ఇది లాభదాయక పదవి అని ఆరోపణలు వచ్చాయి. ఈ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ ఈసీ.. ఈ ఏడాది జనవరి 19న రాష్ట్రపతికి సిఫార్సు చేసింది. మరుసటి రోజే రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో ఆ 20 మందిని అనర్హులుగా ప్రకటిస్తూ కేంద్రం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిపై ప్రజాప్రతినిధులు దిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. నోటిఫికేషన్‌పై స్టే విధించేందుకు జనవరి 24న హైకోర్టు నిరాకరించింది. అయితే సదరు నియోజకవర్గాల్లో ఖాళీలను భర్తీ చేయడానికి ఉపఎన్నికల తేదీని ప్రకటించడం వంటి చర్యలను చేపట్టరాదని ఈసీని ఆదేశించింది.



ముఖ్యమంత్రి కేజ్రీవాల్ నివాసంలో ఆప్ ఎమ్మెల్యేల ఆనందోత్సాహాలు

తాజాగా ఈ అంశంపై తీర్పును వెలువరించింది. ఆప్ ఎమ్మెల్యేలపై వేటు వేస్తూ ఇచ్చిన నోటిఫికేషన్ చట్టప్రకారం సరికాదని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ చందర్ శేఖర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. దీనిపై ఈసీ చేసిన సిఫార్సును తప్పుపట్టింది. ఇందులో సహజన్యాయ సూత్రాల ఉల్లంఘన జరిగిందని పేర్కొంది. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయడానికి ముందు మౌఖిక వాదనను వినలేదని వ్యాఖ్యానించింది. “ఈ కేసుపై మళ్లీ వాదనలు విని, ఆ తర్వాత.. ‘లాభదాయక పదవి అంటే ఏమిటి’ వంటి ముఖ్యమైన అన్ని అంశాలపై నిర్ణయం తీసుకోవాలి” అని ఈసీని ఆదేశించింది.

తీర్పు వెలువడగానే.. కోర్టు హాల్లోనే ఉన్న ఆప్ ఎమ్మెల్యేలు పరస్పరం అభినందనలు తెలుపుకొన్నారు. దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ధర్మ విజయమని పేర్కొన్నారు. “ప్రజా ప్రతినిధులపై అక్రమంగా అనర్హత వేటు వేశారు. దిల్లీ ప్రజలకు హైకోర్టు న్యాయం చేసింది. ఇది వారి విజయమే. దిల్లీ ప్రజలకు శుభాకాంక్షలు” అని ఆయన ట్విటర్‌లో పేర్కొన్నారు. మరోవైపు హైకోర్టు తీర్పు నేపథ్యంలో సదరు 20 మంది ఎమ్మెల్యేలను ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు అనుమతిస్తామని స్పీకర్ రామ్‌నివాస్ గోయెల్ తెలిపారు. ఆప్ ఎమ్మెల్యేల అనర్హత కేసుపై ఈసీ వద్ద మరోసారి పోరాటం చేస్తామని దిల్లీ కాంగ్రెస్ విభాగం అధ్యక్షుడు అజయ్ మాకెన్ చెప్పారు.

మార్పులపై వివరణ ఇవ్వాలి

- అప్పుడే సవరించిన వ్యయ అంచనాల పరిశీలన
- పోలవరం పనుల పరిమాణంపై నిపుణుల కమిటీ స్పష్టీకరణ

ఈనాడు - అమరావతి

పోలవరం ప్రాజెక్టు పనుల పరిమాణంలో చేసిన మార్పులపై కేంద్ర జల మండలి (సీడబ్ల్యూసీ) లేవనెత్తిన సందేహాలకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం వివరణ ఇవ్వాలని, తన వాదన నిరూపించుకునేందుకు అవసరమైన పత్రాల్నీ జత చేయాలని నిపుణుల కమిటీ సూచించింది. ఈ వివరాలు అందిన తర్వాత మాత్రమే ప్రాజెక్టు అంచనాల్ని సవరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పంపించిన ప్రతిపాదనల్ని సీడబ్ల్యూసీ పరిశీలిస్తుందని స్పష్టం చేసింది. ఒక పునరావాస కాలనీని కమిటీ సందర్శించిందని, పునరావాస ప్యాకేజీతో నిర్వాసితులు సంతృప్తిగా ఉన్నారని పేర్కొంది. ఈ జాతీయ ప్రాజెక్టుని రాష్ట్ర జలవనరుల శాఖ నిర్వహిస్తున్నందున పోలవరం ప్రాజెక్టు అథారిటీ అవసరం లేదని అభిప్రాయపడింది. దాని పాత్ర గురించి నిర్దిష్టంగా నిర్వహించుకోవాల్సి ఉందని పేర్కొంది. పోలవరం ప్రాజెక్టు పనులు ప్రణాళిక ప్రకారం సాగుతున్నాయా, నిబంధనలకు అనుగుణంగానే జరుగుతున్నాయా? వంటి అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు కేంద్ర జలవనరుల శాఖ ఎస్.మసూద్ హుస్సేన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఈ నెల 15 నుంచి 17 వరకు ప్రాజెక్టు ప్రాంతాన్ని, నిర్వాసితుల పునరావాస కేంద్రాల్ని సందర్శించింది. వివిధ అంశాలపై సిఫార్సులు చేసింది.



కమిటీ నివేదికలోని ముఖ్యాంశాలు...!

★ పోలవరం ప్రాజెక్టు అంచనాల్ని రూ.16,010.45 కోట్ల నుంచి రూ.58,319.06 కోట్లకు పెంచాలని కోరుతూ సీడబ్ల్యూసీకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదన పంపింది. పనుల పరిమాణాన్ని ఎందుకు పెంచాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాలని అది 2018 మార్చి 6న కోరింది. దీనిపై సత్వరం వివరణ ఇస్తే తప్ప రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తిని పరిశీలించడం సాధ్యపడదు.

★ పోలవరం ప్రాజెక్టుని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలంటే... భూసేకరణ, నిర్వాసితులకు పునరావాసం కార్యక్రమాల్ని వేగవంతం చేయాలి. మొత్తం 1,66,213.71 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా ఇంత వరకు 1,10,003.02 ఎకరాల సేకరణే పూర్తయింది. మొత్తం 17739 నిర్వాసిత కుటుంబాలు ఉండగా, ఇంత వరకు 3348 కుటుంబాలకు మాత్రమే పునరావాసం కల్పించారు.

★ పోలవరం ప్రాజెక్టుని 2019 డిసెంబరు నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడక్కడ పనులు జరుగుతున్న తీరుని బట్టి చూస్తే... లక్ష్యాన్ని చేరుకోవాలంటే పనుల్ని మరింత వేగవంతం చేయాలి. ప్రాజెక్టు డ్రాయింగ్‌లకు సీడబ్ల్యూసీ నుంచి త్వరగా అనుమతులు పొందాలి.

★ స్పిల్ ఛానల్ మీద సాధారణ బ్రిడ్జికి బదులుగా, ఐకానిక్ బ్రిడ్జి నిర్మిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఆకృతులు ఖరారైన వెంటనే... ఐకానిక్‌గా బ్రిడ్జిగా మార్చడం వల్ల నిర్మాణ వ్యయంలో వచ్చే వ్యత్యాసానికి సంబంధించిన వివరాల్ని కమిటీకి అందజేయాలి. డీడీఆర్‌పీ పరిశీలనకూ పంపించాలి.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు నివాళులు

దిల్లీ, ఈనాడు, అమరావతి: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. వారి వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం మోదీ అంజలి ఘటించారు. “భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల బలిదానాలు దేశ చరిత్రలో నిలిచిపోతాయి. వారు భారతీయులైనందుకు.. దేశవాసులంతా గర్వపడుతున్నారు” అని మోదీ ఓ సందేశంలో వ్యాఖ్యానించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లకు రాజ్యసభ, లోక్‌సభలు కూడా నివాళులు అర్పించాయి. రాజ్యసభ కార్యకలాపాల ప్రారంభ సమయంలో సభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు వారి త్యాగాలను స్మరించుకున్నారు. ఇటు స్వాతంత్ర్య ఉద్యమకారుడు రామ్ మనోహర్ లోహియా జయంతి సందర్భంగా ఆయన సేవలనూ మోదీ కొనియాడారు.

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల నిస్వార్థ, సాహసోపేతమైన త్యాగాలను జనసేన పార్టీ స్మరించుకుంటుందని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు.

సాహిత్య అకాడమీ సలహామండలి సభ్యుడిగా యాకూబ్

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర సాహిత్య అకాడమీ ఏర్పాటు చేసిన తెలుగు సలహామండలిలో ప్రముఖ కవి యాకూబ్‌కు స్థానం కల్పించారు. 2018 నుంచి 2022 వరకు సలహామండలిలో ఆయన సభ్యుడిగా కొనసాగుతారు. బుధవారం దిల్లీలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో యాకూబ్‌ను ఎంపిక చేసినట్లు అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. సాహిత్య అకాడమీ తెలుగుకు సంబంధించి నిర్వహించనున్న కార్యక్రమాలు, ప్రచురణల విషయంలో ఆయన సలహాలు తీసుకుంటామన్నారు.

చరిత్ర సృష్టించిన ఎయిర్ ఇండియా!



టెల్‌అవీవ్‌కు సమీపాన గల లోడ్ వద్ద గల బెన్ గురియన్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఎయిర్ ఇండియాకు చెందిన బోయింగ్ విమానం

ఇజ్రాయెల్‌కు తొలి భారతీయ విమానం

టెల్ అవీవ్: భారత్-ఇజ్రాయెల్ సంబంధాల్లో నూతన అధ్యాయం! ఆ దేశానికి తొలిసారిగా ఎయిర్ ఇండియా (ఏఐ) తన విమాన సేవలను ప్రారంభించింది. సౌదీ అరేబియా విధించిన దశాబ్దాల గగనతల నిషేధానికి ముగింపు పలుకుతూ- ఆ దేశం మీదుగా ఏఐ విమానం ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ విమానాశ్రయానికి చేరుకోవడం విశేషం. గురువారం దిల్లీలో బయల్దేరిన ఏఐ139 విమానం- ఒమన్, సౌదీఅరేబియా, జోర్డాన్ మీదుగా కేవలం 7.25 గంటల్లోనే గమ్యస్థానానికి చేరుకుంది. ఇజ్రాయెల్‌కు చెందిన ఈఐఏఐ విమానం కంటే దీని ప్రయాణ సమయం 2.10 గంటలు తక్కువ! ప్రతి మంగళ, గురు, ఆదివారాల్లో ఏఐ విమానం ఇజ్రాయెల్‌కు వెళ్తుందని ఎయిర్ ఇండియా సీఎండీ ప్రదీప్ ఖరోలా తెలిపారు. ఇదొక చరిత్రాత్మక ఘట్టమని ఇజ్రాయెల్ పర్యాటక మంత్రి యారివ్ లెవిన్ అన్నారు. భారత విమానం తన భూభాగం మీదుగా వెళ్లేందుకు సౌదీ అంగీకరించడం... మనదేశ నూతన ప్రతిష్ఠకు దర్పణం పడుతుందని పౌర విమానయానశాఖ మంత్రి సురేష్ ప్రభు పేర్కొన్నారు.

పోలవరంపై ఎన్జీటీ తీర్పు సుప్రీంలో సవాలు

ఈనాడు, దిల్లీ: పోలవరం పర్యావరణ అనుమతులు, నిబంధనల ఉల్లంఘనపై జాతీయ హరిత ట్రైబ్యునల్ తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో కేసు దాఖలైంది. ఎన్జీటీ తీర్పును సవాలు చేస్తూ రేలా అనే స్వచ్ఛంద సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ మదన్ బి లోకూర్, జస్టిస్ దీపక్‌గుప్తాలతో కూడిన ధర్మాసనం విచారణకు స్వీకరించింది. పోలవరానికి సంబంధించి సుప్రీంకోర్టులో చాలా కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, కేసు విచారణ చేయలేమని 2017 నవంబరు 17న ఎన్జీటీ తీర్పునిచ్చిందని పిటిషనర్ తరఫు న్యాయవాది శ్రావణ్‌కుమార్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. తాము దాఖలు చేసింది పర్యావరణానికి సంబంధించిందని, దీన్ని ఎన్జీటీ విచారణకు స్వీకరించకపోవడం సరికాదని కోర్టుకు తెలిపారు. పిటిషన్ విచారణకు స్వీకరించిన ధర్మాసనం పోలవరం అథారిటీ, కేంద్ర పర్యావరణ శాఖ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాలకు నోటీసులిచ్చింది.

సరిలేరు ‘హిందూజా’ కుటుంబానికెవ్వరూ!

యూకేలో నివసిస్తున్న ఆసియన్లలో అత్యంత సంపన్నులు

లండన్: యూకేలో నివసిస్తున్న బ్రిటిష్ ఆసియన్లలో తమకు తామే సాటి అని హిందూజా కుటుంబం మరోసారి రుజువు చేసింది. వరుసగా ఐదో ఏడాది కూడా అత్యధిక సంపన్న వ్యాపార కుటుంబంగా నిలిచింది. లండన్ ప్రధాన కేంద్రంగా ఐదు ఖండాల్లో విస్తరించిన వీరి వ్యాపార సామ్రాజ్యం విలువ అక్షరాలా సుమారు రూ.2,02,250 కోట్లు అని ‘ఆసియన్ మీడియా గ్రూప్’ ఏటా విడుదల చేసే ఆసియాన్ సంపన్నుల జాబితాలో వెల్లడించింది. హిందూజా సోదరులైన శ్రీచంద్, గోపీచంద్, ప్రకాశ్, అశోక్‌ల ఆస్తులు 2017లో సుమారు రూ.27,577 కోట్లు పెరిగినట్లు తెలిపింది. హిందూజాల తరువాత భారతీయ స్టీల్ దిగ్గజం లక్ష్మీనివాస్ మిట్టల్ రూ.1,28,704 కోట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఈయన ఆస్తులు రూ.12,870 కోట్లు పెరిగాయి. ఇండోరమా కార్పొరేషన్ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అయిన శ్రీప్రకాశ్ లోహియా రూ.46,885 కోట్లతో తరువాతి స్థానంలో నిలిచారు. యూకేలో ఉంటున్న 101 మంది దక్షిణాసియా సంతతి మిలియనీర్లు మొత్తం రూ.7,35,456 కోట్ల విలువైన ఆస్తిపాస్తులు కలిగి ఉన్నారు. ఇందులో మొదటి పది మంది ఆస్తులు రూ.4,98,731 కోట్లు. మొత్తం ఆస్తిపాస్తుల్లో ఇవి 68 శాతం.

ఆకర్షణీయ నగరాలకు రూ.198 కోట్ల విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఆరు ఆకర్షణీయ నగరాల్లో ప్రతిపాదిత పనుల నిర్వహణకు రూ.198 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగానే అనంతపురం, ఏలూరు, కర్నూలు, నెల్లూరు, శ్రీకాకుళం, ఒంగోలులను ఆకర్షణీయ నగరాలుగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ఇందుకోసం ప్రత్యేక వాహక సంస్థ (ఎస్పీవీ)లను ఏర్పాటు చేసి పలు ప్రభుత్వశాఖలను భాగస్వాములను చేశారు. ప్రస్తుతం విడుదలైన నిధులతో అక్కడ పనులు ప్రారంభించనున్నారు.

పీఎంయూవై లబ్ధిదారుల రుణాల వసూలు వాయిదా

దిల్లీ: ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పీఎంయూవై) పథకం లబ్ధిదారులు తీసుకున్న రుణాలపై చెల్లింపుల వసూలును వాయిదా వేయాలని ప్రభుత్వ చమురు సంస్థలు నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటివరకూ పీఎంయూవై కింద 3.6 కోట్ల పేద మహిళలకు ప్రభుత్వం ఉచిత వంట గ్యాస్ కనెక్షన్లను ఇచ్చింది. కనెక్షన్‌కు అయ్యే రూ.1600ను ప్రభుత్వమే భరించింది. ఇటు సిలిండర్, స్టవ్ కొనుగోలు కోసం లబ్ధిదారులకు చమురు సంస్థలు వడ్డీ లేని రుణాలు ఇచ్చాయి. సిలిండర్ రీఫిల్‌పై ప్రభుత్వం ఇచ్చే రాయితీ మొత్తాన్ని.. రుణ చెల్లింపు కింద వసూలు చేసుకుంటున్నాయి. అయితే ఏప్రిల్ 1 మొదలుకొని.. లబ్ధిదారులు తీసుకునే తదుపరి ఆరు రీఫిళ్లపై ఈ రుణ వసూలు ఉండదని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది.

జిల్లా ఆస్పత్రులకు నీతి ఆయోగ్ ద్వారా శ్రేణులు

ఈనాడు, అమరావతి: నీతి ఆయోగ్ తొలిసారిగా పనితీరు ప్రతిపాదికన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రులకు ర్యాంకింగులను ఇవ్వబోతుంది. దేశవ్యాప్తంగా ఈ ర్యాంకులను ఇచ్చేందుకు సిద్ధమైంది. నీతిఆయోగ్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం రాష్ట్రాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమావేశమయ్యారు. 18 అంశాల ప్రతిపాదికన జిల్లా ఆస్పత్రులకు ర్యాంకింగ్ ఇస్తామని, ప్రధానమంత్రి కార్యాలయ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. మరోవైపు...ఇదే సమావేశంలో ఆయుష్మాన్ భారత్ మార్గదర్శకాల రూపకల్పనకు సంబంధించి కూడా కేంద్ర అధికారులు సమీక్ష జరిపారు. రాష్ట్రాల అధికారుల నుంచి అభిప్రాయాలను సేకరించారు.



మహాసమాధిని దర్శించుకుంటున్న గవర్నర్ నరసింహన్

సత్యసాయి ట్రస్టు సేవలు అమోఘం: గవర్నర్

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సత్యసాయి ట్రస్టు చేపడుతున్న బృహత్తర సామాజిక సేవ కార్యక్రమాలు అమోఘమని గవర్నర్ నరసింహన్ ప్రశంసించారు. శుక్రవారం బెంగళూరు నుంచి పుట్టపర్తి చేరుకున్న ఆయన సాయికుల్వంత్ మందిరంలోని సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. సత్యసాయి ట్రస్టు చేపడుతున్న సామాజిక సేవ కార్యక్రమాలను ట్రస్టు సభ్యులు గవర్నర్‌కు వివరించారు. నిరుపేదలకు ఖరీదైన వైద్యం, గ్రామీణ ప్రాంతాలకు తాగునీరు, సత్యసాయి విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు విలువలతో కూడిన విద్య ఉచితంగా అందించడం బాగున్నాయన్నారు. ఏపీ, తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాల్లో సత్యసాయి సేవా సంస్థలు ఎన్నో కార్యక్రమాలను నిబద్ధతతో చేపడుతున్నాయన్నారు.

ఆటో బోల్తాపడి పదో తరగతి విద్యార్థి మృతి

- మరో ప్రమాదంలో 20 మంది విద్యార్థులకు గాయాలు
- విజయనగరం, కర్నూలు జిల్లాల్లో విషాదం

గరుగుబిల్లి గ్రామీణం, కౌతాళం, న్యూస్‌టుడే: ఆటో బోల్తాపడి విజయనగరం జిల్లాలో ఓ పదోతరగతి విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడు. కర్నూలు జిల్లాలో జరిగిన మరో ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 20 మంది పదోతరగతి విద్యార్థులకు గాయాలయ్యాయి. విజయనగరం జిల్లా గరుగుబిల్లి మండలం నాగూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మరిశర్ల తిరుమలసాయి (15) శుక్రవారం పరీక్ష రాసుకొని తిరిగి ఇంటికొస్తుండగా.. జియ్యమ్మవలస మండలం తురకనాయుడువలస, లఖానాపురం మధ్య మలుపు వద్ద ఆటో బోల్తా పడిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. విద్యార్థి స్వస్థలం గరుగుబిల్లి మండలం ఖడ్గవలస. కర్నూలు జిల్లా బదినేహాల్ గ్రామం నుంచి మండల కేంద్రమైన కౌతాళానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో గ్రామానికి చెందిన సుమారు 50 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు నిత్యం ఆటోలను ఆశ్రయిస్తున్నారు. శుక్రవారం ఓ ఆటోలో 25 మందికి పైగా విద్యార్థులు బయల్దేరారు. కౌతాళం సమీపంలో అది బోల్తా పడింది. దీంతో 20 మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని కౌతాళం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. తీవ్రంగా గాయపడిన కృష్ణ, వీరేష్‌లను ఆదోని ఆసుపత్రికి సిఫార్సు చేశారు.






తిరుమల సాయి (పాతచిత్రం) ★ కర్నూలు జిల్లా కౌతాళం సమీపంలో బోల్తా పడిన ఆటో

అంతర్రాష్ట్ర ఎర్రచందనం ముఠా అరెస్టు

- రూ.75 లక్షల విలువైన దుంగలు, వాహనాలు స్వాధీనం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని వెలుగొండల నుంచి ఎర్రచందనాన్ని అక్రమంగా నరికి విదేశాలకు తరలించే అంతరాష్ట్ర ఎర్రచందనం ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా క్రైం విభాగం ఓఎస్‌డీ విఠలేశ్వర్ తెలిపారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలోని గూడూరులో డీఎస్పీ రాంబాబుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లోని ఎర్రచందనాన్ని అక్రమంగా నరికి స్మగ్లింగ్ చేస్తున్న తొమ్మిది మంది అంతర్రాష్ట్ర ముఠాను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి 40 ఎర్రచందనం దుంగలు(రూ.75లక్షలు విలువైన), మూడు వాహనాలు, నిందితుల వద్ద నుంచి రూ. 5,250 నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు, ప్రత్యేక బృందం తనిఖీలు చేస్తున్న క్రమంలో బెంగళూరు ప్రాంతానికి చెందిన అఫ్రాఖ్ ఖాన్, నవాజ్ షరీఫ్, ఆజ్ ఆహ్మద్ అనే అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లను, కడప జిల్లా ఒంటిమిట్ట ప్రాంతానికి చెందిన బుక్యా నాగేశ్వరావునాయక్, సుంకపురానికి చెందిన బడిచర్ల శివశంకర్, నెల్లూరు జిల్లా రాపూరు ప్రాంతానికి చెందిన రేవూరి సురేష్, కర్నూలు జిల్లా రామాంజనేయపురానికి చెందిన కత్తి ఏడుకొండలు, నంద్యాల ప్రాంతానికి చెందిన తులసీ చిన్న, ప్రకాశం జిల్లా బెస్తవారిపేట ప్రాంతానికి చెందిన రామిరెడ్డిలను అరెస్టు చేసినట్లు తెలిపారు.



విపక్షాలను ప్రజల్లో ఎండగట్టండి

- అసహనంతో అసత్యాల ప్రచారం
- ప్రజలకు వాస్తవాలను తెలియజేయండి
- భాజపా ఎంపీలకు ప్రధాని దిశానిర్దేశం
- పార్లమెంటులో ప్రతిష్టంభనకు ప్రతిపక్షాలే కారణం: అమిత్ షా



దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ, అమిత్‌షా, ఎల్‌కేఆడ్వాణీ తదితరులు

ఈనాడు – దిల్లీ

ఎన్నికల్లో ఓటమితో అసహనం చెందిన విపక్షాలు. . ప్రభుత్వంపై అసత్యాలను ప్రచారం చేస్తున్నాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ప్రజలకు వాస్తవాన్ని తెలియజేసేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా ఉపయోగించాలని భాజపా ఎంపీలకు సూచించారు. శుక్రవారం ఇక్కడ జరిగిన భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. దాదాపు నాలుగు గంటల పాటు ఈ భేటీ జరిగింది. మోదీతోపాటు పార్టీ అధ్యక్షుడు అమిత్ షా కూడా ఈ సమావేశంలో మాట్లాడారు. అనంతరం సమావేశం వివరాలను పార్టీ సీనియర్ ప్రకాశ్ జావడేకర్ విలేఖరులకు వివరించారు. వాటి ప్రకారం.. ఈ సమావేశంలో ఎంపీలను ఉద్దేశించి ప్రసంగించడానికి బదులు.. వారితో ప్రధాని ముచ్చటించారు. పార్టీ కొత్త కార్యాలయాన్ని చూపుతూ.. పార్టీ పని సంస్కృతి జిల్లా స్థాయి ఆఫీసుల నుంచి జాతీయ స్థాయి కార్యాలయాల్లో ప్రతిబింబించాలన్నారు. పార్టీ దివంగత నేత సుందర్ సింగ్ భండారీ ఆ రోజుల్లో అందుబాటులో ఉన్న ఏకైక ప్రసార సాధనమైన రేడియోలో వార్తలను విని, పార్టీని ముందుకు తీసుకెళ్లడంపై కొత్త ఆలోచనలు చేసేవారని చెప్పారు. అదేరీతిలో కార్యకర్తలు కూడా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని ప్రజలకు వాస్తవాలు చెప్పాలని కోరారు.

మరోవైపు.. పార్లమెంటులో ప్రతిష్టంభనకు విపక్షాలే కారణమని పార్టీ అధ్యక్షుడు అమిత్ షా దుయ్యబట్టారు. పార్లమెంటుకు మూడు రోజుల సెలవు దినాలు రావడంతో వాటిని ఉపయోగించుకొని, పార్టీ ఎంపీలందరూ నియోజకవర్గాల్లో పాత్రికేయ సమావేశాలను నిర్వహించి, ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. వచ్చే ఏడాది జరిగే లోక్‌సభ ఎన్నికలకు పార్టీ సన్నద్ధమవుతున్న నేపథ్యంలో. . ఎంపీలు తమ నియోజకవర్గాల్లో బూత్‌స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని షా కోరారు. దేశంలోని అత్యంత వెనుకబడిన 115 జిల్లాలను అభివృద్ధి చేసే అంశంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ ఒక ప్రెజంటేషన్ ఇచ్చారు.

కొత్త కార్యాలయంలో తొలిసారిగా..

ఆనవాయితీకి భిన్నంగా పార్లమెంటు గ్రంథాలయ భవనంలో కాకుండా దిల్లీలోని పార్టీ కొత్త కేంద్ర కార్యాలయంలో భాజపా పార్లమెంటరీ పార్టీ సమావేశాన్ని నిర్వహించింది. దిల్లీలోని పండిట్ దీన్‌దయాళ్ మార్గ్‌లో ఇటీవలే ఆవిష్కరించిన ఈ భవనాన్ని పార్టీ ఎంపీలు వీక్షించడం కోసమే ఇక్కడ ఏర్పాటు చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

జైట్లీకి బాధ్యత

ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ వేధింపుల నిరోధక చట్టంపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు.. భాజపాలో చర్చనీయాంశంగా మారింది. సామాజిక న్యాయ శాఖ మంత్రి థావర్‌చంద్ గెహ్లోత్ సహా పార్టీకి చెందిన అనేక మంది ఎస్సీ, ఎస్టీ ఎంపీలు దీనిపై రివ్యూ పిటిషన్ వేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ వైఖరిని ఖరారు చేసే బాధ్యతను కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీకి అమిత్ షా అప్పగించారు.

> **ఎన్‌డీఏలో లుకలుకలపై..**
>
> ఎన్‌డీఏ కూటమిలో పెరుగుతున్న అసంతృప్తిపై మోదీ, అమిత్ షాలు.. అరుణ్ జైట్లీ, రవి శంకర్ ప్రసాద్‌లు చర్చించారు. "ఎన్‌డీఏను తెదేపా వీడాక.. మరికొన్ని మిత్రపక్షాలు కూడా భాజపాపై ఆగ్రహాన్ని వ్యక్తంచేస్తున్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయనున్నట్లు శివసేన ప్రకటించింది. ఎన్‌డీఏ భాగస్వామ్య పక్షాలతో మెరుగైన సమన్వయం ఉండేలా చూడాలని ఎల్‌జేపీ నేత రామ్ విలాస్ పాసవాన్ కోరుతున్నారు. రాజకీయ సమీకరణాల్లో గణనీయ మలుపులకు ఇది కారణం కావొచ్చు" అని రవిశంకర్ ప్రసాద్ చెప్పినట్లు సమాచారం. దీనికి జైట్లీ బదులిస్తూ. . శివసేన ఒంటరిగా పోటీ చేసే అవకాశం తక్కువేనని చెప్పినట్లు తెలుస్తోంది.

పార్లమెంటులో ప్రతిష్ఠంభన పైనా..

పార్లమెంటు సమావేశాల్లో ఏర్పడుతున్న ప్రతిష్ఠంభన అంశంపై భాజపా అధ్యక్షుడు అమిత్ షా.. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్‌తో చర్చించినట్లు సమాచారం. ఎన్‌డీఏ మాజీ మిత్రపక్షం తెదేపా సహా పలు విపక్ష పార్టీలు నిరంతరంగా పార్లమెంటులో నిరసనలు తెలిజేయడంపై వారు మాట్లాడుకున్నారు. కాంగ్రెస్ ఇచ్చిన అవిశ్వాస తీర్మానంతో తలెత్తే పరిస్థితిని పరిశీలించాలని అమిత్ షా కోరినట్లు పార్టీ ఎంపీ ఒకరు చెప్పారు. 'కేంబ్రిడ్జ్ అనలిటికా' వివాదం నుంచి దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ఈ నోటీసు ఇచ్చినట్లు భాజపా సీనియర్ నేతలు భావిస్తున్నారు.

మూడో కూటమికి అవకాశం లేదు..

జైట్లీ సమాధానంపై మోదీ, షాలు అంగీకార సూచకంగా తల ఊపినట్లు తెలుస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ చెబుతున్న తృతీయ కూటమికి అవకాశం లేదని అమిత్ షా వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న నేపథ్యంలో కేసీఆర్.. ప్రధానంగా కాంగ్రెస్ వ్యతిరేక కూటమి ఏర్పాటును లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. మమతా బెనర్జీ పరిస్థితి ఇందుకు భిన్నమన్నారు. పశ్చిమ బెంగాల్‌లో భాజపా.. ప్రధాన శక్తిగా ఎదుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో భాజపాయేతర, కాంగ్రెసేతర ఫెడరల్ ఫ్రంట్‌ను ఏర్పాటుపై మమత మాట్లాడుతున్నప్పటికీ ఆమె కాంగ్రెస్‌తో ఒక అవగాహనకు వచ్చే అవకాశ ఉందని చెప్పారు.

రాజ్యసభలో భాజపా బలోపేతం

- ఎన్నికలు జరిగిన 25 స్థానాల్లో 12 కమలనాథుల సొంతం



జీవీఎల్ నరసింహారావు ★ అరుణ్ జైట్లీ

★ రాజ్యసభలో ఏప్రిల్‌లో ఖాళీ అవుతున్న స్థానాలు : 58
★ ఏకగ్రీవం అయినవి : 33
★ శుక్రవారం ఎన్నికలు జరిగినవి : 25

దిల్లీ: రాజ్యసభలో అతిపెద్ద పార్టీగా అవతరించిన భాజపా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. 245 మంది సభ్యులున్న పెద్దల సభలో పూర్తిస్థాయి ఆధిక్యం రానప్పటికీ విపక్ష కాంగ్రెస్ కన్నా సంఖ్యాబలంలో మరింత మెరుగైన స్థితికి వచ్చింది. శుక్రవారం ఎన్నికలు జరిగిన 25 స్థానాల్లో 12 స్థానాలను ఆ పార్టీ సొంతం చేసుకుంది. అంతకుముందు ఏకగ్రీవం అయిన స్థానాల్లోనూ 16 కమలనాథుల సొంతం అయ్యాయి.

శుక్రవారం ఎన్నికలు జరిగిన యూపీలోని 10 స్థానాలకు గాను తొమ్మిదింటిని కమలం కైవసం చేసుకోవటం గమనార్హం. ఈ రాష్ట్రంలో కొత్తగా పొత్తుకట్టిన ఎస్పీ-బీఎస్పీల మధ్య ఐక్యతకు గండి కొట్టేలా మాయావతి పార్టీకి చెందిన అభ్యర్థిని వ్యూహాత్మకంగా ఓడించింది. మొన్నటి లోక్‌సభ ఉప ఎన్నికల్లో రెండు స్థానాల్లో(గోరఖ్‌పూర్, ఫూల్‌పుర్) జరిగిన పరాభవానికి ప్రతీకారం తీర్చుకుంది. శుక్రవారం రాజ్యసభ ఎన్నికలు యూపీలో ఉత్కంఠను రేపాయి. 8 స్థానాల్లో అభ్యర్థులను సునాయాసంగా గెలిపించుకోగల భాజపా 9 మందిని రంగంలోకి దించింది. దీంతో ఎస్పీ, బీఎస్పీల అభ్యర్థులకు చెమటలు పట్టించింది. ఎస్పీ అభ్యర్థిని జయాబచ్చన్ తన స్థానాన్ని నిలబెట్టుకోగలిగారు. ఎస్పీ ఎమ్మెల్యే ఒకరు, బీఎస్పీ ఎమ్మెల్యే ఒకరు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడటం, ఈ రెండు పార్టీలకే చెందిన మరో ఇద్దరు శాసనసభ్యులు జైలుతో ఉండటంతో బీఎస్పీ అభ్యర్థి భీమ్‌రావ్ అంబేడ్కర్‌కు ఓటమి తప్పలేదు. ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులూ చివరిలో భాజపా అభ్యర్థికే ఓటు వేశారు. దీంతో ఓట్లలెక్కింపు సమయంలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

- పశ్చిమ బెంగాల్‌లోని 5 స్థానాలకు జరిగిన పోలింగ్‌లో నాలుగు స్థానాలను తృణమూల్ కాంగ్రెస్, మిగిలిన ఒక స్థానాన్ని టీఎంసీ మద్దతుతో కాంగ్రెస్ గెలుచుకుంది.
- కర్ణాటక విధానసభ నుంచి నాలుగు రాజ్యసభ స్థానాలకు జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ముగ్గురు, ఓ భాజపా అభ్యర్థి విజయాన్ని సాధించారు. జనతాదళ్ అభ్యర్థి పరాజయం పాలయ్యారు.
- తెలంగాణలోని మూడు స్థానాలను తెరాస కైవసం చేసుకుంది.
- ఛత్తీస్‌గఢ్‌లోని ఒక స్థానాన్ని భాజపా సొంతం చేసుకుంది.
- ఝార్ఖండ్‌లోని రెండు స్థానాల్లో భాజపా, కాంగ్రెస్ చెరొక స్థానాన్ని గెలుచుకున్నాయి.
- ఏప్రిల్‌లో ఖాళీ అవుతున్న 58 స్థానాల్లో 33 స్థానాల్లో ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది.
- కేరళలో ఉప ఎన్నిక జరిగిన ఒక స్థానంలో వామపక్ష కూటమి (ఎల్‌డీఎఫ్) మద్దతిచ్చిన జేడీ(యు-శరద్‌యాదవ్ వర్గం) అభ్యర్థి ఎంపీ వీరేంద్ర కుమార్... కాంగ్రెస్ అభ్యర్థిపై గెలుపొందారు.

> **ఎన్నికల్లో గెలిచిన ప్రముఖులు..**
>
> కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ (భాజపా), జీవీఎల్ నరసింహారావు (భాజపా), జయా బచ్చన్ (ఎస్పీ)...వీరు ముగ్గురూ యూపీ నుంచి ఎన్నికయ్యారు. అభిషేక్ మను సింఘ్వీ (కాంగ్రెస్) పశ్చిమబెంగాల్ నుంచి తృణమూల్ కాంగ్రెస్ మద్దతుతో గెలుపొందారు.

చంద్రయాన్-2 ప్రయోగం అక్టోబర్‌కు వాయిదా

చెన్నై: చంద్రుడిపై మరిన్ని పరిశోధనల కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) నిర్వహించ తలపెట్టిన 'చంద్రయాన్-2' అంతరిక్ష ప్రయోగం అక్టోబర్‌కు వాయిదా పడింది. ఏప్రిల్‌లో దీన్ని ప్రయోగించాలని ఇస్రో భావించింది. అయితే నిపుణులు కొన్ని పరీక్షలు చేపట్టాలని సూచించడంతో.. తాజాగా నిర్ణయం మార్చుకుంది. ఈ విషయాన్ని ఇస్రో ఛైర్మన్ కె.శివన్ శుక్రవారం పాత్రికేయులకు వెల్లడించారు. పూర్తిగా దేశీయ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని రూ. 800 కోట్ల వ్యయంతో ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపడుతోంది. జీఎస్‌ఎల్‌వీ ద్వారా ఆర్బిటర్, ల్యాండర్, రోవర్‌లను చంద్రుడిపైకి పంపుతోంది.

29న జీశాట్–6ఏ ప్రయోగం: జీశాట్-6ఏ ఉపగ్రహాన్ని మార్చి 29న ప్రయోగించనున్నట్లు ఇస్రో ప్రకటించింది. జీఎస్‌ఎల్‌వీ-ఎఫ్08 ద్వారా దీన్ని ఆకాశంలోకి పంపనున్నట్లు తెలిపింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రంలోని రెండో లాంచ్‌పాడ్ నుంచి ఈ ప్రయోగాన్ని చేపట్టనున్నారు.

ఆరోగ్యపరమైన అసౌకర్యం.. సిమ్లా నుంచి దిల్లీకి సోనియాగాంధీ

సిమ్లా: యూపీఏ సారథి సోనియాగాంధీ(71) గురువారం రాత్రి బాగా పొద్దుపోయాక తనకు ఆరోగ్య పరంగా అసౌకర్యంగా ఉందంటూ చెప్పడంతో ఆమెను వెంటనే దిల్లీకి తరలించారు. వాస్తవానికి ఇక్కడి ఛారాబ్రలో తన కుమార్తె ప్రియాంక నిర్మించుకుంటున్న ఇంటిపనులను చూసే నిమిత్తం సోనియా వచ్చారు. అయితే, అర్ధరాత్రి దాటాకా ఆమె తనకు ఇబ్బందిగా ఉన్నట్లు చెప్పారు. ఆమె వెంటే ఉన్న బృందంలోని వైద్యుడు వెంటనే తనకు ఫోన్‌చేసి చెప్పినట్లు ఇందిరా గాంధీ వైద్యకళాశాల ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్. రమేష్‌చంద్ చెప్పారు. వెంటనే ఆమె తన సొంతకారులో, వైద్యబృందం ఉన్న అంబులెన్స్ వెంటరాగా దిల్లీకి వచ్చారు. ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కార్తీకి బెయిల్ మంజూరు

దిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరంనకు దిల్లీ హైకోర్టు శుక్రవారం బెయిల్ మంజూరు చేసింది. ఐఎన్‌ఎక్స్ మీడియా అవినీతి కేసులో కార్తీని ఫిబ్రవరి 28న సీబీఐ అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. అనంతరం అతనికి విధించిన 12 రోజుల జ్యుడీషియల్ కస్టడీ శనివారంతో ముగుస్తున్న నేపథ్యంలో బెయిల్ మంజూరైంది.

ఎయిర్‌సెల్–మ్యాక్సిస్ కేసులో: హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన కొద్ది గంటల్లోనే కార్తీ చిదంబరం ఎయిర్‌సెల్-మ్యాక్సిస్ కేసులో ముందస్తు బెయిల్‌కు నగర న్యాయస్థానంలో విజ్ఞాపన దాఖలు చేశారు.

కలబుర్గి హత్యకేసులో ఎన్ఐఏ దర్యాప్తు కుదరదు

సుప్రీం కోర్టుకు విన్నవించిన ఎన్ఐఏ

దిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అనేది జాతీయ, అంతర్ రాష్ట్ర ఉగ్రవాద కేసులను దర్యాప్తు చేయడానికి ఉద్దేశించిందని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం సుప్రీం కోర్టుకు తెలిపింది. అందువల్ల 2015లో కర్ణాటకలో ప్రముఖ సాహితీవేత్త, హేతువాది ఎం.ఎం.కలబుర్గి హత్య కేసును ఈ సంస్థ దర్యాప్తు చేయజాలదని విన్నవించింది. ఈ కేసును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)తో దర్యాప్తు జరిపించాలని హతుడి భార్య ఉమాదేవి పిటిషన్ వేశారు. ఈ కేసు ఎన్ఐఏ చట్టం పరిధిలోకి రాదని కేంద్రం తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ పింకీ ఆనంద్ తాజాగా విన్నవించారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం కేసును జులై మొదటి వారానికి వాయిదా వేసింది.

జీనత్ అమాన్‌పై లైంగికదాడి!

వ్యాపారవేత్త అరెస్టు

ముంబయి: అలనాటి బాలీవుడ్ కథానాయిక జీనత్ అమాన్(68)పై అత్యాచారానికి పాల్పడ్డారనీ, రూ. 15 కోట్ల మేరకు ఆమెను మోసం చేశారన్న ఆరోపణలతో సర్ఫరాజ్ అలియాస్ అమాన్ ఖన్నా(38) అనే వ్యాపారవేత్తను అరెస్టు చేశారు. జీనత్ అమాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు ఖన్నాను గురువారం రాత్రి అరెస్టు చేసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. ఆయనను శుక్రవారం న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కేసును క్రైం బ్రాంచ్‌కు అప్పగించారు. ఆమె అమాన్ ఖన్నాపై ఇక్కడి జుహు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2001-2015 మధ్య ఈ వ్యవహారం జరిగినట్లు పేర్కొన్నారు.

ఫ్రాన్స్‌లో ఐఎస్ సాయుధుడి దాడి: ముగ్గురి మృతి

ట్రెబెస్(ఫ్రాన్స్): నైరుతి ఫ్రాన్స్‌లోని ట్రెబెస్‌లో ఉన్న ఓ సూపర్ మార్కెట్‌పై శుక్రవారం ఓ సాయుధుడు విరుచుకుపడ్డాడు. తీవ్రవాదిగా అనుమానిస్తున్న ఈ వ్యక్తి జరిపిన కాల్పుల్లో ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. భద్రతా సిబ్బంది ఆ సాయుధుడిని కాల్చి చంపేశాయి. అసలీ ఘటన తీవ్రవాద ఘాతుకంగా కనిపిస్తున్నట్లు ప్రధాని ఎడ్వర్డ్ ఫిలిప్పే పేర్కొన్నారు. మతపరమైన విశ్వాసాన్ని ప్రతిబింబించే నినాదాలు చేస్తూ అతడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ దాడి నిర్వహించింది తామేనని ఇస్లామిక్ స్టేట్ జిహాదీ వర్గం బీరుట్‌లో ప్రకటించుకుంది. ట్రెబెస్ దాడికి పాల్పడిన వ్యక్తి ఇస్లామిక్ స్టేట్ సైనికుడేనని పేర్కొంది.

అమెరికా ఎన్ఎస్ఏను మార్చిన ట్రంప్

వాషింగ్టన్: అమెరికా జాతీయ భద్రత సలహాదారు (ఎన్ఎస్ఏ) పదవి నుంచి లెఫ్టినెంట్ జనరల్ హెచ్‌ఆర్ మెక్‌మాస్టర్‌ను ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తొలగించారు. ఆ స్థానంలో గతంలో ఐరాసలో అమెరికా రాయబారిగా పనిచేసిన జాన్ బోల్టన్‌ను నియమించారు. కొద్ది రోజుల క్రితం విదేశాంగమంత్రిని కూడా ట్రంప్ మార్చిన సంగతి తెలిసిందే. మెక్‌మాస్టర్ తొలగింపుపై గత వారం నుంచి వార్తలు వస్తున్నప్పటికీ.. శ్వేతసౌధం వాటిని తోసిపుచ్చుతూ వచ్చింది. అయితే బోల్టన్ నియామకం గురించి ట్రంప్ శుక్రవారం ట్విటర్ వేదికగా ప్రకటించారు.

లోకాయుక్తను ఎందుకు నియమించలేదు?

- తెలంగాణ సహా

11 రాష్ట్రాలకు సుప్రీం కోర్టు ప్రశ్న

దిల్లీ: చట్టం అమల్లోకి వచ్చి ఐదేళ్లు గడిచినప్పటికీ లోకాయుక్త, ఉప లోకాయుక్తలను నియమించకపోవడానికి కారణాలు చెప్పాలని తెలంగాణ సహా 11 రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను సుప్రీం కోర్టు శుక్రవారం ప్రశ్నించింది. ఒడిశాలో ఈ సంస్థలు పనిచేస్తున్నాయా లేదో చెప్పాలని ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగింది.

తమ ముందున్న వివరాల ప్రకారం తెలంగాణ, జమ్మూ కశ్మీర్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, పుదుచ్చేరి, తమిళనాడు, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లో లోకాయుక్త లేదా ఉపలోకాయుక్తల నియామకం జరగలేదని స్పష్టమవుతున్నట్లు జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఆర్.బానుమతితో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. సదరు నియామకాలకు ఈ 11 రాష్ట్రాలు ఏమైనా చర్యలు చేపట్టాయా అని ప్రశ్నించింది. ఒకవేళ చేపడితే అవి ఏ దశలో ఉన్నాయి.. వంటి వివరాలను రెండు వారాల్లోగా కోర్టుకు తెలియజేయాలని ఆదేశించింది. ఎప్పటిలోగా నియామకాలు చేస్తారో కూడా చెప్పాలంది. దిల్లీకి చెందిన భాజపా నేత, న్యాయవాది అశ్వనీ కుమార్ ఉపాధ్యాయ్ వేసిన ప్రజాహిత వ్యాజ్యంపై వాదనల సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. తదుపరి విచారణను వచ్చే నెల 12కు వాయిదా వేసింది.

లోకాయుక్తలు సమర్థంగా పనిచేయడానికి వీలుగా సరిపడా బడ్జెట్ కేటాయింపులు, మౌలిక వసతులు సమకూర్చేలా రాష్ట్రాలకు ఆదేశాలివ్వాలంటూ పిటిషనర్ కోరారు.

'అయోధ్య' కేసు విస్తృత ధర్మాసనానికి?

అయోధ్యలో వివాదాస్పద స్థలసేకరణకు సంబంధించిన 1994 నాటి తీర్పును పునఃపరిశీలించే అంశాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించాలా? వద్దా? అనే విషయంపై ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు సుప్రీంకోర్టు శుక్రవారం వెల్లడించింది. ముందుగా ఈ తీర్పు విషయంలో నెలకొని ఉన్న వివాదాన్ని పరిష్కరించాలి. అందుకే, ఈ తీర్పు మొత్తాన్ని కానీ....లేదా కొన్ని భాగాలను కానీ విస్తృత ధర్మాసనానికి నివేదించవచ్చు అని చీఫ్.జస్టిస్. దీపక్‌మిశ్ర, జస్టిస్. అశోక్‌భూషణ్, జస్టిస్.ఎస్.ఎ.నజీర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది.

భాజపా 'అసత్యాల పరిశ్రమ' మళ్లీ పనిచేస్తోంది!

కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ విమర్శల పరంపర

దిల్లీ: భాజపాపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ట్విటర్‌లో విమర్శల పరంపర కొనసాగిస్తున్నారు. ఆ పార్టీ 'అసత్యాల పరిశ్రమ' మళ్లీ పనిచేస్తోందంటూ శుక్రవారం విమర్శించారు. 'కేంబ్రిడ్జ్ అనలిటికా' వ్యవహారానికి సంబంధించి - డేటా చౌర్యంపై కేంద్రం కట్టుకథలు అల్లుతోందంటూ గురువారం ఆరోపించిన రాహుల్ కొనసాగింపుగా మరిన్ని విమర్శలు చేశారు. కాంగ్రెస్‌పై ఆరోపణలు చేస్తూ భాజపా వాస్తవాలను మరుగున పడేస్తోందని పేర్కొన్నారు. అసత్యాలను ప్రచారం చేసేందుకు కేబినెట్ మంత్రిని రంగంలోకి దించిందని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన 'కేంబ్రిడ్జ్ అనలిటాకు భారత్‌తో సంబంధం'పై వచ్చిన ఓ వార్తాకథనాన్ని కూడా జతచేశారు.

కాంగ్రెస్ ఎంపీల నిరసన: రాహుల్ నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంటు ప్రాంగణంలోని మహాత్మాగాంధీ విగ్రహం ముందు శుక్రవారం నిరసన చేపట్టారు. ఎస్సీ, ఎస్టీలపై అకృత్యాల నిరోధక చట్టం (ఎస్సీ/ఎస్టీ యాక్ట్)పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. చట్ట సవరణకు కూడా డిమాండ్ చేశారు. అంతకు ముందు పార్టీ ఎంపీలంతా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యాలయం వద్ద కలిసి ఈ అంశంపై వ్యూహరచన చేశారు.

ప్రకృతి సంపదకు ముప్పు తెస్తూ...

మానవాళే మునిగిపోతోంది?



- ఐపీబీఈఎస్ నివేదిక ఆవేదన
- పగడపు దిబ్బలకూ పొంచి ఉన్న ప్రమాదం
- పక్షులు, క్షీరదాలు అంతర్ధానం?
- మత్స్య జాతుల మనుగడ ప్రశ్నార్థకం?
- మేలుకుంటేనే తేరుకుంటాం

మెడెలిన్(కొలంబియా): ప్రకృతి సంపదకు ఎనలేని హాని చేయడం ద్వారా మానవుడే తనకు తాను ఇబ్బందిని కొని తెచ్చుకుంటున్నట్లు పర్యావరణ శాస్త్రవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 550 మందికి పైగా శాస్త్రవేత్తలు మూడేళ్లపాటు అహర్నిశలు శ్రమించి నిర్వహించిన అధ్యయన నివేదికను శుక్రవారం విడుదల చేశారు. దీనిప్రకారం 2048 నాటికి ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో మత్స్యసంపద కాస్తా హరించుకుపోతుంది. 2050 నాటికి ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని ప్రవాళభిత్తికలు(పగడపు దిబ్బలు) 90 శాతం వరకూ క్షీణిస్తాయి. 2100 నాటికల్లా ఆఫ్రికాలోని పక్షులు, క్షీరదజాతులు సగానికిపైగా అంతరించిపోతాయి. భీతిగొలిపే ఈ పరిణామాల ప్రభావం ఆర్థికవ్యవస్థలు, ఆహారభద్రత, జీవనోపాధికి పెను ప్రమాదకారులుగా పరిణమిస్తాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ' మనమే(మానవజాతి) స్వయంగా మన భవిష్యత్‌ను, బాగోగులను దెబ్బతీసుకుంటున్నాం' అని 'ఇంటర్ గవర్నమెంటల్ సైన్స్-పాలసీ ప్లాట్‌ఫారం అన్ బయోడైవర్సిటీ, ఎకోసిస్టమ్ సర్వీసెస్'(ఐపీబీఈఎస్) వ్యాఖ్యానించింది. ఐపీబీఈఎస్ సారథి రాబర్ట్ వాట్సన్ మాటల్లో చెప్పాలంటే...మానవాళి ప్రకృతిని విచక్షణ రహితంగా వినియోగించుకుంటున్న తీరును మార్చుకుంటే తప్ప పరిస్థితి మెరుగుపడదు. జీవవైవిధ్యాన్ని మానవజాతి విపరీతరీతిలో వినియోగించుకుంటున్న తీరు జీవజాతులు అంతరించిపోవడానికి కారణమౌతోంది. గతశతాబ్ద కాలంలో సగటున ఏటా రెండు రకాల వెన్నెముక జాతి జంతుజాలం అంతర్ధానమై పోతోంది. తాజాగా..., సూడాన్‌లో ప్రపంచంలోనే ఆఖరిదైన తెల్లని ఖడ్గమృగం మృతిచెందడం ఇందుకు తాజా ఉదాహరణ.

ముఖ్యంగా ఆసియా-పసిఫిక్ ప్రాంతంలోని జీవవైవిధ్యానికి పెనుముప్పు పొంచి ఉందని ఐపీబీఈఎస్ నివేదిక హెచ్చరించింది. ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు, వ్యక్తులు అంతా ఒక్కటిగా యోచించాలి. తమ నిర్ణయాల్లో జీవవైవిధ్య పరిరక్షణ అంశాలకు ప్రాధాన్యతనివ్వాలి. వ్యవసాయం, మత్స్య సంపద, అటవీ, మైనింగ్, మౌలికవసతుల కల్పన వంటి అంశాల దిశగా ఈ కోణం నుంచే నిర్ణయాలు తీసుకోవాలి.

అత్యంత ఖరీదైన ఏడాది 2017!

ఐక్యరాజ్య సమితి: కొన్నిదేశాల్లో ప్రతికూల వాతావరణ పరిస్థితులు, ప్రకృతివిపత్తులు కలగలిసి మొత్తం మీద 2017వ సంవత్సరంలో 320 బిలియన్ డాలర్ల మేరకు వ్యయానికి కారణమైనాయి. భారత ఉపఖండంలో సంభవించిన భారీ వరదలు...తూర్పు ఆఫ్రికాలోని కొన్ని ప్రాంతాల్లో నెలకొన్న తీవ్ర కరవు పరిస్థితుల రీత్యా జరిగిన వ్యయాన్ని బట్టి చూస్తే 2017ను అత్యంత ఖరీదైన సంవత్సరంగా పేర్కొనవచ్చు. ప్రపంచ వాతావరణ సంస్థ(డబ్ల్యుఎంఓ) నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. అమెరికాను ఒక్క ఊపు ఊపేసిన తుపాను బీభత్సం భారీ వ్యయానికి కారణమైంది.

రాజీ కుదిరితే సరే.. లేకుంటే దెబ్బకు దెబ్బ!

- ట్రంప్ వాణిజ్య ఆంక్షలు విధిస్తే

ఊరుకోబోమని చైనా గట్టి హెచ్చరిక

బీజింగ్: ట్రంప్ సర్కారు విధించిన వాణిజ్య ఆంక్షలకు గట్టి సమాధానం ఇచ్చేందుకు చైనా సిద్ధమైంది! మూడు బిలియన్ డాలర్ల విలువైన 128 రకాల అమెరికా ఉత్పత్తులపై దిగుమతి సుంకాల పెంపునకు రంగం సిద్ధం చేసినట్లు వెల్లడించింది. ప్రస్తుతం పెద్ద వస్తువుల జోలికి వెళ్లకుండా. .. చిన్నచిన్న ఉత్పత్తులపైనే దృష్టి సారించినట్లు తెలిపింది.

చైనా దిగుమతులపై వార్షిక సుంకాలను 60 బిలియన్ డాలర్లకు పెంచుతూ ట్రంప్ సర్కారు గురువారం కార్యనిర్వాహక ఆదేశాలిచ్చిన క్రమంలో- చైనా ఈ ఎత్తు వేసింది. ట్రంప్ నిర్ణయం పట్ల చైనా వాణిజ్య, విదేశాంగశాఖలు శుక్రవారం ఘాటుగా స్పందించాయి. అమెరికా తన విన్యాసాలను మానుకుని... ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాలు చిక్కుల్లో పడకుండా తెలివైన నిర్ణయాలు తీసుకోవాలని వాణిజ్యశాఖ హెచ్చరించింది. న్యాయబద్ధమైన హక్కులు, ప్రయోజనాలకు విఘాతం కలుగుతుంటే చూస్తూ ఊరుకోబోమనీ... తమ ప్రయోజనాల పరిరక్షణకు పూర్తి సంసిద్ధతతో ఉన్నామని వాణిజ్యశాఖ ప్రతినిధి తెలిపారు.

డబ్ల్యూటీవో నియమాలకు బద్ధ విరుద్ధం

మరోవైపు- ట్రంప్ నిర్ణయం ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) నియమాలకు బద్ధ విరుద్ధమనీ.. ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం అమెరికాకు తగదని విదేశాంగ శాఖ ప్రతినిధి హు చున్యాంగ్ నిప్పులు చెరిగారు. తన నిర్లక్ష్యపూరిత నిర్ణయాలకు ఆ దేశం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆమె హెచ్చరించారు. 375 బిలియన్ అమెరిన్ డాలర్ల చైనా వర్తక మిగులును సమర్థించుకుంటూ- చైనా ఉత్పత్తులు అమెరికా వినియోగదారుల మన్ననలు పొందడమే కాకుండా, ధరల నియంత్రణకూ దోహదపడ్డాయని ఆమె అన్నారు. అమెరికా నుంచి దిగుమతయ్యే స్టీలుపై 25%, అల్యూమినియంపై 10% మాత్రమే కాకుండా... మద్యం, పండ్లు తదితరాలపై 15% సుంకాలను విధిస్తామని అంతకుముందు వాణిజ్య శాఖ వెల్లడించింది. ఈ ప్రభావం 128 రకాల అమెరికా ఉత్పత్తులపై పడుతుంది. దీంతో ఇతర విదేశీ ఉత్పత్తులతో చైనాలో అమెరికాకు తీవ్ర పోటీ ఎదురయ్యే పరిస్థితి వస్తుంది.

"వర్తక అంశాలపై అమెరికాతో సంప్రదింపులు జరుపుతాం. రాజీ కుదిరితే సరే... చర్చలు విఫలమైతే తొలి దశలో 15% దిగుమతి సుంకాన్ని విధిస్తాం. పరిస్థితిని బట్టి తర్వాత దానిని 25 శాతానికి పెంచుతాం" అని చైనా వాణిజ్య వర్గాలు తెలిపాయి.

కుజుడిపై ఈ కొండ వెనక నీటిజాడ?



అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా' విడుదల చేసిన తాజా చిత్రమిది. కుజుడిపై అన్వేషిస్తున్న క్యూరియాసిటీ, ఈ ఏడాది జనవరి నుంచి పంపించిన అనేక ఫొటోలను కలపగా అంతిమంగా ఈ చిత్రం ఆవిష్కృతమైంది. చిత్రంలో కనిపిస్తున్న మట్టిలాంటి కొండ ఏర్పడటానికి అక్కడ ప్రవహించిన నీరే కారణమని శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. మరోవైపు మార్చి 2, 2018నాటికి క్యూరియాసిటీ కుజుడిపై కాలుపెట్టి 2000 రోజులు పూర్తయ్యాయి. కుజుడిపై రోజంటే, మన భూమిపై 24 గంటల 39 నిముషాల 35 సెకన్లకు సమానం. అంటే కుజుడిపై 2000 రోజులు మన భూమిపై 2055 రోజులకు సమానమన్నమాట.

కేంబ్రిడ్జ్ అనలిటికాకు కేంద్రం తాఖీదు

దిల్లీ: ఫేస్‌బుక్‌లో భారతీయ వినియోగదారుల వ్యక్తిగత సమాచార దుర్వినియోగానికి సంబంధించి కేంద్రప్రభుత్వం కొరడా ఝుళిపించింది. ఈ వివాదంలో కేంద్ర బిందువైన బ్రిటన్‌కు చెందిన కేంబ్రిడ్జ్ అనలిటికాకు తాఖీదునిచ్చింది. సమాచార దుర్వినియోగంలో, భారతీయ ఓటర్ల ఓటింగ్ సరళిని ప్రభావితం చేయటంలో ఆ సంస్థ ప్రమేయంపై వివరణను కోరింది. ఆ సంస్థ సేవలను పొందిన వారి జాబితా, సమాచారాన్ని పొందటానికి అనుసరించిన విధానం, దాని వినియోగం తీరు, ఫేస్‌బుక్ వినియోగదారుల సమ్మతిని ఏమైనా తీసుకున్నారా.. తదితర ప్రశ్నలను ప్రభుత్వం సంధించింది. వీటన్నిటికీ సంస్థ వివరణలను ఈ నెల 31వ తేదీలోగా ఇవ్వాలని కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ ఆ తాఖీదులో పేర్కొంది. సమాచార చౌర్యం ద్వారా భారతీయ ఓటర్లను ప్రభావితం చేసే యత్నాలు జరిగి ఉంటే కఠిన చర్యలు తప్పవని ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌ను కేంద్ర న్యాయ, ఐటీ శాఖల మంత్రి రవిశంకర్ ప్రసాద్ హెచ్చరించిన నేపథ్యంలో ఈ తాఖీదు జారీ అయ్యింది.

ఓటర్లను ప్రభావితం చేసే చర్యలపై ఈసీ నిఘా: ఎన్నికల్లో ఓటర్లను అక్రమ పద్ధతుల్లో ప్రభావితం చేసేందుకు జరిగే చట్ట వ్యతిరేక చర్యలను అడ్డుకోవటానికి సంబంధించి దర్యాప్తు సంస్థలతో సమన్వయం ఏర్పరచుకోనున్నట్లు ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ ఓపీ రావత్ తెలిపారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications; a division of Ushodaya Enterprises Private Limited and Printed at EENADU Press, Gudavalli Village & Panchayat, Vijayawada Rural Mandal, Krishna District, A.P and EENADU Press, Patamatalanka, Vijayawada AND Published at EENADU Press, Patamatalanka, Vijayawada-520 010. Phones: 2494900 (4 Lines), Fax-2470000. Regd. No. VJ/013/2018-20 RNI No. 32238/78. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10-00